పొరుగు 'మార్గం'లో ప్రైవేటు

ట్రావెల్స్ ప్రమాదాలకు కారణాలు ఎన్నెన్నో
ఈశాన్యంలో రిజిస్ట్రేషన్లు.. ఇక్కడ సర్వీసులు
అక్కడ ఫీజులు తక్కువగా ఉండటంతో మొగ్గు
ఆపరేటర్లకు వరంగా ఆలిండియా పర్మిట్ 12
వాటిపై రవాణ శాఖ నియంత్రణ అంతంతే
బీఎస్-6 వాహనాల్లో సమస్యల చిక్కుముడి
కాసుల కక్కుర్తితో స్లీపర్ బస్సుల్లో సీట్ల డిజైన్

www.andhrajyothy.com
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI

శనివారం | 25-10-2025 | పేజీలు: 14 | వెల (Price) : Rs. 6.50 | సంపుటి (Volume) : 66 సంచిక (Issue) : 189 | విజయవాడ సిటీ**

Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal | Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ విశ్వావసునామ సంవత్సరం, దక్షిణాయనం, శరదృతువు, కార్తీకమాసం, శుక్లపక్షం, తిథి: చవితి తె.3:49 తదుపరి పంచమి, నక్షత్రం: అనూరాధ ఉ.7:52 తదుపరి జ్యేష్ఠ, వర్జ్యం: మ.2:08-3:56, దుర్ముహూర్తం: ఉ.6:14-7:46, అమృతఘడియలు: రా.12:54-2:42, రాహుకాలం: ఉ. 9:00-10:30, సూర్యోదయం: 6:14, సూర్యాస్తమయం: 5:43



ఆఖరి ప్రయాణం..

19 మంది బస్సులోనే సజీవ దహనమయ్యారు.

బస్సు ఢీకొనడంతో ఒక యువకుడు చనిపోయాడు.

మృతుల్లో ఆరు రాష్ట్రాలకు చెందిన వారు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన వారు ఆరుగురు ఉండగా, తెలంగాణ వాసులు ఆరుగురు మరణించారు. తమిళనాడు 2, కర్ణాటక 2, బిహార్, ఒడిసా వాసులు ఒక్కొక్కరు చొప్పున మరణించారు. రిజర్వేషన్ లేకుండా ఆరాంఘర్‌లో ఎక్కిన వ్యక్తి ఎవరనేది గుర్తించాల్సి ఉంది.

ప్రమాద సమయంలో బస్సులో 46 మంది ఉండగా... 27 మంది సురక్షితంగా బయటపడ్డారు.

తీవ్రత పెరిగిందిలా...

పల్సర్ బైక్ బస్సు ముందు భాగంలో ఇరుక్కుని... రోడ్డును రాసుకుంటూ పోవడంతో మంటలు వ్యాపించా యి. ఏసీ బస్సులో ఉన్న కర్టెన్లు, సీట్లు, బస్సు బ్యాటరీలు, కార్గోలో ఉన్న కొత్త సెల్‌ఫోన్‌ల బాక్స్ కారణంగా మంటలు తీవ్రమ య్యాయని ఫోరెన్సిక్ నిపుణులు ప్రాథమికంగా నిర్ధారించారు. డ్రైవర్లు వంటకోసం ఉపయోగించుకునే చిన్న సిలిండర్ కూడా కార్గోలో ఉంది. దానివల్ల మంటలు వ్యాపిం చాయా, లేదా అన్నదానిపై స్పష్టత లేదు.

అగ్నికి ఆహుతి



పూర్తిగా తగలబడిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు. ఇన్‌సెట్‌లో బస్సు ఫైల్ ఫొటో

19 మంది సజీవ దహనం

హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళ్తున్న 'వేమూరి కావేరి' బస్సు
జాతీయ రహదారిపై బైక్‌ను ఢీకొట్టి
200 మీటర్లు అలాగే ఈడ్చుకెళ్లిన డ్రైవర్
బస్సు కింద ఇరుక్కుపోయిన పల్సర్ బైక్
పెట్రోల్ ట్యాంకు మూత ఊడి మంటలు
క్షణాల్లో బస్సుకు వ్యాపించిన అగ్నికీలలు
సెన్సర్లు పనిచేయక తెరుచుకోని డోర్లు
బయటికి వచ్చే దారిలేక ఆర్తనాదాలు
బస్సులోనే మాడిమసైన మృతదేహాలు
డీఎన్ఏ పరీక్షల అనంతరమే అప్పగింత
27 మంది సురక్షితంగా బయటకు
బస్సు ఢీకొనడంతో యువకుడి మృతి

దీపావళి సెలవులు సరదాగా గడిపి తిరిగి బయలుదేరిన వారు కొందరు... ఉద్యోగం కోసం ఇంటర్వ్యూలకు వెళ్తున్న వారు కొందరు... వ్యాపార, ఇతర అవసరాల కోసం ప్రయాణమైన వారు కొందరు... గమ్యస్థానం బెంగళూరు... స్లీపర్ బస్సులో ఆదమరిచి నిద్రిస్తున్నారు! అదే వారికి శాశ్వత నిద్ర అయ్యింది. బహుశా... 'బస్సు ఢీ... బైకర్ మృతి' అని మాత్రమే వినాల్సిన వార్త! కానీ... 19 నిండు ప్రాణాలు సజీవ దహనమయ్యాయి. వారిలో ఒకే కుటుంబానికి చెందిన నలుగురు ఉన్నారు. తెలుగు రాష్ట్రాలతోపాటు ఆరు రాష్ట్రాలకు చెందిన వారు బాధితులుగా మిగిలారు. కర్నూలు నగరానికి 22 కిలోమీటర్ల దూరంలో... జరిగిన పెను విషాదమిది! ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు, ఇతర అధికార వర్గాలు అందించిన సమాచారం ప్రకారం..... ఇవీ ఆ వివరాలు!

కర్నూలు సమీపంలో ఘోర ప్రమాదం

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

అది... 'వేమూరి కావేరి' ట్రావెల్స్ బస్సు! డీడీ01 ఎన్9490 నంబర్.. మల్టీ యాక్సిల్ స్కానియా ఏసీ స్లీపర్ బస్! హైదరాబాద్ నుంచి బెంగళూరుకు వెళుతోంది! గురువారం రాత్రి 10.30 గంటలకు హైదరాబాద్‌లోని లకడీ కపూల్‌లో బయలుదే రింది. 11:05 గంటలకు ఆరాంఘర్ చౌరస్తాకు చేరుకుంది. అక్కడ ముగ్గురు ప్రయాణికులను ఎక్కించుకొని ఎన్‌హెచ్-44పై బెంగళూరు దిశగా కదిలింది. రిజర్వేషన్ చేయించుకున్న ప్రయాణి కులు 39 మంది... టికెట్ అక్కర్లేని చిన్న పిల్లలు నలుగురు... మధ్యలో ఎక్కిన మరో ప్రయాణి కుడు... ఇద్దరు డ్రైవర్లు! బస్సులో మొత్తం 46 మంది! బెంగళూరులో వివిధ కంపెనీల్లో పని చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ప్రైవేట్ కంపెనీల్లో పని చేసే ఉద్యోగులు, వివిధ వ్యాపారాలు చేసే వాళ్లు... పనులపైనా, దీపావళి పండుగ సెలవుల కోసం హైద రాబాద్‌కు వచ్చి.. తిరిగి బెంగళూరుకు వెళ్తున్నవారే అధికం! సిటీ దాటగానే... ఒక్కొక్కరుగా నిద్రలోకి జారుకున్నారు. అర్ధరాత్రి దాటాక 2.40 గంటల సమయంలో... బస్సు చిన్న టేకూరు దాటుతోంది. బస్సుకు ఇద్దరు డ్రైవర్లున్నారు. ఆ సమయంలో మిర్యాల లక్ష్మయ్య బస్సు నడుపుతున్నాడు. అంత కుముందు వరకు బస్సు నడిపిన మరో డ్రైవర్ శివ నారాయణ... వెనుకవైపు డిక్కీలో విశ్రాంతి తీసు కుంటున్నాడు. అంతలో ఏం జరిగిందంటే....

దఢేల్‌మనే శబ్దంతో...

కర్నూలు శివారులోని ప్రజానగర్‌కు చెందిన బి.శివశంకర్(21) అనే యువకుడు ఇళ్లలో గ్రానైట్ ఫ్లోరింగ్ పనులు చేస్తుంటాడు. నంద్యాల జిల్లా డోన్‌లో పని దొరికింది. తెల్లవారక ముందే

మిగతా 13వ పేజీలో...

కదిలే శవ పేటికలు!

స్లీపర్ బస్సుల నిర్మాణంలోనే లోపాలు.. చైనా, జర్మనీల్లో ఈ బస్సులపై నిషేధం
అమెరికా, ఈయూల్లో కఠిన నిబంధనలు.. మన దేశంలో విచ్చలవిడిగా పెరిగాయ్ 12

రాష్ట్రపతి, ప్రధాని దిగ్భ్రాంతి

మృతుల కుటుంబాలకు కేంద్రం పరిహారం రూ.2 లక్షలు

మరో 5 లక్షలు ప్రకటించిన రాష్ట్ర ప్రభుత్వం
క్షతగాత్రులకు 2 లక్షల చొప్పున సహాయం

యూఏఈ నుంచి సీఎం చంద్రబాబు సమీక్ష

ఈ ఆనందం ఇదే ఆఖరు

స్నేహితుల కుటుంబాల్లో 'చిచ్చు'
ఒక కుటుంబం ఆహుతి..
మరొకరు క్షేమం 13



స్నేహితుడు నెలకుర్తి రమేశ్ (కుడివైపు నల్ల చొక్కా)తో కలిసి గురువారం హుస్సేన్ సాగర్‌లో బోటు షికారు చేస్తున్న గోళ్ల రమేశ్ కుటుంబ సభ్యులు. ఈ ప్రమాదంలో గోళ్ల రమేశ్ కుటుంబ సభ్యులు నలుగురూ చనిపోయారు.

మాతృభూమిని మరవొద్దు!

అందరం కలిసి పుట్టిన ఊరి రుణం తీర్చుకోవాలి

గల్ఫ్‌లోని తెలుగు ప్రవాసులకు చంద్రబాబు పిలుపు

నాడు మైక్రోసాఫ్ట్ హైదరాబాద్‌కు గేమ్ చేంజర్
అలాగే నేడు గూగుల్ విశాఖకు, ఏపీకి
తెలుగుజాతికి ప్రపంచంలో తిరుగులేదు
ప్రపంచంలో ఎక్కడికి వెళ్లినా..
తెలుగువారు ఉండాలన్నది నా కోరిక
వారిని గ్లోబల్ సిటిజన్స్‌గా చూడాలనుకున్నా
కానీ గ్లోబల్ లీడర్స్‌గా ఎదుగుతున్నారు
'స్వర్ణాంధ్ర' లక్ష్యానికి సహకరించండి: సీఎం

"ప్రపంచంలో ఎక్కడున్నా అందరినీ మెప్పించ డంలో తెలుగువారు ముందుంటారు. దుబాయ్ పాలకులను సైతం మెప్పించి ఇక్కడ హిందూ దేవాలయాన్ని కట్టడమే దానికి నిదర్శనం.

- సీఎం చంద్రబాబు



దుబాయ్‌లో మంత్రి అబ్దుల్లా బిన్‌తో సీఎం చంద్రబాబు ఆత్మీయ ఆలింగనం

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'జన్మ భూమి.. కర్మభూమి.. ఈ రెండింటినీ ప్రతి ఒక్కరూ గుర్తుపెట్టుకోవాలి. ఏ దేశంలో ఉంటే ఆ దేశ కట్టుబా ట్లను, రాజ్యాంగాలను గౌరవించాలి. అదే సమయంలో అందరం కలిసి జన్మభూమి రుణం తీర్చుకోవాలి' అని ముఖ్యమంత్రి చంద్రబాబు పిలుపిచ్చారు. యూఏఈ

మిగతా 14వ పేజీలో...

అమరావతిలో ఆర్‌బీఐ

నేలపాడులో మూడు ఎకరాల్లో నిర్మాణం
రిజర్వ్‌బ్యాంకు, సీఆర్‌డీఏ మధ్య ఒప్పందం



మెల్బోర్న్ క్రికెట్ స్టేడియంలో క్రికెట్ విక్టోరియా ఎగ్జిక్యూటివ్‌లతో మంత్రి లోకేశ్

మీ పెట్టుబడికి మాదీ పూచీ!

ఒకసారి ఏపీతో చేతులు కలిపాక మీ ప్రాజెక్టు మాదే: లోకేశ్

అన్ని దశల్లో నిరంతరం పర్యవేక్షిస్తాం
16 నెలల్లో పది లక్షల కోట్ల పెట్టుబడులు
2047కి గ్లోబల్ పవర్ హౌస్‌గా ఏపీ
వచ్చే జనవరి నుంచి అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు 14
ఆస్ట్రేలియా పర్యటనలో మంత్రి వెల్లడి

త్వరలోనే ఫ్రీహోల్డ్‌కు స్వేచ్ఛ!

నిషేధం నుంచి భూములకు విముక్తి



ఉపసంఘం సమావేశంలో మంత్రులు ఫరూక్, అనగాని, పార్థసారథి, నారాయణ, తదితరులు

మంత్రివర్గ ఉపసంఘం కీలక చర్చ
వచ్చే సమావేశంలో అధికారిక నిర్ణయం
భూ కేటాయింపు విధానంలో కీలక మార్పులు
ఇకపై ఇచ్చేది లీజు ప్రాతిపదికనే
వక్ఫ్ అధికారులపై మంత్రుల ఆగ్రహం
భూములు అమ్మాలన్న ప్రతిపాదన తిరస్కరణ

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అసైన్డ్ భూముల ఫ్రీహోల్డ్‌పై ఉన్న నిషేధం త్వరలో తొలగిపోనుంది. ఈ మేరకు మంత్రివర్గ ఉపసంఘం నిర్ణయం వెలువరించనుంది. అతి త్వరలో రాష్ట్ర ప్రజలకు తీపి కబురు చెబుతామని రెవెన్యూ మంత్రి అనగాని సత్యప్రసాద్ చెప్పారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో ఆయన నేతృత్వంలో ఉపసంఘం సమావేశ మైంది. మంత్రులు ఎన్ఎండీ ఫరూక్, పయ్యావుల కేశవ్, పి.నా రాయణ, కె.పార్థసారథి తదితరులు పాల్గొన్నారు. ఆంధ్రప్రదేశ్ అసైన్డ్ భూముల చట్టం-1977లో చేసిన చట్టసవరణ, నిబంధన లకు లోబడి ఉన్న భూములకు పూర్తి స్వేచ్ఛ కల్పించాలని రెవెన్యూ శాఖ ప్రతిపాదించింది. నిబంధనలు ఉల్లంఘించిన కేసుల్లో అక్రమార్కులపై చర్యలు తీసుకోవాలని కోరింది. అలాగే జిల్లా స్థాయి కమిటీలు ఇచ్చిన నివేదికల్లోని పలు అంశాలపై కూడా కీలక ప్రతిపాదనలు చేసింది. వాటన్నిటికీ ఉపసంఘం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. అయితే ఫ్రీహోల్డ్ కింద

మిగతా 11వ పేజీలో...

కోస్తాకు తుఫాన్ ముప్పు

బంగాళాఖాతంలో అల్పపీడనం

నేడు వాయుగుండంగా, రేపు రాత్రికి తుఫాన్‌గా బలపడే చాన్స్ 14
29న కాకినాడ-మచిలీపట్నం మధ్య తీరంపైకి?.. నేడు, రేపు భారీవర్షాలు
27, 28 తేదీల్లో కుంభవృష్టి!.. ప్రకాశం జిల్లాలో వాగులో విద్యార్థి గల్లంతు

తల మీద తుపాకీ పెడితే..
ఒప్పందాలు కుదుర్చుకోం

» కేంద్ర వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్



బెర్లిన్/న్యూఢిల్లీ, అక్టోబరు 24: అమెరికా, యూరోపియన్ యూనియన్ (ఈయూ) సహా పలు దేశాలు, ప్రాంతాలతో వాణిజ్య ఒప్పందాలపై భారత్ చురుగ్గా చర్చలు జరుపుతోందని కేంద్ర వాణిజ్య, పరిశ్రమల శాఖ మంత్రి పీయూష్ గోయల్ పేర్కొన్నారు. తొందరపాటుతో లేదా తలకు తుపాకీ పెట్టడంతో భారత్ వాణిజ్య ఒప్పందాలు కుదుర్చుకోబోదని ఆయన శుక్రవారం కరాఖండీగా చెప్పేశారు. "మేము ఈయూతో చురుగ్గా చర్చలు జరుపుతున్నాం. అమెరికాతోనూ మాట్లాడుతున్నాం. మేము తొందరపడి ఒప్పందాలు కుదుర్చుకోం. గడువులతో లేదా తలకు తుపాకీ పెట్టడంతో ఒప్పందాలు చేసుకోబోం" అని జర్మనీలో జరిగిన బెర్లిన్ గ్లోబల్ డైలాగ్ ఆయన పేర్కొన్నారు. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులను పెంచే మార్గాల గురించి చర్చించడానికి నాయకులు, బెర్లిన్ వ్యాపారుల సమావేశంలో పాల్గొనేందుకు కేంద్ర మంత్రి బెర్లిన్‌కు వెళ్లారు. అధిక సుంకాలను ఎదుర్కోవడంలో భాగంగా భారత్ కొత్త మార్కెట్లపై దృష్టిసారిస్తోందని గోయల్ చెప్పారు. ఒక దేశం నుంచి ఒక నిర్దిష్ట ఉత్పత్తిని కొనుగోలు చేయాలనే నిర్ణయాన్ని మొత్తం ప్రపంచం తీసుకోవాలన్నారు. రష్యా నుంచి ముడిచమురు కొనుగోలు చేయడాన్ని ఆపాలని భారత్‌పై అమెరికా ఒత్తిడి చేస్తున్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో పీయూష్ గోయల్ తాజాగా చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

అయోధ్య రామాలయ దర్శన వేళల్లో మార్పులు

అయోధ్య, అక్టోబరు 24: అయోధ్యలోని బాల రాముడి ఆలయంలో దర్శన సమయాల్లో అధికారులు స్వల్ప మార్పులు చేశారు. జన్మభూమి పథం గుండా ఇప్పటివరకు రాత్రి 9 గంటల వరకు భక్తులను దర్శనాలకు అనుమతిస్తున్నారు. ఆ సమయాన్ని అరగంట పాటు కుదించి ఇకపై 8:30 వరకే అనుమతించనున్నారు. శీతాకాలం దృష్ట్యా ఈ నిర్ణయం తీసుకున్నట్లు రామజన్మభూమి తీర్థక్షేత్ర ట్రస్టీ అనిల్ మిశ్రా ప్రకటించారు. శయన హారతి సమయాన్ని కూడా సవరించి, రాత్రి 10 గంటలకు బదులుగా 9:30కు నిర్వహిస్తారు. అదేవిధంగా ఉదయం వేళ జరిగే కార్యక్రమాల్లోనూ స్వల్ప మార్పులు జరిగాయి. మంగళ హారతి 4 గంటలకు బదులుగా 4:30కు, శృంగార హారతి 6 గంటలకు బదులుగా 6:30కు నిర్వహిస్తారు. భక్తులకు సాధారణ దర్శనాలు యథావిధిగా ఉదయం 7 గంటల నుంచి ప్రారంభమవుతాయి.

అమెరికాలో రెండు ఉద్యోగాలు చేస్తున్న భారతీయుడి అరెస్టు

» 15 ఏళ్ల జైలుశిక్ష విధించే అవకాశం!

న్యూయార్క్, అక్టోబరు 24 : అమెరికాలో రెండు ఉద్యోగాలు(మూన్‌లైటింగ్) చేస్తోన్న ఓ భారతీయుడిని అక్కడి అధికారులు అరెస్టు చేశారు. మెహుల్ గోస్వామి(39) అనే ఆ వ్యక్తి న్యూయార్క్‌లో ఉంటూ.. న్యూయార్క్ స్టేట్ ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ సర్వీసెస్ కార్యాలయంలో ప్రభుత్వ ఉద్యోగం చేస్తున్నాడు. అదే సమయంలో మాల్టా పట్టణంలోని గ్లోబల్ ఫౌండ్రీస్ అనే సెమికండక్టర్ కంపెనీలో 2022 మార్చి నుంచి కాంట్రాక్టర్‌గానూ చేస్తున్నాడు. దీనిపై ఒక ఈమెయిల్ ద్వారా సమాచారం అందడంతో అధికారులు విచారణ చేపట్టి అతడు రెండు ఉద్యోగాలు చేస్తున్నట్లు నిర్ధారించారు. ప్రభుత్వ ఉద్యోగులు తమ విధులను నిజాయితీగా నిర్వహించాలని, కాని గోస్వామి దాన్ని ఉల్లంఘించినట్లు పేర్కొన్నారు. ఈ నెల 15న గోస్వామిని అరెస్టు చేసి జడ్జి ముందు హాజరుపరిచారు. అనంతరం వ్యక్తిగత పూచీకత్తుపై అతడు విడుదల అయ్యాడు. ఈ కేసు దర్యాప్తు ఇంకా కొనసాగుతోంది. విచారణలో నేరం నిరూపణ అయితే అతడికి దాదాపు 15 ఏళ్ల జైలుశిక్షతోపాటు జరిమానా విధించే అవకాశం ఉందని అంచనా.

తీరప్రాంత గస్తీకి 'అజిత్', 'అపరాజిత్'

న్యూఢిల్లీ, అక్టోబరు 24: భారత తీరప్రాంత రక్షణ సామర్థ్యాన్ని మరింత పెంచే దిశగా మరో కీలక ముందడుగు పడింది. భారతీయ కోస్ట్ గార్డ్ (ఐసీజీ) కోసం గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్ (జీఎస్ఎల్) నిర్మించిన రెండు అడ్వాన్స్‌డ్ ఫాస్ట్ పెట్రోలింగ్ నౌకలు (ఎఫ్‌పీవీ) 'ఐసీజీఎస్ అజిత్', 'ఐసీజీఎస్ అపరాజిత్' శుక్రవారం ప్రారంభమయ్యాయి. తీరప్రాంత గస్తీ, మత్స్య సంపద సంరక్షణ, అక్రమ రవాణా నిరోధం, పైరసీ నిరోధంతో పాటు సెర్చ్, రెస్క్యూ ఆపరేషన్లు నిర్వహించే సత్తా కలిగిన ఈ రెండు ఎఫ్‌పీవీలను గోవా షిప్‌యార్డ్ లిమిటెడ్‌లో ప్రారంభించినట్లు రక్షణ మంత్రిత్వ శాఖ తెలిపింది. ఐసీజీ కోసం జీఎస్ఎల్ నిర్మించిన ఎనిమిది స్వదేశీ ఎఫ్‌పీవీల శ్రేణిలో ఇవి చివరి (ఏడు, ఎనిమిది) నౌకలని పేర్కొంది. వీటి చేరికతో తీరప్రాంత నిఘా, స్పందించే సామర్థ్యం పెరుగుతాయని వెల్లడించింది. 52 మీటర్ల పొడవు, 320 టన్నుల బరువు కలిగిన ఈ నౌకల్లో నియంత్రించదగిన పిచ్ ప్రొపెల్లెంట్లు అమర్చినట్టు తెలిపింది.

జమ్మూ-కశ్మీర్‌లో రాజ్యసభ ఎన్నికల ఫలితాలు
నేషనల్ కాన్ఫరెన్స్‌కు 3, బీజేపీకి 1

శ్రీనగర్, అక్టోబరు 24: జమ్మూ-కశ్మీర్‌లో నిర్వహించిన రాజ్యసభ స్థానాల ఎన్నికల ఫలితాలు శుక్రవారం వెల్లడయ్యాయి. మొత్తం నాలుగు స్థానాలకు ఎన్నికలు జరగగా మూడింటిలో అధికారిక నేషనల్ కాన్ఫరెన్స్, ఒక స్థానంలో బీజేపీ విజయం సాధించాయి. నేషనల్ కాన్ఫరెన్స్‌కు చెందిన చౌదరి మహమ్మద్ రమ్‌జాన్, సాజద్ కిచ్లూ, జి.ఎస్.ఒబెరాయ్ అలియాస్ షమ్మీ ఒబెరాయ్ గెలుపొందారు. నాలుగో స్థానంలో బీజేపీకి చెందిన సత్ శర్మ విజయం సాధించారు. శర్మకు 32 ఓట్లు రాగా, ప్రత్యర్థి అయిన నేషనల్ కాన్ఫరెన్స్ యువ అధికార ప్రతినిధి ఇమ్రాన్ నబీ దర్‌కు 22 వచ్చాయి. ఈ ఎన్నికల్లో నేషనల్ కాన్ఫరెన్స్, బీజేపీలు మ్యాచ్ ఫిక్సింగ్‌కు పాల్పడ్డాయని పీపుల్స్ కాన్ఫరెన్స్ చీఫ్ సాజద్ లోన్ ఆరోపించారు.

వీఐటీఈఈఈ–2026 కోసం దరఖాస్తుల ఆహ్వానం

VIT Vellore Institute of Technology (Deemed to be University under section 3 of UGC Act, 1956)

చెన్నై, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఫ్లాగ్‌షిప్ ఇంజనీరింగ్ ప్రోగ్రామ్‌ల్లో ప్రవేశానికి వేలూరు ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ(వీఐటీ) దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. వీఐటీఈఈఈ-2026 పేరిట నిర్వహించనున్న పరీక్షలో ప్రతిభ చూపిన విద్యార్థులకు వేలూరు, చెన్నై, అమరావతి, భోపాల్‌లోని వీఐటీ ప్రాంగణాల్లో ప్రవేశాలు కల్పించనున్నట్లు నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులు www.viteee.vit.ac.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవచ్చని పేర్కొన్నారు. దేశంలోని 134 నగరాలు, 9 అంతర్జాతీయ పరీక్షా కేంద్రాల్లో వచ్చే ఏడాది ఏప్రిల్ 28 నుంచి మే 3వ తేదీ వరకు ఈ పరీక్ష నిర్వహించనున్నట్లు వెల్లడించారు. విద్యార్థులు తమకు దగ్గరగా ఉన్న ఏదో ఓ కేంద్రాన్ని ఎంచుకోవచ్చని పేర్కొన్నారు. ప్రపంచ స్థాయి మౌలిక సదుపాయాలతో, అద్భుతమైన ప్లేస్‌మెంట్ అవకాశాలతో ఇంజనీరింగ్ విద్యకు కేరాఫ్‌గా వీఐటీ నిలుస్తోందని వివరించారు. తమ కలల కేరీర్ వైపు అడుగులు వేయాలనుకునే విద్యార్థులకు ఇది సువర్ణ అవకాశమని పేర్కొన్నారు.


అప్పుల్లో మనమే టాప్!

కుటుంబ రుణాల్లో అగ్రస్థానంలో ఏపీ, తెలంగాణ.. దేశంలోనే దక్షిణాదిలో అత్యధికం

» కేంద్ర గణాంకాలశాఖ వెల్లడి

» దక్షిణాది ప్రజలకు రుణచెల్లింపు సామర్థ్యం అధికం

» అందుకనే రుణసంస్థలు అప్పులిస్తున్నాయ్.. నిపుణులు



న్యూఢిల్లీ/అమరావతి, అక్టోబరు 24: సామాజిక, ఆర్థిక అంశాల్లో ముందంజలో ఉండే దక్షిణాది రాష్ట్రాలకు చెందిన కుటుంబాలు అప్పులు తీసుకోవటంలోనూ దేశంలోని ఇతర రాష్ట్రాల కంటే ముందున్నాయి. ఇక మొత్తం దక్షిణాదిలో రెండు తెలుగు రాష్ట్రాలు అగ్రస్థానంలో ఉన్నాయి. ప్రతీ ఆరు నెలలకోమారు విడుదలయ్యే కేంద్ర గణాంకాలశాఖ జర్నల్ 'సర్వేక్షణ' ఈ వివరాలను వెల్లడించింది. దీని ప్రకారం.. దేశంలోని వయోజనుల్లో అప్పు తీసుకున్న వారి సంఖ్య సగటున 15 శాతం కాగా.. దక్షిణాది రాష్ట్రాలన్నింటా ఇది 20 శాతానికిపైనే ఉంది. అన్నింట్లోకి అగ్రస్థానంలో ఆంధ్రప్రదేశ్ నిలవటం గమనార్హం. ఆ రాష్ట్రంలో అప్పు తీసుకున్న వయోజనుల సంఖ్య సగటున 43.7 శాతం. ఆ తర్వాత స్థానంలో తెలంగాణ 37.2 శాతంతో ఉంది. తదుపరి స్థానాల్లో కేరళ (29.9%), తమిళనాడు (29.4%), పుదుచ్చేరి (28.3%), కర్ణాటక (23.2%) ఉన్నాయి. ఇతర రాష్ట్రాల విషయానికొస్తే.. ఛత్తీస్‌గఢ్ 6.5%, అస్సాం 7.1%, గుజరాత్ 7.2%, జార్ఖండ్ 7.5%, పశ్చిమ బెంగాల్ 8.5%, హరియాణా 8.9% మంది రుణగ్రహీతలను కలిగి ఉన్నాయి. ఢిల్లీలో అత్యల్పంగా కేవలం 3.4 శాతం మంది మాత్రమే రుణం తీసుకున్నట్లు తెలిపారు.

అగ్రస్థానంలో బీసీలు

దేశంలో అప్పులు తీసుకుంటున్న వ్యక్తులను, కుటుంబాలను సామాజికవర్గాల ప్రకారం పరిశీలిస్తే.. 16.6 శాతంతో బీసీలు అగ్రస్థానంలో నిలువగా.. 11 శాతంతో ఎస్టీలు అత్యంత దిగువన ఉన్నారు. పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల పరంగా స్వల్ప తేడానే ఉంది (పట్టణాలు-14%, గ్రామీణ ప్రాంతాలు-15%). అలాగే మతాలవారీగానూ పెద్దగా తేడాల్లేవు. మహిళలకంటే పురుషులు, వివాహితులు, చిన్న కుటుంబాల వారు ఎక్కువగా అప్పులు తీసుకుంటున్నట్లు తేలింది. 2020-21లో నిర్వహించిన 78వ బహుళ ప్రయోజనకర సర్వేలో వెల్లడైన అంశాల ఆధారంగా ఈ వివరాలను సమోదు చేశారు. సర్వేలో భాగంగా 15 లేదా అంతకంటే ఎక్కువ వయసు ఉన్న వారిని ప్రశ్నించారు. సర్వే సమయానికి కనీసం రూ.500 లేదా అంతకంటే ఎక్కువ అప్పు ఉన్న వారి వివరాలు సేకరించారు. ఈ నివేదికపై ఆర్థిక నిపుణులు స్పందిస్తూ.. దక్షిణాది రాష్ట్రాల ప్రజల తలసరి ఆదాయం, ఆస్తులు ఎక్కువ కాబట్టి, రుణాలు తిరిగి చెల్లించే సామర్థ్యం ఉంటుందని, అందువల్లే రుణసంస్థలు వారికి అప్పులను గణనీయంగా ఇస్తున్నాయని పేర్కొన్నారు.

అరచేతిపై సూసైడ్‌నోట్..
వైద్యురాలి ఆత్మహత్య

» ఓ ఎస్సై తన మీద పలుమార్లు అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ప్రాణం తీసుకున్న ప్రభుత్వ డాక్టర్

» మహారాష్ట్రలో దారుణం.. ఎస్సైపై వేటు

ముంబై, అక్టోబరు 24: ఆమె ఓ ప్రభుత్వ వైద్యురాలు! తనపై ఓ పోలీసు అధికారి గత ఐదునెలల్లో నాలుగుసార్లు దారుణ అత్యాచారానికి పాల్పడ్డాడని.. అతడి తీవ్ర శారీరక, మానసిక వేధింపులను తాళలేకే ప్రాణాలు తీసుకుంటున్నానంటూ అరచేతిపై సూసైడ్ నోట్ రాసి ఆత్మహత్య చేసుకున్నారు. మహారాష్ట్రలో గురువారం రాత్రి జరిగిన ఈ ఘటన ఆ రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. తీవ్ర రాజకీయ దుమారానికి దారితీసింది. ఘటనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతుండటంతో మహారాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టింది. ముఖ్యమంత్రి ఫడణవీస్ ఆదేశాల మేరకు వైద్యురాలు ఆరోపణలు గుప్పించిన ఎస్సైని సస్పెండ్ చేస్తున్నట్లు అక్కడి పోలీసు ఉన్నతాధికారులు ప్రకటించారు. మృతురాలు సతారా జిల్లాలో వైద్య అధికారిగా పనిచేస్తున్నారు. తనపై గోపాల్ బాద్నే అనే ఎస్సై నాలుగుసార్లు అత్యాచారానికి పాల్పడ్డాడని అరచేతిపై ఆమె రాసుకున్నారు. అసిస్టెంట్ పోలీస్ ఇన్‌స్పెక్టర్ లాడ్‌పుత్రే కూడా తనను మానసికంగా తీవ్ర వేధింపులకు గురిచేశారని ఆమె ఆరోపించారు. ఈ పోలీసు అధికారుల వేధింపుల గురించి ఆమె గతంలోనే.. అంటే జూన్ 19న ఫల్టాన్ డీఎస్పీకి లేఖ రాశారు. లేఖలో ఆమె ఇవే ఆరోపణలు చేశారు. గోపాల్, లాడ్‌పుత్రే కారణంగా తాను తీవ్ర మానసిక ఒత్తిడిలో కూరుకుపోయానని.. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించి, విచారణ చేసి, ఆ ఇద్దరు పోలీసు అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని లేఖలో ఆమె కోరారు. వైద్యురాలు రెండేళ్ల క్రితమే సతారా ఆస్పత్రిలో డ్యూటీలో చేరారు. పోస్టుమార్టం, ఫిట్‌నెస్‌లపై నకిలీ నివేదికల కోసం ఆమెపై పోలీసు అధికారులు తీవ్ర ఒత్తిడి చేశారని.. ఆ వేధింపులు భరించలేకే ఆమె ప్రాణాలు తీసుకున్నారని వైద్యురాలి బంధువు ఆరోపించారు. పోలీసు అధికారుల వేధింపులపై డీఎస్పీ, ఎస్పీకి ఆమె రెండు, మూడుసార్లు లేఖలో ఫిర్యాదు చేశారని.. అయినా ఎలాంటి చర్యలూ తీసుకోలేదని ఆయన విమర్శించారు. వైద్యురాలి చావుకు కారణమైన పోలీసు అధికారులను వెంటనే అరెస్టు చేసి.. మరణశిక్ష విధించాలని డిమాండ్ చేశారు. వైద్యురాలి ఆత్మహత్య ఘటన నేపథ్యంలో మహారాష్ట్ర సర్కారుపై ఆ రాష్ట్ర కాంగ్రెస్ నేత నాందేవ్ రావు ఎక్స్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. మహిళలను రక్షించాల్సిన పోలీసులే వారిని వేధిస్తే న్యాయం ఎలా జరుగుతుంది? అని ప్రశ్నించారు. తన పట్ల పోలీసు అధికారుల దుశ్చర్యలపై గతంలోనే బాధితురాలు లేఖలు రాసినప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదు? అని నిలదీశారు. దారుణాలకు పాల్పడుతున్న పోలీసులకు మహారాష్ట్ర ప్రభుత్వమే కాపాడుతోందని తీవ్ర విమర్శలు చేశారు. వైద్యురాలి ఆత్మహత్య ఘటన దురదృష్టకరమని మహారాష్ట్ర ప్రభుత్వంలో భాగస్వామి అయిన బీజేపీ పేర్కొంది. తన మీద జరుగుతున్న వేధింపులపై వైద్యురాలు గతంలోనే ఉన్నతాధికారులకు లేఖ రాసినట్లుగా తమ దృష్టికి వచ్చిందని, దీనిపై విచారణ జరుపుతామని బీజేపీ ఎమ్మెల్సీ, మహారాష్ట్ర మహిళా ప్రెసిడెంట్ చిత్రావాగ్ పేర్కొన్నారు. కాగా గతంలో వైద్యురాలు రాసిన లేఖపై విచారణ జరిపి, నివేదిక ఇవ్వాలంటూ మహారాష్ట్ర మహిళా కమిషన్, ఆ రాష్ట్ర పోలీసులకు ఆదేశాలు జారీ చేసింది.

లోకం తీరు



ఉబర్, ఓలాకు పోటీగా
'భారత్ ట్యాక్సీ'

» సహకార విధానంలో తెస్తున్న కేంద్రం


» వచ్చే నెల నుంచి ఢిల్లీలో పైలట్ ప్రాజెక్టు

» డిసెంబర్ నుంచి దేశవ్యాప్తంగా విస్తరణ

న్యూఢిల్లీ, అక్టోబరు 24: క్యాబ్ సర్వీసులు అందించే ఓలా, ఉబర్‌లకు పోటీగా 'భారత్ ట్యాక్సీ' వస్తోంది. క్యాబ్ నిర్వాహకుల నుంచి ఎలాంటి కమీషన్లు వసూలు చేయకుండా, సహకార పద్ధతిలో నిర్వహించే ఈ సర్వీసుతో.. అటు క్యాబ్ నిర్వాహకులకు, ఇటు ప్రయాణికులకు ప్రయోజనం కలగనుంది. ఓలా, ఉబర్ సంస్థలు క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్ల నుంచి అడ్డగోలుగా 25% వరకు కమీషన్లు వసూలు చేస్తున్నాయని.. ప్రయాణాల రద్దు, రద్దీ సమయాల పేరిట ప్రయాణికుల నుంచి అడ్డగోలు చార్జీలు వసూలు చేస్తున్నాయనే ఆరోపణలున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలోనే ప్రైవేటు క్యాబ్ సర్వీసులకు ప్రత్యామ్నాయాన్ని అందుబాటులోకి తేవడం.. క్యాబ్ నిర్వాహకులు, డ్రైవర్లకు ప్రయాణ చార్జీలు పూర్తిగా అందేలా చేయడం లక్ష్యంగా.. కేంద్ర సహకారశాఖ, జాతీయ ఈ-గవర్నెన్స్ విభాగం (ఎన్ఈజీడీ) 'భారత్ ట్యాక్సీ'ని రూపొందించింది. రూ.300 కోట్ల మూలధనంతో 'సహకార్ ట్యాక్సీ కో-ఆపరేటివ్ లిమిటెడ్' సంస్థను ఏర్పాటు చేసింది. ఇందులో క్యాబ్ నిర్వాహకుల నుంచి కేవలం రోజువారీ, నెలవారీ సభ్యత్వ రుసుమును మాత్రమే తీసుకుంటారు. నవంబర్ నుంచి ఢిల్లీలో పైలట్ ప్రాజెక్టుగా 650 క్యాబ్‌లతో 'భారత్ ట్యాక్సీ'ని ప్రారంభించనున్నారు. డిసెంబర్‌లో ముంబై, పుణె, భోపాల్, లక్నో, జైపూర్ సహా 20 నగరాలకు, వచ్చే ఏడాది మార్చి నాటికి ప్రధాన నగరాలన్నింటికీ భారత్ ట్యాక్సీని విస్తరిస్తారు. 2030 నాటికి లక్ష మంది క్యాబ్ డ్రైవర్లను భారత్ ట్యాక్సీకి అనుసంధానం చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నారు.

ప్రచార వ్యూహకర్త పీయూష్ పాండే కన్నుమూత

» 'అబ్‌కీ బార్ మోదీ సర్కార్' నినాదం ఆయన సృష్టించిందే



ముంబై, అక్టోబరు 24: పదకొండేళ్ల క్రితం లోక్‌సభ ఎన్నికల సమయంలో బీజేపీ ప్రచారానికి 'అబ్‌కీ బార్ మోదీ సర్కార్' నినాదాన్ని రూపొందించిన ప్రచార వ్యూహకర్త పీయూష్ పాండే శుక్రవారం తెల్లవారుజామున ముంబైలో కన్నుమూశారు. ఆయన వయస్సు 70 ఏళ్లు. 1982లో ఒగిల్వీ ఇండియా ప్రకటనల సంస్థలో చేరిన ఆయన తన ప్రకటనల్లో పాశ్చాత్య ధోరణులను పక్కనబెట్టి భారతీయ భాషల్లోని భావోద్వేగాన్ని చేర్చడం ద్వారా కొత్త ఒరవడిని సృష్టించారు. అన్ని భాషల సంస్కృతులను మేళవిస్తూ దేశం మొత్తాన్ని ఉర్రూతలూగించిన 'మిలే సుర్ మేరా తుమారా' పాటను ఈయనే రాశారు. పల్స్ పోలియో ప్రచారానికి 'దో బూంద్ జిందగీ కీ', క్యాడ్‌బరీ డైరీ మిల్క్ చాక్లెట్ కోసం 'కుచ్ ఖాస్ హై', ఫెవికాల్ కోసం 'ఫెవికాల్ కా మజ్‌బూత్ జోడ్ హై, టూటేగా నహీ' పంచ్ లైన్లతో ఆయన రూపొందించిన ప్రకటనలు సూపర్ డూపర్ హిట్ అయ్యాయి. ఇంటింటా జనం గొంతులో పలికాయి. పీయూష్ పాండే పద్మశ్రీ గ్రహీత. రాజస్థాన్ తరఫున రంజీ క్రికెట్ ఆడారు. ఆయన సోదరి ఇలా అరుణ్ ప్రముఖ బాలీవుడ్ నటి. 2013లో మద్రాస్ కేఫ్ సినిమాలో నటించారు. పీయూష్ పాండే మృతికి ప్రధాని నరేంద్ర మోదీ, బాలీవుడ్ నటుడు అమితాబ్ బచ్చన్ తదితరులు సంతాపం తెలిపారు. ఆయన సృజనాత్మక మేధోశక్తిని గుర్తు చేసుకున్నారు.

డిజిటల్ సేవలు @ టెలికం సైబర్ సెక్యూరిటీ!

ఆయా సంస్థలన్నీ నిబంధనలు పాటించాల్సిందే



» టెలికం సైబర్ సెక్యూరిటీ నిబంధనలు నోటిపై చేసిన కేంద్రం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: వాట్సాప్ నుంచి పేమెంట్ యాప్‌లు, ఆహారాన్ని సరఫరా చేసే యాప్‌ల వరకు.. మొబైల్ నంబర్ల ఆధారంగా డిజిటల్ సేవలందించే సంస్థలన్నింటినీ కేంద్ర ప్రభుత్వం 'టెలికం సైబర్ సెక్యూరిటీ నియంత్రణ'ల పరిధిలోకి తెచ్చింది. సైబర్ నేరాలను అరికట్టేందుకు గాను టెలికమ్యూనికేషన్స్ (టెలికం సైబర్ సెక్యూరిటీ) సవరణ నిబంధనలు 2025ను ఈ నెల 22న నోటిపై చేసింది. ఈ నిబంధనలు తక్షణమే అమల్లోకి వస్తాయని తెలిపింది. ఈ నిబంధనల ప్రకారం.. ఒకేసారి వేర్వేరు డిజిటల్ సేవలు పొందే వినియోగదారుల ఖాతాలను నిలిపివేసే అధికారాలు సంబంధిత సంస్థలకు ఉంటాయి. అలాగే వాడిన ఫోన్ల అమ్మకం లేదా కొనుగోలు చేసేముందు ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే 'మొబైల్ నంబర్ వెరిఫికేషన్ (ఎంఎన్‌వీ)' వ్యవస్థలో డేటాబేస్ తనిఖీలు తప్పనిసరి చేసింది. దొంగిలించిన లేదా ఫోర్జరీ చేసిన మొబైల్ కనెక్షన్లు, ఫోన్ హ్యాండ్‌సెట్లతో చేస్తున్న సైబర్ నేరాలను అరికట్టడమే లక్ష్యంగా ఈ చర్యలు చేపట్టింది. తాజా నిబంధనల్లో 'టెలికమ్యూనికేషన్ ఐడెంటిఫయర్ యూజర్ ఎంటిటీస్ (టీఐయూఈ)' అనే కొత్త విభాగాన్ని సృష్టించారు. లైసెన్స్ టెలికం ఆపరేటర్లు మినహా ఫోన్ నంబర్ల ఆధారంగా వినియోగదారులను గుర్తించి, సేవలందించే వ్యాపార సంస్థలన్నీ దీని పరిధిలోకి వస్తాయి. జొమాటో, స్విగ్గీ, ఫోన్‌పే, పేటీఎం, ఓలా, ఉబర్ వంటి సంస్థలు టీఐయూఈ విభాగంలోకి వస్తాయి. మెసేజింగ్ సేవల విషయంలో ఎయిర్‌టెల్, జియోలు కూడా ఈ కోవకే చెందుతాయి. కొత్త నిబంధనల మేరకు ఈ టీఐయూఈలు తప్పనిసరిగా ప్రభుత్వ ఆదేశాలను పాటించాల్సి ఉంటుంది. ఫోన్ నంబర్లను సస్పెండ్ చేయడం, ఆయా సంస్థలు వాడే ఫోన్ నంబర్ల డేటాకు సంబంధించిన అభ్యర్థనలకు స్పందించడం, అధికారులు సూచించిన విధంగా వినియోగదారుల గుర్తింపును తనిఖీ చేయడం వంటివి చేయాల్సి ఉంటుంది. భద్రతా కారణాల రీత్యా ప్రభుత్వం ఒక ఫోన్ నంబరును నిలిపివేయవచ్చు. అలాగే ఆ నంబరు వినియోగాన్ని నిలిపివేయాలని టెలికం ఆపరేటర్లు, యాప్‌లను ఆదేశించవచ్చు. ప్రజాప్రయోజనాల రీత్యా ముందుగా ఎలాంటి నోటీసు ఇవ్వకుండానే సంబంధిత సేవలను నిలిపివేయవచ్చు. దేశంలో రోజురోజుకూ పెరిగిపోతున్న సైబర్ నేరాలను అడ్డుకునేందుకే కొత్త నిబంధనలను అమల్లోకి తెచ్చినట్లు కేంద్ర ప్రభుత్వం తెలిపింది.

పెన్షన్ పథకాల్లో మరో రెండు ఐచ్ఛికాలు

న్యూఢిల్లీ, అక్టోబరు 24: కేంద్ర ప్రభుత్వ ఉద్యోగుల కోసం అమలు చేస్తున్న నేషనల్ పెన్షన్ స్కీం (ఎన్‌పీఎస్), యూనిఫైడ్ పెన్షన్ స్కీం(యూపీఎస్)లలో మరో రెండు పెట్టుబడుల ఐచ్ఛికాలను అమలు చేయనున్నట్లు శుక్రవారం కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. లైఫ్ సైకిల్ (ఎల్‌సీ), బ్యాలెన్స్‌డ్ లైఫ్ సైకిల్ (బీఎల్‌సీ) పేరుతో వీటిని అమలు చేయనున్నట్టు తెలిపింది. పదవీ విరమణ ప్రణాళికలను మరింత సరళతరం చేసి, పెట్టుబడులకు మరిన్ని అవకాశాలు కల్పించడమే దీని లక్ష్యమని పేర్కొంది. ఉద్యోగులు నచ్చిన స్కీంను ఎంచుకోవచ్చని తెలిపింది. షేర్లలో పెట్టుబడులు పెట్టడానికి అవకాశం కల్పించింది. లైఫ్ సైకిల్ ఆప్షన్‌లో ఎల్‌సీ-25 కింద గరిష్ఠంగా 25% వరకు ఈక్విటీలను కేటాయిస్తారు. 35 ఏళ్ల నుంచి 55 ఏళ్లు వచ్చే వరకు కొనసాగించవచ్చు. ఎల్‌సీ-50 కింద రిటైర్మెంట్ నిధిలో గరిష్ఠంగా 50% వరకు ఈక్విటీలు కేటాయిస్తారు. ఎల్‌సీ-50కి కొన్ని మార్పులు చేసి బ్యాలెన్స్‌డ్ లైఫ్ సైకిల్ (బీఎల్‌సీ) ఆప్షన్‌ను రూపొందించారు. దీనికింద 45 ఏళ్లు వచ్చిన తరువాతే పెట్టుబడులు పెట్టవచ్చు. పెట్టుబడులను నచ్చినంత కాలం కొనసాగించుకునే వెసులుబాటు ఉంది. ఎల్‌సీ 75 కింద గరిష్ఠంగా 75% ఈక్విటీలు ఇస్తారు. 35 నుంచి 55 ఏళ్లు వచ్చే వరకు వీటిని కొనసాగించవచ్చు. స్కీం-జీ కింద 100% సొమ్మును ప్రభుత్వ సెక్యూరిటీల్లో పెట్టవచ్చు. పీఎఫ్ఆర్‌డీఏ అమలు చేస్తున్న వివిధ రకాల పథకాల్లోనూ పెట్టుబడులు పెట్టే అవకాశం ఉంది.

పాక్‌కు అఫ్గాన్ జలాలు కట్!

» కునార్ నదిపై డ్యామ్ నిర్మాణానికి అఫ్గాన్ నిర్ణయం

న్యూఢిల్లీ, అక్టోబరు 24: దాయాది పాకిస్థాన్‌తో సింధూజలాల ఒప్పందాన్ని రద్దు చేసుకున్న భారత్ బాటలోనే అఫ్గానిస్థాన్ కూడా నడుస్తోంది. యుద్ధం నేపథ్యంలో సరిహద్దుల గుండా ప్రవేశించే కునార్ నదీ జలాలు పాక్ భూభాగంలోకి ప్రవేశించకుండా కట్టడి చేయాలని అఫ్గాన్ నిర్ణయం తీసుకుంది. దీని కోసం కునార్ నదిపై అతి త్వరలోనే డ్యామ్‌ను నిర్మిస్తామని తాలిబన్ సుప్రీం లీడరు మౌలావీ హిబాతుల్లా అఖుంద్‌జాదా ప్రకటించారు. డ్యామ్ నిర్మాణం విషయంలో అఫ్గాన్ పాలకులు పట్టుదలగా ఉన్నారని లండన్ కేంద్రంగా పని చేస్తున్న ఆ దేశ జర్నలిస్టు సమీ యూసఫ్‌జయ్ తెలిపారు. విదేశీ నిర్మాణ సంస్థల కోసం వేచి చూడకుండా దేశీయ కంపెనీలకే కాంట్రాక్టు ఇచ్చి కునార్ నది వద్ద పనులు వెంటనే మొదలుపెట్టాలని జల వనరులు, ఇంధన మంత్రిత్వశాఖను సుప్రీం లీడరు ఆదేశించారని పేర్కొన్నారు. ఈశాన్య అఫ్గానిస్థాన్‌లోని హిందూకుష్ పర్వతాల్లో జన్మించిన కునార్ నది 480 కిలోమీటర్లు ప్రవహించి బ్రోఘిల్ పాస్ వద్ద పాక్ భూభాగంలోకి ప్రవేశిస్తుంది. చిత్రాల్‌గా పాక్‌లో పిలిచే ఈ నది ఖైబర్ పంఖ్తుంఖ్వా ప్రాంత సాగు, తాగునీటి అవసరాలు తీరుస్తోందని సమీ యూసఫ్‌జయ్ 'ఎక్స్'లో తెలిపారు. కాగా, యుద్ధం నేపథ్యంలో పాకిస్థాన్, అఫ్గానిస్థాన్‌ల మధ్య సరిహద్దులు మూసుకుపోయాయి. రెండు దేశాల్లోనూ నిత్యావసరాల ధరలు మండిపోతున్నాయి. పాక్‌లో ఎక్కువగా వినియోగించే టమాటా కేజీ రూ.187 పలుకుతోంది. సరుకులతో నిండిన దాదాపు 5000 కంటైనర్లు సరిహద్దుకు అటూఇటూ నిలిచిపోయాయి.

నితీశ్ నేతృత్వంలో ఎన్డీయే రికార్డులు బద్దలు కొడుతుంది



బిహార్ ఎన్నికల ప్రచారంలో మోదీతో నితీశ్

» ఎన్డీయే సీఎం అభ్యర్థిపై సందిగ్ధత తొలగించిన ప్రధాని

పట్నా, అక్టోబరు 24: బిహార్ అసెంబ్లీ ఎన్నికల్లో సీఎం నితీశ్ నేతృత్వంలో ఎన్డీయే గత రికార్డులన్నింటినీ బద్దలు కొడుతుందని ప్రధాని మోదీ చెప్పారు. అభివృద్ధిలో బిహార్ దూసుకుపోతుందని, మరోసారి ఎన్డీయే ప్రభుత్వం ఘన విజయం సాధించబోతుందన్నారు. బిహార్‌లోని బెగుసరాయ్, సమస్తీపూర్ జిల్లాల్లో ఎన్నికల ప్రచార సభల్లో పాల్గొన్న ఆయన ఎన్డీయే సీఎం అభ్యర్థిపై నెలకొన్న సందిగ్ధతను తొలగించారు. సభకు హాజరైన వారితో సెల్‌ఫోన్ లైట్ ఆన్ చేయించి... ఎన్డీయే పాలనలో కావాల్సినంత వెలుగుండగా విపక్ష మహాగఠ్‌బంధన్ లాంతరు(ఆర్జేడీ ఎన్నికల గుర్తు) అవసరమా అని మోదీ ప్రశ్నించారు. గత 11 ఏళ్లుగా యూపీయే హయాం కంటే మూడింతల ఎక్కువ నిధులు బిహార్‌కు ఇచ్చినట్లు మోదీ చెప్పారు. తాజా అసెంబ్లీ ఎన్నికల్లో మహిళలు కీలకమని చెబుతూ పార్లమెంట్‌లో మహిళా బిల్లు పెట్టినప్పుడు ఆర్జేడీ కాంగ్రెస్ అడ్డుకున్నాయని చెప్పారు. అయితే, బిహార్‌లో ఎన్డీయే గెలిచినా నితీశ్‌ను సీఎం చేయరని మహాగఠ్‌బంధన్ సీఎం అభ్యర్థి తేజస్వీ యాదవ్ అన్నారు. నితీశ్‌ను మోదీ, షా హైజాక్ చేశారని ఆరోపించారు.

యువత సాధికారత కోసం కృషి చేస్తున్నాం

దేశంలోని యువత సాధికారత కోసం కేంద్రంలోని ఎన్డీయే ప్రభుత్వం కృషి చేస్తోందని మోదీ తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగాలను తృటిలో కోల్పోయిన వారికి ప్రైవేటు రంగంలో అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటున్నట్టు పేర్కొన్నారు. శుక్రవారం ఢిల్లీలో 17వ రోజ్‌గార్(ఉద్యోగ) మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా దేశవ్యాప్తంగా ప్రభుత్వ ఉద్యోగాలు పొందిన 51 వేల మందికి నియామక పత్రాలను అందించారు. ఈ మేళాను ఉద్దేశించి ప్రధాని సందేశమిచ్చారు. ఇప్పటి వరకు నిర్వహించిన రోజ్‌గార్ మేళాలలో 11 లక్షల మందికి నియామకపత్రాలు అందించామన్నారు. 'ప్రతిభ సేతు' పోర్టల్‌ను తీసుకువచ్చామన్న ఆయన.. అఖిల భారత ఉద్యోగ నియామకాల్లో తృటిలో అవకాశం కోల్పోయిన వారికి కొత్త అవకాశాలు సృష్టించడమే ఈ పోర్టల్ లక్ష్యమన్నారు.

టెట్ నోటిఫికేషన్ విడుదల

- ప్రైవేటు స్కూల్ టీచర్లకూ టెట్ తప్పనిసరి
- బీఈడీ అభ్యర్థులకే అర్హత మినహాయింపు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్) నోటిఫికేషన్‌ను పాఠశాల విద్యాశాఖ శుక్రవారం విడుదల చేసింది. గురువారం మార్గదర్శకాలు, షెడ్యూలు జారీ చేసిన విషయం తెలిసిందే. ప్రభుత్వ, ఎయిడెడ్ మేనేజ్‌మెంట్ల పాఠశాలలతో పాటు ప్రైవేటు పాఠశాలల్లో టీచర్ ఉద్యోగం చేయాలనుకునేవారు కూడా టెట్ ఉత్తీర్ణత సాధించాలని స్పష్టంచేసింది. అర్హత ఉన్న అభ్యర్థులు 1ఎ, 1బి, 2ఎ, 2బి నాలుగు పేపర్లకు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక్కో పేపరుకు రూ.వెయ్యి ఫీజు చెల్లించాలని పేర్కొంది. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో ఇన్ సర్వీస్ టీచర్లకూ టెట్ రాసే అవకాశం కల్పించింది. దీంతో 2011కు ముందు టెట్ లేకుండా టీచర్ ఉద్యోగం పొందినవారు ఇప్పుడు తప్పనిసరిగా టెట్ ఉత్తీర్ణత సాధించాల్సిన అవసరం ఏర్పడింది. కాగా వారికి విద్యార్హతల్లో కనీస మార్కుల నిబంధనలను మినహాయించింది. అలాగే 2011 జూలై 29కు ముందు బీఈడీ చేసిన, అడ్మిషన్ పొందిన వారికి కూడా విద్యార్హత మార్కుల నుంచి మినహాయింపు ఇచ్చారు. కానీ డీఈడీ చేసిన వారు మాత్రం ఇంటర్మీడియట్‌లో కనీస అర్హత మార్కులు సాధించి ఉండాలి. టెట్ పరీక్షలకు ఫస్ట్ కమ్ ఫస్ట్ విధానంలో కేంద్రాలు కేటాయిస్తారు.

తుర్లపాటి రాజేశ్వరికి కేంద్ర సాహిత్య అకాడమి పురస్కారం


మాధవ్ కౌశిక్ నుంచి పురస్కారం అందుకుంటున్న రాజేశ్వరి

న్యూఢిల్లీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ప్రముఖ రచయిత్రి తుర్లపాటి రాజేశ్వరి కేంద్ర సాహిత్య అకాడమి అనువాద పురస్కారం అందుకున్నారు. కోల్‌కతాలోని జాతీయ లైబ్రరీలోని శ్యామ ప్రసాద్ ముఖర్జీ ఆడిటోరియంలో అకాడమి అధ్యక్షుడు మాధవ్ కౌశిక్. శుక్రవారం రాజేశ్వరిని రూ.50 వేల నగదు, తామ్రపత్రంతో సత్కరించారు. సుప్రసిద్ధ ఒడియా రచయిత గోపీనాథ మహంతి రచించిన దాడిబుధ అనే నవలను ఈతచెట్టు దేవుడు అన్న పేరుతో రాజేశ్వరి అనువదించారు. ఒడిశాలోని కోరాపుట్ జిల్లాలోని ఉల్లా గ్రామంలో జరిగిన కథతో రూపొందిన ఈ నవల, అడవిలో అడవి జంతువుల ముప్పు మధ్య నివసిస్తున్న గిరిజన వర్గాల జీవితాలను, నమ్మకాలను చిత్రీకరిస్తుంది. 1947 ఆగస్టు 10న కృష్ణా జిల్లా గుడ్లవల్లేరులో జన్మించిన రాజేశ్వరి దాదాపు 5 దశాబ్దాలుగా బరంపురంలో స్థిరపడి పలు ఒడియా రచనల్ని తెలుగులో అనువదించారు. కవిత్వం, అనువాదాలు, వ్యాసాలు, పరిశోధనా రచనలు చేశారు. ఈతచెట్టు దేవుడుకు తెలుగులో అనువాద బహుమతిని ప్రదానం చేయడం సాహిత్య అకాడమికే గర్వకారణమని అకాడమి కార్యదర్శి కృత్తివెంటి శ్రీనివాసరావు తెలిపారు.

మా కుటుంబాన్ని వైసీపీ నేతలు ట్రోల్ చేశారు

- పార్టీ పెద్దల వద్ద డబ్బు తీసుకుని ఆందోళనకు దిగారు
- ఆ నాయకులపై ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి
- తుని అత్యాచార నిందితుడి కోడలు నాగలక్ష్మి

తుని రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కాకినాడ జిల్లా తుని బాలిక అత్యాచారం ఘటనలో నిందితుడు నారాయణరావు కోడలు నాగలక్ష్మి వైసీపీ నేతలపై తీవ్ర ఆరోపణలు చేశారు. వైసీపీ పెద్దల వద్ద ఆ పార్టీ నేతలు కొందరు డబ్బు తీసుకుని ఆందోళనకు దిగారని, రాజకీయ లబ్ధి పొందాలనుకున్నారని, వారిపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం తునిలో ఆమె మీడియాతో మాట్లాడారు. తమ మామ తప్పు చేస్తే.. వైసీపీ నాయకులు తమ కుటుంబ సభ్యుల ఫొటోలు సోషల్‌మీడియాలో పెట్టి ట్రోల్ చేసి మానసిక క్షోభకు గురి చేశారన్నారు. బాలిక కోసం ధర్నా చేసిన కొందరు దళిత నేతలు..మాలమహానాడు నాయకుడైన తమ మామ చనిపోతే ఎందుకు స్పందించలేదని ప్రశ్నించారు. తమ మామకు తగిన శాస్తి జరిగిందని, ఆడపిల్లల విషయంలో ఏ మగాడు ఇలాంటి ఘటనలకు పాల్పడకుండా కఠినంగా వ్యవహరించాలని మంత్రి లోకేశ్‌ను నాగలక్ష్మి కోరారు.

రైస్ పుల్లింగ్ పేరుతో వైద్యురాలికి టోకరా

- రూ.1.5 కోట్లు కొల్లగొట్టిన కేటుగాళ్లు
- ముగ్గురి అరెస్ట్.. రిమాండుకు తరలింపు
- మిగిలిన నిందితుల కోసం గాలింపు

ఆరిలోవ (విశాఖపట్నం), అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రైస్ పుల్లింగ్ పేరుతో వైద్యురాలికి టోకరా వేసి రూ.1.5 కోట్లు కొల్లగొట్టిన ముగ్గురు కేటుగాళ్లను విశాఖ పోలీసులు అరెస్టు చేసి, రిమాండుకు తరలించారు. ఈ వివరాలను ద్వారకా ఏసీపీ నరసింహమూర్తి శుక్రవారం ఆరిలోవ పోలీస్ స్టేషన్‌లో విలేకరులకు వివరించారు. హైదరాబాద్‌కు చెందిన డాక్టర్ ప్రియాంకకు సత్యసాయి జిల్లా పుట్టపర్తికి చెందిన ఒక మహిళ పరిచయమైంది. విశాఖలో తనకు తెలిసిన వారి వద్ద అద్భుతమైన చెంబు ఉందని, దాని విలువ విదేశాల్లో రూ.కోట్లలో ఉంటుందని, అత్యవసరంగా దానిని విక్రయిస్తున్నారని తెలిపింది. వైద్యురాలు విశాఖ వచ్చి జేపీ మోర్గాన్ సంస్థకు చెందిన సైంటిస్టు పేరుతో చలామణి అవుతున్న వ్యక్తి వద్ద చెంబును మెటల్ డిటెక్టర్‌తో పరీక్షించారు. అది బియ్యాన్ని ఆకర్షించడంతో ప్రియాంకకు నమ్మకం కుదిరింది. దీంతో ఆమె కేటుగాళ్ల బృందానికి దఫదఫాలుగా సుమారు రూ.1.5 కోట్లను చెల్లించారు. చెంబు తీసుకుని హైదరాబాద్ చేరుకున్న ఆమె దానికి ఎలాంటి మహిమలూ లేవని తెలుసుకుని, మోసపోయానని గ్రహించారు. ఈ నేపథ్యంలో కేటుగాళ్ల బృందం ఆరిలోవ ప్రాంతంలో మకాం వేసినట్టు తెలుసుకుని, ఈ నెల 19న ఆరిలోవ పోలీసులకు ఫిర్యాదు చేశారు. నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి ఆదేశాలతో కేసును ఛేదించేందుకు ఆరిలోవ సీఐ మల్లేశ్వరరావు బృందం రంగంలోకి దిగింది. పెందుర్తికి చెందిన వి.నివాస్, అరకులోయకు చెందిన కొర్రా బంగార్రాజును ఆరిలోవ డంపింగ్ యార్డు వద్ద, విజయవాడకు చెందిన కర్నాటి ప్రసాద్‌ను విమ్స్ ప్రధాన గేటు వద్ద అరెస్ట్ చేశారు. ఈ ముఠాలోని ప్రధాన నిందితుడు హరికృష్ణ కోసం గాలిస్తున్నామన్నారు నిందితుల నుంచి రూ.2.4 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నామని, వారి బ్యాంకు ఖాతాలను సీజ్ చేశామన్నారు.

డిప్యూటీ సీఎం పవన్‌తో హైడ్రా కమిషనర్ భేటీ



అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను హైడ్రా కమిషనర్ ఎం.వి.రంగనాథ్ మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం సాయంత్రం మంగళగిరిలోని డిప్యూటీ సీఎం క్యాంప్ కార్యాలయానికి వచ్చిన ఆయన పవన్ కల్యాణ్‌తో భేటీ అయ్యారు.

జూన్ నాటికి 2.60 లక్షల టిడ్కో ఇళ్లు పూర్తి

- పేదలకు న్యాయం చేయాలని సీఎం ఆదేశం: మంత్రి నారాయణ

రాష్ట్రంలో వచ్చే జూన్ నాటికి 2.60 లక్షల టిడ్కో ఇళ్లను పూర్తి చేసి, లబ్ధిదారులకు అందజేస్తామని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ వెల్లడించారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ 2014-19 మధ్య అప్పటి టీడీపీ ప్రభుత్వం పేదలకు 7 లక్షల టిడ్కో ఇళ్లను అన్ని సౌకర్యాలతో నిర్మించి ఇవ్వాలనే ఉద్దేశంతో 5 లక్షల ఇళ్లకు పరిపాలన అనుమతిచ్చి, నిర్మాణాలు ప్రారంభిస్తే.. గత వైసీపీ ప్రభుత్వం వాటిని 2.60 లక్షల ఇళ్లకు కుదించిందని చెప్పారు. కూటమి ప్రభుత్వంలో పేదలకు న్యాయం చేయాలని సీఎం చంద్రబాబు చెప్పారని, గత ప్రభుత్వం చేసిన తప్పులు చేయకూడదని సూచించారన్నారు. మొత్తం 2.60 లక్షల టిడ్కో ఇళ్లను వచ్చే జూన్ నాటికి పూర్తి చేయాలని సీఎం ఆదేశించినట్లు చెప్పారు. ఇందుకు తీసుకోవాల్సిన చర్యలపై మంత్రివర్గ ఉపసంఘం సమావేశంలో చర్చించినట్టు తెలిపారు.

ఈత సరదా మిగిల్చిన విషాదం..!

- స్వర్ణముఖి నదిలో ముగ్గురు విద్యార్థులు గల్లంతు
- మరొకరు మృతి.. తిరుపతి జిల్లాలో దుర్ఘటన

తిరుపతి రూరల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): తిరుపతి జిల్లాలో విషాదం చోటుచేసుకుంది. స్వర్ణముఖి నదిలో సరదాగా ఈత కొట్టేందుకు వెళ్లిన ఏడుగురు విద్యార్థుల్లో ముగ్గురు గల్లంతయ్యారు. మరొకరు మృతిచెందారు. తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం అగ్రహారం గ్రామానికి చెందిన ఏడుగురు విద్యార్థులు శుక్రవారం సాయంత్రం స్వర్ణముఖి నదిలో ఈతకు వెళ్లారు. నది మధ్యలో ఉన్న ఇసుక దిబ్బపై ఆడుతూ.. నీళ్లలో దూకుతూ సరదాగా గడిపారు. ఈ క్రమంలో అకస్మాత్తుగా నీటి ప్రవాహం పెరగడంతో ప్రకాశ్ (17), మునిచంద్ర అలియాస్ చిన్న (15), తేజ (19), బాలు (16) కొట్టుకుపోగా.. కృష్ణ, విష్ణు, మునికృష్ణ క్షేమంగా ప్రాణాలతో బయటపడ్డారు. ఈ ముగ్గురిలో ఒకరు నది మధ్యలో చెట్టుని పట్టుకుని వేలాడుతుండగా.. అటువైపు వచ్చిన ఓ యువకుడు ఒడ్డుకు చేర్చారు. మిగిలిన ఇద్దరూ ఇసుక దిబ్బపై నిలబడి ఉన్నారని తెలిసింది. గల్లంతైన వారిలో బాలు మృతదేహం మాత్రం లభించింది. మిగతా ముగ్గురి కోసం గాలింపు కొనసాగుతోంది.

గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి చర్యలు

- మంత్రి సంధ్యారాణి
- కొత్తవలసలో ముస్తాబు కార్యక్రమానికి శ్రీకారం

పార్వతీపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): గిరిజన ప్రాంతాల్లో విద్యాభివృద్ధికి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని గిరిజన సంక్షేమశాఖ మంత్రి గుమ్మిడి సంధ్యారాణి తెలిపారు. పార్వతీపురం మన్యం జిల్లా సాలూరు మండలం కొత్తవలసలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో అదనపు భవనాల నిర్మాణానికి శుక్రవారం ఆమె శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. 'రూ.185 కోట్లతో రాష్ట్రంలో 45 ఆశ్రమ పాఠశాలల్లో అదనపు భవన నిర్మాణాలు చేపడతాం. పలు వసతి గృహాల్లో 2,030 మరుగుదొడ్లను నిర్మిస్తున్నాం' అని తెలిపారు. అనంతరం వసతి గృహంలో 'ముస్తాబు' అనే వినూత్న కార్యక్రమానికి మంత్రి శ్రీకారం చుట్టారు. రాష్ట్రంలోనే తొలిసారిగా జిల్లాలో ఈ కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు వెల్లడించారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ప్రపంచ ఆశాజ్యోతి

ఐక్యరాజ్యసమితి 80వ వార్షికోత్సవం సందర్భంగా విదేశాంగమంత్రి జైశంకర్ న్యూఢిల్లీలో శుక్రవారం ఒక పోస్టల్ స్టాంప్ విడుదల చేస్తూ సమితిమీద ప్రశంసలూ, విమర్శలూ సమపాళ్ళలో మేళవించి ఓ ప్రసంగం చేశారు. సమితికి భారత్ అండదండలు దండిగా ఉంటాయని అంటూనే, దాని నిర్ణయాలు ప్రపంచ ప్రాధాన్యతలను ప్రతిబింబించడం లేదన్నారు. ప్రపంచం ప్రస్తుతం క్లిష్టపరిస్థితుల్లో ఉంటే ఐరాస తదనుగుణంగా వ్యవహరించలేకపోతున్నదని ఆవేదన చెందారు. ఐరాసలో సంస్కరణలు జరగాలనీ, అవి అర్థవంతంగా, యావత్ ప్రపంచ ప్రాధాన్యతలను దృష్టిలో పెట్టుకొని జరగాలన్నారు. ప్రపంచం అనేక యుద్ధాలతో బాధపడుతున్న తరుణంలో శాంతి అన్నది మాటలకు మాత్రమే పరిమితమైపోయినప్పుడు అభద్రతల మధ్య అభివృద్ధి అసాధ్యమన్న ఆయన హెచ్చరిక సముచితమైనది.


రెండో ప్రపంచయుద్ధం తరువాత, మానవాళి అప్పటివరకూ చవిచూసిన విధ్వంసాలు, వినాశనాలకు ఇక స్వస్తిచెప్పి, భవిష్యత్తులో అటువంటి సంఘర్షణలను నిరోధించే లక్ష్యంతో ఈ అంతర్జాతీయ సంస్థ ఆవిర్భవించింది. దేశాలన్నీ పరస్పర సహకారంతో, సయోధ్యతో, సమన్వయంతో వ్యవహరించుకోవాలనీ, ఎంతటి తీవ్ర సమస్యనైనా చర్చలతో పరిష్కరించుకొని అంతిమంగా ప్రపంచం అనునిత్యం శాంతియుతంగా నడవాలన్నది సంకల్పం. సహకారం, సంఘీభావం పునాదిగా సమస్తమానవాళీ మనుగడ సాగించాలన్నది ఆశయం. ఏ నేపథ్యంలో ఈ సంస్థ పురుడుపోసుకున్నదో తెలుసు కనుక, అది మరింత క్రియాశీలకంగా పనిచేయాలని ఆశించడం, ఆవిర్భావలక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించలేకపోతున్నదనీ, కొన్ని దేశాల చేతిలో కీలుబొమ్మగా మారిందని విమర్శలు చేయడం సహజమే. అగ్రదేశాల ఉగ్రరాజకీయాలను ఆపలేకపోయినా, వాటి దురాలోచలనూ దురాక్రమణలనూ అడ్డుకోలేకపోయినా, అనేక చిన్నాచితకా ఘర్షణలను సమితి నిలువరించలేకపోలేదు. కొన్ని ఆఫ్రికన్ దేశాల్లో అంతర్యుద్ధాలను, సంఘర్షణలను పరిష్కరించడంలోనూ, ఉపశమింపచేయడంలోనూ దాని కృషి ప్రశంసనీయమైనది. అయినాకూడా, సిరియానుంచి సూడాన్ వరకూ అది చేతులెత్తేసిన సందర్భాలు అనేకం. వియత్నాం ఘోరకలినుంచి, ఇరాక్ బూటకపు యుద్ధం వరకూ అసత్యాలనుంచి ఆవిర్భవించిన అనేకానేక సంఘర్షణలు సమితి వైఫల్యాల చిట్టాలో ఉన్నాయి. నియంతలను పెంచిపోషించే అగ్రరాజ్యాల స్వార్థం కారణంగా ప్రపంచవ్యాప్తంగా అనేక సంఘర్షణలో లక్షలాదిమంది హతులైనారు, నిరాశ్రయులైనారు.

అరడజను అగ్రరాజ్యాల భద్రతకోసమే ఏర్పడినట్టుగా భద్రతామండలి వ్యవహారం సాగుతోంది. ఐదుదేశాల వీటోశక్తి ఏదీ తేలనివ్వకుండా, ఎటూ కదలనివ్వకుండా ప్రపంచాన్ని నిర్దేశిస్తోంది. వాటి అండ చూసుకొనో, సమితి నిస్సహాయతను అడ్డంపెట్టుకొనో చాలా సభ్యదేశాలు అంతర్జాతీయ చట్టాలను బేఖాతరు చేస్తున్నాయి, సమితి నిబంధనలను ఉల్లంఘిస్తున్నాయి. అంతర్జాతీయ నేరన్యాయస్థానం ఏళ్ళతరబడి మధించి వెలువరించిన తీర్పులు కొరగాకుండా పోతున్నాయి. తన ఆదేశాలు బేఖాతరుచేసినా ఆయా దేశాల పాలకులను ఏమీ చేయలేని నిస్సహాయస్థితిలో అది ఉంది.

అయితే, ఐక్యరాజ్యసమితి అనుబంధసంస్థలు తమకు నిర్దేశించిన బాధ్యతలను ఎంతోకొంతమేర నిర్వర్తించగలగడం మెచ్చుకోదగింది. కరోనాకాలంలో అన్ని దేశాల మధ్యా సహకారాన్ని సాధించి, వ్యాప్తి నిరోధంలోనూ, పేద, ధనిక తేడాలేకుండా వాక్సిన్ సకాలంలో అందరికీ అందించడంలోనూ ఆరోగ్యసంస్థ విఫలమైంది. అయితే, పోలియో వంటి ప్రమాదకర వ్యాధుల నియంత్రణలో, ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది బాలబాలికలకు అతిముఖ్యమైన టీకాలు అందడంలోనూ అది ప్రశంసనీయమైన పాత్ర నిర్వహిస్తోంది. నిర్వాసితులను ఆదుకుంటూ, అన్నార్తుల ఆకలిని తీరుస్తోంది. 'డిగ్ బేబీ డిగ్' తరహా ఎజెండాలతో, కార్పొరేట్లకు వంతపాడే ట్రంప్ తరహా పాలకులు పుట్టుకొస్తున్నందున 'కాప్' సదస్సులు ఎన్ని జరిపినా, పర్యావరణానికి మాత్రం అది కాపలాదారు కాలేకపోతోంది.

గత నెలలో జరిగిన 80వ సర్వసభ్యసమావేశానికి నూటయాభైకి పైగా దేశాల అధినేతలు హాజరైనారు. పాలస్తీనా గుర్తింపు నుంచి, ప్రస్తుతం భీకరంగా సాగుతున్న రెండు యుద్ధాల వరకూ చాలా అంశాలు చర్చకు వచ్చి, ఏకాభిప్రాయం సాధ్యపడుతుందని అంతా అనుకున్నారు. కానీ, ఎప్పటిలాగానే వారంతా ఎదుటివారి కారణంగానే ప్రపంచం పాడైపోతుందని దూషణలు చేశారు, విమర్శలు, ప్రతివిమర్శలతో సదస్సు ముగించారు. ప్రపంచం మరింత సంక్షోభంలోకి జారుతున్న తరుణంలో అగ్రదేశాల సహాయనిరాకరణ నుంచి నిధుల కొరతవరకూ సమితి పలు సమస్యలు ఎదుర్కొంటోంది. సంస్కరణలు జరగాలన్న జైశంకర్ వ్యాఖ్యల్లో భద్రతామండలిలో మనస్థానం మాట గుర్తుచేయడం కనిపిస్తోంది. ఐదుదేశాలదే ఇష్టారాజ్యం కాకూడదనీ, బలంగా ఎదుగుతున్న భారత్, బ్రెజిల్ వంటివి కూడా శాశ్వత సభ్యత్వాన్ని పొందగలిగినప్పుడు అది ఆవిర్భావ లక్ష్యాలకు అనుగుణంగా వ్యవహరించగలదని ఓ ఆశ, నమ్మకం.

పర్యావరణ స్వచ్ఛత ధార్మిక కర్తవ్యం



నింగిలో కాంతి పుంజాలు, ఆకాశాన్ని బద్దలు కొట్టే శబ్దరావాలు... దీపావళి నడి రేయి.. అయినా ఎడతెగని టపాసుల మోతలు... నిద్ర పట్టడం లేదు, విసుగు కమ్మేస్తోంది. సమీపంలో ఉన్న ఒక పోలీస్ స్టేషన్‌కు ఫోన్ చేశాను. 'అర్ధరాత్రి దాటిపోయింది. టపాకాయలు ఇంకా పేలుతూనే ఉన్నాయి. సుప్రీం కోర్టు నిర్దేశించిన మార్గదర్శకాల ప్రకారం, నిబంధనలను ఉల్లంఘించిన వారిపై చర్య తీసుకుంటారా?' ఆవలివైపు నుంచి అలసట ధ్వనిస్తున్న గొంతు వినిపించింది: 'మా ప్రయత్నం మేము చేస్తున్నాం, అయితే ప్రజలు మా మాట వినడం లేదు'. ఆ రాత్రి డ్యూటీలో ఉన్న కానిస్టేబుల్ పట్ల జాలి కలిగింది. పౌరులు లెక్క చేయనప్పుడు, రాత్రి పది తరువాత టపాసులు కాల్చకూడదన్న కోర్టు ఆదేశాన్ని వారు ఎలా అమలుపరచగలరు?

మరుసటి ఉదయం యథావిధిగా, చెంతనే ఉన్న ఒక ఉద్యానవనంలో వ్యాహ్యాళికి వెళ్లాను. చల్లనిగాలి, కాదు, విషతుల్య వాయువును శ్వాసిస్తూ నడుస్తున్నాను. శరదృతువు ఉదయం సూర్యకాంతి స్థానంలో దట్టమైన, నల్లని పొగమంచు! క్రితం రాత్రి కొంత మంది ఆనందోత్సాహాల అనివార్య పర్యవసానమది, ఎంతో మంది ఇతరులకు భరింపరాని యాతన, సందేహం లేదు. భారతదేశ రాజధాని, ప్రపంచంలోనే అత్యంత కాలుష్య నగరాలలో ఒకటిగా ఉన్నది! ఇందుకు జవాబుదారీ ఎవరు? అక్టోబర్ నుంచి జనవరి మధ్యనాళ్ల దాకా న్యూఢిల్లీలో వాయు కాలుష్యం ప్రమాదకర స్థాయి దాటడం కద్దు. అందునా దీపావళి పండుగ రోజుల్లో గాలి నాణ్యత మరింత అధ్వానమైపోతోంది. శ్వాసకోశ వ్యాధులు మరింత తీవ్రమవుతాయి. ఆ రోగాలు లేనివారు సైతం విషపూరిత గాలిని పీల్చి అనారోగ్యం కోరల్లో చిక్కుకోవడం పరిపాటి.

దీపావళి పండుగ సందర్భంలో టపాసులపై నిషేధాన్ని ఎత్తివేయాలని భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ధర్మాసనం ఎందుకు నిర్ణయం తీసుకున్నది? 'విరుద్ధ ఆసక్తుల' మధ్య సమతుల్యతకు గౌరవనీయ న్యాయమూర్తులు చిత్తశుద్ధితో ప్రయత్నించారా? లేక బాణసంచాపై ఆంక్షలు 'హిందూ మనోభావాల'ను వ్యతిరేకించడమే నని వాదిస్తున్న వారిని అనునయించేందుకే సర్వోన్నత న్యాయస్థానం ఆ నిర్ణయం తీసుకున్నదా? తనపై గర్హనీయమైన బూటుదాడికి కారణమైన (విష్ణువు ప్రతిమపై) స్వీయ వ్యాఖ్యలకు సీజేఐ ఇప్పటికే హిందుత్వవాదుల నుంచి తీవ్ర విమర్శల నెదుర్కొంటున్నారు. తన శత్రువులతో శాంతి పడేందుకే ఆయన ఈ నిర్ణయం తీసుకున్నారా? 'గ్రీన్ క్రాకర్స్' (ఈ పదం ఒక విరోధాభాసాలంకారం)ను ఆమోదించడం సమర్థనీయమేనా? దీపావళి వేడుకలు, పర్యావరణ పరిరక్షణకు అదొక మధ్యేదారి అని భావించారా? న్యాయమూర్తుల ఉద్దేశం ఏమైనప్పటికీ మరింత బాణసంచాకు అనుమతినివ్వడం టపాసులను మరింత నిర్భయంగా కాల్చేందుకే పౌరులను పురిగొల్పింది. టపాకాయల తయారీదారులకు అనుకూలంగా వ్యవహరిస్తున్న ఢిల్లీ ప్రభుత్వం తాము నిర్దేశించిన నిబంధనలను అమలు పరచగలదని సర్వోన్నత న్యాయమూర్తులు ఆశించారా?

ఢిల్లీ ప్రభుత్వం తన పక్షపాత వైఖరిని నిస్సిగ్గుగా బయటపెట్టుకున్నది. 27 ఏళ్ల 'వనవాసం' అనంతరం బీజేపీ ఈ ఏడాది ఫిబ్రవరిలో ఢిల్లీ కేంద్ర పాలిత ప్రాంతంలో అధికారంలోకి వచ్చింది. టపాకాయల ఆనందోత్సాహాలను ఢిల్లీ వాసులకు మళ్లీ ఇస్తామనేది బీజేపీ ఇచ్చిన హామీలలో ఒకటి. మురుగునీటి పారుదల సదుపాయాలను మెరుగుపరచడం, రోడ్లపై కొండలుగా పేరుకు పోతున్న చెత్తా చెదారాన్ని తొలగించడం మొదలైన తక్షణ కర్తవ్యాలను నిర్వహించడానికి బదులు 'దీపావళి' టపాసుల వేడుక సంప్రదాయాన్ని పునరుద్ధరించేందుకు అధికారంలో ఉన్నవారు దృఢంగా నిర్ణయించుకున్నారు. దీపావళి పండుగ రోజుల్లో టపాసులు పేల్చడం 'ఒక సాంస్కృతిక వేడుక' అని ముఖ్యమంత్రి రేఖా గుప్తా అభివర్ణించారు. మంచిదే. అయితే ప్రజల ఆరోగ్యానికి వాటిల్లే హాని విషయమేమిటి? బాణసంచాను నిషేధించడం ద్వారా ఆప్ ప్రభుత్వం హిందువులకు వ్యతిరేకంగా వ్యవహరించిందని బీజేపీ పదే పదే ఆరోపించింది. ఇదొక ప్రమాదకరమైన వాదన. అత్యంత ప్రధానమైన ప్రజారోగ్యం అంశాన్ని మతంతో ముడిపెట్టేందుకు ఉద్దేశించిన వాదన అది. మొరటు మెజారిటేరియన్ రాజకీయాలకు అదొక తార్కాణం. ఇటువంటి అహేతుక జనాకర్షక కథనాల కారణంగా ప్రతిపక్షాలు ఆత్మరక్షణలో పడిపోయాయి. నిర్మల పర్యావరణం కంటే మతపరమైన బుజ్జగింపే ఎక్కువ ఓట్లు తీసుకువస్తుంది మరి.



■ రాజ్‌దీప్ సర్దేశాయి

దీపశిఖ

బాణాసంచా కాల్చడమనేది దీపావళి వేడుకల్లో అంతర్భాగమని చెప్పేందుకు చారిత్రక సాక్ష్యాధారాలు లేవు. మన పెద్దలు, పూర్వీకులు దీపావళిని వెలుగుల పండుగగా చూశారేగానీ చెవులు చిల్లులు పడే శబ్దహేలగా ఎవరూ పరిగణించలేదు. దీపకాంతుల దృశ్యం భవిష్యత్తుకు భరోసా నిచ్చే ఆశాజ్యోతిగా భావించడం పరిపాటి. బాణసంచా తయారీ ఇటీవలి కాలంలోనే వందల కోట్ల వ్యాపారమై పోయింది. వినియోగదారు మతతత్వం ఆ వ్యాపారానికి తోడయింది. దీంతో మతపరమైన ప్రతి సందర్భమూ ఒక మహావేడుకగా పరిణమించింది. వ్యాపారానికి అతీతమైనది ఏదీ లేకుండా పోయింది. సరే, ఓటు బ్యాంకు రాజకీయాలు మతపరమైన భావోద్వేగాలను సంతృప్తి పరచడానికి ప్రాధాన్యమివ్వసాగాయి. బక్రీద్ పండుగ నాడు మేకలను వధించేందుకు ముస్లింలకు అనుమతినిస్తున్నప్పుడు, దీపావళి రోజుల్లో హిందువులకు తమ ఇష్టానుసారం బాణసంచాను కాల్చేందుకు అనుమతి ఎందుకు ఇవ్వకూడదు? ఇదొక అతార్కిక వాదన. తార్కికతపై భావోద్వేగాలు గెలిచినప్పుడు ఇటువంటి అర్థం పర్థం లేని వాదనలు వస్తాయి. ఇది, మనకు మనమే హాని చేసుకోవడమే.

సర్వోన్నతన్యాయస్థానం ఆదేశాలను అమలుపరిచేందుకు ప్రభుత్వం నిజంగా నిబద్ధమైతే ఆ విషయాన్ని పోలీసులకు స్పష్టంగా తెలియజేసి ఉండవల్సింది. కోర్టు ఉత్తర్వును కచ్చితంగా అమలుపరచాలని, నిబంధనలను ఉల్లంఘించిన వారిని లాంఛనప్రాయమైన జరిమానాలతో వదిలివేయకూడదని పోలీసులకు గట్టిగా చెప్పి ఉండవల్సింది. ఈ విషయమై పై స్థాయిలో రాజకీయ సంకల్పం కొరవడింది. అయినా నానా బాధ్యతల బరువుతో కుంగిపోతున్న కానిస్టేబుల్స్ ప్రతి మొహల్లాలోనూ తిరుగుతూ బాణసంచా పేలుళ్లను నిబంధనల మేరకు అదుపుచేయడం ఎలా సాధ్యం? అది ఆచరణ సాధ్యం కాని విషయం. 'హరిత టపాసు' ఏదో, నిషిద్ధ టపాసు ఏదో చెప్పగల అవగాహన బీట్ కానిస్టేబుల్‌కు ఉండాలని న్యాయమూర్తులు, నాయకులు భావిస్తున్నారా? చట్టోల్లంఘనకు పాల్పడిన వారిపై పోలీసులు చర్య తీసుకోవాలని వారు ఆశిస్తున్నారా? సామాన్య ప్రజలు స్వచ్ఛందంగా నిబంధనలను పాటించని పక్షంలో బాణసంచాపై నిషేధంకాని, నియంత్రణ కాని పనిచేయవనే సత్యాన్ని ఎలా విస్మరిస్తున్నారు?

అసలు ఏ చట్టాన్ని అయినా పాటించడమనేది మన దేశంలో ఒక పెద్ద సవాల్‌గా ఉన్నది. 2023లో దేశవ్యాప్తంగా వివిధ నియమాలను ఉల్లంఘించినందుకు దాదాపు 8 కోట్ల ట్రాఫిక్ చలాన్లు జారీ చేశారు. చాలా మంది తాము చేసిన తప్పును పదే పదే చేసినవారే కావడం గమనార్హం. సవరించిన మోటార్ వెహికల్స్ చట్టం కింద భారీ జరిమానాలు విధించినప్పటికీ అనేక మందిని చట్టానికి కట్టుబడి ఉండేలా చేయడంలో ఆ శిక్ష విఫలమయింది! ఆ జరిమానా మరింత పెద్ద మొత్తంలో విధించినప్పటికీ వారు నిబంధనలను కచ్చితంగా పాటిస్తారనేందుకు హామీ ఉన్నదా? కొద్ది రోజుల క్రితం మహారాష్ట్ర మంత్రి కాన్వాయ్ ఒకటి ట్రాఫిక్ రద్దీని తప్పించుకునేందుకు నిబంధనలను ఉల్లంఘించింది. ఏ ట్రాఫిక్ కానిస్టేబుల్ కూడా మంత్రిని శిక్షించడం కాదు కదా, కనీసం మందలించ లేదు.

చట్టాన్ని కచ్చితంగా పాటించేలా చేయడం ఎలా సాధ్యమవుతుంది? శిక్ష పడుతుందనే భయం ఉండాలి. దానితో పాటు చట్టాన్ని పాటించాలన్న అంతః ప్రేరణ ఉండాలి. స్వచ్ఛంద ప్రవర్తనే సత్ప్రవర్తన. టపాసులు కాల్చడంలో నిబంధనలు ఉల్లంఘించిన వారిలో ఒక డజన్ మందికి కఠిన శిక్ష విధించడంతో పాటు నగుబాటుకు గురిచేయండి. అప్పుడు అది తప్పక ఒక గట్టి నేర నిరోధక చర్యగా పరిణమిస్తుంది. పాఠశాలలు, కార్యాలయాలలో అవగాహనా కార్యక్రమాలను ఏర్పాటు చేయాలి. ఈ ప్రజాహిత విషయంలో మీడియా సంస్థల బాధ్యతను ప్రత్యేకంగా చెప్పాలా? విచారకరమైన విషయమేమిటంటే బాణసంచాను కాల్చడమనేది తమ మత స్వేచ్ఛ హక్కును ఉపయోగించుకోవడమేనని లక్షలాది ప్రజలకు రాజకీయులు నూరిపోశారు. ఈ హక్కును నిరాకరించే అధికారం ఏ ప్రభుత్వానికీ లేదని కూడా ప్రజల మెదళ్లలోకి ఎక్కించారు. ప్రజాహిత స్ఫూర్తిగల పౌరులు బాణసంచాకు వ్యతిరేకంగా తమ గళం విప్పితే వారిని 'హిందూ వ్యతిరేక కుహనా లౌకికవాదులు' అనే ముద్ర వేస్తున్నారు. అంతేనా? వారిపై 'జాతి–వ్యతిరేకులు' అనే నింద కూడా మోపుతున్నారు!

పర్యావరణ పరిరక్షణ హిందూధర్మ స్వతస్సిద్ధ సత్యం. ఈ పురాతన ధర్మం ప్రకృతిని భగవత్ సృష్టిగా గౌరవిస్తుంది; వృక్షాలను పూజిస్తుంది; నదుల పట్ల నిత్యం భక్తిప్రపత్తులు ప్రదర్శిస్తుంది. అదే సమయంలో పర్యావరణ సుస్థిరతకు నిరంతరం ప్రయత్నిస్తుంది. పర్యావరణాన్ని పరిశుభ్రంగా ఉంచాలని డిమాండ్ చేయడం సంపన్నులు, పలుకుబడి కలవారు, అధికార ప్రాభవం ఉన్నవారు అభిలషిస్తున్న విషయంగా మాత్రమే చూడకూడదు. అది సమస్త పౌరుల ధర్మబద్ధమైన విధి. హమాలీల నుంచి అందమైన హర్మ్యాలలో నివసించే ఆస్తిపరుల దాకా ప్రతి భారతీయుడినీ వాయు కాలుష్యం బాధిస్తోంది. గాలి నాణ్యత అధ్వానంగా ఉండడమనే సమస్యకు సులభ పరిష్కారాలు లేవు. పంట వ్యర్థాల దగ్ధం, పారిశ్రామిక కాలుష్యం, టపాకాయల కాంతులు, శబ్దాలతో వాటిల్లే ప్రతి సంభావ్య పర్యావరణ ప్రమాదాన్ని సంబాళించేందుకై ఏడాది పొడుగునా అమలుపరిచే ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది. ప్రజలకు ఆరోగ్యవంతమైన భవిష్యత్తును సమకూర్చేందుకు ఈ కర్తవ్య పాలన తప్పనిసరి.

“ పరిశుభ్ర పర్యావరణం సమస్త పౌరుల ధర్మబద్ధమైన విధి. హమాలీల నుంచి అందమైన హర్మ్యాలలో నివసించే ఆస్తిపరుల దాకా ప్రతి భారతీయుడినీ వాయు కాలుష్యం బాధిస్తోంది. గాలి నాణ్యత అధ్వానంగా ఉండడమనే సమస్యకు సులభ పరిష్కారాలు లేవు. పంట వ్యర్థాల దగ్ధం, పారిశ్రామిక కాలుష్యం, టపాకాయల కాంతులు, శబ్దాలతో వాటిల్లే ప్రతి సంభావ్య పర్యావరణ ప్రమాదాన్ని సంబాళించేందుకై ఏడాది పొడుగునా అమలుపరిచే ఒక సమగ్ర కార్యాచరణ పథకాన్ని రూపొందించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి ఉన్నది.

(వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్)

మన 'భరోసా' దేశానికే ఆదర్శం!

దేశంలో పేదలు, వృద్ధులు, వికలాంగులు, వితంతువులు, నిరుపేద కుటుంబాల సామాజిక భద్రత కోసం కేంద్రం నేషనల్ సోషల్ అసిస్టెన్స్ ప్రోగ్రాం (ఎన్ఎస్ఏపీ) ద్వారా అందిస్తున్న మొత్తాలు చాలా తక్కువగా ఉంటున్నాయి. ప్రస్తుత ద్రవ్యోల్బణ పరిస్థితుల్లో జీవనోపాధికి ఈ మొత్తాలు సరిపోకపోవడంతో దేశంలోని అనేక రాష్ట్రాలు అదనపు నిధులు కేటాయించి తమ స్వంత పింఛన్ పథకాలను అమలు చేస్తున్నాయి. ఆ కోవలోనే ఆంధ్రప్రదేశ్‌లో 'ఎన్‌టీఆర్ భరోసా పింఛన్ పథకం' సామాజిక సంక్షేమాన్ని బలపరుస్తూ ముందుకు వెళ్తున్నది.

ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు పదవీ బాధ్యతలు స్వీకరించిన వెంటనే, ఉమ్మడి మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు, మూడవ ఫైల్‌గా పింఛన్ పెంపు ఫైలుపై సంతకం చేశారు. అమలుకు వెంటనే చర్యలు ప్రారంభించారు. పింఛన్ రాబడి మీద ఆధారపడే వృద్ధులు, వితంతువులు, దివ్యాంగులు వంటి సామాజికంగా బలహీనవర్గాల సంక్షేమం పట్ల ఆయనకు ఉన్న నిబద్ధతకు ఇది సజీవ సాక్ష్యం. ఆంధ్రప్రదేశ్‌లో సామాజిక భద్రతా పింఛన్ వ్యవస్థకు పునాదులు వేసింది తెలుగుదేశం పార్టీ ప్రభుత్వమే. స్వర్గీయ నందమూరి తారకరామారావు ప్రజల ఆర్థిక భద్రత కోసం తీసుకున్న ఈ విప్లవాత్మక నిర్ణయం వృద్ధులు, వితంతువులు, వికలాంగులకు ఒక ఆర్థిక అండగా నిలిచింది. 1980లలో నెలకు కేవలం రూ.35తో ప్రారంభమైన ఈ పథకం, ఆ సమయంలోనే ప్రజా పరిపాలనలో మానవీయతకు సంకేతంగా నిలిచింది. తరువాత చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన వెంటనే పింఛన్లను రూ.75కు పెంచి, పథకాన్ని మరింత తీర్చిదిద్దారు.

2004 ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ భారీ హామీలు ప్రకటించినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తరువాత వైఎస్సార్ ఇచ్చిన హామీని నిలబెట్టుకోలేకపోయారు. రూ.200 చేస్తామని ప్రచారం చేసిన ఆయన, చివరకు కేవలం రూ.25 మాత్రమే పెంచి, పింఛన్ మొత్తాన్ని రూ.175గా నిర్ణయించడం నిరాశను కలిగించింది. 2014లో తెలుగుదేశం పార్టీ మళ్లీ అధికారంలోకి వచ్చిన తర్వాత, జూన్ 8న సీఎంగా చంద్రబాబు ప్రమాణ స్వీకారం చేసిన రోజే పింఛన్ పెంపు ఫైల్‌పై సంతకం చేశారు. ఆ రోజు నుంచే పింఛన్ మొత్తాన్ని రూ.1,000కు పెంచడం, తరువాత దాన్ని రూ.2,000కు పెంచడం, వృద్ధులు, వితంతువులు, వికలాంగులు వంటి వర్గాల ఆర్థిక స్థితిని మారుస్తూ, దేశంలోనే అత్యధిక పింఛన్ అందించే రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్‌ను నిలబెట్టింది. కేవలం ఐదేళ్లలో పింఛన్లను 10 రెట్లు పెంచిన ఘనత చంద్రబాబు నాయుడిదే.



అయితే, వైసీపీ నాయకుడు జగన్మోహన్ రెడ్డి 2019 ఎన్నికల సమయంలో 'పెన్షన్లను రూ.3,000కు పెంచుతాం' అని ప్రకటించారు. ఈ మాటను ఆయన చేసిన పాదయాత్రల్లోనూ, పార్టీ మేనిఫెస్టోలోనూ మళ్లీ మళ్లీ ప్రస్తావించారు. కానీ అధికారంలోకి వచ్చిన తరువాత, పింఛన్ మొత్తాన్ని కేవలం రూ.250మాత్రమే పెంచి, రూ.2,000 నుంచి రూ.2,250గా నిర్ణయించారు. ఈ నిర్ణయం వృద్ధులలో నిరాశను రేకెత్తించింది. ఆర్థికంగా లెక్కలు వేసుకుంటే– మొత్తం మూడేళ్లల్లో ఒక్కొక్కరు రూ.18,000 నష్టపోయారు. వాస్తవానికి జగన్ రెడ్డి ఇచ్చిన హామీ, ఆ సమయంలో టీడీపీ అప్పటికే అమలు చేసిన పథకానికి పోటీగా ఇచ్చినదే.

ఇదే సమయంలో, చంద్రబాబు మళ్లీ ముఖ్యమంత్రిగా ఎన్నికైన వెంటనే పింఛన్ పెంపు ఫైల్‌పై సంతకం చేశారు. వృద్ధులకు రూ.3,000 నుంచి రూ.4000కు, వితంతువులు, వికలాంగులకు రూ.4000 నుంచి రూ.6000కు, ఆరోగ్య సమస్యలున్న వారికి రూ.10,000 నుంచి రూ.15,000కు పెంచారు. ఏఆర్‌టీ (హెచ్ఐవీ పాజిటివ్) బాధితులకు, సీకేడీ, తలసేమియా, సికిల్ సెల్, లివర్, కిడ్నీ మార్పిడి బాధితులకు కూడా ప్రత్యేక పింఛన్లు మంజూరు చేస్తోంది. మొత్తం 28 వేర్వేరు వర్గాల ప్రజలకు ఈ పథకం వర్తింపచేయడం ద్వారా కూటమి ప్రభుత్వం ఒక సమగ్ర సంక్షేమ అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళుతోంది. ఈ ప్రభుత్వం 2025–26 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కోసం బడ్జెట్‌లో రూ.32,143 కోట్లు కేటాయింపులు చేసింది. ఇది రాష్ట్ర బడ్జెట్‌లో సుమారు 12–14 శాతం. సామాజిక భద్రతా పింఛన్ల కోసం ఈ స్థాయిలో బడ్జెట్ కేటాయింపులు చేయడం సామాజిక భద్రతపై చంద్రబాబు ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధిని తెలియజేస్తోంది. పథకాన్ని విస్తరించేందుకు ప్రభుత్వం నిర్మాణాత్మక చర్యలు తీసుకుంటున్నది. 2024 జూలై నుంచి 2025 అక్టోబర్ వరకు పింఛన్ పంపిణీ గణాంకాలను విశ్లేషిస్తే– మొత్తం రూ.47,996.21 కోట్లు విడుదల చేయగా, అందులో రూ.47,118.38 కోట్లను లబ్ధిదారులకు పంపిణీ చేశారు. అంటే, సగటున 98 శాతానికి పైగా లబ్ధిదారులకు పెన్షన్ అందింది.

సామాజిక భద్రత పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వాలలో కూటమి సర్కార్ దేశంలోనే అత్యధికంగా పింఛన్లు అందిస్తున్న ప్రభుత్వంగా నిలిచింది. ఉదాహరణకు తెలంగాణలో పింఛన్ మొత్తం రూ.2,016 మాత్రమే కాగా, లబ్ధిదారుల శాతం కూడా తొమ్మిది లోపే ఉంది. తమిళనాడు, మహారాష్ట్రలలో పింఛన్ లబ్ధిదారుల శాతం నాలుగు కూడా లేకపోగా, బిహార్ వంటి పెద్ద రాష్ట్రాల్లో ఈ శాతం తొమ్మిదికి చేరినప్పటికీ పింఛన్ మొత్తాలు కేవలం రూ.400 మాత్రమే ఉన్నాయి. గుజరాత్ వంటి అభివృద్ధి చెందిన రాష్ట్రంలో సైతం వికలాంగులకు కేవలం రూ.600 మాత్రమే ఇవ్వటం ఆశ్చర్యకరం. కానీ, ఆంధ్రప్రదేశ్‌లో మాత్రం రాష్ట్ర జనాభాలో దాదాపు 13 శాతం మంది పింఛన్ లబ్ధిదారులుగా ఉండటం విశేషం. భరోసా పెన్షన్ల కోసం నెలకు రూ.2,722 కోట్ల వ్యయం జరుగుతోంది.

పింఛన్లను కేవలం ఓ సంక్షేమ కార్యక్రమంగా కాకుండా, ప్రజల హక్కుగా కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తూ, సామాజిక భద్రతను సమర్థవంతంగా అమలు చేస్తున్నది. ప్రతి లబ్ధిదారుడి వివరాలను సర్వేల ఆధారంగా నిర్ణయించడం, నేరుగా లబ్ధిదారుడి చేతికే పెన్షన్ పంపిణీ వంటి సంస్కరణల ద్వారా ఈ పథకాన్ని మరింత విశ్వసనీయంగా మార్చింది. ఆంధ్రప్రదేశ్ పింఛన్ విధానం దేశానికి ఆదర్శంగా నిలుస్తోంది.

పింఛన్లను కేవలం ఓ సంక్షేమ కార్యక్రమంగా కాకుండా, ప్రజల హక్కుగా కూటమి ప్రభుత్వం భావిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయకత్వంలో పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తూ, సామాజిక భద్రతను సమర్థవంతంగా అమలు చేస్తున్నది. ప్రతి లబ్ధిదారుడి వివరాలను సర్వేల ఆధారంగా నిర్ణయించడం, నేరుగా లబ్ధిదారుడి చేతికే పెన్షన్ పంపిణీ వంటి సంస్కరణల ద్వారా ఈ పథకాన్ని మరింత విశ్వసనీయంగా మార్చింది.

■ గుమ్మడి ప్రభాకర్
మీడియా కో–ఆర్డినేటర్, ముఖ్యమంత్రి కార్యాలయం

అర్థంకాని ఈ సమాజాన్ని ఎలా మారుస్తారు?!

సమాజాన్ని వాస్తవికంగా అర్థంచేసుకోకుండా దాన్ని మార్చే కార్యక్రమాన్ని ఎవ్వరూ రూపొందించలేరు. విప్లవ కార్యక్రమాన్ని రూపొందించడమే సజావుగా సాగనప్పుడు దాన్ని విజయవంతం చేయడం అసాధ్యం అవుతుంది. ప్రస్తుతం మావోయిస్టు పార్టీ ఉనికి సంక్షోభంలో పడిపోవడం దీనికి సరికొత్త హెచ్చరిక.



రాజ్యాంగం ప్రకారం మనది 'సర్వసత్తాక, సామ్యవాద, లౌకిక, ప్రజాస్వామ్య, గణతంత్రం'. అయితే రాజ్యాంగాల్లో ప్రకటించుకున్నట్టుగా ఏ సమాజమూ ఉండదు; ఏ ప్రభుత్వమూ పనిచేయదు. రాజ్యాంగ పరిధిలోనే భారతదేశం 'హిందూ మతరాజ్యం'గా మారిపోయిందని సుబ్రమణియన్ స్వామి వంటివాళ్ళు ఐదేళ్ళ క్రితమే ప్రకటించారు. ఒక ప్రజాస్వామిక రాజ్యాంగం అమల్లో వుండగా దేశంలో మతరాజ్యం ఏర్పడడం రాజకీయ ధార్మిక రంగాల్లో వైచిత్రి కావచ్చుగానీ, సామాజిక రంగంలో అది చాలా పెద్ద సంక్షోభాన్ని రేపుతుంది.

భారత సమాజాన్ని అంచనా వేయడంలో కమ్యూనిస్టు పార్టీల్లో కూడా విపరీతమైన వైరుధ్యం కనిపిస్తుంది. సమాజాన్ని అర్థం చేసుకున్న దాన్నిబట్టే ఆయా పార్టీల దీర్ఘకాలిక కార్యక్రమాల రూపకల్పన జరుగుతుంది. మనది అర్థ భూస్వామ్య–అర్థ వలస సమాజమని మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీలన్నీ భావిస్తుంటాయి. ఇది 1935–40 మధ్య ప్రాంతంలో చైనా సమాజం గురించి మావో చేసిన విశ్లేషణ. దాన్నుండి ఆయన 'నూతన ప్రజాస్వామిక విప్లవం' అనే కార్యక్రమాన్ని రూపొందించాడు. చైనాలో సామ్రాజ్యవాద వ్యతిరేక జాతీయ బూర్జువా వర్గం కూడా కమ్యూనిస్టుల విప్లవంతో కలిసి వచ్చింది. ఇండియాలో అలాంటి పరిస్థితి లేకపోయినా, స్థల కాలాలు మారిపోయినా, మావోయిస్టులు సహా మార్క్సిస్టు–లెనినిస్టు పార్టీలన్నీ 'నూతన ప్రజాస్వామిక విప్లవం'ను పట్టుకుని వేలాడుతున్నాయి.

1990లలో మన దేశంలోనే కాక ప్రపంచవ్యాప్తంగా సామాజిక ఆర్థిక వ్యవస్థల పునాది మారిపోయింది. తూర్పు యూరప్‌లోని సోషలిస్టు ప్రభుత్వాలు పతనం కావడమే గాక సోషలిస్టు రష్యా సహితం విచ్ఛిన్నం అయిపోయింది. కమ్యూనిజానికి ఆమోదాంశం ఇరుకున పడిపోయింది. మరోవైపు, గాట్ కారణంగా ప్రపంచ వాణిజ్య సంస్థ ఏర్పడి సరళీకృత ఆర్థిక విధానాలు వచ్చాయి. డిజిటల్ టెక్నాలజీతో సంప్రదాయ ఉత్పత్తి విధానమే మారిపోయింది. వీటికితోడు మనదేశంలో మతతత్వ రాజకీయాలు విజృంభించాయి. కొత్త గణాంకాల ప్రకారం మనదేశ జీడీపీలో వ్యవసాయం, ఆక్వా, అటవీ సంపదల వాటా 16.3 శాతం. పారిశ్రామిక రంగం వాటా 29 శాతం. కొత్తగా ప్రవేశించిన సర్వీస్ సెక్టార్ వాటా 54.55 శాతం. అయినప్పటికీ ఇంకా ఎవరైనా వ్యవసాయిక విప్లవం, నూతన ప్రజాస్వామిక విప్లవం అంటూ ఉంటే మాత్రం వాళ్ళ మెదళ్ళను పురాతత్వశాలల్లో జాగ్రత్తగా భద్రపరచాలి! ఏ సమాజంలో అయినా ఉత్పత్తిశక్తులు, ఉత్పత్తి సంబంధాలతో కూడిన ఉత్పత్తి విధానం రాజకీయాలతో సహా ఇతర సామాజిక సాంస్కృతిక రంగాలన్నింటినీ ప్రభావితం చేస్తుంటుంది. ఈ సూత్రాన్ని 21వ శతాబ్దపు డిజిటల్ సమాజానికి అన్వయించే పని ఎవరూ చేయలేదు.

ఆధిపత్య సమూహాల దగ్గర రాజకీయ అధికారంతో సహా వనరులన్నీ సమృద్ధిగా ఉంటాయి. అంచేత వాళ్ళు కొత్త సమాజాన్ని విశ్లేషించుకోకపోయినా వాళ్ళకు వచ్చే ఇబ్బంది ఏమీ లేదు. కానీ, వర్తమాన సమాజం వల్ల ఇబ్బందులు, వివక్ష, అణచివేతలకు గురయ్యేవాళ్ళు దాన్ని మార్చాలనుకుంటే మాత్రం కొత్త పరిణామాలను నిశితంగా విశ్లేషించుకోక తప్పదు. సమాజాన్ని వాస్తవికంగా అర్థం చేసుకోకుండా దాన్ని మార్చే కార్యక్రమాన్ని ఎవ్వరూ రూపొందించలేరు. విప్లవ కార్యక్రమాన్ని రూపొందించడమే సజావుగా సాగనప్పుడు దాన్ని విజయవంతం చేయడం అసాధ్యం అవుతుంది. ప్రస్తుతం బస్తర్‌లో మావోయిస్టు పార్టీ ఉనికి సంక్షోభంలో పడిపోవడం దీనికి సరికొత్త హెచ్చరిక.

మరోవైపు, దేశాన్ని ఫాసిజమో, నాజీయిజమో పాలిస్తున్నదనే అభిప్రాయాన్ని కొందరు తరమూ వ్యక్తం చేస్తున్నారు. పాలకుల్లో ఆ లక్షణాలు కనిపిస్తున్నమాట నిజమేగానీ వందేళ్ళ నాటి ఇటలీ, జర్మనీ రాజకీయ సామాజికార్థిక పరిస్థితులూ ఇప్పటి మన సామాజిక వాస్తవమూ ఒకటి కానే కాదు. ఇప్పుడు మనం చూస్తున్నది కార్పొరేట్ మత తత్వ నియంతృత్వం. (Corporate Communal Dictatorship –CCD). కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, హిందూత్వ ఆధిపత్యం, రాజ్య అణచివేతల క్రూర సమ్మిశ్రిత వ్యవస్థ ఇది. ఆర్థిక రంగంలో సహజ, కృత్రిమ వనరులు, శాస్త్రవిజ్ఞానం మొత్తం కార్పొరేట్ల ఆధీనంలోకి వెళ్ళిపోతుంటాయి. సాంస్కృతిక రంగంలో మెజారిటీ మతం ఇతర మతాలను అణచివేస్తుంటుంది. హిందూ సమూహాలను ఐక్యం చేయడానికి దానికున్న ఏకైక మార్గం ఇస్లాం, క్రైస్తవ మతాలను దేశ భద్రతకు ముప్పుగా ప్రచారం చేస్తుండడం. సామాన్య ప్రజలు తిరగబడకుండా రాజ్యం అణచివేస్తుంటుంది. ఈ మూడు రకాల అణచివేతల బాధితులు ఏకం కావాలని కొందరు సమంజసంగానే అంటుంటారు గానీ అది అంత సులువు కాదు.

"హిందూ సమాజం అంటూ ప్రత్యేకంగా ఏదీ ఉనికిలో ఉండదు. అది కేవలం కులాల సమాహారం. ప్రతి కులం తన ఉనికి గురించి తపనతో ఉంటుంది. దాని మనుగడే దాని ఉనికికి మూలం, అదే దాని ముగింపునకూ మూలం. కులాలు ఎన్నడూ ఒక సమాఖ్యగా కూడా ఏర్పడవు. కాబట్టి, హిందూ సమాజాన్ని కులాల సముదాయం అనడం కూడా సరికాదు. ఒకరితో మరొకరు పోరాడుకుంటుండే సమూహాలు అవి. హిందూ–ముస్లిం అల్లర్లు జరిగినప్పుడు మాత్రమే హిందూ కులాల మధ్య అనుబంధం ఏర్పడుతుంది. అది కూడా తాత్కాలికం మాత్రమే. ఇతర సందర్భాల్లో ఒక కులం మరో కులంతో తనకో అనుబంధం ఉందని కనీసంగానైనా భావించదు," అన్న బీఆర్ అంబేడ్కర్ మాటలు నేటికీ వర్తిస్తాయి. అంబేడ్కర్ మాటల్ని తిరగేసి చూస్తే, ఎన్నికల్లో హిందూ ఓటు బ్యాంకును కొల్లగొట్టాలంటే నిరంతరం ముస్లిం భూతాన్ని చూపుతుండాలి అనే అర్థం వస్తుంది. దీనినే ఇస్లామోఫోబియా అంటున్నారు. అలా చేస్తే, హిందూ సమాజం మొత్తం కాకున్నా వాళ్ళలో 36–38 శాతం ఓట్లు వేసినా అప్రతిహత శక్తి అని చెప్పుకునే అవకాశం మన పార్లమెంటరీ ఎన్నికల వ్యవస్థలో ఉంది.

సమాజం నిలువు దొంతరలుగానేగాక, సమాంతరంగానూ సమూహాలు సమూహాలుగా విడిపోయి ఉంటుంది. నిలువు దొంతరల్ని విశ్లేషించినంత సులువుకాదు సమాంతర సమూహాల మధ్యనున్న వైరుధ్యాలను పరిష్కరించడం. నిలువు దొంతరలు కళ్ళకు కనిపిస్తుంటాయి. సమాంతర సమూహాలను విడగొట్టి చూడడం కష్టసాధ్యం. సమాజం మారాలనో, సమాజాన్ని మార్చాలనో చాలామంది అంటుంటారు. అలాంటివాళ్ళు అన్నింటికన్నా ముందు సమాజ వాస్తవికతను గుర్తించాలి. దానికి బాధితుల జాబితా సిద్ధం చేయాలి. సాధారణ బాధితులు మొదలు ప్రధాన బాధితుల వరకు ఒక గ్రేడింగ్‌ను కూర్చాలి. ఇప్పటి సమాజాన్ని ఎలాంటి సమాజంగా మార్చాలని ఆశిస్తున్నామో, ఎలాంటి సమాజాన్ని నిర్మించగలమో– నిర్ధారించుకోవాలి. అప్పుడు ఆ దిశగా ప్రయాణించడానికి ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించుకోవచ్చు. అయితే, ఇది చాలా సంక్లిష్ట ప్రక్రియ. తరచూ మన గతమే మనల్ని కట్టి పడేస్తుంది.

వర్తమాన భారత మేధోరంగాన్ని మూడు దృక్పథాలు నడుపుతున్నాయి. ఎంఎస్ గోల్వాల్కర్, కార్ల్ మార్క్స్, బీఆర్ అంబేడ్కర్. గోల్వాల్కర్ ఆలోచనా విధానానికి వ్యతిరేకంగా మార్క్స్, అంబేడ్కర్ ఆలోచనా స్రవంతుల్ని ఏకం చేయాలి అని చాలామంది అనవచ్చు. దీనినే లాల్ – నీల్ మైత్రి అంటున్నారు కొందరు. లోతుగా చీలిపోయిన సమాజంలో ఇది అంత సులువైన వ్యవహారం కాదు. ఇప్పటి ఇండియా కార్పొరేట్ మతతత్వ నియంతృత్వానికి ప్రధాన బాధితులు ముస్లింలు, ఆదివాసులు. ఉద్యమంలోనూ, ఆ తరువాత మనం కోరుకుంటున్న సమాజంలోనూ ఈ రెండు సమూహాల స్థానాన్ని నిర్ణయించకపోతే బండి ఒక్క అడుగు కూడా ముందుకు నడవదు. ఆలస్యం జరిగేకొద్దీ, కార్పొరేట్ పెట్టుబడిదారీ విధానం, హిందుత్వ ఆధిపత్యం, రాజ్య అణచివేత మూడూ మరింతగా పెరుగుతుంటాయి.

◆ డానీ
సమాజ విశ్లేషకులు



బందరు రోడ్డులో జోరువాన



కర్నూలు జిల్లాలో ప్రైవేట్ బస్సు ప్రమాదం అనంతరం ఉమ్మడి కృష్ణాజిల్లాలో బస్సుల భద్రతపై ప్రశ్నలు ఉదయిస్తున్నాయి. అసలు ఇక్కడి ప్రైవేట్ బస్సులు నిబంధనల ప్రకారం నడుస్తున్నాయా? అంటే నూటికి 95 శాతం కాదనే సమాధానం వస్తుంది. ఇక్కడి బస్సులకు కూడా వేరే రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయడం వల్లే ఈ పరిస్థితి తలెత్తుతోందని తెలుస్తోంది. ఫైర్‌సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండా, వాహనాలు ఎలా ఉంటాయో కూడా చూడకుండా, రోడ్డు ట్యాక్స్‌కు కక్కుర్తి పడి ప్రైవేట్ యాజమాన్యాలు తమ బస్సులకు వేరే రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయిస్తూ ప్రయాణికుల ప్రాణాలను ప్రమాదాల్లోకి నెట్టేస్తున్నారు.

మన బస్సుల్లో భద్రత ఎంత?

ప్రమాదకరంగా ఉమ్మడి కృష్ణాలోని ప్రైవేట్ బస్సులు

దాదాపు వెయ్యికిపైగా బస్సులు.. చాలావరకు స్లీపర్స్

- బస్సులు ఇక్కడివి.. రిజిస్ట్రేషన్ మాత్రం కోహిమాలో..
- ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండానే అక్కడ రిజిస్ట్రేషన్
- వాట్సాప్‌లో కాగితాలు పెడితే చాలు.. గంటల్లోనే పూర్తి
- కనీసం బస్సును కూడా చూడకుండానే హడావిడి
- ఫైర్‌సేఫ్టీ నిబంధనలు కూడా తూచ్..
- డబ్బుకు కక్కుర్తిపడుతున్న ప్రైవేట్ యాజమాన్యాలు
- ప్రయాణికుల ప్రాణాలతో చెలగాటం

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : రాష్ట్రంలోనే ఉమ్మడి కృష్ణాజిల్లాలో ప్రైవేట్ బస్సులు అత్యధికంగా ఉన్నాయి. విజయవాడ కేంద్రంగా మూడు వంతుల మేర పొరుగు రాష్ట్రాలకు ఈ బస్సులు నడుస్తున్నాయి. ఇప్పుడీ బస్సులకు ఏ రాష్ట్రంలో రిజిస్ట్రేషన్లు జరిగాయి? ఏ విధానంలో జరిగాయి? ప్రమాణాలకు అనుగుణంగానే జరిగాయా? వంటి అంశాలపై రవాణాశాఖ అధికారులు నిగ్గు తేల్చకపోతే భవిష్యత్తులో ప్రమాదకర ఘటనలు జరిగే అవకాశం ఉంది. ఉమ్మడి కృష్ణాజిల్లాలో వెయ్యికి పైగా ప్రైవేట్ బస్సులు ఉన్నాయి. వీటిలో స్లీపర్ బస్సులే ఎక్కువ. వందకు పైగా ప్రైవేట్ బస్ ఆపరేటర్లు ఉన్నారు. 95 శాతానికి పైగా బస్సులు మిగతా 6లో..

ఆందోళన కలిగిస్తున్న బీఎస్-6 బస్సులు

బీఎస్-6 బస్సులు ఆందోళన కలిగిస్తున్నాయి. ఈ బస్సులు టెక్నాలజీని అందిపుచ్చుకున్నప్పటికీ సాంకేతికంగా తలెత్తే సమస్యలను తెలుసుకునే పరిస్థితి లేదు. కంపెనీ ప్రతినిధి వచ్చి ల్యాప్‌ట్యాప్‌ను కనెక్ట్ చేసి చూస్తే తప్ప సమస్య గుర్తించలేం. దీనికి వైరింగ్ కూడా ఎక్కువ. దాదాపు 200 రకాల వైరింగ్ సిస్టమ్ ఉంటుంది. షార్ట్ సర్క్యూట్‌కు అవకాశం ఎక్కువ. అలాగే, పొగ రాకుండా ఉండటానికి డీజిల్‌లో బ్లూ ఆయిల్ కలుపుతారు. ఈ ఆయిల్‌కు మండే స్వభావం ఎక్కువగా ఉండటం వల్ల మంటలు త్వరగా వ్యాపించే అవకాశం ఉంటుంది. బస్సుల్లో అద్దాలు ఫిక్స్‌డ్‌గా బిగించి ఉండటం, స్లీపర్ బెర్తుల వల్ల బస్సు ఇరుకుగా మారి కదల్లేని పరిస్థితి ఏర్పడుతుంది.



ముందు జాగ్రత్తలతో సురక్షిత ప్రయాణం 8

తగు ఏర్పాట్లతోనే ప్రమాదాల నుంచి బయటపడే అవకాశం

మరో గండం

ఈ నెల 26, 27, 28 తేదీల్లో మరో వాయుగుండం

భారీ వర్షాలు కురిసే అవకాశం.. ఆరెంజ్ అలర్ట్

ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం : వర్షం ఇప్పట్లో వీడే సూచనలు కనిపించట్లేదు. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం ప్రభావంతో నాలుగైదు రోజులుగా వర్షాలు కురుస్తూనే ఉన్నాయి. ఇది చాలదన్నట్టుగా బంగాళాఖాతంలో తాజాగా శుక్రవారం మరో అల్పపీడనం ఏర్పడింది. శనివారం నాటికి తీవ్ర వాయుగుండంగా మారుతుందని, 26వ తేదీ నాటికి తుఫానుగా రూపాంతరం చెందుతుందని వాతావరణ శాఖ హెచ్చరించింది. దీంతో ఈనెల 26 నుంచి 28వ తేదీ వరకు కోస్తాతీరానికి ఆరెంజ్ అలర్ట్‌ను జారీ చేశారు. భారీ వర్షాలు కురుస్తాయన్న వాతావరణ శాఖ హెచ్చరికలతో రైతులు బెంబేలెత్తిపోతున్నారు. కొద్దిరోజుల్లో వరికోతలు ప్రారంభం కానుండగా, ఈ తరుణంలో భారీ వర్షాల కారణంగా ఎలాంటి విపత్కర పరిస్థితులు ఏర్పడతాయోనని భయపడుతున్నారు.

గుండెపోటుతో విద్యార్థి మృతి

టెన్త్‌క్లాస్ ట్యూషన్‌కు వెళ్తూ దారిలోనే..

- సైకిల్ తొక్కుతుండగా గుండెనొప్పి
- ఆసుపత్రికి తరలించేలోపు దుర్మరణం
- జగ్గయ్యపేటలో విషాదం



గణేశ్ (ఫైల్)

జగ్గయ్యపేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : చిన్న వయస్సులోనే మరో గుండె ఆగింది. స్థానిక కాగితాల బజార్‌కు చెందిన పదో తరగతి విద్యార్థి గుండెపోటుతో మృతిచెందడంతో విషాదఛాయలు అలముకున్నాయి. పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో పదో తరగతి చదువుతున్న గోలి వెంకట గణేశ్ (15) శుక్రవారం ఉదయం 7 గంటలకు మార్కండేయ బజార్‌లో ఉన్న ట్యూషన్‌కు వెళ్లేందుకు సైకిల్‌పై బయల్దేరాడు. గుడి సమీపంలోకి రాగానే, సైకిల్ తొక్కలేక కింద పడిపోయాడు. స్థానికులు గమనించి ఆర్‌ఎంపీ దగ్గరకు తీసుకెళ్లారు. పల్స్ పడిపోవటంతో పాటు తలపై కంటి పక్కన దెబ్బ తగలడంతో వారు గణేశ్ తల్లి శిరీషకు సమాచారం అందించారు. అనంతరం గణేశ్‌ను ఆటోలో ప్రభుత్వాసుపత్రికి తరలించగా, అప్పటికే గుండెపోటుతో చనిపోయినట్టు వైద్యులు ధ్రువీకరించారు. గణేశ్ తండ్రి రామారావు ఐదేళ్ల కిందట హృద్రోగంతో చనిపోయాడు. తల్లి శిరీష ప్రైవేట్ ఉద్యోగం చేస్తూ కుమారుడిని చదివిస్తోంది. అటు భర్తను, ఇటు చేతికి అందివచ్చిన కొడుకును కోల్పోయి శిరీష గుండెలవిసేలా రోదించింది.

జీపీఎస్



కృష్ణాజిల్లాలో ధాన్యం సేకరణకు తీసుకునే వాహనాల విషయంలో వాహన యజమానులు, రవాణా అధికారుల మధ్య వివాదాలు చోటు చేసుకుంటున్నాయి. ఈ ఏడాది జీపీఎస్ ఉన్న వాహనాలే సమకూర్చాలని నిర్ణయించడంతో సమస్య మొదలైంది.

ధాన్యం సేకరణకు వాహనాల ఎంపికలో రచ్చ

జీపీఎస్ ఉన్న వాహనాలే చూడాలని ఉన్నతాధికారుల ఆదేశాలు

- క్షేత్రస్థాయిలో జీపీఎస్ ఉన్న వాహనాలు లేని పరిస్థితి
- సొంత ఖర్చుతో ఏర్పాటు చేసుకోవాలని యజమానులకు సూచన
- వాహనాలు తీసుకోవడమే కాక ఈ గొడవ ఏంటని యజమానుల ఆగ్రహం
- సమస్యను జేటీసీకి తెలియజేసేందుకు సిద్ధమవుతున్న రవాణా ఇన్‌స్పెక్టర్లు

జేటీసీ వద్దకు..

వాహనాల సేకరణ విషయంలో జీపీఎస్ పరికరాల ఏర్పాటుకు సంబంధించి యజమానులతో తలెత్తుతున్న గొడవల వల్ల తాము పడుతున్న ఇబ్బందులను జేటీసీకి వివరించేందుకు రవాణా ఇన్‌స్పెక్టర్లు సిద్ధమవుతున్నారు. రెండు రోజుల్లో ఆయన్ను కలిసి వ్యవహారం తేల్చాల్సిందిగా కోరనున్నారు.

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : కృష్ణా జిల్లాలో ధాన్యం సేకరణకు సంబంధించి గ్లోబల్ పొజిషనింగ్ సిస్టమ్ (జీపీఎస్) ఉన్న వాహనాలను సమకూర్చాలని రవాణా శాఖ జాయింట్ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (జేటీసీ)కు ఆదేశాలు అందాయి. కానీ, క్షేత్రస్థాయిలో రవాణా శాఖ అధికారులకు జీపీఎస్‌తో కూడిన వాహనాలు దొరకని పరిస్థితి ఏర్పడింది. జీపీఎస్ పరికరాల ఖర్చుపై జిల్లా యంత్రాంగం నుంచి స్పష్టత మిగతా 6లో..

కమర్షియల్ కొండపై వేటు

- సబార్డినేట్ శ్రీనివాసరావు సస్పెన్షన్

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అధికారుల ఆదేశాలు లేకుండా సీవీటీ (చెకింగ్ వెహికల్ ట్యాక్స్) తనిఖీలకు వెళ్లి ట్రాన్స్‌పోర్టు వ్యాపారి నుంచి లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు చిక్కిన వాణిజ్యపన్నుల శాఖ సబార్డినేట్ కొండపల్లి శ్రీనివాసరావుపై అధికారులు వేటు వేశారు. గవర్నరుపేట సర్కిల్‌లో పనిచేస్తున్న శ్రీనివాసరావు ఇటీవల వన్‌టౌన్‌లోని జెండాచెట్టు సెంటర్‌లో ఉన్న ట్రాన్స్‌పోర్టు కార్యాలయానికి వెళ్లి రూ.20 వేలు డిమాండ్ చేసి రూ.16 వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్న విషయం తెలిసిందే. అతడిని కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించింది. దీనిపై శ్రీనివాసరావును వాణిజ్యపన్నుల శాఖ ఒకటో డివిజన్ అధికారులు సస్పెండ్ చేశారు.

ముసుగు తీశాకే బదిలీ

పోలీసు కమిషనరేట్‌లో బదిలీలపై సీపీ కీలక నిర్ణయం

- గత మరకలను దాచేసి బదిలీ ప్రయత్నాలు
- సిఫార్సు లేఖల అండతో అడ్డగోలు వ్యవహారాలు
- ఇకపై ఆ పరిస్థితి ఉండబోదన్న సీపీ రాజశేఖరబాబు
- చరిత్ర తెలుసుకున్నాకే బదిలీ అని విభాగాలకు ఆదేశాలు



(ఆంధ్రజ్యోతి-విజయవాడ) : కోరుకున్నచోట పోస్టింగ్ కోసం ఒకరు ముఖ్య అధికారితో సిఫార్సు చేయించుకుంటారు. మరొకరు ఎంపీ రికమండేషన్ అంటారు. ఇంకొకరు ఎమ్మెల్యే నుంచి సిఫార్సు లేఖ తెస్తారు. పోలీసు శాఖలో పోస్టింగ్‌లకు సిఫార్సులు తోకల్లా తయారవుతున్నాయి. వాటిని కొట్టిపారేయలేని పరిస్థితి అధికారులది. ఈ సిఫార్సులతో లోగడ ఉన్న మరకలకు ముసుగులు వేసేసి కొంతమంది పోస్టింగ్‌లు దక్కించుకుంటున్నారు. ఫైళ్లను సిద్ధం చేయించుకుని అధికారులు పని ఒత్తిడిలో ఉన్న సమయంలో సంతకాలు చేయించుకుంటున్నారు. దీంతో పోలీసు కమిషనర్ ఎస్వీ రాజశేఖరబాబు కీలకం నిర్ణయం తీసుకున్నారు. పోస్టింగ్‌ల కోసం సిఫార్సులను తెచ్చుకున్న వారి చరిత్రను తెలుసుకున్న తర్వాతే ఫైళ్లపై సంతకాలు చేయాలని నిర్ణయం తీసుకున్నారు. దీనికి సంబంధించి బదిలీలు, పోస్టింగ్‌ల వ్యవహారాలతో మిగతా 6లో..

ఆ ఘటనతో మార్పులు

కీలకమైన విభాగంలో పనిచేస్తూ పలు ఆరోపణలతో బదిలీ అయిన కానిస్టేబుల్ తిరిగి అదే విభాగంలో పోస్టింగ్ సంపాదించుకున్నాడు. తనతో పాటు బదిలీ అయిన మరో కానిస్టేబుల్ కూడా ఇక్కడికి రావడానికి ప్రయత్నాలు ముమ్మరం చేశాడు. ఈ వ్యవహారం గందరగోళం కావడంతో పోలీసు కమిషనర్ రాజశేఖరబాబు విచారణకు ఆదేశించారు. ఆ కానిస్టేబుల్ బదిలీ కోసం కమిషనరేట్‌లో ఏ అధికారి సిఫార్సు చేయలేదని తేలింది. చివరికి ఎవరి సిఫార్సుతో ఈ బదిలీ చేయాల్సి వచ్చిందో నిర్ధారణకు వచ్చిన పోలీసు కమిషనర్ దాని వెనుక ఏం జరిగిందో తెలుసుకున్నారు. తనపై ఇంతకుముందు క్రమశిక్షణ చర్యల కింద బదిలీ చేశారన్న విషయాన్ని తొక్కిపెట్టి ఓ ప్రముఖ వ్యక్తితో సిఫార్సు చేయించుకున్నాడు. ఆయన సిఫార్సుకు గౌరవం ఇస్తూ ఆ కానిస్టేబుల్‌కు కోరుకున్న చోట పోస్టింగ్ ఇచ్చారు. బదిలీల కోసం అసలు విషయాలను తొక్కిపెడుతున్నారని పోలీసు కమిషనర్ గుర్తించారు. దీంతో బదిలీల ప్రక్రియను పర్యవేక్షించే 'ఏ' విభాగానికి, స్పెషల్ బ్రాంచ్, సిబ్బంది పనిచేస్తున్న విభాగాల్లోని అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు.

మెట్రో టెండర్లలో ఎల్‌అండ్‌టీ-ఎన్‌సీసీ బిడ్లు

టెండర్లను ఓపెన్ చేసిన ఏపీఎంఆర్‌సీ అధికారులు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : మెట్రోరైల్ ప్రాజెక్టు టెండర్లలో ఎల్‌అండ్‌టీ-ఎన్‌సీసీ జాయింట్ వెంచర్ (జేవీ) బిడ్ వేసింది. రెండు సంస్థలు సంయుక్తంగా కలిసి టెండర్‌ను దాఖలు చేశాయి. శుక్రవారం ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) అధికారులు విజయవాడ మెట్రో టెండర్ల బిడ్‌ను తెరిచారు. ప్రీ బిడ్ మీటింగ్‌లో అనేక సంస్థలు పాలుపంచుకున్నా చివరి రోజున మాత్రం ఎల్‌అండ్‌టీ-ఎన్‌సీసీ జాయింట్ వెంచర్ మాత్రమే టెండర్ వేసింది. ఈ విషయాన్ని మెట్రో రైల్ కార్పొరేషన్ అధికారులు రాష్ట్ర మునిసిపల్ పట్టణాభివృద్ధి శాఖ మంత్రి నారాయణకు తెలియజేశారు. మెట్రోరైల్ ప్రాజెక్టులో భాగంగా సివిల్ నిర్మాణాలైనా వయాడక్ట్ తదితర పనులకు రూ.4,500 కోట్లతో టెండర్లు పిలిచిన విషయం తెలిసిందే. గంపగుత్తగా టెండర్లు పిలవటంపై ప్రీబిడ్ సమావేశంలో కాంట్రాక్టు సంస్థల నుంచి ప్యాకేజీలుగా విభజించాలన్న మిగతా 6లో..

పత్తిని చిత్తు చేస్తున్న వానలు! » పంటకు తీవ్రనష్టం.. నానుతున్న గింజలు 6

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు » గుదిబండలా గత ప్రభుత్వ స్థలాలు: మంత్రి పార్థసారథి 6

న్యాయస్థానంలో ఇదేం పద్ధతి! » హత్య కేసు నిందితులపై న్యాయాధికారి ఆగ్రహం

పత్తిని చిత్తు చేస్తున్న వానలు!



పంటకు తీవ్ర నష్టం.. చేలల్లోనే నానుతున్న గింజలు





పత్తి చెట్టు అడుగు భాగంలో నల్లగా మారిన కాయలు; వర్షాలకు గుడ్డిగా, నల్లగా, గట్టి ఉండలుగా మారిన పత్తి

- నాన్చుడు వానతో సర్వనాశనం
- ఇలానే ఉంటే మొలకలు వచ్చే ప్రమాదం
- చేలల్లో తీత లేక ఎక్కడ పత్తి అక్కడే

(కంచికచర్ల/తిరువూరు/జి.కొండూరు-ఆంధ్రజ్యోతి)

ఎన్టీఆర్ జిల్లాలో ఈ ఏడాది 81,875 ఎకరాల్లో రైతులు పత్తి పంట సాగు చేశారు. నందిగామ, చందర్లపాడు, కంచికచర్ల, వీరులపాడు మండలాల్లో 31,500 ఎకరాల్లో సాగైంది. ఎకరానికి రూ.50 వేలకు పైగా పెట్టుబడి పెట్టారు. మొన్నటి వరకు పత్తిచేలు ఆశాజనకంగా ఉన్నాయి. మంచి దిగుబడి వస్తుందని రైతులు ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. అలాంటిది కాయలు పక్వానికి వచ్చే తరుణంలో అధిక వర్షాలు నిలువునా ముంచాయి. దాదాపుగా ప్రతిరోజూ ఏదో ఒక సమయంలో వర్షం పడుతూనే ఉంది. పల్లపు, లోతట్టు భూముల్లో నీళ్లు నిలవటం వల్ల వేరుకుళ్లు తెగులు సోకింది. చెట్లు నిలువునా చచ్చిపోతున్నాయి. చేలు గుబురుగా ఉండటం, గాలి తగలకపోవటంతో రోజుల తరబడి తేమ ఆరటం లేదు. తేమవల్ల ఫంగస్ తెగులు సోకటంతో తొలికాపు పూర్తిగా దెబ్బతిన్నది. కొంత భాగం పూత, పిందెలు రాలిపోయాయి. అడుగు భాగం కాయలు బూజు పట్టి నల్లగా మారాయి. పక్వానికి వచ్చిన కాయలు సరిగ్గా విచ్చుకోకుండా ముడుచుకుపోయాయి. ఒక్కో చెట్టుకు పది నుంచి 20 కాయల వరకు దెబ్బ తిన్నాయి. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల లోపు గుడ్డి పత్తి, కాయ పత్తి వస్తుంది. నల్లగా మారిన కాయలను పగుల కొట్టి పత్తి తీయాల్సి వస్తున్నది. పగిలిన కాయల్లోని పత్తి తడవటం వల్ల రంగు కూడా మారింది.

> జిల్లాలో పత్తి రైతుల పరిస్థితి దారుణంగా తయారైంది. ఎడతెగని వర్షాలు పత్తి చేల ఉసురు తీస్తుండగా, రైతులను నిలువునా నట్టేట ముంచుతున్నాయి. ఇప్పటికే లోతట్టు చేలు దెబ్బతినగా, అడుగు భాగం కాపు అంతా నాశనమైంది. తేమ ఆరకపోవటం వల్ల కాయలు బూజుపట్టి నల్లగా మారాయి. ఎకరానికి రెండు నుంచి మూడు క్వింటాళ్ల లోపు నాణ్యత లేని కాయ, గుడ్డి పత్తి వస్తున్నది. ఇంకా వర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ అధికారులు చెపుతుండటంతో రైతులు తీవ్ర ఆందోళన చెందుతున్నారు.

భారంగా మారిన పత్తి తీత కూలి..

చెట్టు అడుగుభాగంలో ఉన్న కాయపత్తి, గుడ్డిపత్తి తీయటానికి కూడా కూలీలు ముందుకు రావటం లేదు. ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు పత్తి తీతకు ఒక్కో కూలీకి రూ. రెండు వందలు తీసుకుంటున్నారు. పది మంది కూలీలు తీసినప్పటికీ క్వింటా పత్తి కూడా కావటం లేదు. పత్తికి కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.8,110లు. అయితే ఈ పత్తి నాణ్యత తక్కువ కావటం వల్ల మార్కెట్లో వ్యాపారులు కొనటం లేదు. దళారులు మాత్రం చాలా తక్కువ ధరకు అడుగుతున్నారు. క్వింటా రూ. 2వేల నుంచి రూ.4వేల లోపు కొంటున్నారు. ఈ గుడ్డి పత్తి, కాయ పత్తి అమ్మితే కూలీల ఖర్చులు కూడా రావటం కూడా గగనమవుతోందని రైతులు వాపోతున్నారు.

తగ్గనున్న దిగుబడి..

పత్తి చేలు దెబ్బతినటంతో దిగుబడి గణనీయంగా తగ్గుతుందని రైతులు చెబుతున్నారు. ఈ ఏడాది చేలు బాగుండటంతో పది క్వింటాళ్లకు పైగా దిగుబడి వస్తుందని ఆశించిన రైతులను అధిక వర్షాలు నీరుగార్చాయి. సాధారణంగా దీపావళికి రైతుల లోగిళ్లు పత్తి నిల్వలతో కళకళలాడుతుంటాయి. అలాంటిది ఇప్పుడు చూద్దామన్నా తెల్లని పత్తి కనిపించటం లేదు. ఇంకా వర్షాలు తగ్గకపోగా ప్రతి రోజూ ఏదోక సమయంలో పడుతూనే ఉన్నాయి. అల్పపీడనాల వల్ల వారం రోజులు వర్షాలు పడతాయని వాతావరణ శాఖ అధికారులు హెచ్చరిస్తుండటంతో రైతులకు ఏమి చేయాలో పాలుపోవటం లేదు. ఇలాగే వర్షాలు పడితే ఇక పత్తి చేలు పూర్తిగా దెబ్బతింటాయి. దిగుబడులపై ఆశలు వదులుకోవాల్సి వస్తుంది. దీనికితోడు చేలను కాపాడుకునేందుకు రైతులు అష్టకష్టాలు పడుతున్నారు. ఎరువులు వేస్తున్నారు. దీంతో పెట్టుబడి ఎక్కువైంది. ఇక వర్షాలు తగ్గితే మలికాపు అయినా దక్కుతుందన్న ఆశతో రైతులు ఉన్నారు.

తిరువూరు నియోజకవర్గ పరిధిలో ఈక్రాప్ నమోదు ప్రకారం మొత్తం 21,011 ఎకరాల్లో పత్తిసాగు జరుగుతుండగా, తిరువూరులో 2263 ఎకరాల్లో, ఎ.కొండూరు మండలంలో 6552 ఎకరాల్లో, గంపలగూడెం మండలంలో 11742 ఎకరాల్లో, విస్సన్నపేట మండలంలో 454 ఎకరాల్లో పత్తిసాగు జరుగుతుంది. ప్రస్తుతం చేలో పత్తి తీతలకు రైతాంగం సిద్ధం అవుతున్న తరుణంలో వర్షలకు, తీతకు వచ్చిన పత్తి తడిసి నల్లరంగుకు మారుతుండటంతో మార్కెట్‌లో కొనుగోలు జరగదని, పత్తితీత ఖర్చు అదనంగా తమపై పడుతుందనే భయం రైతుల్లో నెలకొంది. గతంలో మిర్చిసాగుచేసిన రైతాంగం, సాగులో వస్తున్న తెగుళ్లు.. సాగుకు తలకుమించిన ఖర్చు అవుతుండటం, మిర్చికోత కూలీ రాని పరిస్థితిల్లో ఈ ఏడాది మిర్చిరైతులు, పత్తిసాగు చేశారు.



చిరంజీవి సతీమణి సురేఖకు ప్రసాదం, పట్టువస్త్రాలు అందజేస్తున్న స్థానాచార్యుడు శివప్రసాద్ శర్మ

దుర్గమ్మ సేవలో చిరంజీవి సతీమణి సురేఖ

ఇంద్రకీలాద్రి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : ఇంద్రకీలాద్రిపై దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మను శుక్రవారం మెగాస్టార్ చిరంజీవి సతీమణి సురేఖ స్నేహితులు, బంధువులతో కలసి దర్శించుకున్నారు. ఆలయ అధికారులు వారికి స్వాగతంపలికి అమ్మవారి దర్శనం కల్పించారు. అనంతరం వేద పండితులు అమ్మవారి ఆశీస్సులు అందజేశారు. స్థానాచార్యుడు విష్ణుభొట్ల శివప్రసాద్ శర్మ అమ్మవారి పట్టువస్త్రాలు, లడ్డూ ప్రసాదం అందజేశారు.

సహస్రదీపార్చన సేవ



ఇంద్రకీలాద్రి : దుర్గగుడిలో కార్తీకమాసం సందర్భంగా శుక్రవారం రాత్రి సహస్ర దీపార్చన సేవ అత్యంత భక్తి నిష్ఠలతో సాగింది. అర్చక స్వాములు పూజలు నిర్వహించి, మంత్ర పుష్పం, ఆశీర్వచనం, తీర్థ ప్రసాద స్వీకరణ చేశారు. సహస్రలింగార్చన, సహస్రదీపార్చన, ఊంజల్ సేవలలో ఉభయదాతలు, భక్తులు పాల్గొన్నారు. ప్రదోష కాలములో 'మహా నివేదన', పంచ హారతులు, చతుర్వేద స్వస్తి జరిగాయి. భక్తులచే ప్రతిరోజూ సాయంత్రం 6.30 గంటలకు శ్రీమల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం వద్ద దీపోత్సవం (ఆర్జిత సేవ) నిర్వహిస్తున్నారు.



ఎలక్ట్రిక్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న ఈవో, చైర్మన్, బ్యాంక్ అధికారులు

దుర్గగుడికి కానుకగా 2 ఎలక్ట్రిక్ వాహనాలు

ఇంద్రకీలాద్రి : ఈవో వీకే శీనానాయక్ చొరవతో కరూర్ వైశ్యా బ్యాంక్ రెండు ఎలక్ట్రిక్ వాహనాలను దేవస్థానానికి విరాళంగా అందజేసింది. వీటిని కనకదుర్గ నగర్‌లోని నూతన సమాచార కేంద్రం వద్ద ఉంచి వృద్ధులు, అనారోగ్యంగా ఉన్నవారికి, దివ్యాంగులకు వినియోగించనున్నారు. రూ.18.36 లక్షల విలువైన రెండు ఎలక్ట్రిక్ వాహనాలను బ్యాంక్ డీజీఎం నెరల్లా రమేష్ శుక్రవారం ఈవో శీనానాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణల సమక్షంలో దేవస్థానానికి అందజేశారు.



నియమక పత్రాలతో ఉద్యోగులు, కేంద్ర మంత్రి, ఉన్నతాధికారులు

రోజ్‌గార్ మేళాతో 10 లక్షల మందికి ఉపాధి

- కేంద్రమంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ

రైల్వేస్టేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కేంద్ర ప్రభుత్వ రోజ్‌గార్ మేళా ద్వారా 10 లక్షల మందికి ఉపాధి లభిస్తుందని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ అన్నారు. విజయవాడ డివిజనల్ రైల్వే ఆడిటోరియంలో రోజ్‌గార్ మేళా 17వ విడతలో భాగంగా కేంద్ర మంత్రి వివిధ విభాగాలకు సంబంధించి 69 మందికి ఉద్యోగ నియామక పత్రాలను అందజేశారు. తొలుత ప్రధానమంత్రి నరేంద్ర మోదీ శుక్రవారం దేశంలోని 40 ప్రాంతాల్లో నూతనంగా నియమితులైన అధికారులను ఉద్దేశించి వర్చువల్ మోడ్‌లో ప్రసంగించారు. అనంతరం కేంద్రమంత్రి మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లోని రోజ్‌గార్ మేళాను విజయవాడ, విశాఖపట్నంలలో నిర్వహించారన్నారు. విజయవాడలో ఏడు వేర్వేరు కేంద్ర ప్రభుత్వ విభాగాల నుండి 69 మంది అభ్యర్థులు తమ నియామక ఉత్తర్వులను అందుకున్నారని తెలిపారు. వారిలో 45 మంది అభ్యర్థులు ఇండియన్ రైల్వేస్ నుంచి, 13 మంది పోస్టల్ శాఖ నుంచి, నలుగురు ఎంప్లాయిస్ స్టేట్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ నుంచి, ముగ్గురు హోం మంత్రిత్వ శాఖ నుంచి, ఇద్దరు ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా నుంచి, డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ ఇస్రో నుంచి ఒక్కొక్కరు ఉన్నారని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ సర్కిల్ చీఫ్ పోస్ట్ మాస్టర్ జనరల్ బీపీ శ్రీదేవి, విజయవాడ డివిజన్ అదనపు డివిజనల్ రైల్వే మేనేజర్ (ఇన్ఫ్రాస్ట్రక్చర్) పిఇ ఎడ్విన్, విజయవాడ రీజియన్ పోస్ట్ మాస్టర్ జనరల్ డిఎస్‌వీఆర్ మూర్తి, ఐపీవోఎస్, పలువురు ప్రముఖులు హాజరయ్యారు.

అవయవదానంతో..
ముగ్గురికి ప్రాణదానం



సీహెచ్ ప్రసాద్ (ఫైల్)

తాడేపల్లి టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బ్రెయిన్ డెడ్ అయిన యువకుడి అవయవదానం ముగ్గురి జీవితాల్లో వెలుగులు నింపింది. మణిపాల్ వైద్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పల్నాడు జిల్లా పిడుగురాళ్లకు చెందిన సీహెచ్ ప్రసాద్ గత కొద్దికాలంగా తీవ్రమైన తలనొప్పితో బాధపడుతుండటంతో చికిత్స నిమిత్తం గుంటూరు పీపుల్స్ ట్రామా సెంటర్‌కు తీసుకెళ్లారు. పరీక్షించిన వైద్యులు ప్రసాద్ మెదడులో రక్తస్రావం వల్ల తలనొప్పి వస్తోందని తెలిపారు. మెరుగైన చికిత్స కోసం మణిపాల్ వైద్యశాలకు తరలించగా పరీక్షల అనంతరం ప్రసాద్ బ్రెయిన్ డెడ్‌కు గురైనట్టు వైద్యులు నిర్ధారించారు. కుటుంబ సభ్యుల అంగీకారంతో ఏపీ జీవన్‌దాన్ ట్రస్ట్ చైర్మన్ రాంబాబు, మణిపాల్ డైరెక్టర్ రామాంజనేయ రెడ్డి ఆధ్వర్యంలో అవయవదానం నిర్వహించారు. కాలేయం, ఒక కిడ్నీ మణిపాల్ ఆసుపత్రిలో ఇద్దరికి, మరో కిడ్నీని విజయవాడలోని విజయ హాస్పిటల్‌లో ఒకరికి ట్రాన్స్‌ప్లాంటేషన్ చేయగా, కళ్లను ఎల్.వి.ప్రసాద్ ఐ ఆసుపత్రికి తరలించారు.

అర్హులందరికీ ఇళ్లు, స్థలాలు

- గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాలు

గుదిబండలా మారాయి: మంత్రి పార్థసారథి

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అర్హులైన నిరుపేదలందరికీ ఇళ్లు, ఇళ్ల స్థలాలు ఇవ్వాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం పని చేస్తోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి కొలుసు పార్థసారథి తెలిపారు. శుక్రవారం రాష్ట్ర సచివాలయంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ గత ప్రభుత్వం నివాస యోగ్యం కాని, నిర్మాణాలకు అనువు కాని ప్రాంతాల్లో సెంటు, సెంటున్నర స్థలాలిచ్చి, ప్రజలకు గుదిబండగా మార్చిందని ఆరోపించారు. ఎక్కడైతే నిర్మాణాలు జరగలేదో అటువంటి లే అవుట్లలో లబ్ధిదారుల్ని ఒప్పించి, చట్టపరంగా వాటిని రద్దు చేసి, వారికి మళ్లీ రెండు, మూడు సెంట్లు ఇచ్చే అవకాశాన్ని మంత్రివర్గ ఉపసంఘ సమావేశంలో చర్చించినట్టు తెలిపారు. ఈ అంశంపై అధికారుల స్థాయిలో కూడా మరో సమావేశాన్ని నిర్వహించాక.. మంత్రివర్గ ఉపసంఘం భవిష్యత్ కార్యాచరణపై నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. ఇదే విధంగా జర్నలిస్టులకు స్థలాలు కేటాయించి, ఇళ్లు నిర్మించి ఇవ్వాలనేది తమ ప్రభుత్వ విధానమని తెలిపారు. సుప్రీంకోర్టు తీర్పు నేపథ్యంలో న్యాయపరమైన అడ్డంకులను అధిగమించేందుకు అడ్వొకేట్ జనరల్‌ను సంప్రదించి, వారి అభిప్రాయంపై సీఎంతో చర్చించి, తదుపరి సమావేశంలో తగిన నిర్ణయం తీసుకుంటామని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి పార్థసారథి

బాలకృష్ణపై వ్యాఖ్యలు సరికాదు: జగన్‌కు హితవు

ప్రముఖ సినీ నటుడు, టీడీపీ ఎమ్మెల్యే బాలకృష్ణపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మంత్రి పార్థసారథి మండిపడ్డారు. జగన్ అసెంబ్లీకి రాకుండా బాలకృష్ణ గురించి మాట్లాడడం మంచిది కాదని హితవు పలికారు. సహచర శాసనసభ్యుడి గురించి జగన్ ఇష్టానుసారం మాట్లాడడం మంచిపద్ధతి కాదన్నారు. ఆయన గురించి అభ్యంతరకరంగా ఎలా మాట్లాడతారని నిలదీశారు. విశాఖపట్నంలో డేటా సెంటర్ ఎవరు తెచ్చారో రాష్ట్ర ప్రజలందరికీ తెలుసన్నారు. 2020లో జగన్ అదానీతో అగ్రిమెంట్ చేసుకుంటే ఎందుకు డేటా సెంటర్ పెట్టలేదని ప్రశ్నించారు. ఏపీకి రాకుండా అదానీ డేటా సెంటర్ ఎందుకు పారిపోయిందని నిలదీశారు. జగన్ దమ్ముంటే అసెంబ్లీకి వచ్చి మాట్లాడాలని సూచించారు.

డైట్‌లలో బోధన పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): జిల్లా విద్య శిక్షణ సంస్థ(డైట్)ల్లో బోధనా పోస్టుల ఖాళీలను డెప్యుటేషన్ ప్రాతిపదికపై భర్తీ చేసేందుకు నోటిఫికేషన్ జారీచేసినట్టు ఎస్‌సీఈఆర్‌టీ డైరెక్టర్ ఎంవీ కృష్ణారెడ్డి శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. ఈ నెల 29 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారని, లీప్ యాప్ ద్వారా దరఖాస్తులు సమర్పించాలని పేర్కొన్నారు. నవంబరు 5 నుంచి 8వ తేదీ వరకు రాత పరీక్షలు నిర్వహించి, 13న ఫలితాలు ప్రకటిస్తామన్నారు. ఆ తర్వాత త్రిసభ్య కమిటీ ఇంటర్వ్యూలు నిర్వహిస్తుందని,రాత పరీక్ష, ఇంటర్వ్యూ మార్కుల ఆధారంగా తుది ఎంపిక జరుగుతుందని వివరించారు.

ముగిసిన కళా ఉత్సవ్-2025

అమరావతి : విద్యార్థులకు చదువుతో పాటు కళలు, సంస్కృతి పట్ల కూడా ఆసక్తి పెరిగేలా చూడాలని సమగ్ర శిక్ష స్టేట్ ప్రాజెక్టు డైరెక్టర్ బి.శ్రీనివాసరావు సూచించారు. పాఠశాల విద్యాశాఖ, ఎస్‌సీఈఆర్‌టీ ఆధ్వర్యంలో రెండురోజుల పాటు జరిగిన కళాఉత్సవ్-2025 ముగింపు కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 345 మంది విద్యార్థులు 12 రకాల కళారూపాలతో పోటీల్లో పాల్గొన్నారు. విజేతలకు శ్రీనివాసరావు బహుమతులు అందజేశారు.

న్యాయస్థానంలో ఇదేం పద్ధతి!

- హత్య కేసు నిందితులపై న్యాయాధికారి ఆగ్రహం
- విచారణ జరుగుతుండగా వెళ్లిపోయిన నిందితులు

విజయవాడ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి) : హత్య కేసులో విచారణకు హాజరైన నిందితులు కోర్టులో వ్యవహరించిన తీరుపై న్యాయాధికారి ఆగ్రహం వ్యక్తం చేశారు. సాక్షిని విచారిస్తున్న సమయంలో అనుమతి లేకుండా నిందితులు వరుసగా బయటకు వెళ్లిపోవడంపై మండిపడ్డారు. ఈ ఘటన విజయవాడలోని ఎనిమిదో అదనపు జిల్లా జడ్జికోర్టులో శుక్రవారం జరిగింది. విజయవాడ రూరల్ మండలం ప్రసాదంపాడులో 2011 జూలై నెలలో వడ్లమూడి మోహన్‌కృష్ణ అనే వ్యక్తిని దారుణంగా హత్య చేశారు. ఆయనను ఇంట్లో చంపేసి రోడ్డుపై పడేసి రోడ్డుప్రమాదంగా చిత్రీకరించే ప్రయత్నం చేశారు. దీనిపై పటమట పోలీసులు కేసు నమోదు చేశారు. ఈ కేసు విచారణ ఎనిమిదో ఏడీజే కోర్టులో జరుగుతోంది. ఈ కేసులో మొత్తం 15 మంది నిందితులు ఉండగా నలుగురు చనిపోయారు. మిగిలిన 11 మందిలో ఇద్దరు ఆబ్‌సెంట్ పిటిషన్ దాఖలు చేశారు. ఒకరిపై కోర్టు నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ చేసింది. ప్రధాన నిందితుడు వల్లభనేని నాగరాజు, ఏ2 బత్తుల పండుతోపాటు ఎనిమిది మంది హాజరయ్యారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా వ్యవహరించిన ప్రస్తుత జీఆర్పీ డీఎస్పీ రత్నరాజు సాక్ష్యం చెప్పడానికి కోర్టుకు శుక్రవారం వచ్చారు. ఆయన సాక్ష్యాన్ని న్యాయాధికారి డి.లక్ష్మి నమోదు చేస్తున్నారు.

ఇది జరుగుతుండగా కొంతమంది నిందితులు పదేపదే న్యాయాధికారి వద్దకు వెళ్లి ఏదో ఒక వంక చెప్పి బయటకు వెళ్తున్నారు. సాక్ష్యాన్ని రికార్డు చేస్తున్న సమయంలో ఇలా చేయడంతో న్యాయాధికారి వారిపై అసహనం వ్యక్తం చేశారు. సాక్ష్యం నమోదు సాయంత్రం వరకు జరుగుతుండగా నిందితులు తెలివితేటలు ప్రదర్శించారు. ఒక నిందితుడు బోనులో ఉండగా తమకు శిక్ష పడుతుందని భయంగా ఉందని, న్యాయాధికారి కాళ్లు పట్టుకుంటానని కన్నీరు పెట్టుకున్నాడు. దీనికి న్యాయాధికారి సర్దిచెప్పారు. విచారణకు వాయిదా కావాలని నిందితుల్లో కొంతమంది తరఫున న్యాయవాది పిటిషన్ దాఖలు చేశారు. కేసు విచారణ ఇప్పటికే ఆలస్యమైందని, ఇక సమయం ఇవ్వలేనని న్యాయాధికారి లక్ష్మి స్పష్టం చేశారు. దీనితో ఆ న్యాయవాది బయటకు వెళ్లి బోనులో ఉన్న నిందితులు ఒక్కొక్కరిని బయటకు పిలవడం మొదలుపెట్టారు. నిందితులు ఎదురుగా ఉన్న న్యాయాధికారి అనుమతి తీసుకోకుండా బయటకు వెళ్లిపోయాడు. దర్యాప్తు అధికారి సాక్ష్యం నమోదు పూర్తయ్యే సరికి బోనులో నలుగురు మాత్రమే నిందితులు కనిపించారు. ఒక నిందితుడు మాత్రం తన బంధువులు చనిపోయారని అనుమతి తీసుకుని వెళ్లిపోయాడు. దీనిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. మిగిలిన నిందితులంతా ఏమయ్యారని ప్రశ్నించారు.అనుమతి లేకుండా ఎవరెవరు వెళ్లిపోయారో పేర్లు నమోదు చేయాలని సిబ్బందిని ఆదేశించారు. కేసు డాకెట్‌పై వారి పేర్లు రాసి ఈ నిందితులు కోర్టు ధిక్కరణకు పాల్పడ్డారని హైకోర్టుకు రాశారు. అనంతరం విచారణను 27వ తేదీకి వాయిదా వేశారు.

ముసుగు తీశాకే బదిలీ

(5వ పేజీ తరువాయి)

సంబంధం ఉన్న విభాగాలకు స్పష్టమైన ఆదేశాలిచ్చారు.

ఇక సవివరాలతోనే బదిలీ పోస్టింగ్

ఇక నుంచి పోస్టింగ్‌ల కోసం సిఫార్సులతో ఎవరు వచ్చినా వారి విజ్ఞాపనాపత్రాలను క్షుణ్ణంగా పరిశీలించాలని సీపీ స్పష్టం చేశారు. సంబంధిత సిబ్బంది ఇంతకుముందు ఎక్కడ పనిచేశారు, ఏ కారణంగా అక్కడి నుంచి బదిలీ అయ్యారు, వారిపై ఏమైనా అభియోగాలు ఉన్నాయా, విచారణలు జరిగాయా, లోగడ ఎప్పుడైనా వీఆర్‌కు వెళ్లారా, ఒకవేళ వెళ్తే అందుకు గల కారణాలు.. ఇలా అన్ని వివరాలు సవివరంగా తెలుసుకుని ఫైళ్లను సిద్ధం చేయాలని ఆదేశించారు. మరకలు ఉన్నా సిఫార్సులతో వచ్చినంత మాత్రాన కోరుకున్నచోట పోస్టింగ్ ఇవ్వకూడదని అధికారులు నిర్ణయించారు. గత చరిత్రను వెల్లడించకుండా పోస్టింగ్‌ల కోసం దరఖాస్తు చేసుకున్న సిబ్బందిపై అవసరమైతే చర్యలు తీసుకోవాలన్న నిర్ణయానికి పోలీసు కమిషనర్ వచ్చారు.

మన బస్సుల్లో భద్రత ఎంత?

(5వ పేజీ తరువాయి)

స్థానికంగా రిజిస్ట్రేషన్ లేనివే. నాగాలాండ్ రాష్ట్రం కోహిమాలో ఇక్కడి బస్సుల రిజిస్ట్రేషన్ జరిగినట్టుగా తెలుస్తోంది. ఇక్కడ రిజిస్ట్రేషన్ చేయడం సులభం. కేవలం వాట్సాప్‌లో కాగితాలు పంపిస్తే గంటల వ్యవధిలోనే బస్సు రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి చేస్తున్నారు. కొత్త బస్సు అయితే బాడీ బిల్డింగ్ పూర్తి చేసుకోకపోయినా రిజిస్ట్రేషన్ చేసేస్తున్నారు.

ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండానే..

భారత్ స్టేజ్ (బీఎస్)-6 వంటి అధునాతన సెన్సార్ ఆధారిత బస్సుల విషయంలో భద్రతా ప్రమాణాలను పాటించాల్సి ఉంటుంది. దీనికోసం మన దగ్గర ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్‌ను తప్పనిసరి చేశారు. షార్ట్ సర్క్యూట్, ఇతర కారణాల వల్ల మంటలు చెలరేగినపుడు బస్సు బాడీబిల్డింగ్ నిర్మాణం వాటిని నియంత్రించేదిగా ఉండాలి. అగ్ని నిరోధక వ్యవస్థలను కలిగి ఉండాలి. తగిన అగ్ని నిరోధక భద్రతను కలిగి ఉందని ధ్రువీకరించడానికి ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ దోహదపడుతుంది. మన దగ్గర ఈ సర్టిఫికెట్ చూపిస్తేనే రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. ఈ సర్టిఫికెట్ పొందటానికి రూ.2 లక్షల మేర ఖర్చు అవుతుంది. కోహిమాలో అయితే ఫైర్ సేఫ్టీ సర్టిఫికెట్ లేకుండానే రిజిస్ట్రేషన్ చేస్తారు. దీనివల్ల ప్రైవేట్ బస్సు యజమానికి రూ.2 లక్షలు కలిసొస్తుంది.

రోడ్డు ట్యాక్స్ తగ్గించుకునేందుకు..

ఉమ్మడి కృష్ణాజిల్లాకు చెందిన 95 శాతానికి పైగా ప్రైవేట్ బస్సులు కోహిమాలోనే రిజిస్ట్రేషన్లు పూర్తి చేసుకున్నట్టు తెలుస్తోంది. దీనివల్ల ఆ రాష్ట్ర ప్రభుత్వానికి ఏడాదికి రూ.50 వేలు మాత్రమే రోడ్డు ట్యాక్స్ చెల్లిస్తే సరిపోతుంది. మన దగ్గర అయితే, స్లీపర్ బస్సు అయితే 36 బెర్తులకు (ఒక్కో బెర్తుకు రూ.3,500 చొప్పున) ఒక త్రైమాసికానికి రూ.1,26,000 రోడ్డు ట్యాక్స్‌గా చెల్లించాలి. ఏడాదికైతే రూ.5,04,000 చెల్లించాలి.

మెట్రో టెండర్లలో ఎల్అండ్‌టీ-ఎన్‌సీసీ బిడ్లు

(5వ పేజీ తరువాయి)

అభిప్రాయం వ్యక్తమైంది. ప్యాకేజీలుగా విభజించటం వల్ల పనులు జాప్యం కావటానికి అవకాశం ఉంటుందని ఏపీఎంఆర్‌సీ అధికారులు తెలిపారు. ప్యాకేజీలుగా విడగొట్టలేమని తేల్చిచెప్పారు. నగరంతో పాటు రాష్ట్ర ప్రభుత్వానికి కూడా అత్యంత ప్రతిష్టాత్మక మెట్రో ప్రాజెక్టు పనులను భారీ సంస్థలైతేనే వేగంగా చేపట్టగలవని పేర్కొన్నారు. రెండో దఫా ప్రీబిడ్ మీటింగ్‌లో అయినా జాయింట్ వెంచర్ (జేవీ)కు అవకాశం కల్పించాలని కాంట్రాక్టు సంస్థలు డిమాండ్ చేశాయి. రెండు సంస్థలు కలిసి జాయింట్ వెంచర్‌గా ఏర్పడి టెండర్లు వేస్తామంటే తమకు అభ్యంతరం లేదని చెప్పిన అధికారులు ఆ మేరకు టెండర్‌ను సవరించారు.

పనులు అప్పగించటం లాంఛనమే..

మెట్రో పనులను ఎల్అండ్‌టీ-ఎన్‌సీసీకి అప్పగించటం లాంఛనమేనని తెలుస్తోంది. ఎల్అండ్‌టీ సంస్థ హైదరాబాద్‌లో విజయవంతంగా మెట్రో నిర్మాణ పనులు చేపట్టింది. సివిల్ నిర్మాణాలను అందంగా, పటిష్టంగా చేపట్టింది. ఆ అనుభవంతో విజయవాడలో కూడా చాలా వేగంగా ఎల్అండ్‌టీ సంస్థ పనులు చేపట్టే అవకాశం ఉంటుంది.

జీపీఎస్

(5వ పేజీ తరువాయి)

లేకపోవటంతో వాటిని యజమానులే ఏర్పాటు చేసుకోవాలని రవాణా అధికారులు నిర్దేశిస్తున్నారు. 'అవసరానికి మా వాహనాలను బలవంతంగా తీసుకోవటమే కాకుండా.. జీపీఎస్‌లు ఏర్పాటు చేయమంటారా..' అంటూ వాహన యజమానులు రవాణా ఇన్‌స్పెక్టర్లపై ఎదురు తిరుగుతున్నారు. ఈ పరిణామంతో ఇక తమ వల్ల కాదని రవాణా ఇన్‌స్పెక్టర్లు.. జేటీసీని కలిసి విన్నవించేందుకు సిద్ధమవుతున్నారు.

వివాదాలు ఇలా..

ప్రతి సీజన్‌లోనూ ధాన్యం సేకరించే సందర్భంలో వాహనాలను సమకూర్చే బాధ్యతలను జిల్లా ఉన్నతాధికారులు రవాణా అధికారులకు అప్పగిస్తుంటారు. రవాణా అధికారులు ట్రాలీలతో కూడిన ట్రాక్టర్లు, లారీలను తీసుకుంటారు. రైతు సేవాకేంద్రాల నుంచి కస్టమ్ మిల్స్‌కు ధాన్యాన్ని పంపటానికి ఈ వాహనాలను వినియోగిస్తారు. ఈసారి జీపీఎస్‌తో కూడిన వాహనాలను తీసుకోమని కృష్ణా జిల్లా యంత్రాంగం నిర్దేశించటంతో సమస్య మొదలైంది. చిన్న, మధ్య తరహా లారీలు, ట్రాలీ ట్రాక్టర్లకు చాలా వరకు జీపీఎస్‌లు ఉండవు. నిర్దేశిత మిల్లులకు వెళ్తున్నాయా, లేదా అనేది తెలుసుకోవాలంటే కచ్చితంగా జీపీఎస్ అవసరం. ఇలాంటి సందర్భంలో జీపీఎస్ పరికరాలను జిల్లా యంత్రాంగమే ఏదైనా ఏజెన్సీకి అప్పగించి తీసుకున్న వాహనాలకు ఏర్పాటు చేయించాలి. అలాకాకుండా యజమానులే జీపీఎస్ పరికరాలను ఏర్పాటు చేసుకోవాలని నిర్దేశిస్తుండటం వివాదాలకు కారణమవుతోంది.

మండలానికి
150 వాహనాల సమీకరణ

కృష్ణా జిల్లావ్యాప్తంగా ప్రతి మండలానికి 150కు తగ్గకుండా వాహనాలను సమకూర్చాలని జిల్లా యంత్రాంగం రవాణా శాఖకు నిర్దేశించింది. అవనిగడ్డ, నాగాయలంక వంటి మండలాల్లో వాహనాలను సేకరించటం అధికారులకు కష్టంగా మారింది. సాధారణంగా జీపీఎస్ పరికరాలను జిల్లా యంత్రాంగమే ఏర్పాటు చేయాలి. ఇంతకుముందు ఇదే జరిగింది. అలాకాకుండా రవాణా అధికారులకు ఖర్చుపై స్పష్టత ఎందుకు ఇవ్వట్లేదో అర్థంకాని పరిస్థితి. ఫలితంగా క్షేత్ర స్థాయిలో వారం రోజులుగా గొడవలు జరుగుతున్నాయి.

కొండప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

మొగల్రాజపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వర్షాల నేపథ్యంలో కొండ ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని టీడీపీ యువనాయకుడు గద్దె క్రాంతికుమార్ విజ్ఞప్తి చేశారు. శుక్రవారం ఏడో డివిజన్ అమ్మ కళ్యాణమండపం ఎదురు రోడ్డులో కొండ చరియలు విరిగి పడిన ప్రాంతాన్ని ఈస్ట్ ఎమ్మార్వో రోహిణి, వీఎంసీ ఈఈ సామ్రాజ్యం, జోనల్ కమిషనర్ షమీతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులు కూడా ప్రమాదాలకు ఆస్కారం ఉన్న ప్రాంతాల ప్రజలను అప్రమత్తం చేయాలని సూచించారు. పునరావాస కేంద్రాలకు తరలించాలని చెప్పారు. ఈ కార్యక్రమంలో 8వ డివిజన్ కార్పొరేటర్ ఉషారాణి, శిరీషాగాంధీ, అశోక్, తదితరులు పాల్గొన్నారు.

భయం గుప్పిట్లో కొండప్రాంత వాసులు

- కొండపై కూలిన ఇల్లు
- పరుగులు తీసిన స్థానికులు

గుణదల, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): గడచిన మూడు రోజుల నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు కొండ ప్రాంతవాసులు భయం గుప్పిట్లో బిక్కు బిక్కుమంటూ ఉన్నారు. ఇదిలా ఉండగా శుక్రవారం మారుతీనగర్ వద్దగల కోకోకోలా వీధి కొండపై భాగంలో ఓ ఇల్లు కూలిపోయింది. ఇల్లు కూలిన సమయంలో పెద్ద శబ్దం రావడంతో స్థానికులు పరుగులు తీశారు. పడి పోయిన ఇంట్లో ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం జరగలేదు. సమాచారం అందుకున్న మాచవరం సీఐ ప్రకాష్ సిబ్బందితో ఘటనా స్థలానికి చేరుకుని చుట్టుపక్కల వారిని అప్రమత్తం చేశారు. కొండపై భాగంలో ఇల్లు కావడంతో పునాది సరిలేక కూలిపోయిందని ఇంట్లో సామాగ్రి ధ్వంసమైందని స్థానికులు సీఐకు వివరించారు.

జిమ్‌లో స్టెరాయిడ్స్ విక్రయాలు

- 20 బాటిల్స్ సీజ్ ● ఒకరు అరెస్టు

గుణదల, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): శరీర ధారుడ్యాన్ని పెంచుకోవడంతో పాటు ఆరోగ్యవంతమైన జీవితం కావాలనుకుని యువత జిమ్‌ల బాట పడుతున్నారు. యువతను మత్తు మందులకు బానిసగా చేసి డబ్బు సంపాదించుకోవాలనుకునే వారు జిమ్‌కి వచ్చే యువతకు స్టెరాయిడ్స్ అలవాటు చేయడం పరిపాటైపోయింది. గడచిన 10 రోజుల క్రితమే పటమట పోలీసులు గురునానక్ నగర్లోని ఓ జిమ్‌పై దాడిచేసి స్టెరాయిడ్స్ పట్టుకున్నారు. ఇది మరిచిపోకముందే తాజాగా గుణదల పోలీస్ స్టేషన్ పరిధిలోని గుణదల మేరీమాత ఆలయం బస్టాప్ వద్ద ఉన్న పీజే జిమ్‌పై పోలీసులు, ఔషధ శాఖ అధికారులు సంయుక్తంగా దాడిచేసి స్టెరాయిడ్స్ స్వాధీనం చేసుకున్నారు. నిడమానూరుకు చెందిన పృథ్వీరాజ్ గుణదల వద్ద పీజే జిమ్‌ను నిర్వహిస్తున్నాడు. జిమ్‌కు వచ్చే యువతకు స్టెరాయిడ్స్ అలవాటు చేసి సొమ్ము చేసుకోవడం ప్రారంభించాడు. స్టెరాయిడ్స్‌ను ఢిల్లీ నుంచి తెప్పించి ఇక్కడ యువతకు అమ్మడం ప్రవృత్తిగా ఎంచుకున్నాడు. ఢిల్లీలోని గుర్‌గ్రాంకు చెందిన డల్లా రవి వద్ద నుంచి స్టెరాయిడ్స్ దిగుమతి చేసుకుంటున్నట్లుగా పోలీసులు గుర్తించారు. దీంతో అతనిని ఏ2గా కేసులో నమోదు చేయడం జరిగిందని, ఏ1గా ఉన్న పృథ్వీరాజ్ వద్ద నుంచి 20 స్టెరాయిడ్ బాటిల్స్ స్వాధీనం చేసుకుని అతనిని శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరుపరిచినట్లు గుణదల సీఐ వాసిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్‌లో 74 మందికి జరిమానా

విజయవాడ లీగల్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : మద్యం సేవించి వాహనాలు నడిపిన 74 మందికి ఏడవ అదనపు జ్యుడీషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ ఆర్‌వీఎస్ శర్మ జరిమానాలు విధించారు. ఒక్కొక్కరికి రూ.10 వేల చొప్పున జరిమానా విధించారు.

టీటీడీ నిత్యాన్నదాన పథకానికి కూరగాయలు

గవర్నర్‌పేట, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 23వ డివిజన్ కార్పొరేటర్ నెల్లిబండ్ల బాలస్వామి ఆధ్వర్యంలో శుక్రవారం తిరుమల తిరుపతి దేవస్థానం నిత్య అన్నదాన పథకానికి 10టన్నుల కూరగాయలను పంపారు. సూర్యారావుపేటలోని టీడీపీ కార్యాలయం వద్ద ఎమ్మెల్యే బొండా ఉమా మహేశ్వరరావు జెండా ఊపి తిరుమల స్వామి సన్నిధికి వెళ్లే కూరగాయల వాహనానికి వీడ్కోలు పలికారు.





కరణం వీధి, దానయ్యవీధి మధ్యలో ఉన్న చిన్న వీధిలో వారం రోజులుగా నిలిచిన నీరు, కరణం వీధిలో పొంగుతున్న యూజీడీ



విజయదుర్గా నగర్‌లో పగిలిన యూజీడీ పైపుల స్థానంలో కొత్తవి వేసేందుకు తవ్విన రోడ్డు

తటాకాలను తలపిస్తున్న రోడ్లు

- ఆప్టికల్ ఫైబర్ లైన్ సిబ్బంది నిర్లక్ష్యం.. పగిలిన యూజీడీ లైన్ ● వర్షం నీరు మురుగు నీటితో కలుస్తున్న వైనం
- పొంగుతున్న యూజీడీలు ● అల్లాడుతున్న కాలనీల జనాలు

మొగల్రాజపురం, ఆంధ్రజ్యోతి: ఆప్టికల్ ఫైబర్ లైను సిబ్బంది నిర్లక్ష్యంతో యూజీడీ పైపు లైన్ పగిలిపోవడంతో 11వ డివిజన్‌లో రోడ్లు మురుగు నీరు, వర్షం నీటితో తటాకాలుగా మారాయి. ఐదు రోజుల క్రితం పదవ డివిజన్ విజయదుర్గానగర్ రోడ్డులో ఫైబర్ లైన్ కోసం డ్రిల్ యంత్రాలతో రోడ్డును తవ్వుతున్నపుడు యూజీడీ పైపులు పగిలాయి. దీంతో భద్రయ్యనగర్, పంటకాల్వరోడ్డు, భాగయ్యవీధి, అచ్చమ్మ వీధి, దానయ్య వీధి, కరణం వీధి, యాదవుల బజారు, జ్యోతివిద్యాలయం బజారు, పాత పోస్టాఫీసు రోడ్డు, పోస్టల్ కాలనీతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల నుంచి యూజీడీ నీరు విజయదుర్గానగర్ రోడ్డుమీదుగా ఆ పక్కనే ఉన్న పంప్ హౌస్‌కు వెళ్లాలి. సరిగ్గా పంప్ హౌస్‌కు వెళ్లే చోట పైపులు పగలడంతో పై ప్రాంతాల్లో యూజీడీలు పొంగి రోడ్ల మీదకు మురుగు నీరు చేరింది. వర్షాల దెబ్బకు మురుగునీటికి వర్షం నీరు జత కలిసి రోడ్లు చెరువులను తలపిస్తున్నాయి.

మరమ్మతులకు వర్షం అడ్డంకి

విజయదుర్గానగర్‌లో పైపులైను పగలిన చోట రోడ్డును తవ్వి పైపు లైన్ పనులు చేపట్టారు. ఒక పక్కన కాలనీల నుంచి వస్తున్న నీరు, ఇంకో పక్క వర్షం దెబ్బకు పనులు చేయడానికి వీఎంసీ సిబ్బంది నానా ఇబ్బంది పడుతున్నారు. ఇటీవల ఈ రోడ్డుకు మొదట్లో పంటకాల్వ రోడ్డులో యూజీడీ కుంగటంతో అక్కడ రోడ్డును తవ్వి మరమ్మతులు చేశారు. ఇపుడు ఇక్కడ మోటారు పెట్టి యూజీడీ నీటిని తోడి పక్కనే ఉన్న సైడు కాల్వలోకి పంపుతున్నారు. ఈ నీరు పంటకాల్వ రోడ్డుమీదుగా ఆటోనగర్ వైపు మళ్లించారు. పంప్ హౌస్‌లో ఉన్న నాలుగు మోటార్లలో 80,40 హెచ్‌పీ మోటార్లు రెండు మాత్రమే పనిచేస్తున్నాయి.

కనిపించని సైడు కాల్వలు

ఇదిలా ఉంటే భాగయ్య బజారు నుంచి పాత పోస్టాఫీసు రోడ్డు వరకు ఉన్న అన్ని రోడ్లలో సైడు కాల్వలు కనిపించడం లేదు. జనం చేసిన తప్పులు కొంత, సైడు కాల్వలను పూడ్చకుండా చూడాల్సిన శానిటరీ అధికారుల నిర్లక్ష్యం వల్ల భారం యూజీడీ మరమ్మతులు చేసే కార్మికుల మీద పడుతోంది.

పైపు లైన్ల సామర్థ్యం సరిపోక

ఈప్రాంతంలో ఎపుడో దశాబ్దాల క్రితం వేసిన యూజీడీ లైను పెరిగిన ఇళ్ల సంఖ్యకు సరిపోవడం లేదు. దానయ్యవీధి, అచ్చమ్మవీధి వంటి చోట ఆరేళ్ల క్రితం కొత్త లైను వేశారు. కాకపోతే 8 అంగుళాల పైపు వేయడంతో దీని సామర్థ్యం సరిపోవడం లేదు. వీధుల్లో నుంచి పంప్‌హౌస్‌కు వెళ్లే ప్రధాన లైన్ 13 అంగుళాల పైపులు వేశారు. ఎలుకలు , రోడ్డు కుంగిన చోట మట్టి ఈ పైపుల్లోకి చేరి తరుచుగా సమస్య వస్తోంది.

● అధికారులు ఇప్పటికైనా స్పందించి యుద్ధ ప్రాతిపాదికన సైడు కాల్వలను క్లియర్ చేయించాల్సిన అవసరం ఉంది. లేకపోతే మరికొన్ని రోజులు ఇలానే ఉంటే దోమల దెబ్బకు విషజ్వరాలు ప్రబలే అవకాశం ఉంది.

సైడ్ డ్రెయిన్లు లేక.. రోడ్డుపైనే వర్షపు నీరు

రామలింగేశ్వరనగర్: నివాసాల మధ్యనే వర్షపు నీరు నిలిచి పోతుందని పటమట అంబేడ్కర్ నగర్, సత్యనారాయణ నగర్ కాలువ గట్టు వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రధానంగా సైడ్ డ్రెయిన్లు లేక పోవడం వలన రోడ్డుపై వర్షపు నీరు నిలిచి ఉండడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. చిన్న వంతెన సెంటర్ నుంచి పటమట లంకకు వెళ్లే వాహనదారులు ఈ ఇరుకు రోడ్డులోనే వెళుతున్న సమయంలో వర్షపు నీరు చిందీ పాదచారులపై పడటంతో గొడవలకు దారి తీస్తోందంటున్నారు. సంబంధిత అధికారులు స్పందించి సైడ్ డ్రెయిన్లు నిర్మించేలా చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.





కాలువ గట్టు ప్రాంతంలో, సత్యనారాయణ నగర్‌లో నిలిచిన వర్షపు నీరు

కల్తీ మద్యం అరికట్టేందుకు పటిష్టమైన చర్యలు



యాప్‌తో మద్యం బాటిల్‌ను చెక్‌చేస్తున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, అధికారులు

భారతీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కల్తీ మద్యం సరఫరాను అరికట్టి పెద్ద కంపెనీలు తయారుచేసిన నాణ్యమైన మద్యాన్ని, మద్యం తాగే వారికి అందుబాటులోకి తీసుకురావడానికి కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని తూర్పు

యాప్‌ను ఆవిష్కరించిన ఎమ్మెల్యే గద్దె

ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం తూర్పు పరిధిలోని 10వ డివిజన్ పంట కాలువ రోడ్డులో ఉన్న ఎస్‌వీడి వైన్స్‌లో విక్రయిస్తున్న మద్యాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ స్వయంగా పరిశీలించారు. కల్తీ మద్యాన్ని అరికట్టడానికి కూటమి ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిన యాప్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కల్తీ మద్యాన్ని తయారుచేయడానికి వీలులేకుండా తమ ప్రభుత్వం పటిష్టమైన చర్యలు తీసుకుందన్నారు. మద్యం సీసాపై క్యూఆర్ కోడ్‌ను ఆ యాప్ ద్వారా స్కాన్ చేస్తే ఆ మద్యం కల్తీనా, ఒరిజనలా అనే విషయం తెలుస్తుందన్నారు. స్పిరిట్‌తో మద్యాన్ని తయారుచేసి ప్రజల ప్రాణాలతో ఆటలు ఆడిన వైసీపీ నాయకులు ఇప్పుడు కల్తీ గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. కార్పొరేటర్ ముమ్మనేని ప్రసాద్, ఎక్సైజ్‌శాఖ సీఐ పెద్దిరాజు, లా అండ్ ఆర్డర్ ఎస్ఐ వి.భారతి, పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు

అర్హులైన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా చూస్తున్నామని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. శుక్రవారం అశోక్‌నగర్‌లోని తూర్పు ఎమ్మెల్యే కార్యాలయం దగ్గర నియోజకవర్గంలోని పేద కుటుంబానికి చెందిన కొత్తపల్లి కోటేశ్వరరావుకు రూ.25వేలు విలువ చేసే తోపుడు బండిని ఎమ్మెల్యే గద్దె అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందని వారికి తన సొంత నిధులతో సహాయం చేస్తూ వారికి అండగా ఉంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో నూతి శ్రీను, కొడే సాంబశివరావు, యలమంచిలి రవీంద్ర, తదితరులు పాల్గొన్నారు.

హోం గార్డులకు హెల్మెట్‌లు అందజేత



హోం గార్డులకు హెల్మెట్ అందజేస్తున్న సీపీ రాజశేఖరబాబు

విజయవాడ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆప్ సబ్‌కి ఆవాజ్ స్వచ్ఛంద సంస్థ సమకూర్చిన హెల్మెట్లను పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖర బాబు నగరంలోని 120 మంది హోం గార్డ్‌లకు కమిషనరేట్ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆ సంస్థ హోం గార్డులకు హెల్మెట్‌లను సమకూర్చింది. సంస్థ ప్రతినిధులు వి.శివకుమార్, బి.కిరణ్‌కుమార్, కె.ఈశ్వరరావు, డాక్టర్ రాధామాధవిలను సీపీ సత్కరించి అభినందించారు. డీసీపీ కె.జి.వి.సరిత, హోంగార్డ్స్ కమాండెంట్ టి.ఆనందరావు, ఏఆర్ ఏడీసీపీ కె.కోటేశ్వరరావు, డీఎస్పీ ఎన్.వి.రమణ, ఆర్ఐ సుధాకరరెడ్డి పాల్గొన్నారు.



మొదటి బహుమతి సాధించిన పీబీ సిద్ధార్థ విద్యార్థులు

జానపద నృత్య, గీతాల పోటీల్లో
పీబీ సిద్ధార్థ విద్యార్థులకు ప్రథమ బహుమతులు

మొగల్రాజపురం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర యువజన సర్వీస్‌ల శాఖ నిర్వహించిన జిల్లాస్థాయి యువజనోత్సవాల్లో పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల విద్యార్థులు ప్రతిభ చూపడంతో పాటు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారని కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం కేబీఎన్ కళాశాలలో జరిగిన పోటీలలో జానపద నృత్యంలో విగ్నేష్ కార్తీక్ బృందం, జానపద గీతాల పోటీల్లో సింధురాగేశ్వరీ బృందం మొదటి బహుమతి గెలుచుకున్నారని వీరు రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. వీరు విజయవాడ సబ్ కలెక్టర్ కావూరి చైతన్య, జిల్లా యువజన సంక్షేమ అధికారి యు. శ్రీనివాసరావు చేతుల మీదుగా బహుమతులు, ప్రశంసా పత్రాలు అందుకున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థులను డైరెక్టర్ వేమూరి బాబూరావు, డీన్ రాజేష్, కల్చరల్ కమిటీ కో ఆర్డినేటర్ జయప్రకాష్, అభినందించారు.

సీసీ కెమెరాల ఏర్పాటుకు చందన బ్రదర్స్ చేయూత



సీపీ రాజశేఖరబాబుకు చెక్కు అందజేస్తున్న చందన బ్రదర్స్ మేనేజర్ మల్లిఖార్జునరావు

విజయవాడ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): సురక్షా కార్యక్రమంలో భాగంగా నగరంలోని కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలోని ప్రాంతాల్లో సీసీ కెమెరాలను ఏర్పాటు చేసేందుకు చందన బ్రదర్స్ నిర్వాహకులు రూ.10 లక్షలను జిల్లా పోలీస్ శాఖకు వితరణగా ఇచ్చారు. ఈ నగదు చెక్కును పోలీస్ కమిషనరేట్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ ఎస్.వి.రాజశేఖరబాబుకు చందన బ్రదర్స్ మేనేజర్ నూలు మల్లిఖార్జునరావు శుక్రవారం అందజేశారు.

ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ నేరాల దర్యాప్తును సీసీ కెమెరాలు సులభతరం చేస్తాయన్నారు. కృష్ణలంక పోలీస్ స్టేషన్ పరిధిలో సీసీ కెమెరాల ఏర్పాటుకు నగదు సాయం అందించిన చందన బ్రదర్స్ నిర్వాహకులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సౌత్ ఏసీపీ డి.పావన్‌కుమార్, కృష్ణలంక స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఎస్.ఎస్.వి. నాగరాజు పాల్గొన్నారు.



నీరు పోయేదెలా?

7వ డివిజన్ పరిధి ఉడ్‌పేటలోని కనుమూరి దేవానందం రోడ్డు ,శాంతినగర్ రెండో లైన్ కలిసే చోట శ్రుతి స్కిన్ క్లినిక్ వద్ద వర్షం నీరు నిలిచి వాహన దారులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. నీరు పోయే మార్గం లేక వర్షం వచ్చిన ప్రతిసారి రోజుల తరబడి నీరు నిలుస్తోంది. దీంతో భరించలేని దుర్గంధం వెదజల్లుతోంది.

-మొగల్రాజపురం

గుర్తింపు కార్డుల జారీకి సర్వే

- టౌన్ వెండింగ్ కమిటీ సభ్యులతో కమిషనర్ సమీక్ష



మాట్లాడుతున్న వీఎంసీ కమిషనర్ ధ్యానచంద్ర

కార్పొరేషన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వీఎంసీ కమిషనర్, టౌన్ వెండింగ్ కమిటీ ఛైర్మన్ ధ్యానచంద్ర శుక్రవారం ప్రధాన కార్యాలయంలోని తన చాంబర్‌లో పట్టణ వీధి విక్రయదారుల కమిటీ సమావేశం నిర్వహించారు. సమావేశంలో సభ్యులు వీధివిక్రయదారులకు సంబంధించిన అనేక అంశాలపై చర్చించి తీర్మానాలు చేశారు. విక్రయదారులందరూ గుర్తింపు కార్డు, వెండింగ్ సర్టిఫికేట్‌లను పొందాల్సి ఉందన్నారు. వీఎంసీ మెప్మా రిసోర్స్ పర్సన్స్ ద్వారా సర్వే చేయనున్నట్టు తెలిపారు. సర్వేలో నమోదైనవారు గుర్తింపు కార్డు, వెండింగ్ సరిఫికెట్ కోసం రూ.200 చెల్లించాలని కమిటీ ఛైర్మన్ తెలిపారు. పట్టణంలో గ్రీన్, అంబర్, రెడ్ జోన్‌లుగా మార్కింగ్ చేయాలన్నారు. పీఎం స్వానిధి 2.0 కార్యక్రమం కింద ప్రతి నెల లోక కల్యాణ మేళా నిర్వహించి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలన్నారు. అర్హులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయించాలని తీర్మానం చేశారు. సమావేశంలో కార్పొరేటర్ వల్లూరి ఎన్‌డీఎస్ మూర్తి, చీఫ్ మెడికల్ హెల్త్‌ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, టౌన్ వెండింగ్ కమిటీ కన్వీనర్ ప్రాజెక్టు ఆఫీసర్ (యూసీడీ) పి.వెంకటనారాయణ, లీడ్‌డిస్ట్రిక్ట్ ఆఫీసర్ కె.ప్రియాంక, బ్రాంచ్ మేనేజర్ ఎస్.సుధాకర్, వీధి వ్యాపారులు పాల్గొన్నారు.

మోపిదేవిలో విస్తృత ఏర్పాట్లు

● నేడు నాగుల చవితి



సుబ్రహ్మణ్యేశ్వరస్వామి

మోపిదేవి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం జరిగే నాగులచవితికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. స్వామివారికి జరిగే వార్షిక మహోత్సవాలలో నాగుల చవితి ఎంతో విశిష్టమైనది. పలు ప్రాంతాల నుంచి 50 వేల మందికిపైగా భక్తులు పుట్టలో పాలుపోసేందుకు వస్తారని అధికారుల అంచనా వేశారు. సంతానం లేని వారు, వివాహం కానీ వారు నాగులచవితి పర్వదినం సందర్భంగా పుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుంటే కోరిన కోర్కెలు సిద్ధిస్తాయని భక్తుల ప్రగాఢ విశ్వాసం. తెల్లవారుజాము 2.30 గం టల నుంచే భక్తులు పుట్టలో పాలుపోసేందుకు ఆలయ అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో భక్తులకు ఏ విధమైన ఇబ్బందులు కలుగకుండా నాగపుట్ట వద్ద, స్వామివారి దర్శనం కల్పించేలా విస్తృత ఏర్పాట్లు చేశారు. ఆలయాన్ని చాందిని టెంట్లతో అలంకరించి విద్యుత్ దీపాలతో తీర్చిదిద్దారు. దేవస్థానం ఆధ్వర్యంలో భక్తులకు పులిహోర ప్రసాదం, మంచినీరు, చిన్న పిల్లలకు పాలు అందించనున్నట్లు ఈవో దాసరి శ్రీరామవరప్రసాదరావు తెలిపారు. అవనిగడ్డ డీఎస్పీ తాళ్లూరి విద్యశ్రీ ఆధ్వర్యంలో చల్లపల్లి సీఐ ఈశ్వరరావు, మోపిదేవి ఎస్సై సత్యనారాయణ ఆధ్వర్యంలో 150 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆలయ ప్రాంగణంలో భక్తుల కోసం ఏర్పాట్లు



వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ప్రతినిధులు

58 సర్జరీలకు ప్రత్యేక జీవో జారీ చేయాలి

● మంత్రి సత్యకుమార్‌కు ఆంధ్రప్రదేశ్ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ వినతి

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్ట్ అమలుచేసిన కేంద్ర ప్రభుత్వం ఆయుర్వేద వైద్యులకు అనుమతించిన 58 సర్జరీల కోసం రాష్ట్ర ప్రభుత్వం నుంచి ప్రత్యేక జీవో జారీ చేయాలని రాష్ట్ర ప్రభుత్వ మెడికల్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫీసర్స్ అధ్యక్షుడు డాక్టర్ టి.బుల్లయ్య కోరారు.

ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్‌ను సెక్రటేరియట్‌లోని ఆయన చాంబర్‌లో కలిసి ముఖ్యమైన అంశాలపై చర్చించారు. విలేజ్ క్లినిక్స్‌లో ఆయుర్వేద గ్రాడ్యుయేట్స్ నియామకం చేపట్టడంతో పాటు స్టేట్ మెడికల్ కౌన్సిల్ ఫర్ ఇండియన్ సిస్టం ఆఫ్ మెడిసిన్‌కు పాలక మండలి ఏర్పాటు చేయాలని కోరారు. ప్రభుత్వ ఆయుర్వేద కాలేజీలకు స్థలాలు కేటాయించడంతో పాటు రెగ్యులర్ మెడికల్ ఆఫీసర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు. ప్రభుత్వ ఆయుర్వేద వైద్యులకు డీడీవో అధికారులు మంజూరు చేయాలన్నారు. వీటిపై సానుకూలంగా స్పందించిన మంత్రి తగిన చర్యలు తీసుకుంటానని తెలిపారు. ఈ సమావేశంలో నేషనల్ మెడికల్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డా.వేముల భాను ప్రకాష్, డాక్టర్ వి.శ్రీధర్, డాక్టర్ రాజ్ కమలాకర్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ జి.చినరాజు పాల్గొన్నారు.

ఆక్యుపంక్చర్ డే ఉత్సవాల బ్రోచర్ ఆవిష్కరణ

కానూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): నవంబరు 1 నుంచి 16వ తేదీ వరకు జరిగే ప్రపంచ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాలను పురస్కరించుకొని శుక్రవారం జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆక్యుపంక్చర్ డే ఉత్సవాల బ్రోచర్‌ను ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన ఆక్యుపంక్చర్ విధానం విశిష్టత ప్రతి ఒక్కరు తెలుసుకోవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆక్యుపంక్చర్ సైన్స్ ప్రాక్టీషనర్ అసోసియేషన్ ఆఫ్ భారత్ (ఏఎస్‌పీఏ భారత్) ఫౌండర్ అండ్ జనరల్ సెక్రటరీ డాక్టర్ మాకాల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ముందు జాగ్రత్తలతో సురక్షిత ప్రయాణం

హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళ్తున్న స్లీపర్ బస్సులో అకస్మాత్తుగా చెలరేగిన మంటలు దావానంలా వ్యాపించి 19 మందిని బలిగొన్న ఉదంతం కలచివేస్తోంది. ఏసీ బస్సుల్లో అగ్ని ప్రమాదాలు జరిగితే ప్రాణ నష్టం తీవ్రంగా ఉంటుంది. అగ్నిప్రమాదాల నుంచి రక్షణకు అనుగుణంగా బస్సుల నిర్మాణం లేకపోవడం వల్లనే ఈ తరహా నష్టాలు సంభవిస్తున్నాయి. అగ్నిమాపక, రవాణా శాఖల నిబంధనలను అమలు చేయకపోతే ఆ బస్సులు ప్రాణాంతకమౌతాయి.

(ఆంధ్రజ్యోతి-విజయవాడసిటీ/ఇబ్రహీంపట్నం)



విజయవాడ నుంచి ఏసీ స్లీపర్ బస్సులు ప్రతిరోజూ కొన్ని వందల సంఖ్యలో దూర ప్రాంతాలకు వెళుతున్నాయి. హైదరాబాద్ , బెంగళూరు, చెన్నై, తిరుపతి, విశాఖపట్నం, ఛత్తీస్‌ఘడ్ తదితర ప్రాంతాలకు వెళుతుంటాయి. వీటిల్లో అగ్ని భద్రత ప్రామాణికాలతో ఎన్ని బస్సులు నడుస్తున్నాయనేది ప్రశ్నార్థకమే. కాలంతో పాటే వేగంగా పరుగులు తీసే ఈ బస్సులు అగ్ని భద్రత ప్రామాణికాలు పాటిస్తే సమాజం సురక్షితంగా ఉంటుంది.

బస్సుల యజమానులు ఏం చేయాలంటే..

ప్రయాణికుల భద్రతే ప్రధాన ప్రాధాన్యతగా బస్సుల యజమానులు నిత్యం గుర్తుంచుకోవాలి. బస్సుల్లో అగ్ని నిరోధక నిర్మాణం, అగ్ని గుర్తించే వ్యవస్థల ఏర్పాటు, ప్రమాదం జరిగితే అత్యవసరంగా బయటపడే మార్గాలు, డ్రైవర్, సహాయకులకు శిక్షణ, నియమిత పరిశోధన, నిర్వహణ వంటి వ్యవస్థలు రూపొందిస్తే పెను ప్రమాదం నుంచి రక్షణగా ఉంటాయని అగ్నిమాపక అధికారులు తెలియజేస్తున్నారు. బస్సు బాడీ నిర్మాణం చేసేటప్పుడే అగ్ని నిరోధిక మెటీరియల్ ఉపయోగించాలి. విద్యుత్ వైరింగ్ పూర్తిగా హైగ్రేడ్ ఇన్సులేషన్‌తో ఉండాలి. ఇంధన ట్యాంక్, ఇంధన లైన్‌ల డిజైన్ రక్షితంగా ఉండాలి. అగ్నిని గుర్తించేందుకు స్మోక్ డిటెక్టర్‌లు, హీట్ సెన్సార్‌లతో పాటు ప్రారంభ దశలోనే మంటలను గుర్తించేందుకు ఆటోమేటిక్ సిస్టమ్ ఉండాలి. ఊహించని రీతిలో చెలరేగిన అగ్నిని నిరోధించేందుకు ఆటోమేటిక్ ఫైర్ సప్రెషన్ సిస్టమ్ ఇంజన్ బే, ఇంధన ట్యాంక్ ప్రాంతంలో ఉండాలి. మాన్యువల్‌గా మంటలను ఆర్పే ఎక్స్టింగ్విషర్లు బస్సుల్లో అందుబాటులో ఉండాలి. బస్సు కింద ఫైర్ సప్రెషన్ సిస్టమ్ ఇన్‌స్టాల్ చేయాలి. మంటలు చెలరేగితే అత్యవసరంగా బయటపడేందుకు సరైన స్థానాల్లో నిష్క్రమణ ద్వారాలు, సులభంగా బయటకు తోయగలిగే అత్యవసర విండోస్ ఉండాలి. బస్సుల్లో జరిగే అగ్నిప్రమాదాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలు డ్రైవర్‌కు, సహాయకులకు కచ్చితంగా తెలిసి ఉండాలి. ప్రమాద సమయంతో ఏ విధంగా ప్రవర్తించాలనే అంశాలపై వారికి శిక్షణ ఇవ్వాలి. విద్యుత్ వ్యవస్థలను, ఫైర్ ఎక్స్టింగ్విషర్లను, అన్ని భద్ర త వ్యవస్థలను ఎప్పటికప్పుడు తనిఖీ చేస్తుండాలి.

బస్సు ప్రయాణికులు ఏం చేయాలంటే..

ఫైర్ ఫైర్ అని గట్టిగా అరవాలి. మిగిలిన ప్రయాణికులకు ప్రమాద సమాచారాన్ని అం దించి అప్రమత్తం చేయాలి. డ్రైవర్‌కు తెలియజేసి వెంటనే బస్సును ఆపి అన్ని ద్వారాలు తెరిచేలా చూడాలి. భయపడి గందరగోళం చేయకూడదు. ధైర్యంగా ఉండాలి. దగ్గర్లో ఉన్న బయటకు వెళ్లే ద్వారాన్ని ఉపయోగించాలి. అత్యవసర కిటికీలను బ్రేక్ చేయాలి. ముందు వ్యక్తి బయటకు దూకిన తర్వాత మీరు దూకండి. దూకేటప్పుడు రెండు చేతులతో ముఖాన్ని కప్పుకోండి.

ప్రమాదం నుంచి బయటపడాలంటే..

ముఖాన్ని దుప్పటి లేదా బట్టతో ముఖాన్ని కప్పుకోవాలి.బయటపడే మార్గం తెలుసుకోండి. బస్సులో ఎక్కడ ఎగ్జిట్లు ఉన్నాయో ప్రయాణం ప్రారంభించే ముందే గమనించండి. సామాన్ల కంటే జీవితం ముఖ్యం కనుక వాటిని వదిలేయండి. బస్సు నుంచి సురక్షితమైన దూరంలోకి వెళ్లండి. బయట పడిన తర్వాత బస్సు నుంచి కనీసం 50 అడుగుల దూరంలోకి వెళ్లండి. మీరు సురక్షితంగా ఉంటే ఇతరులకు సహాయం చేయండి. ముఖ్యంగా వృద్ధులు, పిల్లలకు సాయం చేయండి. శాంత మనస్సుతో వేగంగా ప్రతి స్పందించడం ద్వారా మీ జీవితాన్ని కాపాడుకోవచ్చు. ప్రయాణం ప్రారంభించే ముందే అత్యవసర ద్వారాల మార్గాలను గుర్తించడం ఎప్పుడూ మంచిది.

బస్సు ప్రమాద దుర్ఘటనపై మంత్రి కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల దిగ్భ్రాంతి

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందని గనులు, భూగర్భవనరులు, ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. కర్నూలు జిల్లా వింజమూరు మండలంలో ఒకే కుటుంబంలో నలుగురు మృతి చెందడంపై కొల్లు రవీంద్ర, ఆర్టీసీ చైర్మన్ కొనకళ్ల నారాయణరావు తీవ్ర విచారం వ్యక్తం చేశారు. హైదరాబాద్ నుంచి బెంగళూరు వెళుతున్న ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు చిన్నటేకూరు వద్ద బైక్‌ను ఢీకొని మంటలు చెలరేగి బస్సు దగ్ధమైందన్నారు. ఈ ఘటనలో పలువురు ప్రాణాలు కోల్పోవడం దురదృష్టకరమని కొల్లు రవీంద్ర, కొనకళ్ల నారాయణరావు సంతాపం వ్యక్తం చేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకునేందుకు ప్రభుత్వం అన్ని విధాలా సాయం అందిస్తుందన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న మాదిగాని గురునాథం

మూడు రాజధానుల మ్యాచ్ ఫిక్సింగ్ సూత్రధారి కొలికపూడి

● నన్ను జగన్ దగ్గరకు పంపిందే కొలికపూడి

● ఎంపీతో పాటు తనపై చేసిన వ్యాఖ్యలను ఖండించిన మాదిగాని

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మూడు రాజధానుల ఉద్యమానికి ప్రణాళిక రచించి, వై.ఎస్.జగన్ దగ్గరకు తనను తీసుకెళ్లి మూడు రాజధానుల ఉద్యమం చేస్తాడని పరిచయం చేసింది తిరువూరు ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావేనని టీడీపీ నాయకుడు మాదిగాని గురునాథం సంచలన వ్యాఖ్యలు చేశారు. ఎంపీ కేశినేని శివనాథ్‌తో పాటు తనపై ఎమ్మెల్యే కొలికపూడి చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ మాదిగాని గురునాథం శుక్రవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో మీడియా సమావేశం నిర్వహించారు.

మూడు రాజధానుల ఉద్యమం తనను చేయమని ప్రేరేపించిందే ఎమ్మెల్యే కొలికపూడి అని అన్నారు. అమరావతి ఉద్యమం ఆయన చేస్తానని, ఇద్దరిలో ఎవరు రాజకీయంగా లబ్ధి పొందిన సహకారం అందించుకుందామని ఒప్పించి మూడు రాజధానుల ఉద్యమం ప్రారంభానికి ముందు ప్రణాళిక రచించారని ఆరోపించారు. మూడు రాజధానుల వల్ల రాష్ట్రానికి ఎలాంటి ప్రయోజనం లేదనే నిజం ఆలస్యంగా గ్రహించడంతో ఎన్నికల సమయంలో కేశినేని శివనాథ్ నాయకత్వంలో నారా లోకేష్ సమక్షంలో టీడీపీలో చేరి వైసీపీని ఓడించేందుకు కృషి చేశానని చెప్పారు.

ఎన్నికల సమయంలో ఎంపీ చిన్ని ఆదేశాల మేరకు తిరువూరు నియోజకవర్గంలో కొలికపూడితో కలిసి ఎన్నికల ప్రచారం, రోడ్‌షోలో పాల్గొన్నానన్నారు. తన స్వార్థ ప్రయోజనాల కోసం ఎవరినైనా వంచించే లక్షణం ఉన్న వ్యక్తి ఎమ్మెల్యే కొలికపూడి అన్నారు. ఎంపీ చిన్ని అవినీతి, అక్రమాలకు పాల్పడ్డారని కొలికపూడి ఆరోపించడం దెయ్యాలు వేదాలు వల్లించినట్టు ఉందన్నారు. ఎంపీ చిన్నిని నియోజకవర్గంలో అడుగు పెట్టనివ్వనని అనడం ఎమ్మెల్యే కొలికిపూడి అహంకారానికి నిదర్శనమన్నారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి బాటలు వేస్తాడని ఎమ్మెల్యేగా గెలిపిస్తే తన స్వార్థం, స్వలాభం కోసమే పని చేస్తున్నాడని గురునాథం ఆరోపించారు. ఎన్నికల ముందు పేదవాడినంటూ డ్రామాలు ఆడిన కొలికపూడికి ఇప్పుడు రోలెక్స్ వాచీ, ఫార్చ్యూన్ కార్లు ఎక్కడి నుంచి వచ్చాయో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో టీడీపీ ఎస్సీ రాష్ట్ర అధికార ప్రతినిధి పరిశపోగు రాజేష్(దళిత రత్న), టీడీపీ నాయకులు డాక్టర్ సంకే విశ్వనాథం, నరసింహ చౌదరి, విజయవాడ అర్బన్ ఎస్సీ సెల్ మాజీ అధ్యక్షుడు జీవీ నరసింహారావు, పీతా బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

రౌడీషీటర్‌కు నోటీసు ఇవ్వడానికి 10 మంది పోలీసులు!

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : అతడు కరుడుగట్టిన గ్యాంగ్‌స్టర్ కాదు. అలాగని మోస్ట్ వాంటెండ్ క్రిమినల్ కాదు. ఓ రౌడీషీటర్. అతడికి నోటీసులు ఇవ్వడానికి పది పోలీసులు వెళ్లాల్సి వచ్చింది. ఈ ఘటన శుక్రవారం జరిగింది. గుణదల కార్మెల్‌నగర్‌కు చెందిన దేవరపల్లి కిషోర్‌పై మాచవరం పోలీస్‌స్టేషన్‌లో రౌడీషీట్ ఉంది. తర్వాత అతడు నివాసం ఉండే గుణదల పీఎస్‌కు దీన్ని బదిలీ చేశారు. 2022లో ఓ మహిళపై దాడి చేసిన కేసులో కిషోర్ నిందితుడు. ఈ కేసులో విచారణకు స్టేషన్‌కు రావాలని మాచవరం పోలీసులు పలుమార్లు పిలి చినా రాలేదు. దీనికి సంబంధించి పలు మార్లు 41ఏ నోటీసు ఇవ్వాలని పోలీసులు ప్రయత్నించినా ఏదో ఒక వివాదం చేసే వాడు. చివరికి పది మంది పోలీసులు ఈ నోటీసు ఇవ్వడానికి కిషోర్ ఇంటికి వెళ్లారు. కానిస్టేబుళ్లు వెళ్లిన ప్రతిసారి ఏదో ఒక వివాదం చేస్తుండడంతో పోలీసులు ఇలా వెళ్లాల్సి వచ్చింది.

మాతృసంస్థకు ఆర్ అండ్ బీ ఈఈ సిద్ధయ్య

విజయవాడ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ(శాప్) ఇంజనీర్‌గా పని చేస్తున్న ఎం.సిద్ధయ్యను మాతృ సంస్థ ఆర్ అండ్ బీకి తిరిగి నియమిస్తూ ఆర్ అండ్ బీ రాష్ట్ర ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి ఎం.టి.కృష్ణబాబు శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఆర్ అండ్ బీ మైలవరం డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈగా పని చేసే సిద్ధయ్యను ఆడుదాం ఆంధ్రా క్రీడల నేపథ్యంలో గత ప్రభుత్వం డెప్యూటేషన్‌పై శాప్‌లో బాధ్యతలు అప్పగించింది. అప్పటి నుంచి ఆయన అక్కడే విధులు నిర్వర్తిస్తున్నారు. ఈ విషయం తెలుసుకున్న ఉన్నతాధికారులు సిద్ధయ్యను తిరిగి మైలవరం డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు ఇచ్చారు. వెంటనే ఇన్‌చార్జ్ ఈఈగా ఉద్యోగ బాధ్యతలు తీసుకోవాలని ఉత్వర్వుల ద్వారా ఆదేశాలు జారీ చేశారు.

సంస్థ పురోభివృద్ధిలో భాగస్వాములు కావాలి

● హ్యాండీక్రాఫ్ట్స్ చైర్మన్ హరిప్రసాద్

గాంధీనగర్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): ఏపీ హ్యాండీక్రాఫ్ట్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పురోభివృద్ధిలో భాగస్వామ్యం కావాలని సంస్థ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్ కోరారు. కార్పొరేషన్ బోర్డు సమావేశం గాంధీనగర్‌లోని ఏపీహెచ్‌డీసీ లేపాక్షి కార్యాలయంలో శుక్రవారం జరిగింది. రాష్ట్ర హస్తకళల అభివృద్ధి, ప్రోత్సాహం, కళాకారుల సంక్షేమానికి చేపట్టాల్సిన చర్యలు తదితర ప్రధాన అంశాలపై చర్చించారు. మార్కెటింగ్ అభివృద్ధి, కళాకారుల ప్రోత్సాహం, సంస్థ అభివృద్ధికి ప్రణాళికలపై సమీక్షించారు. చైర్మన్ హరిప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో వైస్ చైర్మన్ అండ్ ఎండీ ఎం.విశ్వ, బోర్డు సభ్యులు పాల్గొన్నారు. డైరెక్టర్లుగా నూతనంగా నియమితులైన ఆర్.డి.ఎస్.ప్రసాద్, గంగల్ల జీవిత, పొగాకుల సోమశేఖర్, పుట్టం శ్రీనివాసులరెడ్డి సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

మంగినపూడి, హంసలదీవి బీచ్‌లకు పర్యాటకులు రావొద్దు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తుపాను హెచ్చరికల దృష్ట్యా శనివారం మంగినపూడి బీచ్‌కు పర్యాటకులు రావొద్దని జిల్లా పర్యాటక శాఖాధికారి రామలక్ష్మణ తెలిపారు. ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా పర్యాటకులు బీచ్‌కు రావొద్దన్నారు. మంగినపూడి బీచ్‌లో మెరైన్ పోలీసులతో గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారని, పర్యాటకులన అనుమతించడం లేదని వివరించారు.

కోడూరు : ప్రముఖ పర్యాటక కేంద్రం హంసలదీవి బీచ్ గేట్లు మరో రెండు రోజులపాటు మూసివేస్తున్నట్లు ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్ నాగమణి ఒక ప్రకటనలో తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాలతో పాలకాయితిప్ప వద్ద ఉన్న బీచ్ గేట్లు ఈ నెల 25, 26 తేదీల వరకు మూసి ఉంటాయని తెలిపారు. పర్యాటకులు హంసలదీవి బీచ్ వద్దకు రావద్దని తెలిపారు.

తపసిపూడి వద్ద రోడ్డు ప్రమాదం

ఇద్దరు యువకుల సహా 13 మందికి గాయాలు



ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : తపసిపూడి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో 11 మంది మహిళలు, బైక్‌పై వెళ్తున్న ఇద్దరు గాయపడ్డారు. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ అందించిన వివరాలిలా ఉన్నాయి. జ్యూయలరీ పార్కులో రోల్డుగోల్డు పనులు చేసుకుని స్వగ్రామం తాళ్ళపాలెం వెళ్తున్న సమయంలో విజయవాడ రాజరాజేశ్వరిపేట, సింగ్ నగర్‌లకు చెందిన నారగాని సాయిగణేష్, శ్రీనివాస్ మంగినపూడి బైక్‌పై తిరిగి వెళుతూ తపసిపూడి వద్ద ఆటోను ఢీకొన్నారు. దీంతో ఆటో బోల్తా పడింది. ఆటోలో ప్రయాణిస్తున్న డి.కౌసల్య, ఎం.శ్రీలత, టి.విజయ, ఉమాలక్ష్మి, రమ్య, టి.లక్ష్మి, శ్రావణి, ఆటో డ్రైవర్ పరసా శ్రీనివాస్, వై.నాగమణి, పద్మశ్రీ, సిహెచ్. భవానీ గాయపడ్డారు. బైక్‌పై వెళుతున్న సాయిగణేష్, శ్రీనివాస్‌లు గాయాలకు గురయ్యారు. గాయాలకు గురైన వారిని జిల్లా ప్రభుత్వ సర్వజన ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. రూరల్ ఎస్ఐ సత్యనారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఆటోలో సామర్థ్యానికి మించి కూలీలను ఎక్కించడం గమనార్హం.

కృష్ణా డీఎంహెచ్‌వోగా యుగంధర్ బాధ్యతల స్వీకారం



మచిలీపట్నం టౌన్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : కృష్ణాజిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిగా టి.యుగంధర్ శుక్రవారం బాధ్యతలుస్వీకరించారు. అనంతపురం జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారిగా పనిచేస్తున్న యుగంధర్ పదోన్నతిపై కృష్ణాజిల్లా డీఎంహెచ్‌వోగా వచ్చారు. ఈ సందర్భంగా యుగంధర్‌ను ప్రభుత్వ వైద్యులు డాక్టర్ భాస్కరరెడ్డి, డాక్టర్ భానుమూర్తి మర్యాద పూర్వకంగా కలసి అభినందించారు.

రైల్వే పెండింగ్ ప్రాజెక్టులపై దృష్టి సారించండి : కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ



విజయవాడ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి) : విజయవాడ రైల్వే డివిజన్‌లోని పెండింగ్ ప్రాజెక్ట్ పనులు త్వరితగతిన పూర్తి చేసేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని రైల్వే అధికారులను కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ ఆదేశించారు. విజయవాడ రైల్వే స్టేషన్‌లో డీఆర్ఎం మోహిత్ సోనాకియా, ఇతర అధికారులతో మంత్రి శుక్రవారం భేటీ అయ్యారు. నరసాపురం-కోటిపల్లి రైల్వే లైన్ పనులు ఆలస్యమవడానికి కారణాలను డీఆర్ఎంను అడిగి తెలుసుకున్నారు. మచిలీపట్నం-నరసాపురం రైల్వే లైన్ పనుల ప్రస్తుత స్థితి, అమృత్ స్టేషన్ పథకం ద్వారా భీమవరం, నరసాపురం, తాడేపల్లిగూడెం రైల్వే స్టేషన్లలో జరుగుతున్న పనుల పురోగతి, ఆధునిక సదుపాయాల కల్పనకు అదనపు నిధులు మంజూరు కోరుతూ తాను చేసిన ప్రతిపాదనలపై చర్చించారు. వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌తో పాటు పలు ఎక్స్‌ప్రెస్ రైళ్లకు తాడేపల్లిగూడెంలో, శేషాద్రి ఎక్స్‌ప్రెస్‌కు అత్తిలి స్టేషన్‌లో హాల్ట్ కల్పించాల్సిన ఆవశ్యకతను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. నరసాపురం-అరుణాచలం ఎక్స్‌ప్రెస్‌ను పూర్తి స్థాయిలో రెగ్యులర్ చేయడం, నరసాపురం-వారణాసీ ఎక్స్‌ప్రెస్ రైలు సౌకర్య కల్పింపడంపైనా చర్చించారు.



ఏఎంసీ చైర్మన్ల సమావేశంలో మాట్లాడుతున్న ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్

మార్కెట్ కమిటీలకు నిధులు మంజూరు చేయాలి

ఉయ్యూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): వ్యవసాయ మార్కెట్ కమిటీలకు ప్రభుత్వం నిధులు మంజూరు చేయాలని మచిలీపట్నం పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలోని ఏఎంసీ చైర్మన్లతో జరిగిన సమావేశంలో తీర్మానించారు. ఉయ్యూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో శుక్రవారం జరిగిన ఏఎంసీ చైర్మన్ల సమావేశంలో నిధులు, ఇతర అంశాలకు సంబంధించి ఏకగ్రీవంగా తీర్మానించినట్టు ఉయ్యూరు ఏఎంసీ చైర్మన్ కొండా ప్రవీణ్‌కుమార్ తెలిపారు. రైతులకు అండగా ఉండేలా ఎరువులు, వ్యవసాయ ఉత్పత్తుల రవాణాకు డొంక రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని, రైతు బజార్ల నిర్వహణలో భాగస్వామ్యం ఉండాలని, మార్కెట్ కమిటీల ఆదాయవ్యయాల్లో స్వయం ప్రతిపత్తి ఉండాలని తీర్మానించినట్టు తెలిపారు. చైర్మన్లకు జిల్లా పరిధిలో ప్రభుత్వ కార్యక్రమాల్లో ప్రాధాన్యత ఉండాలని కోరామన్నారు. రూ.5 లక్షల లోపు నిధులు నామినేషన్ పద్ధతిలో ఇచ్చేలా చర్చించామన్నారు. ఎమ్మెల్యేలు, వ్యవసాయశాఖల ద్వారా సీఎం, డిప్యూటీ సీఎంల దృష్టికి తీసుకువెళ్లాలని తీర్మానించామన్నారు. ఏఎంసీల చైర్మన్లు అన్నే ధనకోటేశ్వరరావు, గూడవల్లి నరసింహారావు, తోట కనక దుర్గ, సీహెచ్ రవికుమార్, పొట్లూరి రవికుమార్, కె. వెంకటదుర్గాప్రసాద్,ఒడుగు తుల సీరావు, దోనేపూడి శివరామయ్య, జన్నుశోభన్ బాబు, కొల్లూరి వెంకటేశ్వరరావు సమావేశానికి హాజరయ్యారు.

ఆకాంక్షిత బ్లాకుల్లో సమగ్రాభివృద్ధికి కృషి



అంగన్వాడీ పిల్లలతో అశోక్‌బాబు, కలెక్టర్ జి.లక్ష్మీశ, బృందాన్ని సత్కరిస్తున్న కార్యదర్శి బసవలింగేశ్వరావు

ఇబ్రహీంపట్నం / జి.కొండూరు, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలను పారదర్శకంగా, జవాబుదారీతనంతో అమలు చేస్తూ సమష్టి కృషితో ఆకాంక్షిత బ్లాకుల్లో సమగ్రాభివృద్ధికి కృషి చేస్తున్నట్లు నేషనల్ వాటర్ మిషన్ (ఎన్‌డబ్ల్యుఎం) డైరెక్టర్, కేంద్ర ప్రభారీ అధికారి నేలపట్ల అశోక్‌బాబు తెలిపారు. ఇబ్రహీంపట్నం మండలం కాచవరంలోని ఆయుష్మాన్ ఆరోగ్య మందిర్‌ను జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశతో కలిసి శుక్ర వారం ఆయన సందర్శించి వైద్య సేవలను తెలుసుకున్నారు. సేంద్రియ వ్యవసాయ ఉత్పత్తులు, మునగ ఉత్పత్తులపై ప్రజలకు అవగాహన కల్పించడం ద్వారా ఆరోగ్యకరమైన జీవితాన్ని సొంతం చేసుకునేలా చూడాలని వైద్యులకు సూచించారు. జిల్లాలో హరిత విస్తీర్ణాన్ని 33 శాతానికి చేర్చేందుకు గ్రామాలవారీగా తీసుకుంటున్న చర్యలను కలెక్టర్ లక్ష్మీశ వివరించారు. కేతనకొండ అంగన్వాడీ కేంద్రాన్ని, మూలపాడు జడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించారు. కొండపల్లి బొమ్మల కళాకారులతో మాట్లాడారు. పర్యటన అనంతరం ఇబ్రహీంపట్నం ఎంపీడీవో కార్యాలయంలో అశోక్‌బాబు మీడియాతో మాట్లాడారు. 2023 నుంచి ఆ కాంక్షిత బ్లాక్ కార్యక్రమం (ఏబీపీ) అమలవుతోందన్నారు. ఎన్టీఆర్ జిల్లాలో ఇబ్రహీంపట్నం, పెనుగంచిప్రోలు బ్లాక్‌లు, మండలాలు ఉన్నాయన్నారు. తొలి విడతగా సంపూర్ణతా అభియాన్‌ను విజయవంతంగా రెండు మండలాల్లో అమలు చేశారన్నారు. ఆర్డీవో కావూరి చైతన్య, డీఈవో యూవి సుబ్బారావు, డీఎం అండ్‌హెచ్‌వో ఎం.సుహాసిని, రుక్సానా సుల్తానా బేగం, పి.శ్రీనివాస్, ఎంపీడీవో శకుంతల, తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

జి.కొండూరు మండలం చెవుటూరులోని ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను జీఐఎస్‌టీ చైర్‌పర్సన్ ఆండ్రే హాఫ్‌మాన్, రోజాలీ హాఫ్‌మాన్, పవన్ సుఖ్వో, సత్య ఎస్.త్రిపాఠి బృందం గురువారం సందర్శించారు. ప్రపంచ వ్యాప్తంగా సుస్థిరమైన ఆర్థిక వ్యవస్థ కోసం కృషి చేస్తున్న ఈ ఉన్నత స్థాయి బృందం ఏపీసీఎన్ఎఫ్ అమలు విధానం, ఫలితాలు, గ్రామీణ జీవనోపాధులపై ప్రకృతి వ్యవసాయ ప్రభావాన్ని పరిశీలన చేసింది. రైతు సాధికార సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ టి.విజయ్‌కుమార్ స్వాగతం పలికి ప్రకృతి వ్యవసాయంలో తొమ్మిది సార్వత్రిక సూత్రాలను వివరించారు. పంచాయతీ కార్యదర్శి వై.బసవలింగేశ్వరరావు ఆధ్వర్యంలో బృందానికి కొండపల్లి బొమ్మను బహూకరించి సత్కరించారు. జేడీఏ విజయకుమారి, చంద్రశేఖర్, విశ్వేశ్వరరావు, జిల్లా వ్యవసాయాధికారులు, రైతులు పాల్గొన్నారు.


బీడీఎస్ సీట్లకు రెండో దశ కౌన్సెలింగ్

● 276 సీట్ల భర్తీకి నోటిఫికేషన్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బీడీఎస్ కోర్సుల్లో మేనేజ్‌మెంట్ కోటా సీట్లకు సంబంధించి ఫేజ్-2 కౌన్సెలింగ్ నోటిఫికేషన్‌ను ఎన్టీఆర్ హెల్త్ వర్సిటీ విడుదల చేసింది. ఈ మేరకు హెల్త్ వర్సిటీ రిజిస్ట్రార్ శుక్రవారం నోటిఫికేషన్ జారీ చేశారు. నీట్‌లో అర్హత కలిగిన అభ్యర్థులు శుక్రవారం సాయంత్రం 6 గం టల నుంచి 27వ తేదీ మధ్యాహ్నం 11.30 గంటల వరకూ వెబ్ ఆప్షన్ ఎంపిక చేసుకునే అవకాశం కల్పించింది. బీడీఎస్‌లో బీ కేటగిరి మేనేజ్‌మెంట్ కోటా ఫీజు రూ.4.40 లక్షలు, ఎన్నారై కోటా ఫీజు రూ.13.20 లక్షలుగా ప్రభు త్వం నిర్ధారించింది. రాష్ట్రంలోని 14 ప్రైవేటు డెంటల్ కాలేజీల్లో బీ కేటగిరి విభాగంలో 159 సీట్లు, ఎన్ఆర్ఐ కోటా విభాగంలో 76 బీడీఎస్ సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఇవి కాకుండా మైనార్టీ కాలేజీలో 26 బీ కేటగిరి, 15 ఎన్ఆర్ఐ కోటా సీట్లు అందుబాటులో ఉన్నాయి. ఫేజ్-11 లో బీ, ఎన్ఆర్ఐ కోటా కలిపి 276 సీట్లను హెల్త్ వర్సిటీ భర్తీ చేయనుంది.

ఆంధ్రజ్యోతి
నవ్య
కుటుంబ కదంబం
శనివారం • 25 అక్టోబరు 2025

భోజన కుతూహలం



సొర చేసే మేలెంతో!

తెలుగు రాష్ట్రాల్లో ప్రాంతాల వారికి సొరకాయల రూపు మారిపోతూ ఉంటుంది. ఒక ప్రాంతంలో గుండ్రటి సొరకాయలు లభిస్తే, మరొక ప్రాంతంలో పొడవైన సొరకాయలు లభిస్తాయి. పొడవుగా ఉండే సొరకాయను 'తుంబీ' అంటారు. గుండ్రంగా కుండలా ఉండే వాటిని 'కుంభీతుంబి' అంటారు. నేలబారున పాకి పెరిగిన వాటిని 'భూతుంబీ' అంటారు. వీటి గుణాలన్నింటినీ 'భోజన కుతూహలం' గ్రంథం వివరించింది.

- తలనొప్పి, ఛాతిలో మంటలాంటి అనేక వ్యాధులకు సొరకాయ మంచి మందు. సలాడ్ తినే అలవాటు ఉన్నవారు... కొన్ని సొరకాయ ముక్కలను కూడా క్రమం తప్పకుండా తింటే ఈ వ్యాధులు తగ్గిపోతాయి.
- కామెర్ల వ్యాధి వచ్చిన వారికి సొరకాయ ముక్కలను ఉడికించి పెడితే తీవ్రత తగ్గుతుంది.
- జీర్ణసమస్యలతో బాధపడేవారికి సొరకాయ చారు మంచి ఔషధం. సొరకాయ పువ్వులు కూడా జీర్ణశక్తిని పెంచుతాయి. సొర పువ్వులను నేతిలో వేయించి, పచ్చడి చేసి తింటే మంచి ఫలితాలు వస్తాయి.
- అలసటగా ఉన్న సమయంలో సొరకాయ పాయసం శక్తినిచ్చే ఔషధంలా పనిచేస్తుంది.
- పేగుల్లో ఉన్న మంచి బ్యాక్టీరియాను పెంచటానికి పెరుగు ఉపకరిస్తుంది. పెరుగుతో పాటుగా సొరకాయ ముక్కలను కూడా కలుపుకొని తింటే చాలా ప్రయోజనం ఉంటుంది.
- సొరకాయకు శరీరానికి చలువ చేసే శక్తి ఉంది.

• గంగరాజు అరుణాదేవి

వంటిల్లు

కార్తికమాసం వచ్చేసింది. మనలో చాలామంది సోమవారాలు, ఏకాదశి రోజుల్లో ఉపవాసం ఉండి పూజలు చేస్తుంటారు. ఆ రోజుల్లో సగ్గుబియ్యంతో తయారుచేసిన ఉప్మా, పాయసంలాంటి వాటిని మితంగా తీసుకుంటూ ఉంటారు. ఇవి కాకుండా సగ్గుబియ్యంతో సులువుగా తయారుచేసుకోగలిగే విభిన్న వంటకాలు మీ కోసం...



ఉపవాసవేళ సగ్గుబియ్యంతో..

"సగ్గుబియ్యంతో తయారుచేసిన పదార్థాలు తీసుకోవడం వల్ల శరీరంలో పేరుకున్న అదనపు కొవ్వులు కరిగిపోతాయి. శరీరం బరువు నియంత్రణలో ఉంటుంది. కడుపులో ఆమ్లత్వం తగ్గుతుంది. మెదడు చురుకుగా పనిచేస్తుంది. గుండె జబ్బులు దరి చేరవు. రక్తపోటు తగ్గుతుంది. శరీరానికి తక్షణ శక్తి లభిస్తుంది. ముడతలు తొలగిపోయి చర్మం బిగుతుగా మారుతుంది."

సగ్గుబియ్యం బర్ఫీ



కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- ఒక కప్పు, ఫుల్ క్రీమ్ మిల్క్- అర లీటరు, చక్కెర- ఒక కప్పు, నెయ్యి- అయిదు చెంచాలు, యాలకులు- రెండు, బాదం- అయిదు, పిస్తా పలుకులు- కొన్ని, జీడిపప్పు- కొద్దిగా


తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి, అందులో సగ్గుబియ్యం వేసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. తరువాత పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. ఆపైన మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేసి జల్లించాలి. స్టవ్ మీద పాన్ పెట్టి, దానిలో నెయ్యి వేసి కరిగించాలి. అందులో సగ్గుబియ్యం పిండి వేసి బాగా కలుపుతూ అయిదు నిమిషాలపాటు వేయించి గిన్నెలోకి తీసుకోవాలి.
- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి పాలు పోసి చిక్కగా మారేవరకు చిన్న మంట మీద మరిగించాలి. అయిదు నిమిషాల తరువాత చక్కెర వేసి కలపాలి. పంచదార కరిగిన తరువాత నెయ్యిలో వేయించిన సగ్గుబియ్యం పిండి వేసి కలపాలి. ఈ మిశ్రమం బాగా దగ్గరకు వచ్చేవరకూ కలుపుతూ ఉండాలి. చివరగా యాలకుల పొడి వేసి కలిపి స్టవ్ మీద నుంచి దించాలి. నెయ్యి రాసిన పళ్లెంలో ఈ మిశ్రమాన్ని వేసి సమంగా పరచాలి. దానిపైన పిస్తా, బాదం, జీడిపప్పు పలుకులు చల్లాలి. గంట తరువాత ముక్కలుగా కోసి పళ్లెంలోకి తీయాలి.

సగ్గుబియ్యం పరాటా

కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- ఒక కప్పు, ఆలుగడ్డలు- పెద్దవి మూడు, అల్లం తురుము- అర చెంచా, పచ్చి మిర్చి- రెండు, మిరియాల పొడి- అర చెంచా, జీలకర్ర- ఒక చెంచా, ఉప్పు- ఒక చెంచా, కొత్తిమీర తరుగు- కొద్దిగా, కుట్టు పిండి లేదా సింగాడ పిండి లేదా రాజ్‌గిర పిండి- అర కప్పు, నెయ్యి- తగినంత



తయారీ విధానం

- స్టవ్ మీద మందపాటి గిన్నె పెట్టి, అందులో సగ్గుబియ్యం పోసి చిన్న మంట మీద దోరగా వేయించాలి. తరువాత ఒక పళ్లెంలోకి తీసి చల్లార్చాలి. ఆపైన మిక్సీలో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ఈ సగ్గుబియ్యం పిండిని జల్లించి గిన్నెలోకి తీసుకోవాలి. ఆలుగడ్డలను ఉడికించి తొక్క తీసి, తురిమి పెట్టుకోవాలి.
- వెడల్పాటి గిన్నెలో సగ్గుబియ్యం పిండి, అల్లం తురుము, పచ్చి మిర్చి ముక్కలు, మిరియాల పొడి, జీలకర్ర, ఉప్పు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. తరువాత ఆలుగడ్డ తురుము వేసి కలపాలి. ఆపైన కొద్దికొద్దిగా నీళ్లు చిలకరించుకుంటూ ముద్దలా చేయాలి. దీనిమీద మూతపెట్టి పావుగంట సేపు నానబెట్టాలి. తరువాత చేత్తో కొద్ది కొద్దిగా పిండిని తీసుకుంటూ గుండ్రని ముద్దల్లా చేయాలి. చపాతీ పీట మీద ఒక్కో ముద్ద పెట్టి... కుట్టు లేదా సింగాడ లేదా రాజ్‌గిర పిండి చల్లుతూ చపాతీల్లా ఒత్తాలి. స్టవ్ మీద పాన్ పెట్టి ఒక్కో చపాతీ వేస్తూ రెండు వైపులా ఎర్రగా వేయించాలి. చివరగా చెంచాతో నెయ్యి రాసి పళ్లెంలోకి తీయాలి. ఈ పరాటాలను కొత్తిమీర చట్నీతో తినవచ్చు.

సగ్గుబియ్యం నగ్గెట్స్

కావాల్సిన పదార్థాలు

- సగ్గుబియ్యం- అర కప్పు, ఉడికించిన ఆలుగడ్డలు- రెండు, వేయించిన పల్లీల పొడి- పావు కప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్టు- ఒక చెంచా, జీలకర్ర పొడి- ఒక చెంచా, నిమ్మరసం- ఒక చెంచా, ఉప్పు- తగినంత, కొత్తిమీర తరుగు- కొద్దిగా, నూనె- డీప్ ఫ్రైకి తగినంత

తయారీ విధానం

- సగ్గుబియ్యాన్ని వేయించి, పొడిచేసి పెట్టుకోవాలి. ఆలుగడ్డలను సన్నగా తురుముకోవాలి. వెడల్పాటి గిన్నెలో సగ్గుబియ్యం పొడి, పల్లీల పొడి, జీలకర్ర పొడి, ఉప్పు, అల్లం పచ్చిమిర్చి పేస్టు, కొత్తిమీర తరుగు వేసి బాగా కలపాలి. తరువాత ఆలుగడ్డ తురుము, నిమ్మరసం వేసి కలిపి ముద్దలా చేయాలి. ఈ మిశ్రమాన్ని చేత్తో కొద్దికొద్దిగా తీసుకుంటూ నగ్గెట్స్ మాదిరిగా తయారుచేయాలి. స్టవ్ మీద మూకుడు పెట్టి, సగానికిపైగా నూనె పోసి వేడిచేయాలి. అందులో నగ్గెట్స్ వేసి చిన్న మంట మీద ఎర్రగా వేయించి పళ్లెంలోకి తీయాలి. గ్రీన్ చట్నీతో తింటే ఈ నగ్గెట్స్ రుచిగా ఉంటాయి.



మేకప్

సెలెబ్ మేకప్ ట్రెండ్స్

అందరూ వేసుకునే మేకప్ ఇంచుమించు ఒకేలా ఉన్నా... ప్రముఖులు మాత్రం మేకప్‌లో భిన్నంగా కనిపిస్తూ ఉంటారు. అందుకు వాళ్లు అనుసరించే విభిన్నమైన మేకప్ ట్రెండ్స్ ప్రధాన కారణం. ఆ వినూత్నమైన ట్రెండ్స్‌ను అనుసరించి మనం కూడా వారిలాగే వెలిగిపోదామా...

సాఫ్ట్ గ్లామ్, మినిమలిస్ట్, మోనోక్రోమ్, బోల్డ్ అనే నాలుగు రకాల మేకప్ ట్రెండ్స్‌ను ప్రస్తుత భారతీయ ప్రముఖులు పాటిస్తున్నారు. అద్దంలా మెరిసే గ్లాస్ స్కిన్, సహజసిద్ధ కనుబొమలు, మెటాలిక్ ఐషాడోలు, న్యూడ్ లిప్స్ కూడా నేటి మేకప్ ట్రెండ్స్‌లో భాగాలుగా చెలామణీ అవుతున్నాయి.

సాఫ్ట్ గ్లామ్: ముఖంలో ఎక్కడా తీర్చిదిద్దినట్టు కనిపించకుండా న్యూడ్, డ్యూయి ఎలిమెంట్స్‌ను కలిపేసే మేకప్ ట్రెండ్ ఇది. కాటుక కళ్లు, మందపాటి కనుబొమలు, లేత రంగు పెదవులు ఈ ట్రెండ్ ప్రత్యేకతలు

మినిమలిస్ట్: తాజాదనం ఉట్టిపడే సింపుల్ మేకప్‌కు పెద్ద పీట వేస్తూనే బ్లష్, ముదురు రంగు లిప్‌స్టిక్‌లను జోడించడం ఈ మేకప్ ట్రెండ్ ప్రత్యేకత



మోనోక్రోమ్: కళ్లు, పెదవులు, చెక్కిళ్ల మీద ఒకే రంగును ఉపయోగించడం ఈ మేకప్ ప్రత్యేకత

బోల్డ్: ప్రత్యేకమైన సందర్భాల్లో ఎంచుకునే మేకప్ ట్రెండ్ ఇది. కొట్టొచ్చినట్టు కనిపించే స్మోకీ ఐస్, మెటాలిక్ షిమ్మర్ అద్దుకున్న కనురెప్పలు, మందపాటి ఐలైనర్‌లను ఈ మేకప్‌లో ఉపయోగిస్తారు. పెదవుల పైకి దృష్టి మళ్లకుండా ఉండడం కోసం న్యూడ్ లిప్స్‌ను ఎంచుకుంటారు.

కీలకమైన ఆకర్షణలు ఇవే!

చర్మం: అద్దంలా మెరుపులీనే గ్లాస్ స్కిన్ అందర్నీ ఆకట్టుకుంటుంది

కనుబొమలు: ఒత్తుగా, పట్టుకుచ్చులా కనిపించే కనుబొమలు మరింత సహజసిద్ధ లుక్‌ను తెచ్చిపెడతాయి

కళ్లు: గ్రే లేదా లైలాక్ మెటాలిక్ షేడ్స్‌లో మెరిసే ఐషాడోతో పాటు, కళ్లకు కాటుక దిద్దుకోవాలి. అలాగే కనురెప్పల పైన మందంగా ఐలైనర్ అప్లై చేసుకోవాలి

పెదవులు: పెదవులకు న్యూడ్ నుంచి బోల్డ్ వరకూ ఎలాంటి రంగునైనా ఎంచుకోవచ్చు. ఫుల్లర్ లిప్స్‌లా కనిపించడం కోసం ఓవర్ లైన్‌డ్ లిప్స్ స్టైల్ ఎంచుకోవాలి.

వర్షాల్లో ఇవి వేసుకోవాలి...

వర్షాకాలంలో బయటికి వెళ్లేటప్పుడు తడి నేల మీద నడవడానికి వీలుగా మంచి గ్రిప్ ఉన్న చెప్పులు, బూట్లు కొనుక్కోవాలి. లేదంటే నీళ్లలో జారిపడడం, బురదలో పాదాలు కూరుకుపోవడం లాంటి ఇబ్బందులు ఎదురవుతుంటాయి. అలాకాకుండా వర్షాకాలంలో వేసుకోదగ్గ చెప్పులు, బూట్ల గురించి తెలుసుకుందాం...



- ఫ్లోటర్స్ చెప్పులు చాలా మెత్తగా నీళ్లలో నడవడానికి వీలుగా ఉంటాయి. వీటిని వేసుకుని బురద ప్రాంతాల్లో కూడా వడివడిగా నడవచ్చు. పాదాలకు మట్టి, మురికి అంటకుండా కాపాడతాయి. వీటిని తేలికగా శుభ్రం చేసుకోవచ్చు. త్వరగా ఆరిపోతాయి కూడా.
- మరీ ఫ్లాట్‌గా ఉన్న చెప్పులు కొనుక్కోకూడదు. వీటితో నీళ్లలో నడవడం కష్టంగా అనిపిస్తుంది. లెదర్, ఫ్యాబ్రిక్ మెటీరియల్స్‌తో రూపొందించిన వాటిని ఎంపిక చేసుకోకపోవడమే మంచిది. ఇవి తేమను ఎక్కువగా పీల్చుకుంటాయి. నీళ్లలో తడిస్తే త్వరగా ఆరవు. దీనివల్ల పాదాలకు అలెర్జీ వచ్చే ప్రమాదం ఉంటుంది.



- క్రోక్స్ చెప్పులు తేలికగాను నీళ్లలో నడిచేటప్పుడు గ్రిప్‌తోను ఉంటాయి. జారి పడిపోతామన్న భయం ఉండదు. వీటి ప్రత్యేకమైన డిజైన్ కారణంగా నీళ్లు లోపలికి వెళ్లలేవు కాబట్టి పాదాలు పొడిగా ఉంటాయి. పాదాలకు గాలి తగిలేలా వీటి మీద రంధ్రాలు కూడా ఉంటాయి.
- చెప్పులు, బూట్లు కొనుక్కునేటప్పుడు అవి పాదాలకు సరిగా అమరుతున్నాయో లేదో చూసుకోవాలి. వాటి అడుగుభాగంయ(సోల్) గ్రిప్‌తో ఉందో లేదో పరీక్షించుకోవాలి. లేదంటే నీళ్లలో నడిచేటప్పుడు జారిపోతుంటాయి.
- రెయిన్ బూట్స్ వేసుకున్నా పాదాలు తడవవు. ఇవి బురదలో కూరుకుపోవు. పిల్లలకు, పెద్దలకు సౌకర్యవంతంగా ఉంటాయి.
- బూట్లపై నుంచి నీళ్లు త్వరగా జారిపోతూ నిమిషాల్లో గాలికి ఆరేవి ఎంపిక చేసుకోవడం మంచిది. వర్షాకాలంలో నైలాన్, ప్లాస్టిక్, రబ్బర్ బూట్లు అనువుగా ఉంటాయి.



ప్రేరణ

పురుషాధిక్య రంగాల్లో మోటార్‌స్పోర్ట్ ఒకటి. దాన్లో రాణించడమే కాకుండా డాక్టరేట్ కూడా పొందగలిగింది... గురుగ్రామ్‌కు చెందిన 53 ఏళ్ల బని యాదవ్. ఈ గౌరవాన్ని పొందిన ఏకైక భారతీయ రేసర్ బని ఆసక్తికరమైన ప్రస్థానమిది...



53 ఏళ్ల మహిళా రేసర్

బని తండ్రి రేస్ కార్లకు మార్పులు చేసేవారు. అలా చిన్నప్పటి నుంచి రేసు కార్లతో కలిసి పెరిగిన బని... ఎంతో ఆలస్యంగా 43వ ఏట ప్రొఫెషనల్ రేసింగ్‌లోకి అడుగు పెట్టింది. అందుకు కారణం గురించి వివరిస్తూ... "మా నాన్నకు స్వతహాగా రేసింగ్ పట్ల ఆసక్తి ఉన్నప్పటికీ నేను రేసర్‌గా ఎదగడానికి ఒప్పుకోలేదు. పైగా నా చిన్నతనంలో మన దేశంలో రేసింగ్‌కు సంబంధించి మౌలిక సదుపాయాలు కూడా అంత మెరుగ్గా ఉండేవి కావు. దాంతో అందరు యువతుల్లాగే పెళ్లి చేసుకుని, పిల్లల పెంపకంతో బిజీగా మారిపోయాను. అలాగని రేసింగ్ పట్ల నా మక్కువ తగ్గిపోలేదు. చిన్ననాటి స్నేహితుడినే ప్రేమించి, పెళ్లాడాను. దాంతో కుటుంబం నన్ను వెలి వేసింది. ఆర్థిక ఇబ్బందులు కూడా వేధించాయి. దాంతో డబ్బు సంపాదన, పిల్లల పెంపకం మీదే దృష్టిని కేంద్రీకరించాను. పిల్లలు పెరిగి పెద్దయ్యాక, కుటుంబం ఆర్థికంగా స్థిరపడిన తర్వాత... రేసింగ్ గురించి ఆలోచించడం మొదలుపెట్టాను. మా వారు నా మక్కువను మరింత ప్రోత్సహించడంతో 40 ఏళ్ల వయసులో రేసింగ్ మొదలుపెట్టాను. భారతదేశంలో ర్యాలీ కార్ డ్రైవింగ్ ప్రధానంగా పురుషులకే పరిమితం. ఈ పోటీల్లో కేవలం కొద్దిమంది మహిళలే పాల్గొంటూ ఉంటారు. అయితే అదృష్టవశాత్తూ, నా నేవిగేటర్ కూడా మహిళే కావడంతో సర్క్యూట్ మొత్తంలో మేమే ఏకైక మహిళా జంటగా రేసింగ్‌లో పాల్గొనే వాళ్లం. ఇది పురుషుల క్రీడ కాబట్టి మహిళల చేతుల్లో ఓడిపోవడాన్ని పురుషులు ఇష్టపడరు. మహిళలు పురుషులతో సమానంగా వేర్వేరు రంగాల్లో ఎదగడాన్ని పురుషులు స్వాగతిస్తారు, ప్రోత్సహిస్తారు... కానీ అది వాళ్లను ఓడించనంతవరకే! 'రేసింగ్ ఆమె అభిరుచి కాబట్టి రేస్‌లో పాల్గొనడంలో తప్పేముంది?' అన్న వాళ్లే, రేసింగ్‌లో నేను గెలిస్తే జీర్ణించుకోలేకపోతూ ఉండేవారు. ప్రారంభంలో ఇలాంటి ఎన్నో ప్రతిఘటనలను ఎదుర్కొన్నాను. ఆ తర్వాత ర్యాలీలు, టైటిళ్లు గెలుచుకోవడం మొదలుపెట్టడంతో అందరూ గౌరవించడం మొదలుపెట్టారు" అంటూ తన రేసింగ్ పోరాటం గురించి వివరించింది బని.

రిటైరయ్యే వయసులో...

2013లో జైపూర్ స్పీడ్ స్ప్రింట్ పోటీలో పాల్గొని 2వ స్థానాన్ని దక్కించుకోవడంతో మొదలుపెట్టి, 2018, 2019లో నేషనల్ ఆటోక్రాస్ ఛాంపియన్ విమెన్‌గా ఎదిగింది బని. అలాగే భారతదేశం వెలుపల అబుదాబి యాస్ మెరీనా సర్క్యూట్‌లో ఫార్ములా కార్లను నడపడంతో పాటు, తాజాగా మోటార్‌స్పోర్ట్స్‌లో డాక్టరేట్‌ను పొందే స్థాయికి కూడా ఎదగలిగింది. ప్రస్తుతం 53 ఏళ్ల వయసులో సైతం రేసింగ్‌లో సత్తా చాటుతోంది. అగ్ర క్రీడాకారులందరూ 40 ఏళ్ల వయసులో రిటైర్ అయిపోతూ ఉంటారు. కానీ ఎంతో ఆలస్యంగా 43 ఏళ్ల వయసులో రేసింగ్‌లోకి ప్రవేశించిన బని... తన పట్టుదల వెనకున్న కారణం గురించి వివరిస్తూ... "రేసింగ్ అవకాశం నాకు కాస్త ఆలస్యంగా వచ్చింది. రేసింగ్‌లో నా వయసులో సగం వయసున్న పురుషులతో పోటీ పడ్డాను. చాలామంది నన్ను చూసి హేళన చేశారు. పోటీదారులు ట్రాక్ మీద కోపాన్ని ప్రదర్శించి, పోటీలో వెనకపడిపోయేలా చేసేవారు. అయితే నేను నా చిన్ననాటి కలను నిజం చేసుకుంటున్న విషయం వాళ్లకు తెలియదు. నన్ను వెనక్కి తోసేసే అవకాశం, చొరవ ఎవరికీ ఇవ్వననే విషయం కూడా వాళ్లకు తెలియదు. రేసింగ్‌లో పట్టుదల, ఆత్మవిశ్వాసాలతో పాటు నేర్పరితనం కూడా కలిగి ఉండాలి. నా మటుకు నేను పోటీదారులను గమనిస్తూ, వాళ్ల నుంచి కొత్త విషయాలు నేర్చుకున్నాను. అవరోధాలను ఎలా తప్పించుకోవాలో, అపజయాల నుంచి పాఠాలు ఎలా నేర్చుకోవాలో, తప్పుడు గైడెన్స్‌లను ఎలా గుర్తించాలో సాటి రేసర్ల సంభాషణల నుంచి తెలుసుకున్నాను" అంటూ రేసింగ్‌లో ఎదుర్కొన్న సవాళ్ల గురించి వివరించింది బని.

తల్లి బాటలో పిల్లలు...

రేసింగ్‌లో వయసు కూడా ప్రధానమే! ఈ పోటీకి నా వయసు అవరోధంగా మారిన సందర్భాలు లేకపోలేదు. కంటిచూపు, రిఫ్లెక్స్‌లు ఇబ్బంది పెడుతూ ఉంటాయి. అయినా పూర్తి సామర్థ్యం మేరకు ప్రతిభ కనబరచడమెలాగో అనుభవం మీద నేర్చుకున్నాను. ఏ అవకాశమైనా జీవితంలో ఒక్కసారే చేతికి అందుతుంది. దాన్ని నూరు శాతం సద్వినియోగం చేసుకోవాలి. నాకు ఇదొక అపురూపమైన అవకాశం కాబట్టే మక్కువనే శక్తిగా మార్చుకుని రేసింగ్‌లో పైకి ఎదుగుతున్నాను' అంటూ మీడియాకు వివరించిందామె. 53 ఏళ్ల వయసులో సైతం సాటి రేసర్లకు స్ఫూర్తిగా మారుతున్న బన్నికి ఇద్దరు అబ్బాయిలు. వాళ్లిద్దరూ కూడా ర్యాలీ డ్రైవర్లే కావడం చెప్పుకోదగిన విశేషం.

ఇల్లు... సరికొత్తగా!

ప్రతిఒక్కరూ తమ ఇల్లు ప్రత్యేకంగా కనిపించాలని కోరుకుంటారు. సామాన్లను రకరకాలుగా సర్దుతూ ఇంటి లుక్ మార్చే ప్రయత్నం చేస్తారు. అలాకాకుండా చిన్న చిట్కాలతో ఇంటిని సరికొత్తగా మార్చేయవచ్చు. ఆ వివరాలు...

- ఇండోర్ ప్లాంట్స్ వల్ల ఇంటి అందం పెరుగుతుంది. హాల్, పడకగది, వంటగది, పిల్లలు చదువుకునే గదుల్లో వేలాడే మొక్కలను ఏర్పాటు చేసుకోవచ్చు. అక్కడక్కడా వీలును బట్టి చక్కని కుండీలను కూడా పెట్టుకోవచ్చు. తీగలా పెరిగే మొక్కలతో ఇంటిని అందంగా అలంకరించవచ్చు.
- ఖాళీ గోడమీద... రకరకాల ఫొటోలను అందమైన ఆకృతిలో అమర్చుకుంటే ఇంటికి గ్రాండ్ లుక్ వస్తుంది. కుటుంబసభ్యులంతా వివిధ సందర్భాల్లో తీయించుకున్నవి, పిల్లలు ఎదిగే క్రమంలో తీసినవి, ఏదైనా ఫంక్షన్ లేదా పార్టీలో తీసిన వాటిని ఒక క్రమంలో గోడమీద అంటించినా బాగుంటుంది.
- హాల్లో గోడమీద టీవీని అమర్చి చుట్టూరా చిన్న చిన్న అరలను ఏర్పాటు చేయడం నేటి ట్రెండ్. ఈ అరల్లో అందమైన బొమ్మలు, ఫొటోఫ్రేమ్‌లు, ఫ్లవర్ వాజ్‌లు, టెడ్డీబేర్లు, ఇతర గ్లాస్ ఐటెమ్స్‌ను పెడితే ఇల్లు అందంగా కనిపిస్తుంది.
- ప్రస్తుతం చాలామంది.. హాల్, వంటగది, ఇతర గదుల్లో గోడలకు ట్రేలను వేలాడదీసుకుంటున్నారు. వీటివల్ల ఇల్లు ప్రత్యేకంగా కనిపిస్తుంది.
- కిటికీలకు కాంట్రాస్ట్ రంగుల కర్టెన్లు వేస్తే ఇల్లు క్లాసీగా కనిపిస్తుంది.



- హాల్ మధ్యలో చక్కని కార్పెట్ వేయడం వల్ల కూడా ఇంటికి రిచ్ లుక్ వస్తుంది.
- దివాన్ కాట్ లేదా సోఫా మీద ఉండే కుషన్స్‌కు ముదురు రంగులో మెరిసే కవర్లు వేసి అందంగా సర్దితే.. ఇంట్లోకి రాగానే గ్రాండ్‌గా అనిపిస్తుంది.

స్పోర్ట్స్

విజయవాడ ● శనివారం 25 అక్టోబరు 2025

మ్యాక్స్‌వెల్ వచ్చేశాడు..

భారత్‌తో టీ20 సిరీస్‌కు ఎంపిక



మెల్‌బోర్న్: ఆస్ట్రేలియా వెటరన్ ఆల్‌రౌండర్ గ్లెన్ మ్యాక్స్‌వెల్ తిరిగి పోటీక్రికెట్‌లోకి అడుగుపెట్టనున్నాడు. గత నెలాఖరులో న్యూజిలాండ్‌తో టీ20 సిరీస్‌కు నెట్ ప్రాక్టీస్ సందర్భంగా మణికట్టు ఫ్రాక్చర్ కావడంతో ఆటకు దూరమయ్యాడు. భారత్‌తో జరిగే అయిదు టీ20ల సిరీస్‌లోని చివరి మూడు మ్యాచ్‌లకు మ్యాక్స్‌వెల్‌ను ఎంపిక చేశారు. సిరీస్ ఈనెల 29న ఆరంభం కానుంది. అలాగే..యువ పేసర్ మాహ్లీ బీర్డ్‌మన్ అనూహ్యంగా చోటు దక్కించుకున్నాడు.

ఆస్ట్రేలియా టీ20 జట్టు: మిచెల్ మార్ష్, (కెప్టెన్), హెడ్, ఫిలిప్, ఇన్‌గ్లిస్, కునేమన్, మిచెల్ ఓవెన్, మ్యాథ్యూ షార్ట్, స్టొయినిస్, జంపా, మ్యాక్స్‌వెల్ (3,4,5 మ్యాచ్‌లు), అబాట్ (1,3 మ్యాచ్‌లకు), బార్ట్‌లెట్, టిమ్ డేవిడ్, బెన్ డ్వార్షుయిస్ (4, 5 మ్యాచ్‌లకు), నాథన్ ఎలిస్, హాజెల్‌వుడ్ (1, 2 మ్యాచ్‌లకు), మాహ్లీ బీర్డ్‌మన్ (3, 5 మ్యాచ్‌లకు).

పలాష్‌కు కాంస్యం

ఆసియా యూత్ గేమ్స్



రిఫా (బహ్రెయిన్): ఆసియా యూత్ గేమ్స్ బాలుర 5000 మీటర్ల నడకలో భారత్‌కు చెందిన పలాష్ మండల్ కాంస్యం దక్కించుకున్నాడు. శుక్రవారం జరిగిన ఈ రేస్‌ను పలాష్ 24ని.48.92 సెకన్ల సమయంలో పూర్తి చేశాడు. చైనాకు స్వర్ణరజతాలు దక్కాయి.

జూనియర్ హాకీ వరల్డ్‌కప్‌నుంచి

వైదొలిగిన పాకిస్థాన్

కరాచీ: భారత్ ఆతిథ్యమిచ్చే జూనియర్ హాకీ వరల్డ్‌కప్ నుంచి పాకిస్థాన్ జట్టు వైదొలిగింది. ఈ విషయాన్ని అంతర్జాతీయ హాకీ సమాఖ్య (ఎఫ్ఐహెచ్) ధ్రువీకరించింది. చెన్నై, మధురైలో నవంబరు 28 నుంచి డిసెంబరు 28 వరకు ఈ టోర్నీ జరుగనుండగా, పాక్ స్థానంలో ఆడే మరో జట్టును ఇంకా ప్రకటించలేదు. అలాగే తటస్థ వేదికను కేటాయించాలన్న పాక్ కోరికను కూడా ఎఫ్ఐహెచ్ తోసిపుచ్చింది.



ఓదార్పు దక్కేనా?

- ఒత్తిడిలో టీమిండియా
- స్పిన్నర్ కుల్దీప్‌నకు చాన్స్?
- ఆసీస్‌తో మూడో వన్డే

విరాట్ కోహ్లీ

ఉ. 9 గం. నుంచి స్టార్‌స్పోర్ట్స్‌లో..

సిడ్నీ: కొత్త కెప్టెన్ శుభ్‌మన్ గిల్ సారథ్యంలో బరిలోకి దిగిన భారత వన్డే జట్టుకు ఆస్ట్రేలియా పర్యటన చేదు అనుభవాన్నే మిగిల్చింది. వరుసగా రెండు మ్యాచ్‌లను కోల్పోవడంతో సిరీస్ ఇప్పటికే కంగారూల వశమైంది. ఇక ఆఖరిదైన నామమాత్రపు మూడో వన్డే శనివారం సిడ్నీలో జరుగనుంది. టీమిండియా కనీసం ఇక్కడైనా విజయం దక్కించుకుని పరువు కాపాడుకోవాలనుకుంటోంది. అటు మరో రెండేళ్ల తర్వాతే భారత్ ఇక్కడ పర్యటించనుండడంతో వెటరన్ స్టార్లు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలకు ఆసీస్ గడ్డపై బహుశా ఇదే చివరి మ్యాచ్ కానుంది. ఇక రెగ్యులర్ కెప్టెన్ కమిన్స్ బరిలోకి దిగకపోయినా.. పటిష్ట భారత్‌ను మట్టికరిపించిన ఆసీస్ జోష్‌లో ఉంది. అందుకే అలక్ష్యం లేకుండా ఆడి తొలిసారి భారత్‌పై 3-0తో సిరీస్‌ను క్లీన్ స్వీప్ చేయాలనుకుంటోంది. మరోవైపు ఇక్కడి ఎస్‌సీజీ మైదానంలో ఆడిన చివరి ఐదు వన్డేల్లో భారత్ ఒక్కసారే నెగ్గింది.



రోహిత్



మార్ష్

కోహ్లీపైనే కళ్లన్నీ..: 300కు పైగా వన్డేలు ఆడిన స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ తొలిసారిగా రెండు వరుస డకౌట్లతో నిరాశపర్చాడు. ఏ మాత్రం మ్యాచ్ ప్రాక్టీస్ లేకుండా ఏడు నెలల తర్వాత బరిలోకి దిగిన తనకు పరిస్థితులు కలిసిరావడం లేదు. అడిలైడ్‌లో డకౌటై వెనుదిరిగినప్పుడు ప్రేక్షకులు లేచి నిలబడి చప్పట్లతో సెండాఫ్ ఇవ్వడం, కోహ్లీ కూడా వారికి తన గ్లోవ్స్‌ను చూపించడం ఆసక్తి రేపింది. ఏదిఏమైనా సిడ్నీలో తన పవర్ చూపాలని టీమ్‌తో పాటు ఫ్యాన్స్ బలంగా కోరుకుంటున్నారు. రోహిత్ మాత్రం గత వన్డేలో అదరగొట్టాడు. గిల్, రాహుల్ రాణించాల్సి ఉంది. అయితే స్పిన్నర్ కుల్దీప్‌ను బెంచీకే పరిమితం చేయడం విమర్శలకు దారి తీస్తోంది. అడిలైడ్‌లో జంపాకు నాలుగు వికెట్లు దక్కడంతో అందరూ కుల్దీప్‌ను గుర్తుచేసుకున్నారు. జంపాను ట్రంప్‌కార్డుగా ఆస్ట్రేలియా ఉపయోగిస్తుంటే..మన ప్రధాన స్పిన్నర్ కుల్దీప్‌కు మాత్రం జట్టులో చోటే ఇవ్వడంలేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. అతడికి బెర్త్ దక్కాలంటే సుందర్, హర్షిత్‌లలో ఒకరిని తప్పించాల్సి ఉంటుంది. అలాగే పేసర్ ప్రసిద్ధ్‌ను ఆడించే అవకాశం లేకపోలేదు. ఆల్‌రౌండర్‌గా నితీశ్ బ్యాట్‌తో, బంతితో విఫలమయ్యాడు. అతడి మీడియం పేస్ ప్రత్యర్థి బ్యాటర్లను ఏమాత్రం ఇబ్బందిపెట్టడం లేదు. అక్షర్ మాత్రం జడేజాను మరిపించి అంచనాలను అందుకున్నాడు. పేసర్లు సిరాజ్, అర్ష్‌దీప్ ఆసీస్ బ్యాటర్లపై మరింత ఒత్తిడి తీసుకురావాల్సి ఉంది.

ఆత్మవిశ్వాసంతో ఆసీస్ : అద్భుత ఆటతీరుతో ఆసీస్ తమ వరల్డ్‌కప్ ప్రయాణాన్ని ఘనంగా ఆరంభించింది. మాథ్యూ షార్ట్, రెన్షా, మైకేల్ ఓవెన్, కూపర్ కనోలీ ఎలాంటి పరిస్థితుల్లోనైనా బ్యాటింగ్ చేయగలమని నిరూపించుకున్నారు. తొలి మ్యాచ్‌లో భారత్‌ను ఇబ్బందిపెట్టిన స్పిన్నర్ కునేమన్.. ఈసారి జంపాకు జత కలవనుండడం ఇబ్బందే. అటు ఓపెనర్ ట్రావిస్ హెడ్ నుంచి మెరుపులు కనిపించడం లేదు. తను విజృంభిస్తే భారత్‌కు మరిన్ని కష్టాలు తప్పవు. సీనియర్ పేసర్లు స్టార్క్, హాజెల్‌వుడ్‌లకు విశ్రాంతినిచ్చే అవకాశం ఉంది.

తుది జట్లు (అంచనా)

భారత్: గిల్ (కెప్టెన్), రోహిత్, విరాట్, శ్రేయాస్, అక్షర్, రాహుల్, నితీశ్, సుందర్/కుల్దీప్, హర్షిత్/ప్రసిద్ధ్, అర్ష్‌దీప్, సిరాజ్.

ఆస్ట్రేలియా: ట్రావిస్ హెడ్, మిచెల్ మార్ష్ (కెప్టెన్), షార్ట్, రెన్షా, క్యారీ, కూపర్, ఓవెన్, స్టార్క్/ఎడ్వర్డ్స్, బార్ట్‌లెట్, జంపా, హాజెల్‌వుడ్/ఎలిస్.

పిచ్

సిడ్నీ వికెట్ బ్యాటింగ్‌కు అనుకూలంగా ఉండనుంది. ఇక్కడ భారీ స్కోర్లు సాధించిన ఆసీస్ జట్టు తమ ప్రత్యర్థులపై వరుసగా ఆరు వన్డే విజయాలతో దూసుకెళ్తోంది. స్పిన్ కూడా కీలకం కానుంది. వర్ష సూచన లేదు.

పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	ఫ.తే	పా	ర.రే
ఆస్ట్రేలియా	6	5	0	1	11	1.704
దక్షిణాఫ్రికా	6	5	1	0	10	0.276
ఇంగ్లండ్	6	4	1	1	9	1.024
భారత్	6	3	3	0	6	0.628
శ్రీలంక	7	1	3	3	5	-1.035
న్యూజిలాండ్	6	1	3	2	4	-0.490
పాకిస్థాన్	7	0	4	3	3	-2.651
బంగ్లాదేశ్	6	1	5	0	2	-0.578

గమనిక: ఆ: ఆడినవి; గె: గెల్చినవి; ఓ: ఓడినవి; పా: పాయింట్లు; ఫ.తే: ఫలితం తేలనవి; ర.రే: రన్‌రేట్

నేటి మ్యాచ్ మ.3 నుంచి స్టార్ నెట్‌వర్క్‌లో

ఆస్ట్రేలియా x దక్షిణాఫ్రికా



వరుణుడి ఖాతాలో 5

లంక-పాక్ మ్యాచ్ వర్షంతో రద్దు

మహిళల వరల్డ్ కప్

కొలంబో: ప్రతిష్ఠాత్మక మహిళల ప్రపంచ కప్‌లో వరుణుడు మరో మ్యాచ్‌ను అడ్డుకున్నాడు. శ్రీలంక-పాకిస్థాన్ మధ్య శుక్రవారం ఇక్కడ జరగాల్సిన ఆ జట్ల ఆఖరి లీగ్ మ్యాచ్ భారీ వర్షంతో అర్ధంతరంగా రద్దయింది. తొలుత మ్యాచ్ మూడు గంటలకుపైగా ఆలస్యంగా మొదలైంది. దాంతో 34 ఓవర్లకు కుదించారు. టాస్ కోల్పోయి పాకిస్థాన్ మొదట బ్యాటింగ్ చేపట్టగా..4.2 ఓవర్ల ఆట సాగిందో లేదో వరుణుడు మరోసారి విజృంభించాడు. ఈసారి ఏమాత్రం తెరిపినివ్వకపోవడంతో పోటీని రద్దు చేస్తూ అంపైర్లు నిర్ణయం తీసుకున్నారు. అప్పటికి పాకిస్థాన్ వికెట్ నష్టపోకుండా 18 పరుగులు చేసింది. ఒమైమా సొహైల్ (9 బ్యాటింగ్), మునీబా అలీ (7 బ్యాటింగ్) క్రీజులో ఉన్నారు. ఇక్కడి ప్రేమదాస స్టేడియంలో ఈ మెగా టోర్నీలో 11 మ్యాచ్‌లు జరగగా..ఐదు వర్షంతో రద్దు కావడం గమనార్హం. ఈ నేపథ్యంలో ఈశాన్య రుతుపవనాల సీజన్‌లో ప్రేమదాస స్టేడియంలో మ్యాచ్‌లను ఖరారు చేయడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.

శ్రీలంకకు ఖేదం..: శ్రీలంక ఆడిన మ్యాచ్‌ల్లో మూడింటిలో వర్షంతో ఫలితం తేలలేదు. దీంతో సెమీఫైనల్ చేరాలన్న శ్రీలంక జట్టు ఆశలకు బ్రేక్ పడింది. మొత్తం ఏడు మ్యాచ్‌ల్లో మరో మూడింటిలో ఓడిన లంక ఒక మ్యాచ్ నెగ్గింది. ఎనిమిది జట్ల టోర్నమెంట్‌లో ప్రస్తుతం ఐదు పాయింట్లతో శ్రీలంక ఐదో స్థానంలో ఉంది. మరోవైపు ఏడు మ్యాచ్‌ల్లో నాలుగు పరాజయాలు, మూడు ఫలితం తేలని మ్యాచ్‌లతో ఒక్క విజయమూ లేకుండానే పాకిస్థాన్ మహిళలు వెనుదిరిగారు. ఇక శుక్రవారంనాటి మ్యాచ్‌లో అందరి దృష్టి శ్రీలంక కెప్టెన్ చమరి ఆటపట్టుపై నిలిచింది. 35 ఏళ్ల చమరి అధికారికంగా ప్రకటించకపోయినా ఆమెకిదే ఆఖరి వరల్డ్ కప్‌గా భావిస్తున్నారు.

నేటి నుంచి రంజీ రెండో రౌండ్



పుదుచ్చేరి: రంజీ ఎలీట్ గ్రూప్‌లో భాగంగా రెండో రౌండ్ మ్యాచ్‌లు శనివారం నుంచి జరుగబోతున్నాయి. ఇందులో తిలక్ వర్మ కెప్టెన్సీలోని హైదరాబాద్ జట్టు గ్రూప్ 'డి'లోని పుదుచ్చేరితో ఆడనుంది. మొదటి రౌండ్‌లో ఢిల్లీతో ఆడి డ్రా చేసుకుని ఒక్క పాయింట్‌తో ఉంది. అలాగే గ్రూప్ 'ఎ'లో ఉన్న ఆంధ్ర జట్టు బరోడా టీమ్‌తో తలపడబోతుంది. విజయనగరంలో ఈ మ్యాచ్ జరుగనుండగా.. రికీ భుయ్ నేతృత్వంలోని ఆంధ్ర జట్టు ఇప్పటికే యూపీతో ఆడి డ్రా చేసుకుంది. మరోవైపు సౌరాష్ట్ర తరఫున ఆల్‌రౌండర్ రవీంద్ర జడేజా, బెంగాల్ నుంచి పేసర్ షమి, ఆకాశ్ దీప్, అభిమన్యు ఈశ్వరన్ బరిలోకి దిగనుండడం ఆసక్తి కలిగించనుంది.

క్వార్టర్స్‌లో లక్ష్య, దీక్ష

ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్



లక్ష్య

చెంగ్డూ: ఆసియా జూనియర్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్ల హవా సాగుతోంది. శుక్రవారం జరిగిన అండర్-17 ప్రీక్వార్టర్స్‌లో విజయాలు సాధించిన లక్ష్య రాజేశ్, దీక్ష సుధాకర్ క్వార్టర్స్‌లో ప్రవేశించారు. అలాగే అండర్-15లో టాప్ సీడ్ షైనా మణిముత్తు సైతం ప్రీక్వార్టర్స్‌లో గెలిచి ముందంజ వేసింది. ఇక అండర్-17 బాలికల డబుల్స్‌లో అదితి-వృద్ధి, బాలుర డబుల్స్‌లో చరణ్ రామ్-హరికృష్ణ జోడీ, సింగిల్స్‌లో జగ్‌షేర్ సింగ్‌లు క్వార్టర్స్‌లో ప్రవేశించారు.

ఫైనల్లో ముంబై, బెంగళూరు

హైదరాబాద్: ప్రైమ్‌వాలీబాల్ లీగ్ టైటిల్ కోసం ముంబై మిటియోస్, బెంగళూరు టోర్పెడోస్ అమీతుమీ తేల్చుకోనున్నాయి. ఇక్కడి గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో శుక్రవారం జరిగిన మొదటి సెమీఫైనల్లో ముంబై 15-8, 15-8, 16-14తో గోవా గార్డియన్స్‌పై విజయం సాధించింది. మరో సెమీస్‌లో బెంగళూరు 10-15, 15-11, 15-13, 15-13తో అహ్మదాబాద్ డిఫెండర్స్‌పై నెగ్గింది. ఫైనల్ ఆదివారం జరగనుంది.

స్వర్ణ పోరుకు హన్సిక, సారిక


నేహా శర్మకు కాంస్యం

నోవీ సాద్ (సెర్బియా): అండర్-23 ప్రపంచ రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత్‌కు చెందిన హన్సిక లాంబా (53 కి), సారిక మాలిక్ (59కి.) ఫైనల్‌కు చేరారు. కాగా నేహాశర్మ (57కి), నిషు (55కి), పుల్కిత్ (65కి), శ్రిష్టి (68కి) కాంస్య పతకాలు దక్కించుకున్నారు.

ఐపీఓలో పెట్టుబడులకు బ్యాంకు రుణం

వ్యక్తులకు రూ.25 లక్షల వరకు లోన్

- కొనుగోళ్ల కోసం కంపెనీలకు ఫండింగ్..
- బ్యాంకులకు ఆర్‌బీఐ ముసాయిదా మార్గదర్శకాలు



ముంబై: తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ), మలి విడత పబ్లిక్ ఆఫరింగ్ (ఎఫ్‌పీఓ) లేదా ఎంప్లాయీ స్టాక్ ఆప్షన్ ప్లాన్ (ఈఎస్‌ఓపీ) ద్వారా షేర్లను కొనుగోలు చేసేందుకు వ్యక్తుల (ఇండివిడ్యువల్స్)కు బ్యాంకులు రుణాలిచ్చేందుకు వీలుగా భారతీయ రిజర్వ్ బ్యాంక్ (ఆర్‌బీఐ) ముసాయిదా నిబంధనలను శుక్రవారం జారీ చేసింది. అలాగే, భారత కంపెనీల వ్యూహాత్మక కొనుగోళ్లు, విలీనాలకు కూడా బ్యాంకులు నిధులు సమకూర్చేందుకూ అవసరమైన ముసాయిదా నిబంధనలను కూడా విడుదల చేసింది. హేతుబద్ధీకరించిన నిబంధనలను 2026 ఏప్రిల్ 1 నుంచి అమలు చేయాలని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. తద్వారా వ్యక్తులు.. పబ్లిక్ ఇష్యూల్లో పెట్టుబడులు పెట్టేందుకు, కార్పొరేట్ కంపెనీలు ఇతర సంస్థల్లో వాటాలు కొనుగోలు చేసేందుకు అవసరమైన నిధుల సమీకరణకు అవకాశాలు పెరగనున్నాయి. ఈ ముసాయిదా మార్గదర్శకాలపై నవంబరు 21లోగా అభిప్రాయాలు తెలపాలని సంబంధిత వర్గాలను ఆర్‌బీఐ కోరింది.

కంపెనీల కొనుగోళ్ల ఫండింగ్‌కు మార్గదర్శకాలు

- కంపెనీల కొనుగోళ్ల కోసం అందించే రుణాల మొత్తం బ్యాంకు టియర్-1 క్యాపిటల్‌లో 10 శాతానికి మించకూడదు.
- కొనుగోలు ఒప్పందం విలువలో 70 శాతం వరకు బ్యాంకులు రుణం మంజూరు చేయవచ్చు. మిగతా 30 శాతం కంపెనీయే సమకూర్చుకోవాల్సి ఉంటుంది.
- గత మూడేళ్లుగా లాభాలు ఆర్జిస్తూ, సంతృప్తికరమైన నెట్‌వర్త్ కలిగిన లిస్టెడ్ కంపెనీలకు మాత్రమే రుణాలు ఇవ్వాలి.

సబ్‌స్క్రిప్షన్ విలువలో 75% రుణం: భారతీయ రిజర్వ్ బ్యాంక్ (కమర్షియల్ బ్యాంక్స్- క్యాపిటల్ మార్కెట్ ఎక్స్‌పోజర్) డైరెక్షన్స్, 2025' ప్రకారం.. ఐపీఓ, ఎఫ్‌పీఓ, ఈఎస్‌ఓపీలో భాగంగా షేర్ల కొనుగోలుకు బ్యాంకులు.. వ్యక్తికి రూ.25 లక్షల వరకు రుణం మంజూరు చేయవచ్చు. ప్రస్తుతం ఈ పరిమితి రూ.10 లక్షలుగా ఉంది. అయితే, పబ్లిక్ ఆఫరింగ్ లేదా ఈఎస్‌ఓపీ సబ్‌స్క్రిప్షన్ విలువలో బ్యాంకుల రుణ వాటా 75 శాతానికి మించకూడదని, మిగతా 25 శాతం రుణగ్రహీత సమకూర్చుకోవాలని ఆర్‌బీఐ స్పష్టం చేసింది. అలాగే, పబ్లిక్ ఆఫరింగ్స్, ఈఎస్‌ఓపీలో భాగంగా రుణగ్రహీతకు కేటాయించబడే షేర్లపై బ్యాంకులకు ధరావతు హక్కు కల్పించాలని, ఆ షేర్లను కేటాయించాక రుణగ్రహీత వాటిని బ్యాంకు వద్ద తనఖా పెట్టాల్సి ఉంటుదని తెలిపింది.

సెక్యూరిటీల తనఖాపై రూ.కోటి వరకు రుణం: ప్రభుత్వ సెక్యూరిటీలు, మ్యూచువల్ ఫండ్లు, ప్రభుత్వ బాండ్లు, లిస్టెడ్ కంపెనీల షేర్లు, లిస్టెడ్ కన్వర్టబుల్ డెట్ సెక్యూరిటీలు, అధిక రేటింగ్ కలిగిన రుణ పత్రాల తనఖాపై వ్యక్తులకు బ్యాంకులు రూ.కోటి వరకు రుణం మంజూరు చేయవచ్చని ఆర్‌బీఐ ప్రతిపాదించింది. ప్రస్తుతం ఈ పరిమితి రూ.20 లక్షలుగా ఉంది.

తిరుపతిలో ఐటీసీ హోటల్

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, ఒడిశాలోని పూరీలో రెండు ప్రీమియం స్టార్ హోటల్స్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఐటీసీ హోటల్స్ ప్రకటించింది. 'ఎపిక్ కలెక్షన్- మెంబర్ ఐటీసీ హోటల్స్' అనే కొత్త బ్రాండ్ పేరుతో ఈ రెండు ప్రీమియం హోటల్స్ నిర్మిస్తున్నట్లు తెలిపింది. ఈ బ్రాండ్ పేరుతో రానున్న సంవత్సరాల్లో 1,000 గదుల హోటల్స్ నిర్మించాలని యోచిస్తున్నట్టు తెలిపింది. కాగా సెప్టెంబరు త్రైమాసికంలో రూ.839.48 కోట్ల ఆదాయంపై రూ.133.29 కోట్ల నికర లాభం ఆర్జించింది.

బిజినెస్

హైదరాబాద్‌లో స్టార్‌లింక్ గేట్‌వే ఎర్త్ స్టేషన్

న్యూఢిల్లీ: ప్రపంచ కుబేరుడు ఎలాన్ మస్క్ నేతృత్వంలోని స్టార్‌లింక్ మన దేశంలో త్వరలో తన ఉపగ్రహ ఆధారిత కమ్యూనికేషన్ (శాట్‌కామ్) సేవలు ప్రారంభించేందుకు సిద్ధమవుతోంది. దీనికి సంబంధించి కంపెనీ త్వరలోనే ప్రయోగాత్మక పరీక్షలకు సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా హైదరాబాద్, నోయిడా, ముంబై, కోల్‌కతా, లఖ్‌నవూ వంటి నగరాల్లో తన గేట్‌వే ఎర్త్ స్టేషన్లు ఏర్పాటు చేయనుంది. ఈ ప్రయోగాత్మక పరీక్షలకు అవసరమైన స్పెక్ట్రమ్‌ను కేంద్ర ప్రభుత్వం కంపెనీకి తాత్కాలిక ప్రాతిపదికన ఇప్పటికే కేటాయించింది.

కఠినమైన సెక్యూరిటీ నిబంధనలు

స్టార్‌లింక్ ప్రారంభించే ఈ శాట్‌కామ్ సేవలకు ప్రభుత్వం కఠినమైన భద్రతా నిబంధనలు విధించింది. దేశ విద్రోహ శక్తులు ఈ సేవలను దుర్వినియోగం చేయకుండా అవసరమైన అన్ని చర్యలు తీసుకున్నట్టు అధికార వర్గాలు చెప్పాయి. కేంద్ర హోం మంత్రిత్వ శాఖ నుంచి క్లియరెన్స్ వచ్చే వరకు ఈ గేట్‌వే ఎర్త్ స్టేషన్ల నిర్వహణకు విదేశీయులను ఎవరినీ అనుమతించేది లేదని స్పష్టం చేసింది. అప్పటి వరకు ఈ స్టేషన్ల నిర్వహణ భారతీయుల చేతుల్లోనే ఉండాలని ఆదేశించింది.


డాక్టర్ రెడ్డీస్ లాభం

- ఆదాయంలో 10 శాతం వృద్ధి
- రూ.2,750 కోట్ల మిగులు నిధులు
- కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై దృష్టి

రూ. 1,437 కోట్లు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీస్.. సెప్టెంబరుతో ముగిసిన త్రైమాసికంలో ప్రోత్సాహకర ఫలితాలను ప్రకటించింది. జూలై-సెప్టెంబరు త్రైమాసికానికి గాను కంపెనీ కన్సాలిడేటెడ్ నికర లాభం 14.5 శాతం వృద్ధి చెంది రూ.1,437 కోట్లుగా నమోదైంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో లాభం రూ.1,255 కోట్లుగా ఉంది. సమీక్షా త్రైమాసికంలో మొత్తం రెవెన్యూ కూడా 9.8 శాతం వృద్ధితో రూ.8,016 కోట్ల నుంచి రూ.8,805 కోట్లకు చేరుకుంది. సెప్టెంబరు త్రైమాసికంలో బ్రాండెడ్ మార్కెట్లలో పనితీరు మెరుగ్గా ఉండటంతో పాటు నికోటిన్ రీప్లేస్‌మెంట్ థెరపీ (ఎన్ఆర్‌టీ) విభాగం నిలకడగా కొనసాగటం కలిసి వచ్చిందని డాక్టర్ రెడ్డీస్ చీఫ్ ఫైనాన్షియల్ ఆఫీసర్ (సీఎఫ్ఓ) ఎంవీ నరసింహం అన్నారు.

అమెరికా ఆదాయాల్లో 13% క్షీణత: సెప్టెంబరు త్రైమాసికంలో అమెరికా మార్కెట్ నుంచి ఆదాయాలు 13 శాతం తగ్గినట్లు డాక్టర్ రెడ్డీస్ వెల్లడించింది. ఈ కాలంలో అమెరికా ఆదాయాలు రూ.3,728 కోట్ల నుంచి రూ.3,241 కోట్లకు తగ్గినట్లు పేర్కొంది. లెనాలిడొమైడ్ సహా కొన్ని కీలక ఉత్పత్తుల ధరలు గణనీయంగా తగ్గటమే ఇందుకు కారణమని తెలిపింది. అయితే కొత్త ఉత్పత్తుల విడుదల పెరగటం, విదేశీ మారక ఆదాయం సానుకూలంగా ఉండటం కొంత కలిసి వచ్చిందని పేర్కొంది.



యూరప్, భారత్ ఆదాయాల్లో వృద్ధి: ఎన్ఆర్‌టీ పోర్టుఫోలియో కొనుగోలుతో యూరప్ మార్కెట్ల నుంచి ఆదాయాలు ఏకంగా 138 శాతం వృద్ధితో రూ.577 కోట్ల నుంచి రూ.1,376 కోట్లకు చేరుకున్నట్లు సీఎఫ్ఓ నరసింహం తెలిపారు. భారత మార్కెట్ ఆదాయాలు కూడా 13 శాతం వృద్ధితో రూ.1,397 కోట్ల నుంచి రూ.1,578 కోట్లకు పెరిగినట్లు పేర్కొన్నారు. వర్ధమాన మార్కెట్ల ఆదాయాలు కూడా రూ.1,455 కోట్ల నుంచి రూ.1,654 కోట్లకు పెరిగాయి. కాగా కంపెనీ వద్ద రూ.2,750 కోట్ల మిగులు నిధులు ఉన్నాయని పేర్కొంది. అలాగే కొనుగోళ్లు, లైసెన్సింగ్ ఒప్పందాలపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించనున్నట్లు తెలిపింది.

సుంకాల ప్రభావం లేదు

ఫార్మాపై అమెరికా సుంకాల ప్రభావం ప్రస్తుతానికైతే ఏమాత్రం లేదని సీఈఓ ఎరెజ్ ఇజ్రాయెలీ అన్నారు. అంతేకాకుండా సుంకాలకు సంబంధించి ఎలాంటి మార్గదర్శకాలు కూడా అందుకోలేదని ఆయన పేర్కొన్నారు. అయితే బయోలాజిక్స్‌పై ఈ ప్రభావం ఎంత ఉంటుందనే విషయాన్ని మాత్రం పరిశీలించాల్సి ఉంటుందని ఇజ్రాయెలీ తెలిపారు. కాగా వచ్చే ఏడాది పేటెంట్ గడువు తీరనున్న మధుమేహం, ఊబకాయం చికిత్సలో వినియోగించే సెమాగ్లూటైడ్ ఔషధాన్ని భారత్ సహా పలు మార్కెట్లలోకి విడుదల చేయనున్నట్లు ఆయన చెప్పారు.

ఆరు రోజుల ర్యాలీకి బ్రేక్

సెన్సెక్స్ 344 పాయింట్లు పతనం

ముంబై: స్టాక్ మార్కెట్లో ఆరు రోజుల వరుస ర్యాలీకి తెరపడింది. ఎఫ్ఎంసీజీ, బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలతో పాటు విదేశీ సంస్థాగత పెట్టుబడుల ఉపసంహరణ కారణంగా వారాంతం ట్రేడింగ్‌లో ప్రామాణిక సూచీలు నష్టాలు చవిచూశాయి. ఒక దశలో 599 పాయింట్లు పతనమై 84,000 స్థాయిని కోల్పోయిన సెన్సెక్స్.. చివరికి 344.52 పాయింట్ల నష్టంతో 84,211.88 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 96.25 పాయింట్లు తగ్గి 25,795.15 వద్ద ముగిసింది. సెన్సెక్స్‌లోని30 నమోదిత కంపెనీల్లో 20 నష్టపోయాయి.

29 నుంచి ఎంటీఆర్ ఐపీఓ

ఎంటీఆర్, ఈస్టర్న్ మసాలా బ్రాండ్ల యాజమాన్య సంస్థ ఓర్క్లా ఇండియా రూ.1,667 కోట్ల తొలి పబ్లిక్ ఆఫరింగ్ (ఐపీఓ) ఈ నెల 29న ప్రారంభమై 31న ముగియనుంది. ఈ పబ్లిక్ ఇష్యూలో విక్రయించనున్న షేర్ల ధరల శ్రేణిని కంపెనీ రూ.695-730గా నిర్ణయించింది. ఐపీఓలో భాగంగా కంపెనీ ప్రస్తుత ప్రమోటర్లు, వాటాదారులకు చెందిన 2.28 కోట్ల షేర్లను ఆఫర్ ఫర్ సేల్ పద్ధతిలో విక్రయించనుంది. ఈ ఐపీఓలో భాగంగా కంపెనీ రూ.10,000 కోట్ల మార్కెట్ విలువను లక్ష్యంగా పెట్టుకుంది.

మిడ్‌వెస్ట్ షేరు 7 శాతం అప్

తెలంగాణకు చెందిన గ్రానైట్ కంపెనీ మిడ్‌వెస్ట్ లిమిటెడ్ తన షేర్లను శుక్రవారం స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.1,065తో పోలిస్తే, బీఎస్ఈలో 9.39 శాతం లాభంతో రూ.1,165.10 వద్ద ట్రేడింగ్ ఆరంభించింది. ఒకదశలో 11.69 శాతం ఎగబాకి రూ.1,189.50 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. తొలిరోజు ట్రేడింగ్ ముగిసే సరికి కంపెనీ షేరు 7.14 శాతం లాభంతో రూ.1,141.10 వద్ద స్థిరపడింది. దాంతో, కంపెనీ మార్కెట్ విలువ రూ.4,126.31 కోట్లుగా నమోదైంది.

ఆర్ఎన్ఐటీ ఏఐ షేర్లు బీఎస్ఈలో నమోదు

కృత్రిమ మేధ (ఏఐ) ఆధారిత పరిష్కారాలు అందిస్తున్న హైదరాబాద్ సంస్థ ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ తన షేర్లను శుక్రవారం బీఎస్ఈలో నమోదు చేసింది. కంపెనీ ఎండీ రాజ శ్రీనివాస్ నందిగం బీఎస్ఈలో గంట కొట్టి షేర్ల ట్రేడింగ్‌ను ఆరంభించారు. దేశీయ స్టాక్ మార్కెట్లో లిస్టయిన తొలి ఏఐ ఆధారిత గవర్నెన్స్ కంపెనీ ఇదే. తొలిరోజు ట్రేడింగ్ ముగిసే సరికి కంపెనీ షేరు ధర 5 శాతం నష్టపోయి రూ.52.25 వద్ద స్థిరపడింది. ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్ రివర్స్ మెర్జర్ ద్వారా బీఎస్ఈ ప్రధాన ట్రేడింగ్ వేదికపై లిస్టయింది. 2023లో ఆర్ఎన్ఐటీ సొల్యూషన్స్ అండ్ సర్వీసెస్.. ఆటోపాల్ ఇండస్ట్రీస్‌తో విలీనమైంది. అనంతరం, కంపెనీ పేరును ఆర్ఎన్ఐటీ ఏఐ సొల్యూషన్స్‌గా మార్చారు. ఆ తర్వాత షేర్ల మార్పిడి ప్రక్రియను కూడా పూర్తి చేసి మార్కెట్లో మళ్లీ లిస్టయింది.

ఐదేళ్ల కనిష్ఠానికి ఉక్కు ధర

న్యూఢిల్లీ: దేశంలో ఉక్కు ధర ఐదేళ్ల కనిష్ఠానికి దిగజారింది. ప్రస్తుతం టన్ను ధర రూ.47,000- 48,000 మధ్యన ట్రేడవుతోంది. పెరిగిన దిగుమతులు, ఎగుమతి డిమాండ్‌లో క్షీణత, ప్రపంచ మార్కెట్లో అవసరాన్ని మించిన సరఫరా.. ధరలు ఈ స్థాయిలో తగ్గడానికి కారణమని బిగ్‌మింట్ డేటా తెలుపుతోంది. టోకు మార్కెట్లో హాట్ రోల్డ్ కాయిల్ (హెచ్ఆర్‌సీ) ధర టన్నుకు రూ.47,150 స్థాయిలో కదలాడుతుండగా టీఎంటీ బార్స్ ధర రూ.46,500- 47,000 పలుకుతోంది. 2020 తర్వాత ధరలు ఈ స్థాయిలోకి దిగిరావడం ఇదే ప్రథమం. ప్రభుత్వం పలు చర్యలు తీసుకున్నప్పటికీ దేశంలోకి ఉక్కు దిగుమతులు ఏ మాత్రం ఆగడం లేదు.

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



25వ తేదీ			
హైదరాబాద్	550	విజయవాడ	560
వరంగల్	552	గోదావరి	560
చిత్తూరు	583	విశాఖపట్నం	550
		దజను గుడ్లు రూ. 72	

ఫామ్‌గేట్ ధర — వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	112	విజయవాడ	121
వరంగల్	112	గుంటూరు	121
కరీంనగర్	112	ఒంగోలు	121
మహబూబ్‌నగర్	112	చిత్తూరు	104
కర్నూలు	112	నెల్లూరు	109
విశాఖపట్నం	119	అనంతపురం	109
గోదావరి	121		

బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)



	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	1,25,460 ▲	1,15,000 ▲	1,71,000 ▼
విజయవాడ	1,25,500 ▼	1,15,000 ▼	1,52,500 ▼
విశాఖపట్నం	1,26,300 ▼	1,15,000 ▲	1,70,000 ▼
రాజమండ్రి	1,24,360 ▼	1,14,000 ▼	1,53,000 ▼
ప్రొద్దుటూరు	1,24,200 ▼	1,14,260 ▼	1,53,000 ▼
ముంబై	1,21,518 ▼	1,11,310 ▼	1,47,033 ▼

'జోగి' ప్రేరణతోనే కల్తీ మద్యం తయారీ

- అప్పులపాలైన మాకు ఆయన ఆ సలహా ఇచ్చారు
- ముడి సరుకు బెంగళూరు నుంచి తెచ్చాం
- ఫార్ములా బాలాజీది..గోవాలో సమావేశాలు
- అంగీకరించిన నిందితుడు జనార్దనరావు
- సోదరుడు జగన్మోహనరావునూ విచారించిన సిట్

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రేరణతోనే నకిలీ మద్యం తయారీకి పూనుకున్నామని ప్రధాన నిందితుడు అద్దేపల్లి జనార్దన రావు అంగీకరించినట్టు తెలిసింది. అప్పుల ఊబిలో కూరుకుపోతున్న తమకు ఆయన నకిలీ మద్యం తయారీ గురించిన సలహా ఇచ్చారని చెప్పినట్టు సమాచారం. అద్దేపల్లి జనార్దనరావు, ఆయన సోదరుడు జగన్మోహనరావును సిట్ అధికారులు శుక్రవారం విచారించారు. నెల్లూరుజిల్లా కేంద్ర కారాగారంలో ఉన్న జనార్దనరావును ఎస్కార్ట్ పోలీసులు విజయవాడకు తరలించారు. విజయవాడ జిల్లా జైల్లో ఉన్న జగన్మోహనరావునూ ఎక్సైజ్ కార్యాలయానికి తీసుకెళ్లారు. అన్నదమ్ములను అక్కడ వేర్వేరుగా విచారించారు. ఇప్పటివరకు కేసును ఎక్సైజ్ పోలీసులు దర్యాప్తు చేశారు. ఏలూరు రేంజ్ ఐజీ జీవీజీ అశోక్‌కుమార్, ఎస్పీ కడియం చక్రవర్తి సుదీర్ఘంగా వీరిని విచారించారు. నకిలీ మద్యాన్ని ఇబ్రహీంపట్నంలో ఏర్పాటు చేయడానికి ప్రధాన కారణం మాజీ మంత్రి జోగి రమేశేనని వారు తెలిపినట్టు తెలిసింది. ఫోన్ గురించి అధికారులు ప్రశ్నించగా.. ఒక ఫోన్ ఆఫ్రికాలో, మరో ఫోన్‌ను ముంబయి విమానాశ్రయంలో చోరీ అయినట్టు కథ అల్లినట్టు వినికిడి. నకిలీ మద్యం తయారీకి అవసరమైన మొత్తం ముడి సరుకు బెంగళూరు నుంచి కొనుగోలు చేసినట్టు జనార్దన రావు అంగీకరించారు. తయారీకి ఉపయోగించిన ఫార్ములా బాలాజీ అనే వ్యక్తి ఇచ్చినట్టు చెప్పారని సమాచారం. బాలాజీతో గోవాలో పలుమార్లు సిట్టింగ్ ఏర్పాటు చేసుకుని నకిలీ మద్యం తయారీ గురించి చర్చించినట్టు వివరించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పటి నుంచీ నకిలీ మద్యాన్ని తయారు చేస్తున్నట్టు తెలిపారు. ఇబ్రహీంపట్నం, ములకలచెరువులో తయారైన మద్యాన్ని ఎక్కువగా బెల్టు షాపులకు సరఫరా చేసినట్టు వెల్లడించారని విశ్వసనీయంగా తెలిసింది.

మద్యం స్కామ్ కేసులో ఏడుగురికి షాక్

- చెవిరెడ్డి సహా అందరి బెయిల్ పిటిషన్లు కొట్టివేత

విజయవాడ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో రిమాండ్ ఖైదీలుగా ఉన్న ఏడుగురు నిందితులకు విజయవాడ ఏసీబీ కోర్టు షాక్ ఇచ్చింది. వైసీపీ మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కరరెడ్డి సహా అందరి బెయిల్ పిటిషన్లనూ కొట్టివేసింది. న్యాయాధికారి పి.భాస్కరరావు శుక్రవారం ఈ మేరకు కీలక ఉత్తర్వులు జారీచేశారు. కసిరెడ్డి రాజశేఖర్‌రెడ్డి, చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, సజ్జల శ్రీధర్‌రెడ్డి, చెరుకూరి వెంకటేశ్ నాయుడు, బూనేటి చాణక్య, బాలాజీకుమార్ యాదవ్, నవీన్‌కృష్ణ బెయిల్ పిటిషన్లపై వాదప్రతివాదాలు ముగియడంతో భాస్కరరావు తీర్పును వెలువరించారు. రిమాండ్‌ను వచ్చే నెల ఏడోతేదీ వరకు పొడిగించారు.

అతి త్వరలో ఫ్రీహోల్డ్‌కు స్వేచ్ఛ!



మంత్రివర్గ ఉపసంఘం భేటీలో మంత్రులు ఫరూక్, అనగాని, పార్థసారథి, నారాయణ తదితరులు

(మొదటి పేజీ తరువాయి)

కొన్ని రకాల భూములను అనుమతించకూడదని ఆ శాఖ చేసిన ప్రతిపాదనలపై వచ్చే సమావేశంలో చర్చించి అధికారికంగా నిర్ణయం తీసుకోవాలని మంత్రులు ఏకాభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది.

నాడు 13.59 లక్షల ఎకరాలు ఫ్రీహోల్డ్

అసైన్డ్ భూమి కేటాయించి 20 ఏళ్లు పూర్తయి, లబ్ధిదారుల చేతుల్లోనే భూమి ఉంటే వాటిని నిషేధ జాబితా 22ఏ నుంచి తొలగించాలని, ఆ తర్వాత రైతులకు ఆ భూములపై శాశ్వత హక్కులు కల్పించాలని జగన్ ప్రభుత్వం 2023లో అసైన్డ్ చట్టాన్ని సవరించింది. ఈ విధానం అమలుకు 2023 డిసెంబరులో జీవో 596 తీసుకొచ్చింది. అయితే నాటి ప్రభుత్వ పెద్దలు, వైసీపీ నేతలు కుమ్మక్కై.. 13.59 లక్షల ఎకరాలను ఫ్రీహోల్డ్ చేశారు. కూటమి ప్రభుత్వం రాగానే విచారణ చేయించింది. జగన్ సర్కారు 5.74 లక్షల ఎకరాలను అక్రమంగా, చట్టవిరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తీసేసినట్లు తేలింది. పరిస్థితి తీవ్రతను అర్థం చేసుకుని గత ఏడాది ఆగస్టులోనే ఫ్రీహోల్డ్ భూముల రిజిస్ట్రేషన్‌పై నిషేధం విధించింది. ఈ సమస్య తేలేవరకు నిషేధం పొడిగిస్తూ వస్తోంది.. సమస్య పరిష్కారానికి ఈ ఏడాది మార్చిలో మంత్రివర్గ ఉపసంఘం ఏర్పాటు చేసింది. చర్చోపచర్చలు సాగినా అది కూడా సత్వర నిర్ణయం తీసుకోలేకపోయింది. దీనిపై విమర్శలు వెల్లువెత్తడంతో ముఖ్యమంత్రి చంద్రబాబు జోక్యం చేసుకున్నారు. వీలైనంత త్వరగా ఫ్రీహోల్డ్ భూములపై నివేదిక ఇవ్వాలని ఆదేశించడంతో గత రెండు సమావేశాల్లో ఉపసంఘం కీలక అంశాలపై చర్చలు జరిపింది. అసైన్డ్ చట్టం పరిధిలో ఉండి.. జీవో 596 మార్గదర్శకాల ప్రకారం అర్హత సాధించిన 7.85 లక్షల ఎకరాల భూమిని ఫ్రీహోల్డ్‌కు అనుమతించాలని రెవెన్యూ శాఖ తాజాగా ప్రతిపాదించింది. భూమి లబ్ధిదారు చేతిలోనే ఉండి సాగు చేసుకుంటుంటే.. అలాంటి వాస్తవికమైన కేసుల్లో ఫ్రీహోల్డ్ జరిగేలా చూడాలని సూచించింది. ఇందుకు మంత్రులు సానుకూలంగా స్పందించారు. పోరంబోకు, షరతుగల పట్టాలున్న భూములు, చుక్కల భూములు, సర్వీస్ ఇనాం (దేవదాయ) భూములపై వచ్చే సమావేశంలో చర్చించి నిర్ణయం తీసుకోవాలని నిర్ణయించారు. నిబంధనలకు విరుద్ధంగా నిషేధ జాబితా నుంచి తొలగించిన 5.74 లక్షల ఎకరాల భూములను తిరిగి 22ఏలో చేర్చాలన్న ప్రతిపాదనను కూడా సబ్‌కమిటీ ఆమోదించింది. అలాగే పరిశ్రమలు, కంపెనీలు, సంస్థలు మొదలైనవాటికి ఇకపై లీజు ప్రాతిపదికనే కేటాయించాల్సిందిగా ప్రభుత్వానికి సిఫారసు చేయాలని నిర్ణయించింది.

వక్ఫ్ భూములు కాపాడలేక విక్రయించాలంటారా?

- అధికారులపై మంత్రుల ఆగ్రహం

రాష్ట్రంలో వేల కోట్ల విలువైన వక్ఫ్ భూముల అన్యాక్రాంతంపై మంత్రివర్గ ఉపసంఘం ఆందోళన వ్యక్తం చేసింది. అత్యంత కీలకమైన ప్రాంతాల్లో ఉన్న ఖరీదైన భూములు దురాక్రమణకు గురవుతున్నాయని మంత్రులు అనగాని, పయ్యావుల సబ్‌కమిటీ భేటీలో ఆందోళన వ్యక్తం చేశారు. 'ఎలాగూ ఆ భూములను కాపాడలేకపోతున్నాం. వాటిని అమ్మేయడమో.. లేదా ఆక్రమించుకున్న వారికే రెగ్యులరైజ్ చేయడమో పరిశీలన చేయండి' అని మైనారిటీ సంక్షేమ శాఖలోని కీలక అధికారి సూచించినట్లు తెలిసింది. మంత్రులిద్దరూ తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. 'ఏం మాట్లాడుతున్నారు? చేతకావడం లేదని భూములను అమ్మేస్తామా? కబ్జా చేసినోడికే రెగ్యులరైజ్ చేయమంటారా? కబ్జాలు జరుగుతుంటే మీరు, వక్ఫ్ సర్వే అధికారులు ఏం చేస్తున్నారు? మీరు చెప్పినట్లే చేస్తే.. వక్ఫ్ భూములను దోచుకుంటున్నారని, హస్తగతం చేసుకుంటున్నారని మాపై రాజకీయ దాడి చేయరా? వక్ఫ్ భూములను కాపాడాల్సిందే. కబ్జాల నుంచి రక్షించడానికి పోలీసు శాఖ సహకారం తీసుకోండి. మీవల్ల కాదంటే చెప్పండి.. మరో అధికారికి అప్పగిస్తాం' అని ఆగ్రహం వ్యక్తంచేసినట్లు తెలిసింది.

బనకచర్ల డీపీఆర్ తయారీకి 31 వరకూ గడువు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బనకచర్ల పథకం సమగ్ర ప్రాజెక్టు నివేదిక(డీపీఆర్) తయారీకి ఆసక్తిగల సంస్థలు ఈ నెల 31లోగా బిడ్లు దాఖలు చేయాలని జల వనరుల శాఖ ప్రకటించింది. డీపీఆర్ తయారీకి రూ.9 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసి బిడ్లు దాఖలు చేసేటపుడు రూ.9 లక్షలు డిపాజిట్ చెల్లించాలని పేర్కొంది. వాస్తవానికి బిడ్లను ఆహ్వానిస్తూ ఈనెల ఎనిమిదినే తొలి ప్రకటన జారీ అయింది. తాజా ప్రకటనలో గడువు పెంచడంతోపాటు, డిపాజిట్‌గా చెల్లించాల్సిన సొమ్ము మొత్తాన్ని నిర్దేశించింది. మొదట జారీ చేసిన ప్రకటనలో ఇచ్చిన ఫోన్ నంబర్లను సంప్రదించేందుకు ప్రయత్నిస్తుంటే... ఎవరూ సమాధానం ఇవ్వడం లేదని ఆసక్తికలిగిన సంస్థలు ఆరోపిస్తున్నాయి.

జగన్‌కు మతి భ్రమించింది

- మద్యం స్కాం అసలు దోషి ఆయనే: బుద్దా వెంకన్న

విజయవాడ(వన్‌టౌన్), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబుకు ప్రజాదరణ పెరగటంతో జగన్ మతిభ్రమించి మాట్లాడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, మాజీ ఎమ్మెల్సీ బుద్దా వెంకన్న అన్నారు. విజయవాడలోని తన కార్యాలయంలో ఆయన శనివారం విలేకరులతో మాట్లాడారు. 'నోరు తెరిస్తే జగన్ పచ్చి అబద్ధాలు మాట్లాడుతున్నాడు. ఏపీకి డేటా సెంటర్ సీఎం చంద్రబాబు తెస్తే, తన గొప్పగా చెప్పుకోవటానికి జగన్‌కు సిగ్గుండాలి. మద్యం కుంభకోణంలో అక్రమ డబ్బంతా తాడేపల్లి ప్యాలెస్‌కు చేరింది. ఈ కేసులో అసలు దోషి జగన్. అతన్ని అరెస్టు చేయాలి. ఈ కేసులో జగన్ జైలుకు వెళ్లడం ఖాయం. వైసీపీ నాయకులు నోటికొచ్చినట్లు కూతలు కూస్తే మూల్యం చెల్లించుకుంటారు' అని హెచ్చరించారు.

ఫేక్ రాజకీయాల్లో జగన్ దిట్ట

- బస్సు దుర్ఘటన బాధాకరం: మంత్రి పయ్యావుల

అనంతపురం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఫేక్ రాజకీయాలు చేయడంలో జగన్ దిట్ట అని ఆర్థిక మంత్రి పయ్యావుల కేశవ్ అన్నారు. ప్రతి విషయాన్ని రాజకీయం చేయడం జగన్‌కే చెల్లిందని మండిపడ్డారు. అనంతపురంలో శుక్రవారం ఆయన మీడియాతో మాట్లాడారు. 'కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు దుర్ఘటన నేపథ్యంలో... విదేశాల్లో ఉన్న సీఎం చంద్రబాబు తక్షణమే స్పందించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని యంత్రాంగాన్ని ఆదేశించారు. ఏ సంఘటన జరిగినా జగన్‌లా మేం రాజకీయాలు చేయడం లేదు. ఈ ఘటన బాధాకరం. గూగుల్, అదానీ డేటా సెంటర్లను తానే తెచ్చానని జగన్ చెప్పుకోవడం హాస్యాస్పదం. బాలకృష్ణపై జగన్ వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం' అని పయ్యావుల అన్నారు.

మద్యం ఆర్డర్ల కుట్రలో అవినాశ్‌రెడ్డే కీలకం

- 'ముడుపుల' భేటీలకు రాజ్‌కసిరెడ్డితో కలిసి హాజరు
- ప్రస్తుతం పరారీలో.. ముందస్తు బెయిల్‌కు అర్హుడు కాదు
- సిట్ తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా వాదనలు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వైసీపీ హయాంలో ముడుపులు చెల్లించిన డిస్టిలరీలకు మద్యం సరఫరా ఆర్డర్లు ఇచ్చే విషయంలో రాజ్‌కసిరెడ్డి (ఏ1)తో కలిసి పిటిషనర్ ముప్పిడి అవినాశ్‌రెడ్డి పలు సమావేశాల్లో పాల్గొన్నారని దర్యాప్తులో తేలిందని 'సిట్' తరఫు సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూథ్రా శుక్రవారం హైకోర్టుకు నివేదించారు. మద్యం ఆర్డర్ల కుట్రలో పిటిషనర్‌ది కీలక పాత్ర అని, దేశంలో ఏ రాష్ట్రంలో వినియోగంలో లేని మద్యం బ్రాండ్లను రాష్ట్రంలో ప్రవేశపెట్టారని తెలిపారు. అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన ముందస్తు బెయిల్ పిటిషన్‌కు విచారణార్హత లేదన్నారు. దర్యాప్తునకు సహకరించకుండా విదేశాలకు పారిపోయినందున ముందస్తు బెయిల్ దాఖలు చేసే అర్హత పిటిషనర్‌కు లేదని, పిటిషన్‌ను కొట్టివేయాలని కోరారు. కాగా, పిటిషనర్ తరఫున రిప్లై వాదనల కోసం విచారణను ఈనెల 31కి వాయిదా వేస్తున్నట్లు న్యాయమూర్తి జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రకటించారు. తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ ముప్పిడి అవినాశ్‌రెడ్డి (ఏ7) హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. ఈ వ్యాజ్యం శుక్రవారం విచారణకు రాగా, పిటిషనర్ తరఫున సీనియర్ న్యాయవాది రమాకాంత్‌రెడ్డి వాదనలు వినిపించారు. ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరారు.

పేదల ఇళ్లకు 126 కోట్లు

రాష్ట్రంలో పేదల ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం రూ.126.45 కోట్లు మంజూరు చేసింది. ఈ మేరకు పరిపాలనా అనుమతినిస్తూ గృహ నిర్మాణ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్ జైన్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు.

ఖరీఫ్ ధాన్యంసేకరణకు రూ.5వేల కోట్ల రుణం

రాష్ట్రంలో 2025-26 ఖరీఫ్ మార్కెటింగ్ సీజన్‌లో వరిధాన్య సేకరణకు వర్కింగ్ క్యాపిటల్ కోసం జాతీయ సహకార అభివృద్ధి సంస్థ(ఎన్సీడీసీ) నుంచి తాజాగా రూ.5వేల కోట్లు రుణం పొందేందుకు ఏపీ మార్క్‌ఫెడ్‌కు ప్రభుత్వం హామీఇచ్చింది. ఈ మొత్తాన్ని పౌరసరఫరాల సంస్థకు ఇంటర్ కార్పొరేట్ బదిలీ చేయడానికి ఏపీ మార్క్‌ఫెడ్‌కు అనుమతిచ్చింది. అలాగే సహకారచట్ట ప్రకారం మొదటి అర్ధ సంవత్సరం (2025 సెప్టెంబరు 30)లోగా జనరల్ బాడీ సమావేశం నిర్వహించడం నుంచి ఏపీ మార్క్‌ఫెడ్‌ను మినహాయిస్తూ మరో ఉత్తర్వు జారీ చేసింది. కాగా, ప్రస్తుత వర్షాల నేపథ్యంలో పంటల రక్షణకు రైతులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయ శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 'వరి పైరు పాల, పొట్ట దశలో వాలిపోతే.. పొలాల్లో ఉన్న నీటిని వెంటనే బయటకు పంపాలి. బీపీటీ 5204, పీఎల్ 1100 రకం వరిలో గింజ రంగు మారకుండా, తెగుళ్ల వ్యాప్తి చెందకుండా ఎకరానికి 200 ఎంఎల్ ప్రొపికొనజోల్ పిచికారి చేయాలి. కంకులపై మొలకు కనిపిస్తే.. 50 గ్రాముల ఉప్పు లీటర్ నీటిలో కలిసి పిచికారి చేయాల'ని సూచించారు.

మృతుల కుటుంబాలకు కోటి పరిహారం ఇవ్వాలి: సీపీఐ

కర్నూలు బస్సు ప్రమాదంలో మరణించినవారి కుటుంబాలకు రూ.కోటి చొప్పున నష్టపరిహారం అందించాలని సీపీఐ రాష్ట్రసమితి ప్రభుత్వాన్ని డిమాండ్ చేసింది. ఘటనపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులను కఠినంగా శిక్షించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య శుక్రవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు.

మైనార్టీలకు జర్మనీలో ఉద్యోగావకాశాలు: మంత్రి ఫరూక్

రాష్ట్రంలోని మైనార్టీ యువతకు జర్మనీలో ఎలక్ట్రీషియన్‌గా ఉద్యోగ అవకాశాలు కల్పించనున్నట్లు మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి ఎన్ఎండీ ఫరూక్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐ ఉత్తీర్ణత, 30ఏళ్ల లోపు, రెండేళ్ల అనుభవం ఉన్నవారు అర్హులన్నారు. ఎంపికైన వారికి నెలకు భారత కరెన్సీలో రూ.2.60-2..70లక్షలు వరకు జీతం లభిస్తుందన్నారు. వివరాలకు 9988853335, 8712655686, 8790118349, 8790117279నంబర్లలో సంప్రదించాలన్నారు.

చిత్రజ్యోతి ★ SINCE 1965 ★

లంక వెళ్లిన రామ్



రామ్‌చరణ్ నటిస్తున్న రూరల్ యాక్షన్ డ్రామా 'పెద్ది' చిత్రం కోసం ఓ పాటను శనివారం నుంచి శ్రీలంకలో చిత్రీకరించనున్నారు. బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ కూడా ఈ పాట చిత్రీకరణలో పాల్గొంటారు. దర్శకుడు బుచ్చిబాబు సానా, ఇతర యూనిట్ సభ్యులు ఇందుకోసం శ్రీలంక బయలుదేరి వెళ్లారు. అక్కడి అందమైన ప్రదేశాల్లో ఛాయాగ్రాహకుడు రత్నవేలు సారథ్యంలో ఈ పాటను చిత్రీకరించనున్నారు. ఏఆర్ రెహమాన్ ఈ సినిమాకు స్వరాలు అందిస్తున్నారు. దర్శకుడు బుచ్చిబాబు ఆసక్తికరంగా రూపొందిస్తున్న 'పెద్ది' చిత్రంలో రామ్‌చరణ్ సరికొత్త లుక్‌లో కనిపించనున్నారు. టాప్ టెక్నీషియన్లు పని చేస్తున్న ఈ చిత్రాన్ని వచ్చే ఏడాది మార్చి 27న భారీ స్థాయిలో విడుదల చేయనున్నారు నిర్మాత వెంకట సతీశ్ కిలారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో 'పెద్ది' చిత్రం రూపుదిద్దుకుంటోంది.

ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు



నందమూరి బాలకృష్ణ, దర్శకుడు బోయపాటి శ్రీను కాంబినేషన్‌లో రూపుదిద్దుకుంటోన్న 'అఖండ 2: తాండవం' చిత్రం నుంచి అదిరిపోయే అప్డేట్ వచ్చేసింది. ఈ చిత్రాన్ని తేజస్విని నందమూరి సమర్పణలో రామ్ ఆచంట, గోపీ ఆచంట ప్రతిష్ఠాత్మకంగా నిర్మిస్తున్నారు. బ్లాక్‌బస్టర్ మూవీ 'అఖండ'కు సీక్వెల్‌గా తెరకెక్కుతోన్న ఈ సినిమా డిసెంబరు 5న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఇటీవలె భారీ సన్నివేశాలతో అఖండ పాత్రను పరిచయం చేసిన తొలి టీజర్‌కు అద్భుతమైన స్పందన లభించింది. తాజాగా బాలకృష్ణ మరో పాత్రను పరిచయం చేస్తూ దర్శకనిర్మాతలు గ్లింప్స్ విడుదల చేశారు. వీడియోలో బాలకృష్ణ పూర్తి స్థాయి మాస్ అవతార్‌లో హై - ఓల్టేజ్ యాక్షన్‌తో అదరగొట్టారు. 'సౌండ్ కంట్రోల్‌లో పెట్టుకో. ఏ సౌండ్‌కి నవ్వుతానో, ఏ సౌండ్‌కి నరుకుతానో నాకే తెలియదు కొడకా. ఊహకి కూడా అందదు' అనే బాలయ్య పవర్‌ఫుల్ సంభాషణలు సినిమాపై అంచనాలను తారాస్థాయికి చేర్చాయి. రామ్-లక్ష్మణ్ మాస్టర్స్ యాక్షన్ కొరియోగ్రఫీ అద్భుతంగా ఉంది. సంగీత దర్శకుడు తమన్ బీజీఎం సౌండ్ బాక్సులు పగిలిపోయేలా ఉంది. కాగా, ఈ చిత్రంలో సంయుక్త ముఖ్య పాత్రలో నటిస్తున్నారు. ఆది పినిశెట్టి శక్తిమంతమైన పాత్రలో కనిపించనున్నారు.

సంగీత కార్యక్రమాలు మొదలయ్యాయి




మహేశ్‌బాబు కథానాయకుడిగా 'ఎస్ఎస్ఎంబీ29' అనే వర్కింగ్ టైటిల్‌తో రాజమౌళి ఓ చిత్రాన్ని తెరకెక్కిస్తోన్న విషయం తెలిసిందే. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ శరవేగంగా సాగుతోంది. ఈ చిత్రానికి సంబంధించిన ఓ అప్డేట్‌ని సంగీత దర్శకుడు ఎం.ఎం.కీరవాణి తనయుడు కాలభైరవ మీడియాతో పంచుకున్నారు. 'ఎస్ఎస్ఎంబీ29' సంగీత కార్యక్రమాలు ప్రారంభమైనట్లు వెల్లడించారు.. 'మోగ్లీ 2025' చిత్రం పాట ఆవిష్కరణ వేడుకలో పాల్గొన్న ఆయన మీడియాతో మాట్లాడుతూ 'నాన్నగారి సినిమాల్లో వర్క్ ఉంటే కచ్చితంగా నాకు చెబుతారు. ముఖ్యంగా ఆయనతో కలసి రికార్డింగ్ సెషన్స్‌కు వెళ్తుంటా. 'ఎస్ఎస్ఎంబీ29'కి సంబంధించిన మ్యూజిక్ రికార్డింగ్ పనులు ఇటీవలె మొదలయ్యాయి. నేను కూడా అందులో భాగమయ్యా' అని చెప్పారు.

సౌండ్ అదిరింది!



ప్రభాస్ హీరోగా దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా 'స్పిరిట్' పేరుతో ఓ చిత్రాన్ని రూపొందించనున్న సంగతి తెలిసిందే. తమ హీరో పుట్టినరోజు సందర్భంగా ఆయనకు శుభాకాంక్షలు తెలుపుతూ 'సౌండ్ స్టోరీ' పేరుతో ఓ ఆడియో టీజర్‌ను విడుదల చేసి ఓ కొత్త ట్రెండ్‌కు శ్రీకారం చుట్టారు సందీప్‌రెడ్డి. ఇందులో విజువల్స్ లేవు. కానీ ప్రభాస్, ప్రకాశ్ రాజ్ , మరో వ్యక్తి చెప్పే డైలాగ్స్ మాత్రం ఉన్నాయి. కథ ప్రకారం ప్రభాస్‌ది ఇందులో పోలీస్ ఆఫీసర్ పాత్ర. ఏదో కారణం చేత తను అరెస్ట్ అయి జైలుకి వెళతాడు. అక్కడ జైలర్‌గా ఉన్న ప్రకాశ్‌రాజ్, ప్రభాస్‌ల మధ్య జరిగే సంభాషణ ఆసక్తికరంగా ఉంది. ప్రభాస్ కూల్‌గా 'సూపరెండెంట్ సార్.. చిన్నప్పటి నుంచీ నాకు ఓ చెడ్డ అలవాటు ఉంది' అని చెప్పడంతో ఈ ఆడియో క్లిప్ ముగుస్తుంది. ఒక సినిమా ప్రోమోని షూటింగ్‌కు ముందే ఇలా ఆడియో క్లిప్ రూపంలో విడుదల చేయడం తెలుగు సినిమా చరిత్రలో ఇదే తొలిసారి. అందుకే ఈ 'సౌండ్ స్టోరీ అదిరిపోయింది' అంటూ ప్రభాస్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ చిత్రంలో త్రిప్తి డిమ్రి కథానాయిక. వివేక్ ఒబెరాయ్ విలన్‌గా నటిస్తున్నారు. ప్రణయ్‌రెడ్డి వంగా, భూషణ్ కుమార్, కృష్ణన్ కుమార్ నిర్మించే ఈ చిత్రం షూటింగ్ త్వరలో ప్రారంభమవుతుంది.

గుర్తుపట్టలేనంతగా..



తొలి నుంచీ శర్వానంద్ కథను ఎంపిక చేసుకునే విధానం, తెరపైన తను కనిపించే తీరు, హంగూ ఆర్భాటాల్లేని ప్రచార శైలి హీరోల్లో ఆయన్ను ప్రత్యేకంగా నిలిపాయి. ఎక్కువగా కుటుంబ కథా చిత్రాలతో ఇంటిల్లిపాదిని అలరిస్తూ వస్తున్న శర్వానంద్ ఈ సారి తన పంథా మార్చారు. 'బైకర్' చిత్రంతో యాక్షన్ జానర్‌లోకి అడుగుపెట్టిన ఆయన తన పాత్ర కోసం సరికొత్త మేకోవర్‌తో సిద్ధమయ్యారు. ఇప్పటివరకూ క్యూట్‌గా కనిపించిన శర్వా ఈసారి బాగా సన్నబడడమే కాదు గుర్తుపట్టలేనంతగా మారిపోయారు. ఈ సినిమాలోని రేసర్ పాత్ర కోసం కఠినమైన ఆహార నియమాలు పాటించి బరువు తగ్గారు. షర్ట్ లేకుండా శర్వానంద్ దిగిన ఫొటోలను చిత్రబృందం షేర్ చేయగా, 'గుర్తుపట్టలేనంతగా మారిపోయారు, మీ డెడికేషన్‌కు హ్యాట్సాఫ్' అంటూ అభిమానులు శర్వానంద్‌ను ప్రశంసిస్తున్నారు.



తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని శుక్రవారం ఆయన నివాసంలో హీరో నారా రోహిత్ కలిశారు. శుభలేఖ అందజేసి, ఈ నెల 30న జరిగే తన పెళ్లికి రావాలని ఆహ్వానించారు.



సినీ కార్మికుల సమస్యలపై త్వరలో ప్రభుత్వానికి నివేదిక

- ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు

సినీ కార్మికుల సమస్యలపై రాష్ట్ర ప్రభుత్వం వేసిన కమిటీ తొలి సమావేశం శుక్రవారం ఆర్టీసీ క్రాస్‌రోడ్‌లోని తెలంగాణ కార్మిక కమిషనర్ కార్యాలయంలోని బోర్డు మీటింగ్ హాల్‌లో జరిగింది. ఈ సమావేశంలో రాష్ట్ర కార్మిక అదనపు కమిషనర్ డా. ఇ. గంగాధర్, ఎఫ్‌డిసి ఛైర్మన్ దిల్‌రాజు, సినీ కార్మికుల సంఘం అధ్యక్షుడు అనిల్ వల్లభనేని, నిర్మాతలు సుప్రియ, దామోదరప్రసాద్, ఫిల్మ్ ఛాంబర్ సభ్యులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా దిల్‌రాజు మాట్లాడుతూ కమిటీ తొలి సమావేశం ఈ రోజు జరిగిందని వారం రోజుల్లో నివేదికను ప్రభుత్వానికి అందజేస్తామన్నారు. చర్చలు సానుకూలంగా జరిగాయన్నారు. గతంలో 30 శాతం వేతన పెంపు డిమాండ్‌తో మొదలైన సినీ కార్మికుల సమ్మె 22.5 శాతం వేతన పెంపు అంగీకారంతో ముగిసిన విషయం విదితమే. కార్మిక శాఖ ముఖ్యకార్యదర్శి దానకిశోర్ పర్యవేక్షణలో ఏర్పాటైన కమిటీ మిగిలిపోయిన చిన్న చిన్న సమస్యల పరిష్కారం కోసం గాను ఈ రోజు సమావేశమైంది. గంగాధర్ మాట్లాడుతూ మరో రెండు మూడు సార్లు కమిటీ సమావేశం జరుగుతుందని చెప్పారు.

చిక్కడపల్లి (ఆంధ్రజ్యోతి)

ఆఖరి ప్రయాణం



మాంసపు ముద్దలై!

కర్నూలు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లా బస్సు ప్రమాద ఘటనలో మృతదేహాలు గుర్తుపట్టలేనంతగా కాలిపోయి మాంసపు ముద్దలుగా మారాయి. ఏ మృతదేహం ఎవరిదో గుర్తించలేని విధంగా ఉన్నాయి. కొన్ని మృతదేహాల శరీర భాగాలు విడిపోయాయి. ప్రమాదం జరిగిన దాదాపు గంట తర్వాత పోలీసు వాహనాలు, అంబులెన్సులు వచ్చాయి. బస్సులో పడి ఉన్న మృతదేహాలను చూస్తే.. ప్రాణాలు కాపాడుకోడానికి తీవ్రంగా ప్రయత్నాలు చేసినట్లు తెలుస్తోంది. బస్సు మధ్యలో కాలిపోయిన శవాలు గుట్టలుగా కనిపించడంతో తొక్కిసలాట జరిగి ఉంటుందని పోలీసులు భావిస్తున్నారు. బస్సు మొదటి నుంచి చివరి వరకు కాలిపోయిన శవాలే కనిపిస్తున్నాయి. అమ్మ పక్కనే పడుకున్న ఇద్దరు పసిపల్లలు అమ్మతోపాటు మాంసపు ముద్దలుగా మారిన తీరు కన్నీరు తెప్పిస్తోంది. మాంసపు ముద్దలుగా మారిన మృతదేహాలను తీసుకొస్తున్న సిబ్బంది చేతులు రక్తంతో తడిసిపోయాయి. ఓ మృతదేహాన్ని దించుతుండగా.. తలభాగం విడిపోవడంతో మరో వ్యక్తి ఆభాగాన్ని జాగ్రత్తగా తెచ్చి మృతదేహం పక్కనే పెట్టారు.



మంటల్లో కాలిపోతున్న బస్సు

కదిలే శవపేటికలు..!

స్లీపర్ బస్సుల నిర్మాణంలోనే లోపాలు.. సౌకర్యాలు ఘనం.. భద్రత శూన్యం

- ప్రమాదం జరిగితే బయటపడడం కష్టమే
- స్లీపర్ బస్సులను నిషేధించాలంటున్న నిపుణులు

హైదరాబాద్/సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): నిన్న రాజస్థాన్‌లో.. నేడు కర్నూలులో.. స్లీపర్ బస్సులు అగ్నికి ఆహుతయ్యాయి. పదుల సంఖ్యలో ప్రజలు సజీవ దహనం అయ్యారు. ఈ నేపథ్యంలో స్లీపర్ బస్సుల భద్రతపై మరోసారి చర్చ మొదలైంది. వారాంతం వచ్చిందంటే చాలు.. హైదరాబాద్ నుంచి విజయవాడ, విశాఖపట్నం, బెంగళూరు.. ఇలా 300-1000 కిలోమీటర్ల దూరాలకు స్లీపర్ బస్సుల్లో ప్రయాణించేవారు ఎంతో మంది. హైదరాబాద్ నుంచి వెళ్లే ప్రతి పది ట్రావెల్స్ బస్సుల్లో 8 స్లీపర్‌లే ఉంటున్నాయి. వాటిలోనూ సీటర్ కమ్ స్లీపర్ బస్సులే ఎక్కువ. అలసట లేకుండా ఎంత దూరమైనా ప్రయాణించవచ్చనే కారణంతో ఎక్కువ మంది ఆసక్తి చూపుతున్నారు. కానీ, నిపుణులు మాత్రం ఈ బస్సులను 'నడిచే శవపేటికలు'గా అభివర్ణిస్తున్నారు. మన రోడ్ల డిజైన్‌కు ఏ మాత్రం సరిపడని మల్టీ యాక్సిల్ బస్సులే కాదు, స్లీపర్ బస్సుల డిజైనింగ్ లోపాలు ప్రయాణికులకు శాపాలని చెబుతున్నారు. దేశవ్యాప్తంగా పలు స్వచ్ఛంద సంస్థలు, నిపుణులు ఈ తరహా బస్సులను నిషేధించాలని డిమాండ్ చేస్తే.. బెదిరింపులు, ఛీత్కారాలు తప్ప ఫలితం లేదని ఆరోపిస్తున్నారు. అధిక శాతం బస్సుల నిర్వాహకులకు రాజకీయ నాయకుల అండదండలు ఉండడమో, వారే ప్రైవేట్ ట్రావెల్స్ నిర్వాహకులు కావడమో దీనికి ప్రధాన కారణం. చైనా, జర్మనీలాంటి దేశాలు ఈ విషయంలో ఆదర్శనీయమని అంటున్నారు. మన దేశంలో ఉన్న పరిస్థితులే చైనాలోనూ ఉన్నాయని, స్లీపర్ క్లాస్ బస్సుల నియంత్రణలో వారు అనుసరించిన విధానం ఆచరణీయమని చెబుతున్నారు.

సౌకర్యాలున్నాయ్.. భద్రతే లేదు..: స్లీపర్ క్లాస్ బస్సులన్నీ కూడా రెండతస్తుల తరహాలో ఉంటాయి. ఒక్కో బస్సులో కనీసం 30 నుంచి 42 సీట్ల వర కూ ఉంటున్నాయి. కొన్నింటిలో ఎక్కువే ఉంటాయి. ఒకప్పు డు మన కంటే అధికంగా స్లీపర్ బస్సులు కలిగిన చైనా ఇప్పుడు వాటిని వదిలించుకోవడానికి కారణం భద్రతా లోపాలే. 2013కు ముందు చైనాలో దాదాపు 37 వేల స్లీపర్ బస్సులు ఉండేవి. కానీ, ఇప్పుడు కొత్తగా ఒక్క స్లీపర్ బస్సు రోడ్డెక్కడం లేదు. ఆ బస్సుల్లోని భద్రతా లోపాలపై కఠిన చర్యలు తీసుకోవడమే దీనికి కారణం. ఈ బస్సుల్లో ఛాసిస్ కిందకు ఉండడం, బెడ్స్ డిజైన్‌లో లోపాలు, గ్యాంగ్ వే(ప్రయాణికులు నడిచే మార్గం) ఇరుకుగా ఉండడం, అత్యవసర ద్వారాలు తక్కువగా ఉండడం వంటివి ప్రధాన సమస్యలుగా గుర్తించారు. దీనికి తోడు ఈ బస్సుల ఎత్తు ఎక్కువగా ఉండడం, 100-120 కి.మీ. వేగంతో వెళ్లడం, ఏదైనా ఘటన జరిగితే గురుత్వాకర్షణ(సెంటర్ ఆఫ్ గ్రావిటీ) సమస్యల కారణంగా బస్సులోని ప్రయాణికులు విసిరివేసినట్లు పడిపోవడం వంటి ఎన్నో సమస్యలను గుర్తించారు. ఈ బస్సుల్లో అత్యవసర ద్వారాలు లేకపోవడం వల్ల ప్రమాదాల బారిన పడినప్పుడు ప్రయాణికులను కాపాడడం కష్టమే. ఇక ఈ బస్సులు దాదాపు 3 మీటర్ల ఎత్తున ఉండడం వల్ల ప్రమాదం జరిగినప్పుడు లోపల ఉన్నవారు బయటకు దూకడం కూడా కష్టంగానే ఉంటుంది. చైనా దశల వారీగా నిషేధం విధించిన తర్వాత భారత్‌లో కూడా ఆటోమోటివ్ రిసెర్చ్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా(ఏఆర్ఏఐ) 2016లో స్లీపర్ బస్సులకు సంబంధించి కొన్ని నిబంధనలు, ప్రమాణాలను తీసుకొచ్చింది. ఏఆర్ఏఐ మార్గదర్శకాల ప్రకారం.. 2+1 లేఔట్‌ను స్లీపర్ బస్సుల్లో అనుమతించింది. దేశంలో దాదాపు 80% స్లీపర్ లేదంటే హైబ్రిడ్ బస్సులు ఈ లేఔట్‌లోనే ఉన్నాయి. కానీ, నిర్దేశిత ప్రమాణాల ప్రకారం లేవన్నది ఎక్కువ మంది వాదన. మన దేశంలో ఈ బస్సులు సాధారణంగా 12 మీటర్, 13.5, 15 మీటర్ పరిమాణంలో వస్తుంటాయి. స్లీపర్ బస్సుల్లో బెర్త్ కచ్చితంగా 70.8 అంగుళాల పొడవు ఉండాలి. అలాగే 12 మీటర్లలోపు పొడవు కలిగిన బస్సుల్లో కనీసం నాలుగు అత్యవసర ద్వారాలుండాలి. 12 మీటర్లు దాటితే 5 ఉండాలి. వాటిని ప్రతి ఒక్కరూ గుర్తు పట్టేలా ఏర్పాటు చేయాలి. ప్రతి సీటు పక్కన సుత్తిని కూడా ఫిట్ చేసి ఉంచాలి. కానీ, వాటిలో ఏ ఒక్కటీ అమలు కావడం లేదని, పర్యవేక్షణ కూడా లేదని చెబుతున్నారు.

ఇతర దేశాల్లో ఎలా ఉందంటే..

జర్మనీలో 2006లోనే స్లీపర్ కోచ్‌లను నిషేధించారు. ప్రమాదం జరిగినప్పుడు ప్రయాణికులు బయటకు విసిరేసినట్లు పడడం, సీటు బెల్టు పెట్టుకునే అవకాశాలు లేకపోవడం వంటి వాటిని కారణాలుగా చెప్పారు. 2010లో ఈయూ చట్టాన్ని ఉల్లంఘించిందంటూ ఓ ఆపరేటర్ కోర్టుకు ఆశ్రయించాడు. అతని అప్పీల్‌ను కోర్టు తిరస్కరించింది. యూరోపియన్ దేశాల్లో కూడా స్లీపర్ బస్సులు కనిపించవు. అక్కడ విస్తృత రైల్ నెట్‌వర్క్‌తోపాటు నిబంధనలు కఠినంగా ఉండడంతో స్లీపర్ బస్సులు ఉండవు. అమెరికాలో కూడా స్లీపర్ బస్సులు కనిపించవు. అమెరికన్లు బస్సుల్లో ప్రయాణించడానికి పెద్దగా ఇష్టపడరు. స్లీపర్ బస్సులో ప్రయాణించడం కంటే విమానంలో వెళ్లడమే తక్కువ ఖర్చని భావిస్తారు.

బైకును ఢీ కొట్టడంతో
మంటలు చెలరేగాయి

- కర్నూలు ప్రమాదంపై రవాణా శాఖ నివేదిక



అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదానికి గురైన బస్సుకు ఫిట్‌నెస్ ఉందని రాష్ట్ర రవాణా శాఖ ప్రభుత్వానికి నివేదిక ఇచ్చింది. ప్రమాద వార్త తెలియగానే రవాణా శాఖ కమిషనర్ మనీశ్ కుమార్ సిన్హా వెంటనే కర్నూలుకు చేరుకుని దుర్ఘటనపై ఆరా తీశారు. వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందిన ఏసీ స్లీపర్ బస్సు(డీడీ01 ఎన్9490) ప్రమాదంలో పూర్తిగా మంటల్లో కాలిపోయినట్లు ఆర్టీఏ అధికారులు ప్రాథమిక సమాచారం సేకరించారు. బస్సు రిజిస్ట్రేషన్ 2018 మే 2న డామన్ డయ్యూలో అయిందని, బస్సుకు 2027 మార్చి 31 వరకూ ఫిట్‌నెస్ ఉందని గుర్తించారు. 2030 ఏప్రిల్ 30 వరకూ టూరిస్ట్ పర్మిట్ జారీ అయిందని, 2026 ఏప్రిల్ 20 వరకూ ఇన్సూరెన్స్ ఉన్నట్లు తెలుసుకున్నారు. బస్సు ఇంజిన్, ఇతర భద్రతా ప్రమాణాలన్నీ తగిన స్థాయిలో ఉన్నట్లు రవాణా శాఖ వెల్లడించింది. బైకును బలంగా ఢీ కొట్టడం వల్ల రాపిడితో చెలరేగిన మంటలే బస్సు ప్రమాదానికి కారణమని ప్రభుత్వానికి రవాణా శాఖ కమిషనర్ ప్రాథమిక నివేదిక అందజేశారు. డీజిల్ ట్యాంకు, బస్సులో వైరింగ్ వ్యవస్థలో ఎలాంటి లోపం లేదని నిర్ధారించారు. అయితే డ్రైవింగ్ విధానం, భద్రతా ప్రమాణాల అమలు, అగ్నిమాపక పరికరాల లభ్యత వంటి అంశాలపై నివేదిక ఇస్తామని తెలిపారు.

ఆ బస్సుపై 16 చలానాలు

- రెండేళ్లుగా పట్టించుకోని ట్రాఫిక్ అధికారులు

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అగ్ని ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సుపై తెలంగాణ పోలీసులు పలుమార్లు చలానాలు విధించారు. ప్రమాదానికి గురైన కావేరి ట్రావెల్ బస్సుపై 2024 జనవరి 27 నుంచి 2025 అక్టోబరు 9వ తేదీ వరకు 16 పెండింగ్ చలాన్లు ఉన్నాయి. ఈ చలాన్లకు సంబంధించి బస్సు నిర్వాహకులు రూ.23,120 పెనాల్టీ చెల్లించాల్సి ఉంది. దాదాపుగా రెండేళ్ల పాటు చలాన్లు పెండింగ్ ఉన్నా.. ట్రాఫిక్ అధికారులు పట్టించుకోలేదు. ఉల్లంఘన జరిగినప్పుడు మాత్రం చలాన్లు విధిస్తున్న అధికారులు పెద్ద ట్రావెల్ బస్సుల నుంచి వసూలు చేయడంపై దృష్టి పెట్టలేదని తెలుస్తోంది. రోడ్డుపై వెళుతున్న ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు, కార్లు నడిపే వారిని ముక్కుపిండి వసూలు చేస్తున్న ట్రాఫిక్ సిబ్బంది.. ట్రావెల్ బస్సుల వైపు కూడా చూడటంలేదన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి.

కార్యాలయం మూత



కేపీహెచ్‌బీ కాలనీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కూకట్‌పల్లి మెట్రో ఎదురుగా ఉన్న వేమూరి కావేరి ట్రావెల్స్ కార్యాలయం శుక్రవారం మూసేశారు. సాధారణంగా ఇది రోజూ ఉదయం 5 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు తెరిచి ఉంటుంది. ఉదయం నుంచి రాత్రి వరకు టికెట్లు, పార్సిళ్ల బుకింగ్‌లతో పాటు డెలివరీలతో నిత్యం రద్దీగా ఉంటుంది. శుక్రవారం తెల్లవారుజామున కర్నూల్‌లో బస్సు ప్రమాదం జరగడంతో ప్రయాణికుల కుటుంబసభ్యుల నుంచి ఒత్తిడి వస్తుందని భావించి మూసేసినట్లు తెలిసింది. వివిధ ప్రాంతాల నుంచి కూకట్‌పల్లి మీదుగా పటాన్‌చెరు వరకు వెళ్లే బస్సులు ఇక్కడ ఒక్కటీ ఆగకుండా వెళ్లాయి. ఉదయం 7 గంటల నుంచే మీడియా అంతా కూకట్‌పల్లి కార్యాలయం వద్ద ఉంది. అప్పటికే తెరిచి ఉన్న కార్యాలయంలో సిబ్బందిని ప్రమాదం విషయం మీకు తెలుసా అని మీడియా ప్రతినిధులు ప్రశ్నించారు. అంతలోపే నిర్వాహకుల నుంచి ఫోన్లు రావడంతో సిబ్బంది షెట్టర్ మూసేసి వెళ్లిపోయారు.

ఒంగోలు బస్సు.. ఒడిశా అడ్రస్!

- నంబర్ డయ్యూ డామన్‌ది

అమరావతి/హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో ప్రమాదానికి గురైన బస్సు ఒంగోలుకు చెందిన వేమూరి కావేరి ట్రావెల్స్‌కు చెందినది. యజమాని పేరు వేమూరి వినోద్‌కుమార్. 2018 మే 2న తెలంగాణలో బస్సు కొనుగోలు చేశారు. అనంతరం అదే ఏడాది ఆగస్టు 8న డయ్యూ డామన్‌లో 41 సీట్లతో రిజిస్ట్రేషన్ చేయించారు. అప్పటి నుంచి ఏడేళ్ల పాటు హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు నడిపారు. బస్సును స్లీపర్ కోచ్‌గా ఆల్టర్ చేయించి ఒడిశాలోని రాయగడ ఆర్టీవో కార్యాలయంలో 2025 ఏప్రిల్ 29న రిజిస్ట్రేషన్ మార్పు చేశారు. అయితే రిజిస్ట్రేషన్ రాయగడలో జరిగినప్పటికీ బస్సు నంబరు డయ్యూ డామన్‌దే ఉండటం గమనార్హం. రిజిస్ట్రేషన్ మార్పు చేసి ఆరు నెలలు అవుతున్నా అదే నంబరుపై ఇప్పటి వరకు తిరుగుతోంది. ఈ బస్సులో ప్రయాణికుల జాబితా ఎప్పుడూ అందుబాటులో ఉండదు. మంటలు ఆర్పే పరికరాలు లేవని రెండుసార్లు రవాణా శాఖ అధికారులు కేసులు నమోదు చేశారు. అయినా బస్సు యాజమాన్యం నిర్లక్ష్యం వీడలేదు.

డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే 2 నిమిషాల్లోనే కాపాడొచ్చు!

హైదరాబాద్ సిటీ, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): బస్సు డ్రైవర్లు అప్రమత్తంగా ఉంటే.. అగ్ని ప్రమాదాలు సంభవించినా ప్రయాణికుల ప్రాణాలు కాపాడే అవకాశం ఉంటుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. సాధారణంగా రాత్రి సమయంలో బస్సులో ఉన్న ప్రయాణికులందరూ నిద్రలోనే ఉంటారు. ప్రమాద సమయాల్లో మెలకువగా ఉన్నవారు, వెంటనే తేరుకున్న వారు మాత్రమే ప్రాణాలతో బయటపడే అవకాశాలుంటాయి. కానీ, డ్రైవర్లు సరైన రీతిలో స్పందిస్తే.. బస్సులో నుంచి రెండు నిమిషాల్లోనే ప్రయాణికులను కిందకు దింపొచ్చని నిపుణులు చెబుతున్నారు. గతంలోనూ పలువురు బస్ డ్రైవర్లు ప్రాణాలకు తెగించి మరీ ప్రయాణికులను కాపాడిన సంఘటనలున్నాయి.

బస్సు ప్రమాదం దురదృష్టకరం

- రాష్ట్రపతి ముర్ము, ప్రధాని మోదీ దిగ్భ్రాంతి
- మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం: పీఎంవో
- రూ.5 లక్షల చొప్పున ప్రకటించిన ఏపీ, తెలంగాణ ప్రభుత్వాలు

న్యూఢిల్లీ/హైదరాబాద్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనపై రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, ప్రధాని నరేంద్ర మోదీ, తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 19 మంది సజీవ దహనమవడం అత్యంత బాధాకరమన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రమాద మృతుల కుటుంబాలకు రూ.2 లక్షలు, క్షతగాత్రులకు రూ.50 వేలు అందజేయనున్నట్టు ప్రధానమంత్రి కార్యాలయం ప్రకటించింది. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తదితరులు కూడా ప్రమాదం పట్ల విచారం వ్యక్తం చేశారు. బస్సు ప్రమాద ఘటనలో మృతి చెందిన ఏపీకి చెందిన ఆరుగురికి సంబంధించి ఏపీ ప్రభుత్వం రూ.5లక్షల చొప్పున పరిహారం ప్రకటించింది. క్షతగాత్రులకు రూ.2 లక్షలు ప్రకటించింది. అలాగే, తెలంగాణకు చెందిన మృతుల కుటుంబాలకు ఆ రాష్ట్ర ప్రభుత్వం రూ.5 లక్షల చొప్పున ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు ఆ రాష్ట్ర రవాణా మంత్రి పొన్నం ప్రభాకర్ తెలిపారు. క్షతగాత్రులకు రూ.2 లక్షల పరిహారాన్ని అందించనున్నట్టు వెల్లడించారు.

బెంగళూరులో 30 బస్సులు సీజ్

- బస్సు ప్రమాదం నేపథ్యంలో రవాణా అధికారుల దాడులు

బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో బస్సు ప్రమాదం నేపథ్యంలో బెంగళూరులో రవాణాశాఖ అధికారులు శుక్రవారం మెరుపుదాడులు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న ప్రైవేటు బస్సులను తనిఖీ చేశారు. నిబంధనలు పాటించని 30 బస్సులను సీజ్ చేశారు. రవాణాశాఖ అదనపు కమిషనర్ ఓంకారేశ్వరి నేతృత్వంలో ఈ సోదాలు చేపట్టారు. తమిళనాడు, అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్ రిజిస్ట్రేషన్‌తో నడుస్తున్న బస్సులను తనిఖీ చేశారు. ఎలక్ట్రానిక్ సిటీ సమీపంలోని అత్తిబెలె చెక్‌పోస్ట్ వద్ద పలు ప్రైవేట్ బస్సులను పరిశీలించారు. నగరంలోని వివిధ ప్రాంతాలలో శుక్రవారం తెల్లవారుజాము నుంచే దాడులు చేస్తున్నామని కమిషనర్ ఓంకారేశ్వరి తెలిపారు. ఆలిండియా టూరిస్ట్ బస్సులను పరిశీలించామని, పలు బస్సులకు అనుమతి గడువు ముగిసినా తిరుగుతున్నట్లు గుర్తించామని అన్నారు. నిబంధనలు పాటించని 30 బస్సులను స్వాధీనం చేసుకున్నామని తెలిపారు. తనిఖీలలో ఆర్టీఓలు, బ్రేక్ ఇన్‌స్పెక్టర్‌లు పాల్గొన్నారు.



బెంగళూరులో సీజ్ చేసిన బస్సులతో రవాణాశాఖ అధికారులు



రాయితో అద్దాలు పగులగొట్టి.. పది మందిని కాపాడి

ధర్మవరం, అనంతపురం రూరల్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు జిల్లాలో జరిగిన బస్సు ప్రమాదం ఘటన నుంచి సుమారు పది మందిని కాపాడారు శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరానికి చెందిన హరీశ్. బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీరుగా పనిచేస్తున్న తాను.. స్నేహితులు జ్ఞానేందర్, వంశీ, మనీశ్వర్‌తో కలిసి కారులో హైదరాబాద్‌కు వెళ్లి తిరిగి వస్తుండగా శుక్రవారం తెల్లవారుజామున తమ కళ్లెదుటే బస్సు ప్రమాదం జరిగిందని హరీశ్ 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు. 'వెంటనే కారును రోడ్డు పక్కన ఆపేశాను. మంటల్లో చిక్కుకున్న బస్సు వద్దకు వెళ్లాం. రాయి తీసుకుని డ్రైవర్ సీటు పక్కన అద్దాలు పగులగొట్టాం. పది మందిని బయటికి లాగాం. మంటలు పూర్తిగా అంటుకోవడంతో ఎక్కువమందిని కాపాడటం సాధ్యపడలేదు. కాలిపోతున్నవారిని చూసి కన్నీరు ఆగలేదు. అవకాశం ఉంటే మరింతమందిని కాపాడేవాళ్లం. ఘోరం జరిగిపోయింది' అని ఆవేదన వ్యక్తం చేశారు. ఆ మార్గంలో వెళ్లేవారు వీడియోలు తీస్తున్నారేగానీ.. క్షతగాత్రులను కాపాడే ప్రయత్నం చేయలేదన్నారు.



పుట్టినరోజున మృత్యుంజయుడు

నా కుమార్తె చదువు కోసం బెంగళూరులో ఉంటున్నాను. వ్యాపార రీత్యా బెంగళూరు నుంచి హైదరాబాద్‌కు తరచూ ప్రయాణిస్తుంటాను. శుక్రవారం నా పుట్టినరోజు కావడంతో బెంగళూరు వెళ్లాలనుకుని రాత్రి అప్పటికప్పుడు బయలుదేరాను. ఆఖరి వరుసలో సీటు దొరికింది. ప్రమాదం క్షణాల్లో జరిగిపోయింది. ఏం జరిగిందో తెలుసుకునే లోపే పక్క ప్రయాణికులు పగలగొట్టిన ఎమర్జెన్సీ డోరు నుంచి కిందకు దూకాను. ఇంతలో బస్సులో నుంచి మహిళలు, చిన్నపిల్లల ఆర్తనాదాలు వినిపించాయి. ఒక్కసారిగా బస్సు అంతా మంటల్లో చిక్కుకుంది. గాయపడిన మమ్మల్ని అనంతపురానికి చెందినవారు కారులో కర్నూలు ఆసుపత్రికి తీసుకెళ్లారు. వైద్యులు ప్రాథమిక చికిత్స అందించారు. చికిత్స కోసం అధికారులు హైదరాబాద్‌కు తరలించారు. ఇది నాకు పునర్జన్మ.

- మల్లిడి గంగాధర రామారెడ్డి, పందలపాక, బిక్కవోలు మండలం, తూర్పుగోదావరి జిల్లా

పొరుగు మార్గంలో ప్రైవేటు



ట్రావెల్స్ ప్రమాదాలకు కారణాలు ఎన్నెన్నో

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సరిగ్గా పది రోజుల క్రితం రాజస్థాన్‌లో ఓ ట్రావెల్ బస్సు దగ్ధమైంది. అంతకుముందు ఇతర రాష్ట్రాలలో పలు ప్రమాదాలు సంభవించాయి. తాజాగా కర్నూలు జిల్లాలో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ప్రమాదాలు జరిగిన తీరును పరిశీలిస్తే అన్నింటిలోనూ కొన్ని సరూప్యతలు ఉన్నాయి. ప్రమాదానికి గురైన ఈ ప్రైవేటు బస్సులన్నీ స్లీపర్ క్లాస్‌వి. ఇందులో కొన్ని బీఎస్-6 వాహనాలు ఉన్నాయి. ఈ ప్రమాదాలన్నీ రాత్రివేళ అందులోనూ తెల్లవారుజామున జరిగాయి. బస్సులు దగ్ధం కావడంతో ప్రాణనష్టం ఎక్కువగా జరిగింది. తరచూ ఇలాంటి ప్రమాదాలు జరగడానికి కారణాలు ఏంటి? బీఎస్-6 వాహనాల్లో సమస్యలు ఏంటి? స్లీపర్ బస్సుల్లోని ప్రయాణికులు ప్రమాద సమయాల్లో త్వరగా బయటపడకుండా లోపలే చిక్కుకుపోవడానికి కారణాలేంటి? ప్రైవేటు ఆపరేటర్ల పాత్ర ఎంత? వంటి అంశాలను పరిశీలిస్తే.. ఎన్నో లోపాలు ఉన్నాయి..

ఈశాన్యంలో రిజిస్ట్రేషన్లు

రాష్ట్రానికి చెందిన ప్రైవేటు బస్సు ఆపరేటర్లు అధిక శాతం ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయిస్తున్నారు. అరుణాచల్‌ప్రదేశ్, నాగాలాండ్‌తో పాటు డామన్ అండ్ డయ్యూ వైపు వెళుతున్నారు. ఈ రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకుని ఆలిండియా పర్మిట్లు తీసుకుంటున్నారు. రిజిస్ట్రేషన్ ఎక్కడ చేయించినా ఆలిండియా పర్మిట్ తీసుకుంటే దేశంలో ఎక్కడి నుంచి ఎక్కడికైనా ప్రైవేటు బస్సులను నడుపుకొనే అవకాశం ఉంటుంది. ఏపీలో సింహభాగం ప్రైవేటు వాహనాలన్నీ నాగాలాండ్‌లోనే రిజిస్ట్రేషన్ చేయిస్తున్నారు. అక్కడైతే రోడ్ ట్యాక్స్ ఏడాదికి రూ.50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అదే మన రాష్ట్రంలో రిజిస్ట్రేషన్ చేయిస్తే ఏడాదికి రూ.5 లక్షలు చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. అరుణాచల్‌ప్రదేశ్‌లో అయితే ఆలిండియా పర్మిట్ ఏడాదికి కాకుండా ఐదు సంవత్సరాలకు కూడా ఇస్తున్నారు. నాగాలాండ్ లేదా ఇతర ఈశాన్య రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకోవటం చాలా సులభం. వాహనం లేకపోయినా కేవలం వాట్సాప్‌లో కాగితాలు పంపిస్తే గంటల్లోనే రిజిస్ట్రేషన్లు జరిగిపోవడంతో పాటు నంబర్ సైతం వచ్చేస్తుంది. అక్కడ ఫిజికల్ వెరిఫికేషన్ పెద్దగా లేకపోవటం, ఫైర్ సేఫ్టీ స్టాండర్డ్ సర్టిఫికెట్లు అడగకపోవటం వల్ల గంటల్లోనే పని అయిపోతుంది. మన రాష్ట్రం విషయానికొస్తే నిబంధనలు కఠినతరం. ఈ కారణాల వల్ల రాష్ట్రానికి రావాల్సిన ఆదాయం పోవడమే గాక ఇతర రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించిన ప్రైవేటు బస్సులపై అధికారం ఏపీ రవాణా శాఖకు పూర్తి స్థాయిలో ఉండదు. పెట్రోల్, డీజిల్‌పై వ్యాట్, సెస్సుల భారం తగ్గడం కోసం ఇతర రాష్ట్రాలలో ఏ విధంగా డీజిల్ కొట్టించుకుంటున్నారో.. అదేవిధంగా రోడ్డు ట్యాక్స్ తగ్గించుకోవడం కోసం నాగాలాండ్ తదితర రాష్ట్రాలలో రిజిస్ట్రేషన్లు చేయించుకుంటున్నారు. ఈ అంశాలను రాష్ట్ర రవాణా శాఖ ఉన్నతాధికారులు పట్టించుకోలేదు. ప్రైవేటు వాహనాలు రాష్ట్రానికి చెందినవే అయినా.. వాటి ద్వారా వచ్చే ఆదాయాన్ని మాత్రం పొరుగు రాష్ట్రాలు తన్నుకుపోయే పరిస్థితి ఏర్పడింది. ఆదాయం సంగతి అటుంచితే.. ప్రమాణాలను పాటించకపోవటం వల్ల ఇతర రాష్ట్రాల రిజిస్ట్రేషన్ల బస్సులు ఇక్కడి ప్రజలు, ప్రయాణికుల ప్రాణాలు తీస్తున్నాయి. పెద్ద ప్రమాదాలు జరిగినపుడే వ్యవస్థలోని లోపాలపై చర్చలు జరుగుతున్నాయి. ఆ తర్వాత కొన్నాళ్లకు అంతా మర్చిపోతారు.

అనుకూలంగా ఆలిండియా పర్మిట్

దక్షిణాది రాష్ట్రాల్లో ప్రభుత్వాలకు రవాణా ఆదాయం వేల కోట్లలో ఉంటోంది. ఉత్తరాదిలో తక్కువగా ఉండగా.. ఈశాన్యంలో మరీ తక్కువ. మన రాష్ట్రంలో ఒక బస్సు ఏడాది పాటు రోడ్లపై తిప్పాలంటే మూడు నెలలకు 1.64 లక్షలు రవాణా శాఖకు ఆపరేటర్ చెల్లించాలి. అదే ఈశాన్య రాష్ట్రాలైతే ఏడాదికి ఒకసారి 50 వేలు చెల్లిస్తే సరిపోతుంది. అక్కడ రిజిస్టరైన బస్సును ఏపీలో తిప్పడానికి ఆలిండియా పర్మిట్ (ఏడాదికి రూ.2లక్షలు) కేంద్రం జారీ చేస్తుంది. ఆ రెండు లక్షలు రాష్ట్రాలకే పంచుతామని చెప్పడంతో అందుకు రాష్ట్రాలు సమ్మతించాయి. తాజాగా కర్నూలు సమీపంలో ప్రమాదానికి గురైన ట్రావెల్ బస్సు హైదరాబాద్‌లో బయలుదేరింది. కర్నూలు, అనంతపురం మార్గంలో బెంగళూరుకు చేరాల్సి ఉంది. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్, కర్ణాటక.. మూడు రాష్ట్రాలలో ప్రయాణించాలి. దీంతో కేంద్రం ఈ బస్సుకు సంబంధించి ఆ రెండు లక్షలు మూడు రాష్ట్రాలకూ పంపిణీ చేస్తుంది. ట్రావెల్ ఆపరేటర్లు ఈ అవకాశాన్ని తమకు అనుకూలంగా మలచుకుంటున్నారు. తక్కువ ఫీజులున్న ఈశాన్య రాష్ట్రాల్లో రిజిస్ట్రేషన్లు చేయించుకుని, ఎక్కువ ప్రయాణ చార్జీలు భరించే శక్తి ఉన్న దక్షిణాది రాష్ట్రాలలో బస్సులు నడుపుతూ భారీ లాభాలు ఆర్జిస్తున్నారు.

బీఎస్-6 వాహనాలు.. ప్రమాదాలు

ఇటీవల బీఎస్-6 ప్రైవేటు, ఆర్టీసీ బస్సులు తరచూ అగ్నిప్రమాదాలకు గురవుతున్నాయి. ఈ వాహనాల్లో లోపాలు డ్రైవర్లకు అర్థం కావడం లేదు. గతంలో బస్సులలో ఏవైనా లోపాలుంటే రన్నింగ్‌లో డ్రైవర్లకు తెలిసేవి. బీఎస్-6 వాహనాలన్నీ ఎక్కువగా వైర్లు, సెన్సార్లతో పనిచేస్తున్నాయి. బస్సు ఆగిపోతే టోల్ ఫ్రీ నంబర్‌కు ఫోన్ చేస్తారు. వాహన తయారీ కంపెనీ ప్రతినిధి ల్యాప్‌టాప్ తీసుకుని వస్తే తప్ప సమస్య తెలుసుకోలేని పరిస్థితి. సర్వీసు సెంటర్లు తగినన్ని లేక బస్సు ఆగిన చోటుకు రావడానికే రెండు రోజులు పడుతోంది. వైరింగ్ వల్ల షార్ట్ సర్క్యూట్ సంఘటనలు ఎక్కువగా జరుగుతున్నాయని డ్రైవర్లు చెబుతున్నారు. బీఎస్-6 బస్సులలో డీజిల్‌లో పొగ రాకుండా ఉండటం కోసం బ్లూ ఆయిల్ వినియోగాన్ని తప్పనిసరి చేశారు. బ్లూ ఆయిల్‌కు చాలా త్వరగా మండే స్వభావం ఉంటుంది. దీంతో ప్రమాద సమయాల్లో పేలుడు సంభవిస్తున్న ఉదంతాలు కూడా ఉన్నాయని చెబుతున్నారు. బీఎస్-6 వాహనాలలో అద్దాలను కదలకుండా ఫిక్స్ చేయటం వల్ల కూడా ప్రమాద సమయాల్లో ప్రయాణికులు ప్రాణాలను కాపాడుకోలేక పోతున్నారు.

స్లీపర్ బస్సుల్లో డిజైన్ లోపాలు

దేశవ్యాప్తంగా పలు రాష్ట్రాల్లో స్లీపర్ బస్సులు ఎక్కువగా ప్రమాదాలకు గురవుతున్నాయి. ప్రమాదంలో మృతుల సంఖ్య పెరగడానికి డిజైన్లలో లోపాలు ముఖ్య కారణమని రవాణా రంగ నిపుణులు చెబుతున్నారు. సాధారణంగా స్లీపర్ బస్సుల్లో 36 వరకూ బెర్తులుంటే మల్టీ యాక్సిల్ బస్సుల్లో 40వరకూ ఉంటాయి. డ్రైవర్ వెనక నుంచి రెండు బెర్తులు అనుసంధానించి బస్సు చివరి వరకూ ఆరు వరుసలు పైనా, కిందా ఉంటాయి. అదేవిధంగా బస్సుకు ఎడమ వైపు సింగిల్ బెర్తులు కింద ఒకటి, పైన మరొకటి ఉంటాయి. వాటి మధ్యలో నడవాలంటే ప్రయాణికులకు దారి చిన్నగా ఉంటుంది. ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు వెంటనే కిందికి దిగాలంటే డబుల్ బెర్తుల్లో కిటికీ వైపు ఉండే ప్రయాణికుడికి ఇటు వైపు ఉండే ప్రయాణికుడు దారిస్తే కానీ సాధ్యం కాదు. అలాగాకుండా గతంలో ఉన్న డిజైన్ల(అడ్డంగా)లో బెర్తులు రూపొందిస్తే అన్నీ సింగిల్ ఉంటాయి గనుక దిగేందుకు సులభంగా ఉంటుంది. ప్రమాద సమయాల్లో వీలైనంత త్వరగా బయటపడేందుకు అవకాశం ఉంటుంది. అయితే ఈ డిజైన్ వల్ల బెర్తుల సంఖ్య తగ్గిపోతుందని ట్రావెల్ ఆపరేటర్లు అభ్యంతరాలు చెప్పడంతో వాహన తయారీ కంపెనీలు డిజైన్ మార్చేశాయి. డిజైన్లపై కేంద్ర ప్రభుత్వం పునఃసమీక్షించి చర్యలు తీసుకోవాలని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.



బైక్‌పై శివశంకర్ (ఫైల్)

ఆఖరి ప్రయాణం



జాతీయ రహదారిపై దగ్ధమైన బస్సు

తెల్లారేలోగా పనిలో చేరాలని..!

కర్నూలు/కర్నూలు న్యూసిటీ: 'అమ్మా ఉదయాన్నే పని ఉంది. అర్ధరాత్రే బయలుదేరి వెళ్తా. ఇంటికొస్తా కొత్త టీవీ తెస్తా' అని చెప్పి వెళ్లిన కొడుకు శవమయ్యాడు. తెలంగాణ రాష్ట్రం జోగులాంబ గద్వాల జిల్లా అలంపూర్ మండలం కసాపురం గ్రామానికి చెందిన యశోద, నాగన్న దంపతులకు శ్రీహరి, శివశంకర్.. సంతానం. 2015లో నాగన్న మృతి చెందడంతో తల్లి యశోదతో కలసి కర్నూలు నగర శివారులో ప్రజానగర్‌లో వారు జీవితాన్ని మొదలుపెట్టారు. శివశంకర్ ఇళ్లలో గ్రానైట్ రాళ్లు పరిచే పని చేస్తున్నాడు. అన్న శ్రీహరి, తల్లి యశోద భవన నిర్మాణ పనులకు వెళ్తూ బతుకు బండి లాగిస్తున్నారు. ఇల్లు గడవాలంటే బండలు పరవాల్సిందే. గురువారం రాత్రి మేస్త్రీ ఫోన్ చేసి 'డోన్‌లో పనుంది. తెల్లారేపాటికి రావాలి' అని చెప్పాడు. దీంతో శుక్రవారం అర్ధరాత్రి సుమారు 2.15 గంటలకు శివశంకర్ తన పల్సర్ బైక్‌పై బయలుదేరాడు. బస్సు ఢీకొట్టడంతో ఎగిరి రోడ్డు పక్కనపడి చనిపోయాడు. ఈ బైకు, బస్సు ఢీకొన్న ప్రమాదమే మరో 19 మంది మరణానికి కారణమైంది.

ఎస్పీకి ఫోన్ చేసి సమాచారం



కర్నూలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): బస్సు ప్రమాదం జరిగిన వెంటనే ఓ మహిళ స్పందించి నేరుగా కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు సమాచారం ఇచ్చారు. హైదరాబాద్‌కు చెందిన హేమారెడ్డి అనే మహిళ పుట్టపర్తికి వెళ్లి.. గురువారం రాత్రి 11గంటలకు కారులో తిరుగు ప్రయాణమయ్యారు. ఆ వాహనం ప్రమాద స్థలం వద్దకు రాగానే.. ఓ బస్సు మంటల్లో కాలిపోతోందని డ్రైవర్ చెప్పడంతో ఆమె కారు దిగి అక్కడికి చేరుకున్నారు. అక్కడ ఓ వ్యక్తి వద్ద ఫోన్ అడిగి.. తనకు తెలిసిన ఓ పోలీస్ అధికారికి కాల్ చేసి కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ నంబర్ తీసుకున్నారు. వెంటనే ఎస్పీకి ఫోన్‌చేసి బస్సు ప్రమాదం సమాచారం ఇచ్చారు.

12 మందిని కాపాడిన రెండో డ్రైవర్!

కనిగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాద ఘటనలో డ్రైవర్ భయంతో అక్కడి నుంచి పారిపోగా.. రెండో డ్రైవర్ ప్రాణాలకు తెగించి 12 మందిని కాపాడారు. ప్రమాదానికి గురైన బస్సులో ప్రకాశం జిల్లా కనిగిరి పట్టణంలోని బీసీ కాలనీకి చెందిన గుడిపాటి శివనారాయణ కూడా డ్రైవర్‌గా పనిచేస్తున్నారు. తన బీట్ (నడిపే ప్రాంతం) వరకు బస్సు నడిపిన తర్వాత శివనారాయణ మరో డ్రైవర్ లక్ష్మయ్యకు డ్రైవింగ్ అప్పగించి బస్సువెనుక డిక్కీలో పడుకున్నారు. ప్రమాదం జరిగిన తర్వాత లక్ష్మయ్య బస్సు ఆపి శివనారాయణను నిద్రలేపాడేజ ఆ సమయంలోనే మంటలు చెలరేగడంతో లక్ష్మయ్య అక్కడినుంచి పారిపోగా.. శివనారాయణ జాకీతో అద్దాలు పగులగొట్టి దాదాపు 12 మందిని బయటికి రప్పించారు.

స్నేహితుడి కోసం నిరీక్షణే కాపాడింది!

కర్నూలు, హైదరాబాద్, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): కర్నూలు బస్సు ప్రమాదం నుంచి ఓ నేవీ కమాండర్ లక్కీగా తప్పించుకొన్నారు. సికింద్రాబాద్‌కు చెందిన తరుణ్ కుమార్ (27) బెంగుళూరులో నేవీలో లెఫ్టినెంట్ కమాండర్‌గా పనిచేస్తున్నారు. దీపావళికి ఇంటికి వచ్చిన ఆయన సెలవులు ముగియడంతో బెంగళూరు వెళ్లేందుకు గురువారం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో టికెట్ బుక్ చేసుకున్నారు. రాత్రి 10గంటలకు లక్డికాపూల్ వద్ద ఆయన బస్సు ఎక్కాల్సి ఉంది. అయితే స్నేహితుడి కోసం నిరీక్షిస్తూ.. బస్సు డ్రైవర్‌కు ఫోన్ చేసి శంషాబాద్‌లో ఎక్కుతానని చెప్పారు. రాత్రి 11.20 గంటలకు బస్సు శంషాబాద్‌కు చేరుకున్నాక డ్రైవర్ ఫోన్ చేస్తే మీరు వెళ్లిపోండని చెప్పారు. ఓ గంట తర్వాత తరుణ్ కుమార్ మరో బస్సులో బెంగుళూరుకు బయల్దేరారు. స్నేహితుడి కోసం నిరీక్షించడమే తన ప్రాణాలు కాపాడిందని తరుణ్‌కుమార్ చెప్పుకొచ్చారు.

అగ్నికి ఆహుతి!



(మొదటి పేజీ తరువాయి)

అక్కడ ఉండాలని అర్ధరాత్రి తర్వాతే బయల్దేరాడు. కానీ... అతడిని దురదృష్టం వెంటాడింది. శివశంకర్ పల్సర్ బైక్‌ను వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సు వెనుక నుంచి బలంగా ఢీకొట్టింది. శివశంకర్ ఎగిరి రోడ్డుపక్కన పడిపోయాడు. బైక్ మాత్రం బస్సు కిందికి వెళ్లి... ముందు వైపున్న యాక్సిల్‌లో ఇరుక్కుంది. 'దడేల్' అంటూ పెద్ద శబ్దం... కుదుపు! ప్రయాణికుల్లో కొందరికి మెలకువ వచ్చింది కానీ... ఏం జరిగిందో తెలియదు! ఆ సమయంలో బస్సు గంటకు 80 నుంచి 90 కిలోమీటర్ల వేగంతో వెళుతోంది. అప్పటికప్పుడు బ్రేక్ వేసి, బస్సును ఆపి ఉంటే సరిపోయేది. కానీ... ప్రమాదం జరిగిందన్న కంగారువల్లో, మరే కారణం చేతనో డ్రైవర్ ఆ పని చేయలేదని తెలుస్తోంది. సుమారు 200 మీటర్లు అలాగే.. బస్సును ముందుకు తీసుకెళ్లాడు! దాని ఫలితమే...

కాల్చేసిన నిప్పు రవ్వలు

బస్సు కింద ఇరుక్కుపోయిన బైక్... రోడ్డును బలంగా రాసుకుంటూ అలాగే వచ్చేసింది! ఈ క్రమంలో బైక్ పెట్రోల్ ట్యాంక్ మూత ఊడిపోయింది. పెట్రోల్ బయటికి చిమ్మింది. బైక్, రోడ్డు మధ్య జరిగిన రాపిడితో నిప్పు రవ్వలు ఎగిశాయి. పెట్రోలు అంటుకుంది. దాంతోపాటు బస్సుకు కూడా మంటలు వ్యాపించాయి. డ్రైవర్ లక్ష్మయ్య వెంటనే బయటకు దూకాడు. వెనుక వైపు డిక్కీలో నిద్రిస్తున్న మరో డ్రైవర్ శివనారాయణను లేపాడు. 'బస్సుకు మంటలు అంటుకున్నాయి' అని కేకలు వేసి... అక్కడి నుంచి వెళ్లిపోయాడు.

మృతులు వీరే..

పేరు	స్వస్థలం
గోళ్ల రమేశ్(36)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల అనూష(27)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల శశాంక్(7)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
గోళ్ల మాన్విత(4)	ఆంధ్రప్రదేశ్ (నెల్లూరు జిల్లా)
కొవ్వూరు శ్రీనివాసరెడ్డి(39)	ఆంధ్రప్రదేశ్ (రావులపాలెం)
గన్నమనేని ధాత్రి(27)	ఆంధ్రప్రదేశ్ (బాపట్ల జిల్లా)
గిరిరావ్(48)	తెలంగాణ (హైదరాబాద్)
అగ్ర బందోపాధ్యాయ్(23)	తెలంగాణ (హైదరాబాద్)
చందన(23)	తెలంగాణ
సంధ్యారాణి(43)	తెలంగాణ
అనూష(22)	తెలంగాణ
మేఘనాథ్(25)	తెలంగాణ
ప్రశాంత్(32)	తమిళనాడు(పాలక్కాడ్)
ఇవన్ శంకర్‌రాజు(22)	తమిళనాడు
ఫిలోమెన్‌బేబీ(64)	కర్ణాటక
కిశోర్‌కుమార్(41)	కర్ణాటక
అమ్రిత్‌కుమార్(18)	బిహార్
కె.దీపక్‌కుమార్(24)	ఒడిశా
గుర్తు తెలియని వ్యక్తి	---
బి.శివశంకర్(21)	బైకర్(కర్నూలు)

బస్సులోపలున్న ప్రయాణికులను మృత్యుకీలలు ఆవరించడం మొదలైంది. బైక్‌ను ఢీకొట్టిన సమయంలో వచ్చిన శబ్దానికి మేల్కొన్న కొందరు ప్రయాణికులు బస్సు డ్రైవర్ వెళ్లిన మార్గంలోనే కిందికి దూకారు. 'మంటలు... మంటలు... బస్సుకు నిప్పంటుకుంది దూకండి.. దూకండి' అంటూ బిగ్గరగా కేకలు వేశారు. గాఢ నిద్రలో ఉన్న వారు ఉలిక్కిపడి లేచారు. అప్పటికే పొగలు కమ్ముకుంటున్నాయి. మంటలు, వేడికి సెన్సర్లు పనిచేయకపోవడంతో... 'ఆటోమేటిక్ డోర్లు' లాక్ అయిపోయాయి. అత్యవసర (ఎమర్జెన్సీ) ద్వారాలు కూడా తెరుచుకోలేదు. అద్దాలు పగలగొట్టేందుకు అవసరమైన 'హ్యామర్లు' కూడా కనిపించలేదు. లోపలున్న వారిది దిక్కుతోచని పరిస్థితి! చేతులతో, భుజాలతో అద్దాలు పగలగొట్టేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. ఈలోపే... రెండో డ్రైవర్ శివనారాయణ జాకీ తీసి బయటి నుంచి అద్దాలు పగొలగొట్టాడు. బస్సు వెనుకే మరో కారులో వెళుతున్న హరీశ్ అనే వ్యక్తి తన స్నేహితులతో కలిసి రాళ్లతో అద్దాలు బద్దలు కొట్టాడు. దీంతో... లోపలున్న ప్రయాణికుల్లో కొందరు చకచకా కిందికి దూకారు. అప్పటికే బస్సు మొత్తం మంటలు వ్యాపించాయి. ముందు వైపున స్లీపర్ బెర్తుల మధ్య ఇరుక్కున్న వారు బయటికి వచ్చే మార్గమే కనిపించలేదు. వారంతా నిస్సహాయ స్థితిలో.. అగ్ని కీలల మధ్య ఆర్తనాదాలు చేస్తూ సజీవ దహనమయ్యారు. మృతదేహాలన్నీ గుర్తుపట్టలేనంతగా... మాంసపు ముద్దలుగా మారాయి. ప్రమాద విషయం తెలియగానే కర్నూలు రేంజ్ డీఐజీ కోయ ప్రవీణ్, ఎస్పీ విక్రాంత్ పాటిల్, కర్నూలు, డోన్ డీఎస్పీలు, పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది, వైద్య సిబ్బంది అక్కడికి చేరుకున్నారు. పోలీసులు వచ్చేసరికే... ఆరుగురు క్షతగాత్రులు ఒక ప్రైవేట్ వాహనాల్లో వారంతట వారే ఆస్పత్రికి చేరుకున్నారు. మిగిలిన వారిని అంబులెన్స్‌లలో ఆస్పత్రికి తరలించారు. బుగ్గిగా మారిన బస్సులో చెల్లాచెదురుగా పడిపోయిన మృతదేహాలను జాగ్రత్తగా ఒకచోట చేర్చారు. డీఎన్ఏ పరీక్షలు చేసిన తర్వాత మృతదేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పగిస్తామని ఎస్పీ విక్రాంత్ పాటిల్ పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ఆదేశాల మేరకు హోం మంత్రి వంగలపూడి అనిత, మంత్రి రాంప్రసాద్‌రెడ్డి, డీజీపీ హరీష్‌కుమార్ గుప్తా కర్నూలుకు చేరుకుని ఘటనా స్థలాన్ని పరిశీలించారు. మృతులలో తెలంగాణ రాష్ట్రానికి చెందిన వారూ ఉండటంతో ఆ రాష్ట్ర మంత్రి జూపల్లి కృష్ణారావు, అలంపూర్ ఎమ్మెల్యే విజయుడుతో కలిసి సంఘటన స్థలానికి పరిశీలించారు. పోలీసులు ఇద్దరు డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నారు. బైకును ఢీకొన్న తర్వాత బస్సును ఆపితే తనపై దాడి చేస్తారేమోనని అలాగే ముందుకు వెళ్లినట్లు లక్ష్మయ్య అనే డ్రైవర్ విచారణలో చెప్పాడు.

ఆ బస్సులో భారీగా కొత్త సెల్‌ఫోన్లు

కర్నూలు క్రైం: కాలిపోయిన వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సులో ఖరీదైన 234 సెల్‌ఫోన్లు దగ్ధమయ్యాయి. హైదరాబాద్‌కు చెందిన మంగనాథ్ అనే వ్యాపారి రూ.46లక్షలు విలువైన రియల్‌మీ కంపెనీ సెల్‌ఫోన్ల బాక్సులను బస్సులో పార్సిల్ చేశారు. ఇవి బెంగళూరులోని ఫ్లిప్‌కార్టుకు చేరాల్సి ఉంది. అక్కడి నుంచి కస్టమర్లకు అవి సరఫరా అవుతాయి. ప్రమాద విషయం తెలుసుకున్న ఆయన హైదరాబాద్ నుంచి ప్రమాద స్థలానికి చేరుకుని, లబోదిబోమన్నారు. కాగా.. ప్రమాదంలో మంటల తీవ్రత పెరగడానికి ఈ సెల్‌ఫోన్ల బ్యాటరీలు పేలిపోవడం కూడా ఓ కారణమేనని ఫోరెన్సిక్ నిపుణులు అంటున్నారు. మంటలకు ఆ ఫోన్లు కాలిపోవడంతో బ్యాటరీలు పేలిపోయిన శబ్దం వచ్చిందని ప్రత్యక్ష సాక్షులు కూడా చెప్పారు.



బస్సు కింద ఇరుక్కు పోయిన బైక్ పెట్రోల్ ట్యాంక్



నా రెండు కాళ్లు విరిగాయి


25 ఏళ్ల క్రితం బతుకుదెరువు కోసం తల్లిదండ్రులు హైదరాబాద్ వచ్చారు. మూసాపేటలో నివాసం ఉంటున్నాం. బీటెక్ పూర్తి చేశాను. బెంగళూరులో ఇంటర్వ్యూ ఉండటంతో గురువారం రాత్రి బయల్దేరాను. బస్సులో మంటలు చెలరేగడంతో అద్దాన్ని పగులకొట్టి బయటికి దూకేశాను. నా రెండు కాళ్లు విరిగాయి. ప్రస్తుతం నంద్యాల ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాను. నా కళ్లెదుటే బస్సు మంటల్లో ప్రయాణికులు కాలిపోయారు.

- జయసూర్య, నెమళ్లదిన్నె,
పెద్దముడియం మండలం, కడప జిల్లా



సంఘటనా స్థలం వద్ద హోంమంత్రి అనిత, డీజీపీ హరీష్ గుప్తా, అధికారులు

ఒక కుటుంబం ఆహుతి



ప్రమాదంలో ఆహుతైన కుటుంబం

దుత్తలూరు/ఉదయగిరి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వారిద్దరూ మిత్రులు. నెల్లూరు జిల్లాలోని రెండు ప్రాంతాలకు చెందిన వారే అయినా.. ఉన్న ఊరిలో ఉపాధి లేక పొట్ట చేత పట్టుకుని కుటుంబ సమేతంగా బెంగళూరుకు వలస వెళ్లారు. ఒకే సంస్థలో పనిచేస్తున్న సమయంలో స్నేహితులయ్యారు. బాధలు, సంతోషాలను పంచుకుంటూ రెండు కుటుంబాలవారు ఎంతో అన్యోన్యంగా జీవనం సాగిస్తున్నారు. ఈ క్రమంలో దీపావళిని సంతోషంగా జరుపుకొనేందుకు హైదరాబాద్‌లోని మిత్రుడి సోదరి ఇంటికి ఉమ్మడిగా వెళ్లారు. వేడుకలు ముగించుకుని తిరిగి బెంగళూరుకు వస్తుండగా కావేరీ బస్సు ప్రమాదంలో మిత్రులలోని ఓ కుటుంబం మరణించగా.. మరో కుటుంబం మృత్యుంజయులుగా బయటపడింది. నెల్లూరు జిల్లా దుత్తలూరు మండలం కొత్తపేటకు చెందిన నెలకుర్తి రమేశ్, వింజమూరు మండలం గోళ్ల వారిపాళెం గ్రామానికి చెందిన గోళ్ల రమేశ్ బెంగళూరులోని హిందూస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ పరిశ్రమలో మార్కెటింగ్ డిపార్టుమెంట్‌లో పనిచేస్తున్నారు. దీపావళిని ఘనంగా జరుపుకునేందుకు రెండు కుటుంబాలు కలిసి హైదరాబాదులోని నెలకుర్తి రమేశ్ అక్క నివాసానికి వెళ్లారు. అక్కడ దీపావళిని జరుపుకొన్నారు. అనంతరం కుటుంబాలతో కలిసి హైదరాబాద్ నగరంలోని పలు ప్రాంతాలను సందర్శించారు. తిరిగి బెంగళూరుకు వెళ్లేందుకు హైదరాబాదు నుంచి ఆ రెండు కుటుంబాలు బస్సులో బయలుదేరాయి. బస్సు కర్నూలుకు సమీపంలో ప్రమాదం సంభవించి దగ్ధమవడంతో గాఢ నిద్రలో ఉన్న గోళ్ల రమేశ్ కుటుంబం అగ్నికి ఆహుతైంది. ప్రమాదంలో కుమారుడు గోళ్ల రమేశ్(31), కోడలు అనూష(27), మనుమలు శశాంత్(7), మాన్విత(4) ప్రాణాలు కోల్పోవడంతో రమేశ్ తల్లిదండ్రులు గోళ్ల మాలకొండయ్య, సుశీల కన్నీరు మున్నీరయ్యారు.

బస్సు కుదుపులతో మేల్కొన్నా: నెలకుర్తి రమేశ్

నిద్రలో ఉన్న తనకు బస్సు కుదుపులతో మెలకువ వచ్చిందని నెలకుర్తి రమేశ్ తెలిపారు. బస్సు ప్రమాద సంఘటనను 'ఆంధ్రజ్యోతి'కి ఆయన వివరించారు. "బస్సులో అంతా గాఢనిద్రలో ఉన్నారు. ఒక్కసారిగా బస్సు కుదుపులకు గురైంది. నేను నిద్రలో నుంచి తేరుకున్నా. బస్సు డ్రైవర్ మోటార్‌బైక్‌ను ఢీకొట్టి సుమారు 200 మీటర్ల వరకు ఈడ్చుకొని వెళ్లాడు. ఆ సమయంలో మోటార్‌బైక్ బస్సు కిందనే ఉండడంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. వెంటనే నేను కూర్చున్న సీటు పక్కనే ఉన్న అద్దాన్ని పగలకొట్టి నా భార్య శ్రీలక్ష్మి, కుమారుడు అభిరామ్, కుమార్తె జశ్వితలను కిందకు తోసి నేను కూడా దూకేశా. అనంతరం మరికొందరు అందులో నుంచే బయటకు వచ్చారు. అప్పటికే బస్సు పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదం జరగ్గానే డ్రైవర్ బస్సును ఆపి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదు. నాకు, తన కుటుంబానికి ఆప్తుడైన గోళ్ల రమేశ్ కుటుంబాన్ని కోల్పోవడం బాధాకరం." అని అన్నారు.

కన్నీటి మంట ఊరట చెమ్మ!

గురువారానికి వాయిదానే ప్రాణాలు తీసింది



మెదక్ రూరల్ మండలం శివాయిపల్లికి చెందిన ఆ ఇద్దరు తల్లీ కూతుళ్లది ఎంత దురదృష్టం! ప్రయాణాన్ని వాయిదాలు వేస్తూ వేస్తూ చివరికి మృత్యువును ఆహ్వానించుకున్నారేమో అనిపిస్తోంది. ఐటీ ఉద్యోగి అయిన కుమార్తె చందనను బెంగళూరులో దిగబెట్టి.. తాను మస్కట్‌లో భర్త ఆనంద్‌గౌడ్ వద్దకు వెళ్లాలనేది తల్లి సంధ్యారాణి ప్రణాళిక. సెప్టెంబరు 14న తన తండ్రి సంవత్సరీకం కోసం సంధ్యారాణి మస్కట్ నుంచి స్వస్థలానికొచ్చింది. సెలవులు రావడంతో చందన కూడా తల్లి వద్దకొచ్చింది. తల్లీకూతుళ్లు 15 రోజుల క్రితమే తిరుగు ప్రయాణం పెట్టుకున్నా సంధ్యారాణికి జ్వరం రావడంతో వాయిదా వేసుకున్నారు. ఆ తర్వాత మెదక్‌లో శుభకార్యం ఉండటంతో ఆలస్యమైంది. చివరికి.. బుధవారం బెంగళూరు బస్సెక్కాలనుకున్నా చివరి క్షణాల్లో వాయిదా వేసుకున్నారు. గురువారం వేమూరి కావేరి ట్రావెల్స్ బస్సెక్కి ప్రమాదంలో ఇద్దరూ మృత్యువాతపడ్డారు.

'నాన్నా.. బస్ ఎక్కా'.. అదే చివరిమాట!



యాదాద్రి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరుకు చెందిన 22 ఏళ్ల మహేశ్వరం అనూషా రెడ్డి సాఫ్ట్‌వేర్ ఇంజనీర్. నిరుడే బెంగళూరులోని ఓ కంపెనీలో చేరింది. దీపావళి కోసం ఈనెల 16న స్వగ్రామానికొచ్చింది. గురువారం బెంగళూరుకు తిరుగు ప్రయాణం అయ్యేందుకు హైదరాబాద్‌కొచ్చింది. రాత్రి లకిడీకాపూల్‌లో బస్సెక్కింది. రాత్రి 9:30కు తండ్రి శ్రీనివాస్ రెడ్డికి ఫోన్ చేసి 'నాన్న బస్ ఎక్కా'నని చెప్పింది. తమ బిడ్డ నుంచి అవే చివరిమాటలయ్యాయని దంపతులు శ్రీనివాస్‌రెడ్డి, విజిత గుండెలవిసేలా రోదిస్తున్నారు.

దీపావళికి హైదరాబాద్ వచ్చి..



ఖమ్మం జిల్లాకు చెందిన చిత్తారు శ్రీనివాసరావు, విజయలక్ష్మి కుమారుడు మేఘనాథ్ (25)కు ఐటీ కంపెనీలో చక్కని ఉద్యోగం వచ్చిందన్న సంతోషం వారికి ఏడాదైనా మిగల్లేదు. బస్సు ప్రమాదంలో అతడు సజీవదహనమయ్యాడని తెలిసి ఆ దంపతులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఏడు నెలల క్రితం మేఘనాథ్‌కు బెంగళూరులో ఉద్యోగం వచ్చింది. దీపావళికి హైదరాబాద్‌కొచ్చి.. గురువారం తిరుగు ప్రయాణమై ప్రమాదంలో మరణించాడు.

సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని పెళ్లి కల 'బుగ్గి'



ఇంకొల్లు/బాపట్ల/రావులపాలెం/అనపర్తి: అగ్ని ప్రమాదం.. కొన్నాళ్లలో పెళ్లి పీటలెక్కాల్సిన సాఫ్ట్ వేర్ ఉద్యోగిని బలి తీసుకుంది. బాపట్ల జిల్లా ఇంకొల్లు మండలం పూసపాడుకు చెందిన గన్నమనేని ధాత్రి(27) బెంగళూరులో సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం చేస్తున్నారు. దీపావళి సెలవులకు హైదరాబాద్‌లోని మేనమామ శ్రీకాంత్ ఇంటికి వెళ్లారు. సెలవులు ముగించుకుని బెంగళూరుకు తిరిగి వెళుతూ కావేరీ బస్సు ఎక్కి.. మృత్యువాత పడ్డారు. త్వరలోనే ఆమెకు వివాహం చేయాలని భావించామని.. ఇంతలోనే అనంతలోకాలకు వెళ్లిపోయిందంటూ తల్లి వాణి కన్నీరుమున్నీరుగా విలపించారు.

బంధువుల ఇంటికి వచ్చి తిరిగి వెళ్తూ..



బెంగళూరు, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): అనారోగ్యంతో ఉన్న తల్లి సేవ కోసం వేల రూపాయల వేతనాన్ని, ఉద్యోగాన్ని కూడా వదులుకుని తల్లిసేవలో పునీతులవుతున్నారు. కానీ, కర్నూలు జిల్లాలో జరిగిన ఘోర బస్సు ప్రమాదం ఆ తల్లిని, కుమారుడిని కూడా బలితీసుకుంది. బెంగళూరు టిన్ ఫ్యాక్టరీ ప్రాంతంలోని నారాయణపురలో నివసిస్తున్న ఫిలోమిన్ బేబి(64), ఆమె కుమారుడు కిశోర్ కుమార్(41) బస్సు ప్రమాదంలో సజీవదహనమయ్యారు. కిశోర్ కుమార్ ఉద్యోగం చేసేవారు. తల్లికి సేవ చేసేందుకు పెళ్లిని, ఉద్యోగాన్ని కూడా వదులుకున్నారు. ఫిలోమినా బంధువులు హైదరాబాద్‌లో ఉన్నారు. వారితో కొంతకాలం గడిపేందుకు తల్లీకొడుకు ఇటీవల అక్కడకు వెళ్లారు. హైదరాబాద్ నుంచి తిరిగి బెంగళూరుకు కావేరీ బస్సులో వస్తుండగా జరిగిన ప్రమాదంలో ఇరువురు అశువులు బాశారు.

ప్రమాదంపై అన్ని కోణాల్లో దర్యాప్తు

» మృతదేహాలను గుర్తించేందుకు 16 మందితో ఫోరెన్సిక్ టీం: హోం మంత్రి అనిత

కర్నూలు క్రైం, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): కర్నూలు-బస్సు ప్రమాదంపై అన్ని కోణాల్లోనూ దర్యాప్తు చేస్తున్నట్లు ఏపీ హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. శుక్రవారం ఆమె ఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం కర్నూలు జిల్లా పోలీసు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. ప్రాథమిక సమాచారం మేరకు.. బస్సులో మొత్తం 39 మంది పెద్దలు, నలుగురు చిన్నారులు ఉన్నట్లు మంత్రి అనిత తెలిపారు. మరో ఇద్దరు గుర్తు తెలియని వ్యక్తులు అరంఘర్ చౌరస్తా వద్ద ఎక్కగా, అందులో ఒకరు దిగిపోయారన్నారు. ఎదురుగా వస్తున్న బైక్‌ను బస్సు ఢీకొని 200 మీటర్ల దూరం వరకు ఈడ్చుకు వెళ్లడంతో మంటలు(స్పార్క్) చెలరేగి బస్సులోని 19 మంది మృత్యువాతపడినట్లు మంత్రి తెలిపారు. ప్రమాదం జరిగిన తర్వాత 3.21 గంటలకు స్థానిక సీఐకు సమాచారం వచ్చిన వెంటనే పోలీసు, అగ్నిమాపక శాఖ వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని రెస్క్యూ ఆపరేషన్ మొదలు పెట్టారని చెప్పారు. ప్రమాదం జరిగిన వెంటనే కొందరు ప్రయాణికులు ఎగ్జిట్ డోర్‌ను పగులకొట్టడం ద్వారా వారికి వారే రెస్క్యూ ఆపరేషన్ చేసుకుని బయటకు వచ్చారని తెలిపారు. కాగా, మృతదేహాలను గుర్తించేందుకు 16 మందితో ఫోరెన్సిక్ టీం ఏర్పాటు చేశామన్నారు. అందులో డీఎన్ఏ పరీక్షలు చేసేందుకే 10 మంది ఉన్నారని చెప్పారు. ప్రమాదానికి కారణమైన వారిపై కేసులు నమోదు చేస్తామన్నారు.

హైవేలపై ఇది మూడో ప్రమాదం: రవాణా మంత్రి

కొత్త బస్సులన్నింటిలో ఆటోమేటిక్ ఫైర్ అలారం సిస్టం ఎనేబుల్ చేస్తున్నామని ఏపీ మంత్రి రాంప్రసాద్ వెల్లడించారు. సేఫ్టీ మెజర్స్ అన్నీ తీసుకుంటున్నామని తెలిపారు. ప్రమాదానికి గురైన బస్సు ఏడు సంవత్సరాల క్రితంది కావడంతో అందులో ఫైర్ అలారం సిస్టం లేదని తెలిపారు. ఇటీవల హైవేలపై అగ్ని ప్రమాదాలకు సంబంధించి ఇది మూడో సంఘటన అని, ఈ అంశంపై తెలంగాణ, కర్ణాటక రవాణా శాఖ మంత్రులతో మాట్లాడతామని తెలిపారు. మృతదేహాలను డీఎన్ఏ పరీక్షలు పూర్తి చేసిన తక్షణమే బంధువులకు అప్పగిస్తామని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబరేటరీ డైరెక్టర్ పాలరాజు 'ఆంధ్రజ్యోతి'కి తెలిపారు.

రాజీ చేసుకునే అర్హత ఆయనకు లేదు

- టీటీడీ బోర్డు అనుమతి లేకుండా ఆ పనిచేశారు
- నాటికి సతీశ్‌కుమార్ పరకామణి ఏవీఎస్‌వోగా లేరు
- 28న జరిగే బోర్డు భేటీలో ఈ అంశాలు నివేదిస్తాం
- హైకోర్టులో టీటీడీ ఈవో సింఘాల్ కౌంటర్

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): టీటీడీ బోర్డు అనుమతి లేకుండా, అప్పటికి తాను పరకామణి అసిస్టెంట్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి(ఏవీఎస్‌వో) కాకపోయినప్పటికీ వై.సతీశ్‌కుమార్.. నిందితుడు రవికుమార్‌తో లోక్‌అదాలత్ వద్ద కేసును రాజీ చేసుకున్నారని టీటీడీ ఈవో అనీల్‌కుమార్ సింఘాల్ హైకోర్టుకు నివేదించారు. 2023 సెప్టెంబరు 9న ఈ రాజీ కుదిరిందన్నారు. ఎలాంటి అర్హత లేకపోయినా కేసును రాజీ చేసుకున్నందున సతీశ్ కుమార్‌పై క్రమశిక్షణ చర్యలు తీసుకోవాలంటూ టీటీడీ చీఫ్ విజిలెన్స్ సెక్యూరిటీ అధికారి (సీవీఎస్‌వో) ఈ నెల 17న డీజీపీని కోరారని తెలిపారు. కేసుకు సంబంధించిన పూర్తి వివరాలు, రిట్ పిటిషన్‌లో ప్రస్తావించిన అంశాలను ఈ నెల 28న జరగనున్న టీటీడీ బోర్డు సమావేశంలో ఉంచుతామని, పిటిషనర్ శ్రీనివాసులు అభ్యర్థనపై బోర్డు నిర్ణయం తీసుకుంటుందని నివేదించారు. అదనపు వివరాలతో అదనపు కౌంటర్ దాఖలుకు అనుమతించాలని కోరారు. ఈ అంశాలను పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని అభ్యర్థించారు. 2023లో అప్పటి వైసీపీ ప్రభుత్వ హయాంలో టీటీడీ పరకామణిలో జరిగిన కుంభకోణంపై సీఐడీతో దర్యాప్తు జరిపించాలన్న వినతిని టీటీడీ ఈవో పరిగణనలోకి తీసుకోకపోవడంతో జర్నలిస్ట్ ఎం.శ్రీనివాసులు హైకోర్టులో పిటిషన్ దాఖలుచేశారు. పరకామణిలో విధులు నిర్వహిస్తున్న టీటీడీ ఉద్యోగి సీవీ రవికుమార్ డాలర్ల రూపంలో పెద్దఎత్తున నగదు, బంగారాన్ని అపహరించారని ఆ పిటిషన్‌లో ఆరోపించారు. ఇటీవల ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన హైకోర్టు ఈవ్యవహారంతో ముడిపడిన అన్ని రికార్డులను సీఐడీతో సీజ్ చేయించింది. పిటిషనర్ ఇచ్చిన వినతిపై ఏం చర్యలు తీసుకున్నారో చెప్పాలని టీటీడీ ఈవోను ఆదేశించింది. ఈ నేపథ్యంలో ఆయన కౌంటర్ వేశారు.

రైలులో విద్యార్థినిపై టీటీఈ వేధింపులు

- భీమవరంలో కేసు.. ఆలస్యంగా వెలుగులోకి..

భీమవరం క్రైం, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): 'నా పక్కన కూర్చో.. రిజర్వేషన్ బెర్త్ ఇస్తా.. చల్లగా ఏసీలో ఉండు.. నాకు సహకరిస్తే సాయం చేస్తా..' అని ఓ రైల్వే ఉద్యోగి ఓ విద్యార్థినితో అసభ్యంగా ప్రవర్తించిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పశ్చిమగోదావరి జిల్లా భీమవరం ప్రభుత్వ రైల్వే పోలీస్ స్టేషన్ ఎస్ఐ సుబ్రహ్మణ్యం కథనం ప్రకారం.. ఓ విద్యార్థిని ఈనెల 8న నరసాపురం నుంచి ధర్మవరం వెళ్లే ఎక్స్‌ప్రెస్ ఎక్కింది. రిజర్వేషన్ లేకపోవడంతో టీటీఈ అభిజిత్ కుమార్(బిహార్‌కు చెందిన వ్యక్తి)ను బెర్త్ కావాలని కోరింది. ఒంటరిగా ఉన్న ఆమె పట్ల అభిజిత్ అసభ్యకరంగా ప్రవర్తించాడు. నిస్సహాయ స్థితిలో మిన్నకుండిపోయిన ఆమె, తర్వాత తోటి ప్రయాణికుల సాయంతో విజయవాడ రైల్వే పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదును భీమవరం రైల్వే పోలీసులకు పంపించడంతో అభిజిత్‌పై ఇక్కడ కేసు నమోదు చేశారు. రైల్వే ఉన్నతాధికారులు వెంటనే అతడిని సస్పెండ్ చేశారు.


దుబాయ్‌లో మంత్రి అబ్దుల్లా బిన్ బృందంతో సమావేశమైన సీఎం చంద్రబాబు, తదితరులు

అప్పట్లో ఇంటికో ఐటీ ప్రొఫెషనల్ ఉండాలని చెప్పాను. ఇప్పుడు ఇంటికో ఏఐ ప్రొఫెషనల్ తయారు కావాలని పిలుపిస్తున్నాను. ఇంటికో పారిశ్రామికవేత్తను తయారుచేయడమే మా ప్రభుత్వ లక్ష్యం.
- సీఎం చంద్రబాబు

మాతృభూమిని మరవొద్దు!

(మొదటి పేజీ తరువాయి)

పర్యటనలో భాగంగా చివరి రోజు శుక్రవారం దుబాయ్‌లోని లీమెరిడియన్ హోటల్‌లో జరిగిన ప్రవాస తెలుగు ప్రజల సభలో సీఎం ప్రసంగించారు. ప్రపంచంలో ఎక్కడకు వెళ్లినా అక్కడ తెలుగువారు ఉండాలన్నది తన కోరికగా పేర్కొన్నారు. తెలుగువారిని గ్లోబల్ సిటిజన్స్‌గా చూడాలనుకున్నానని, కానీ వారు నేడు గ్లోబల్ లీడర్స్‌గా ఎదుగుతుండడం గర్వంగా ఉందన్నారు. 2047 నాటికి హెల్తీ.. వెల్తీ.. హ్యాపీ స్వర్ణాంధ్రప్రదేశ్ తన లక్ష్యమని.. దానికి అందరూ సహకరించాలని కోరారు. ఇంకా చంద్రబాబు ఏమన్నారంటే..

అత్యంత ప్రభావవంతమైన జాతి..

నేను 30 ఏళ్లుగా దుబాయ్ వస్తున్నా.. ఇప్పుడు మీలో చూస్తున్న ఉత్సాహాన్ని గతంలో ఎప్పుడూ చూడలేదు. 1995లో నేను సీఎం అయినప్పుడు తెలుగువారందరికీ ఒకే మాట చెప్పేవాడిని.. మీ పిల్లలకు ఆస్తులివ్వడం కన్నా మంచి చదువు చెప్పించండని చెప్పేవాడిని. ప్రపంచాన్ని జయించగల సత్తా తెలుగువారిది. హైదరాబాద్‌కు మైక్రోసాఫ్ట్‌ను తీసుకొచ్చాను అందులో ఉద్యోగం చేయడానికి వెళ్లిన సత్య నాదెళ్ల నేడు అదే సంస్థకు సీఈవోగా ఉన్నారు. ఆయన ఏడాది జీతం రూ.850 కోట్లు. తెలుగుజాతికి తిరుగులేదన్నది నా ప్రగాఢ విశ్వాసం. ప్రపంచంలో నంబర్ వన్‌గా జాతిగా.. అత్యంత ప్రభావవంతమైన జాతిగా నిలుస్తుందనడంలో సందేహమే లేదు. 2024 ఎన్నికల్లో మీరంతా వచ్చి కూటమి విజయానికి సొంత డబ్బులు ఖర్చు పెట్టి మరీ పనిచేశారు. మీ నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్ర పునర్నిర్మాణానికి నేను, పవన్ కల్యాణ్.. ప్రధాని మోదీ నేతృత్వంలో పనిచేస్తున్నాం.

అప్పుడు మైక్రోసాఫ్ట్.. ఇప్పుడు గూగుల్

హైదరాబాద్ 25 సంవత్సరాల క్రితం ఎలా ఉంది.. ఇప్పుడెలా అభివృద్ధి చెందింది..? దానికి కారణం టీడీపీ. అప్పుడు హైదరాబాద్ గేమ్ చేంజర్‌గా మైక్రోసాఫ్ట్.. ఐటీ ప్రమోషన్ పనిచేశాయి. ఇప్పుడు గూగుల్, కృత్రిమ మేధ (ఏఐ).. విశాఖ, ఏపీకి గేమ్ చేంజర్‌గా నిలవనున్నాయి. విశాఖలో గూగుల్ 15 బిలియన్ డాలర్ల పెట్టుబడి పెడుతోంది. త్వరలోనే ఏపీ దశదిశ మారనుంది. ఒక రైతుకూలీ బిడ్డ ఐటీ ప్రొఫెషనల్ అయ్యాడంటే ఆ ఘనత టీడీపీది. క్వాంటమ్ వ్యాలీ ఉండే ఏకైక దేశం భారతదేశం.. అది కూడా ఆంధ్రప్రదేశ్. ఎప్పటికప్పుడు ఆలోచనలు మారుతూ ఉండాలి. అప్పుడే అభివృద్ధి సాధ్యమవుతుంది. అబుధాబీ ఒకప్పుడు ఆయిల్ ఎకానమీపై ఆధారపడి ఉండేది.. ఇప్పుడు నాలెడ్జ్ ఎకానమీగా, పర్యాటక రంగం వైపు అడుగులు వేస్తోంది. 1.50 లక్షల హోటల్ గదుల సామర్థ్యంతో ఆతిథ్య రంగాన్ని తయారు చేసుకోవడంతో దుబాయ్‌కి పెద్ద ఎత్తున ఆదాయం వస్తోంది.

ఐటీతో విప్లవాత్మక మార్పులు

గతంలోలా హార్డ్ వర్క్ చేయాల్సిన పనిలేదు.. స్మార్ట్ వర్క్ చేసే రోజుల్లో ఉన్నాం. ఏపీలో ఐటీని ఉపయోగించుకుని విప్లవాత్మక మార్పులు తీసుకొస్తున్నాం. 16 నెలల్లోనే 750 సేవలను వాట్సాప్‌లో తీసుకొచ్చాం. అమరావతిలో క్వాంటమ్ వ్యాలీ వచ్చే జనవరి నుంచి పనిచేయనుంది. తిరుపతి సమీపంలో స్పేస్ సిటీ పెట్టి శాటిలైట్ సర్వీసులను ప్రపంచానికి అందజేసేందుకు సిద్ధమవుతున్నాం. కర్నూలు జిల్లా ఓర్వకల్లులో డ్రోన్ సిటీ ఏర్పాటు చేస్తున్నాం. భవిష్యత్‌లో ఎయిర్ ట్యాక్సీలను తయారుచేసి దుబాయ్‌కి కూడా అందించే పరిస్థితికి వస్తాం. గ్రీన్ ఎనర్జీని ప్రోత్సహిస్తున్నాం. రాబోయే 10 ఏళ్లలో వినూత్న మార్పులు రాబోతున్నాయి. దేశంలోని ప్రతి పౌరుడి డేటాతో డేటాలేక్ రూపొందిస్తున్నాం. ఎడారిగా ఉండే దుబాయ్‌నే ఇక్కడి పాలకులు స్వర్గంలా చేశారంటే అన్ని ఉన్న భారతదేశం ఏ స్థాయిలో అభివృద్ధి చెందాలో ఆలోచించండి.

అనూహ్య స్పందన..

తెలుగు ప్రవాసుల సభకు అనూహ్య స్పందన లభించింది. గల్ఫ్ నలుమూలల నుంచి భారీ సంఖ్యలో వారు తరలివచ్చారు. కువైట్, ఒమాన్, బహ్రెయిన్, ఖతార్ దేశాల నుంచి పెద్ద ఎత్తున తెలుగువారు తరలి రావడంతో సమావేశ మందిరం కిటకిటలాడింది. కార్యక్రమానికి హాజరైన తెలుగువారందరితోనూ చంద్రబాబు ఓపిగ్గా ఫొటోలు దిగారు. మంత్రులు టీజీ భరత్, బీసీ జనార్దన్‌రెడ్డి, ఏపీఎన్నార్టీ చైర్మన్ వేమూరి రవి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రానికి త్వరలో యూఏఈ ప్రత్యేక బృందం

- సీఎంకు ఆ దేశ విదేశీ వాణిజ్య మంత్రి హామీ

యూఏఈ విదేశీ వాణిజ్య మంత్రి థానీ బిన్ అహ్మద్‌తోనూ చంద్రబాబు బృందం సమావేశమైంది. వాణిజ్యం, పెట్టుబడులు, ఆర్థిక సహకారంపై చర్చించారు. ఫుడ్ ప్రాసెసింగ్, పునరుత్పాదక ఇంధనం, పెట్రో కెమికల్స్, రియల్ ఎస్టేట్ వంటి రంగాల్లో భాగస్వామ్యంతోపాటు అమరావతిలో పెట్టుబడులు పెట్టేందుకు థానీ ఆసక్తి చూపించారు. పెట్టుబడి అవకాశాలను పరిశీలించేందుకు ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేస్తామని.. త్వరలో రాష్ట్రాన్ని సందర్శిస్తుందని హామీ ఇచ్చారు. దుబాయ్ వర్చువల్ అసెట్స్ రెగ్యులేటరీ అథారిటీ(వీఏఆర్ఏ) మేనేజింగ్ డైరెక్టర్ దీపారాజా కార్బన్‌తో, క్రౌన్ ఎల్ఎల్సీ సీఈవో స్వపన్ కటారియా, ట్రైస్టార్ గ్రూప్ సీఈవో యూజిన్ మేయిన్, ఆస్టర్ గ్రూప్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఆజాద్ మూపెన్‌తోనూ చంద్రబాబు సమావేశాలు నిర్వహించారు. ఏపీలో అంతర్జాతీయ స్థాయి వైద్య సదుపాయాల కల్పనకు పెట్టుబడులు పెట్టేందుకు ఆస్టర్ గ్రూప్ సానుకూలంగా స్పందించింది.

ఏఐలో కొత్త ఆవిష్కరణలపై.. కలిసి పనిచేద్దాం!

- యూఏఈ-ఆంధ్ర అంగీకారం

కృత్రిమ మేధ(ఏఐ)లో కొత్త ఆవిష్కరణలు, స్టార్టప్‌లను ప్రోత్సహించేలా ఏపీలోని రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్-దుబాయ్ సిలికాన్ ఒయాసిస్(డీఎస్‌వో) మధ్య కొత్త భాగస్వామ్యాలకు యూఏఈ అంగీకారం తెలిపింది. సీఎం చంద్రబాబు శుక్రవారం దుబాయ్‌లో యూఏఈ ఆర్థిక వ్యవహారాలు, పర్యాటక మంత్రి అబ్దుల్లా బిన్ తౌక్ అల్ మర్రీతో సమావేశమయ్యారు. దుబాయ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడుస్తున్న టెక్నాలజీ పార్కు, దుబాయ్ సిలికాన్ ఒయాసిస్‌లో అమలు చేస్తున్న విధానాలపై చర్చించారు. ఏఐ ద్వారా పాలన, పౌర సేవలను మరింత మెరుగ్గా అందించడం.. పౌరసేవలు, పాలనా అంశాల్లోని అత్యుత్తమ విధానాలను ఆర్టీజీఎస్ ద్వారా ఇచ్చిపుచ్చుకోవడం, యూఏఈ-ఏపీ వాణిజ్య బంధం బలోపేతంపై సీఎం చర్చించారు. లాజిస్టిక్స్ రవాణా, మౌలిక రంగాల్లో పెట్టుబడులు, నూతన భాగస్వామ్యాల ఏర్పాటుపైనా చర్చించారు.


కృష్ణా జిల్లా కొండపావులూరులో అటవీ అధికారుల వర్క్‌షాపు సందర్భంగా మొక్క నాటుతున్న డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్

అడవుల రక్షణలో రాజీ లేదు

- అటవీ భూముల ఆక్రమణలను ఉపేక్షించం: ఉపముఖ్యమంత్రి
- రాష్ట్రానికి ఆకు పచ్చని గోడ నిర్మాణం.. వర్క్‌షాప్‌లో పిలుపు

అమరావతి, అక్టోబరు 24 (ఆంధ్రజ్యోతి): అడవులను సంరక్షించుకునే విషయంలో రాజకీయాలకు, రాజీలకు తావు లేదని ఉపముఖ్యమంత్రి, పర్యావరణం-అటవీ శాఖ మంత్రి పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. కృష్ణా జిల్లా కొండపావులూరులోని జాతీయ విపత్తుల నిర్వహణ సంస్థ ఆవరణలో శుక్రవారం జరిగిన రాష్ట్ర స్థాయి అధికారుల రెండ్రోజుల వర్క్‌షాప్‌లో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. అక్కడి ఎన్ఐడీఎంలోని నక్షత్ర వనాన్ని పరిశీలించి, జమ్మి మొక్కను నాటారు. 'గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ' వాల్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పవన్ మాట్లాడారు. 'అడవులు జాతి సంపద. ప్రతి అంగుళం అమూల్యం. కాపాడుకోవడం మనందరి బాధ్యత. వాటిని ఆక్రమించేవారు ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదు. గతంలో అటవీ మంత్రిగా ఉన్న వ్యక్తే సొంత ఇలాకాలో అటవీ భూములను ఇష్టానుసారం ఆక్రమించుకుంటే అప్పటి అధికారులు ఎందుకు మిన్నకుండిపోయారో అర్థం కాలేదు. అలాంటి తప్పిదాలు కూటమి పాలనలో జరగడానికి వీల్లేదు' అని స్పష్టం చేశారు. 2047 నాటికి రాష్ట్ర భూభాగంలో 50శాతం పచ్చదనంతో నిండేలా పని చేయాలన్నారు. 974 కిమీ తీర ప్రాంతంలో మడ అడవుల పెంపకం ప్రధానమని తెలిపారు. రాష్ట్రానికి ఆకు పచ్చని గోడ నిర్మాణానికి కృషి చేయాలని.. గ్రేట్ గ్రీన్ వాల్ ఆఫ్ ఏపీ అనేది గొప్ప ప్రయత్నంగా తీసుకోవాలని సూచించారు.

అమరావతిలో ఆర్‌బీఐ ప్రాంతీయ కార్యాలయం

విజయవాడ సిటీ, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజధాని అమరావతిలో భారతీయ రిజర్వ్ బ్యాంక్(ఆర్‌బీఐ) ప్రధాన ప్రాంతీయ కార్యాలయం నెలకొల్పేందుకు వేగంగా అడుగులు పడుతున్నాయి. ఈ కార్యాలయ భవనాలు నిర్మాణం చేపట్టేందుకు నేలపాడులోని మూడు ఎకరాలను రూ.12 కోట్లు వెచ్చించి ఆర్‌బీఐ కొనుగోలు చేసింది. దీనికి సంబంధించి సీఆర్‌డీఏతో ఆర్‌బీఐ ఒప్పందం చేసుకుంది. ఈ ఒప్పంద పత్రాలను ఆర్‌బీఐ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ వీసీ రూపకు, సీఆర్‌డీఏ ఎస్టేట్స్ విభాగ జాయింట్ డైరక్టర్ వి.డేవిడ్‌రాజు తమ కార్యాలయంలో శుక్రవారం అందజేశారు. 1.6 లక్షల చదరపు అడుగుల్లో తన ప్రాంతీయ కార్యాలయాన్ని ఆర్‌బీఐ నిర్మించనుంది. కార్యకలాపాల నిర్వహణ కోసం ఆర్‌బీఐ అమరావతిలో రూ.200 కోట్ల పెట్టుబడిని పెట్టేందుకు సంస్థ అంగీకరించింది.

పీపీపీపై విచారణకు సిద్ధం: సత్యకుమార్

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): పది నూతన ప్రభుత్వ వైద్య కళాశాలలను కూటమి ప్రభుత్వం ప్రైవేటు వ్యక్తుల చేతుల్లో పెడుతుందంటూ మాజీ సీఎం జగన్ చేస్తున్న ఆరోపణలపై మంత్రి సత్యకుమార్ దీటుగా స్పందించారు. ఈ ఆరోపణలకు సంబంధించి నిజానిజాలు తేల్చేందుకు నిపుణులతో కూడిన ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించారు. శుక్రవారం అమరావతి సచివాలయంలో విలేకరులతో మాట్లాడారు. 'ఈ కమిటీ ఏర్పాటుకు మాజీ సీఎం ఇద్దరు లేదా ముగ్గురు నిపుణులను త్వరగా సూచించాలి. రాష్ట్రంలో కొత్తగా 17 ప్రభుత్వ వైద్య కళాశాలలను నిర్మిస్తామని ఆర్భాటంగా ప్రకటించిన జగన్ ఆ మేరకు తగు చర్యలు చేపట్టకపోవడం వల్లే సంక్షోభం ఏర్పడింది. దాని పరిష్కారానికే కూటమి ప్రభుత్వం పీపీపీ విధానాన్ని చేపట్టింది. జగన్ మానసిక తీరు ఆందోళనకరంగా ఉంది. తాను నిత్యం వల్లెవేసే అబద్ధాలే నిజాలని నమ్మే ఆయన వైఖరి సరికాదు' అని చెప్పారు. జగన్ తీరుపై 30 ప్రశ్నలను సంధించిన మంత్రి సమాధానాలు చెప్పాలని డిమాండ్ చేశారు. బాలకృష్ణపై జగన్ చేసిన వ్యాఖ్యలపై మండిపడ్డారు.

విద్యుత్ రంగంలో ఏటా లక్ష కోట్ల అవినీతి

- టెండర్ల నుంచి కొనుగోళ్ల వరకు అక్రమాలే: ఏబీవీ



తిరుపతి(విద్య), అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): దేశం మొత్తంలో ఏపీలోనే విద్యుత్ రంగంలో అవినీతి ఎక్కువగా ఉందని ఇంటెలిజెన్స్ మాజీ డీజీ ఏబీ వెంకటేశ్వరరావు విమర్శించారు. అవినీతికి ఏపీఎస్పీడీసీఎల్ ప్రయోగశాలగా మారిందన్నారు. సెంటర్ ఫర్ లిబర్టీ ఆధ్వర్యంలో శుక్రవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ఆ సంస్థ ప్రతినిధి నల్లమోతు చక్రవర్తి పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా విద్యుత్ స్కాం జరుగుతున్న విధానాన్ని వివరించారు. అనంతరం ఏబీవీ మాట్లాడుతూ.. రాష్ట్రంలో విద్యుత్ మాఫియా వేళ్లూనుకుని పోయిందని, ఏడాదికి రూ. లక్ష కోట్ల అవినీతి జరుగుతోందని చెప్పారు. టెండర్ల నుంచి ట్రాన్స్‌ఫార్మర్లు, కండక్టర్ల కొనుగోళ్ల వరకు అన్నింటా అవినీతి పేరుకుపోయిందన్నారు. తెలంగాణ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను రూ.87,791కు, ఛత్తీస్‌గఢ్ రూ.75,496కు కొంటే ఆంధ్రప్రదేశ్‌లో గత వైసీపీ ప్రభుత్వం 2023 జూలైలో రూ. 1,39,173కు కొనుగోలు చేసిందని, కూటమి ప్రభుత్వం రూ.1,19,073కు కొనుగోలు చేసిందన్నారు. వ్యవసాయానికి అవసరంలేని ఫైవ్‌స్టార్ 25 కేవీఏ ట్రాన్స్‌ఫార్మర్లను ప్రస్తుత ప్రభుత్వం రూ.1,40,085కు కొనుగోలు చేస్తోందని చెప్పారు.పోటీ లేకుండా కేవలం షిర్డీసాయి, తోషిబా కంపెనీలకే టెండర్లు కట్టబెడుతున్నారని ఆరోపించారు. అవినీతి వల్ల కరెంటు చార్జీలు పెరిగిపోతున్నాయని చెప్పారు.

నూర్‌బాషా కార్పొరేషన్‌కు డైరెక్టర్ల నియామకం

నూర్‌బాషా/దూదేకుల సంక్షేమ కార్పొరేషన్ చైర్మన్‌గా నాగుల్ మీరాను నియమించిన ప్రభుత్వం తాజాగా 15 మంది డైరెక్టర్లను నియమిస్తూ ఉత్తర్వులు జారీచేసింది. షేక్ బాషా బీమా(రాజమండ్రి), కమటలం ఇమామ్ హుస్సేన్(అనంతపురం), షేక్ బాలాజీ నాగ మస్తాన్(పెనమలూరు), దూదేకుల దస్తగిరి(నంద్యాల), దూదేకుల మహబూబ్ కరీం సాబ్(బనగానపల్లి), మైలమూరి పెద్ద పీరు బాబు(విజయవాడ వెస్ట్), షేక్ అల్తాఫ్(సర్వేపల్లి), షేక్ హుస్సేన్(పర్చూరు), షేక్ ఇబ్రహీం బాషా(అనకాపల్లి), షేక్ సుభాన్(రంపచోడవరం), రాళ్లపల్లి షరీఫ్(ధర్మవరం), షేక్ సయ్యద్ ఆలీ జిన్నా(ఆచంట), షేక్ మకూర్(ప్రత్తిపాడు), షేక్ సిద్దయ్య(వినుకొండ), నాగూరి వీరభద్రుడు(రాజంపేట) రెండేళ్ల పదవిలో ఉంటారని తెలిపింది.

ప్రమాదంపై గవర్నర్, సీఎం, డిప్యూటీ సీఎం దిగ్భ్రాంతి

అమరావతి, గవర్నర్, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంపై గవర్నర్ అబ్దుల్ నజీర్ విచారం వ్యక్తం చేశారు. గాయపడిన ప్రయాణికులకు అవసరమైన వైద్య సహాయం అందించాలని గవర్నర్ జిల్లా అధికారులను ఆదేశించారు. మృతుల కుటుంబ సభ్యులకు ఆయన తన సంతాపాన్ని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రమాదంపై తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో పలువురు మృతి చెందడంపై విచారం వ్యక్తం చేశారు. యూఏఈ పర్యటనలో ఉన్న సీఎం బస్సు దుర్ఘటన విషయం తెలిసిన వెంటనే సీఎస్‌తోపాటు, జిల్లా కలెక్టర్ ఎసిరి, ఎస్పీ విక్రాంత్ పాటిల్‌కు ఫోన్ చేశారు. ఉన్నతస్థాయి యంత్రాంగం అంతా ఘటనాస్థలానికి వెళ్లి సహాయక చర్యల్లో పాల్గొనాలని, క్షతగాత్రులకు, బాధితులకు అవసరమైన సహాయ సహకారాలు అందించాలని ఆదేశించారు. ఈ దుర్ఘటనపై మంత్రి లోకేశ్ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. బస్సు ప్రమాదంలో పలువురు ప్రయాణికులు మృతి చెందటం బాధాకరమని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలకు ప్రభుత్వ పరంగా ఆదేశించామన్నారు.

మీ పెట్టుబడికి మాదీ పూచీ!

ఒకసారి ఏపీతో చేతులు కలిపాక మీ ప్రాజెక్టు మాదే: లోకేశ్

- అన్ని దశల్లో నిరంతరం పర్యవేక్షిస్తాం
- గడువు కంటే ముందే అనుమతులు
- ఆస్ట్రేలియాలో చివరి రోజు పర్యటన
- సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ రోడ్‌షో

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ స్టార్టప్ రాష్ట్రమని మంత్రి లోకేశ్ అన్నారు. ఇక్కడ పెట్టుబడులు పెట్టేవారికి సంపూర్ణ భరోసా ఇచ్చారు. పారిశ్రామికవేత్తలు ఒకసారి తమతో చేతులు కలిపాక.. ప్రాజెక్టు ప్రతిపాదనలు తమవిగా భావించి అనుమతులివ్వడం సహా.. ఉత్పత్తి ప్రారంభమయ్యేదాకా సహకారం అందిస్తూ ఉంటామని భరోసా ఇచ్చారు. శుక్రవారం ఆస్ట్రేలియా పర్యటన చివరి రోజు.. ఆరో రోజున ఆయన మెల్‌బోర్న్‌లో ఆస్ట్రేలియా-ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో సీఐఐ పార్ట్‌నర్‌షిప్ సమిట్ రోడ్‌షో నిర్వహించారు. ఆస్ట్రేలియా ట్రేడ్ ఇన్వెస్ట్‌మెంట్ కమిషన్ ఎగ్జిక్యూటివ్‌లతో సమావేశమయ్యారు. విశాఖలో వచ్చే నెల 14, 15 తేదీల్లో నిర్వహించే పెట్టుబడుల భాగస్వామ్య సదస్సుకు తరలిరావాలని పారిశ్రామికవేత్తలకు పిలుపిచ్చారు. ఎడ్యుకేషన్‌పై జరిగిన రౌండ్ టేబుల్ భేటీకి హాజరయ్యారు. మెల్‌బోర్న్ క్రికెట్ స్టేడియంను సైతం సందర్శించి.. క్రికెట్ విక్టోరియా అసోసియేషన్ ప్రతినిధులతో చర్చలు జరిపారు. ఆయా సందర్భాల్లో లోకేశ్ మాట్లాడారు. ఏదైనా సంస్థ నుంచి పరిశ్రమ ఏర్పాటుకు ప్రతిపాదన వచ్చిన వెంటనే ఒక వాట్సాప్ గ్రూప్ క్రియేట్ చేస్తామని.. ఆ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారులు, నాయకులతో ప్రతిరోజూ మెసేజ్‌ల ద్వారా సంప్రదింపులు జరుపుతూనే ఉంటామని తెలిపారు. ప్రాజెక్టు స్థితిగతులను అనుక్షణం తెలుసుకుంటామన్నారు. ఉదాహరణకు ఆతిథ్య సేవల రంగంలో ఈ రోజు ఉదయం ఒక కంపెనీకి భూ కేటాయించాల్సి ఉంటే.. సంబంధిత ఫైలు ఎక్కడ ఉంది.. క్లియరెన్సుకు ఎంత సమయం పడుతుంది.. అనే వివరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటామని వెల్లడించారు. నిర్దేశించిన సమయం కంటే ముందుగానే అనుమతులన్నింటినీ ఇచ్చేస్తామని చెప్పారు. ఇచ్చిన హామీని అమలు చేయడం తమకు చాలా ముఖ్యమని స్పష్టం చేశారు. 16 నెలల్లోనే రాష్ట్రానికి రూ.10 లక్షల కోట్ల పెట్టుబడులు వచ్చాయన్నారు. సుదీర్ఘ పాలనానుభవం కలిగిన సీఎం చంద్రబాబు నాయకత్వం వల్లే ఇది సాధ్యమైందని తెలిపారు. రాజధాని అమరావతిలో క్వాంటమ్ కంప్యూటర్ సేవలు వచ్చే ఏడాది జనవరి నుంచి అందుబాటులోకి వస్తాయని ప్రకటించారు.

దేశంలో వేగంగా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ రెండో స్థానంలో ఉంది. 2047 నాటికి గ్లోబల్ పవర్ హౌస్‌గా ఆవిర్భవిస్తుంది. 2.4 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థ దిశగా వేగంగా అడుగులు వేస్తోంది.
- మంత్రి లోకేశ్


ఆస్ట్రేలియా - ఇండియా బిజినెస్ కౌన్సిల్ ప్రతినిధులతో మంత్రి లోకేశ్

విజనరీ నేతృత్వంలో..

విజనరీ సీఎం చంద్రబాబు సారథ్యంలో ఏపీ అభివృద్ధి దిశగా అడుగులు వేస్తోంది. ఇక్కడ ఏరోస్పేస్, రక్షణ, రేవులు, ఫార్మా, బయోటెక్నాలజీ, పర్యాటకం వంటి రంగాల్లో పెట్టుబడులకు మంచి అవకాశాలున్నాయి. విశాఖ ఇన్నోవేషన్ డేటా హబ్‌గా తయారవుతోంది. భారత్‌లో పెట్టుబడుల గమ్యస్థానంగా ఆంధ్రప్రదేశ్‌ను ఎంచుకోండి. దీనికి 3 కారణాలున్నాయి. మా రాష్ట్రంలో అనుభవం కలిగిన దార్శనిక నాయకత్వం ఉంది. కేంద్రం సహకారం కూడా ఉం ది. ఏపీలో 50 శాతం మంది ఎమ్మెల్యేలు కొత్తగా ఎన్నికైనవారే. 25 మంది మంత్రుల్లో 17 మంది కొత్తవారు. రాష్ట్రాన్ని అగ్రపథాన నిలిపేందుకు మేమంతా కష్టపడుతున్నాం. క్రికెట్ విక్టోరియా ఏపీలోనూ క్రికె ట్ అకాడమీని నెలకొల్పాలి. ఉమ్మడి శిక్షణ శిబిరాలు, మ్యాచ్‌ల నిర్వహణపై దృష్టి సారించాలి.

గూగుల్ రాక వెనుక..13 నెలల కష్టం

సంస్థ ప్రతినిధులు వచ్చినప్పుడు నేనే స్వయంగా వెళ్లి స్థలం చూపించా: లోకేశ్

విశాఖకు గూగుల్ డేటా సెంటర్ రావడం వెనుక 13 నెలల కష్టం దాగి ఉందని మంత్రి లోకేశ్ వెల్లడించారు. గూగుల్ సంస్థ ప్రతినిధులు రాష్ట్ర పర్యటనకు వచ్చినప్పుడు.. తానే స్వయంగా వెళ్లి ప్రాజెక్టు స్థలాన్ని చూపించానని సీఐఐ రోడ్‌షోలో చెప్పారు. 'నేను వారి కార్పొరేట్ కార్యాలయానికి వెళ్లి.. ఎందుకు రాష్ట్రంలో గూగుల్ డేటా సెంటర్ పెట్టాలో వివరణాత్మకంగా తెలియజేసి నచ్చజెప్పాను. తర్వాత గూగుల్ నాయకత్వం సీఎం చంద్రబాబుతో సమావేశమైంది. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వ విధానాల్లో కొన్ని మార్పుచేర్పులు సూచించింది. వెంటనే చంద్రబాబు వాటిపై ప్రధాని మోదీతో, కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌తో, కేంద్ర ఐటీ-ఎలక్ట్రానిక్స్ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో చర్చించారు. సదరు మార్పులు చేయడానికి కేంద్రం సానుకూలంగా స్పందించింది. గూగుల్ సెంటర్ ఏర్పాటు దిశగా విధివిధానాలను సవరించింది. ఈ ప్రక్రియతో గూగుల్ డేటా సెంటర్ రావడమే గాకుండా.. భారతదేశంలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తి చూపే ఐటీ కంపెనీలన్నింటికీ ప్రయోజనం కలిగింది. భారత్ గ్లోబల్ ఐటీ సెంటర్‌గా ఎదిగేందుకు కేంద్ర నిర్ణయం దోహదపడింది. ఇలా గూగుల్ డేటా సెంటర్‌ను విశాఖకు తీసుకొచ్చేందుకు 13 నెలలు అహర్నిశలూ కష్టపడ్డాం. అయితే చెప్పిన సమయం కంటే ఒక నెల ఆలస్యమైనందుకు ఇప్పటికీ బాధపడుతున్నాం' అని లోకేశ్ వివరించారు. ఆస్ట్రేలియాలో ఆర్రోజుల పర్యటన ముగించుకున్న ఆయన శనివారం హైదరాబాద్‌కు రానున్నారు.

కోస్తాకు తుఫాన్ ముప్పు

- బంగాళాఖాతంలో అల్పపీడనం
- నేడు వాయుగుండంగా, రేపు రాత్రికి తుఫాన్‌గా బలపడే చాన్స్.. హోంమంత్రి సమీక్ష

(ఆంధ్రజ్యోతి న్యూస్‌నెట్‌వర్క్)

కోస్తాకు తుఫాన్ ముప్పు పొంచి ఉంది. ఆగ్నేయ బంగాళాఖాతంలో శుక్రవారం అల్పపీడనం ఏర్పడింది. ఇది మొదట పశ్చిమ వాయవ్యంగా పయనిస్తూ ఆగ్నేయ, మధ్య బంగాళాఖాతంలోకి ప్రవేశించే క్రమంలో శనివారానికి వాయుగుండంగా, ఆదివారానికి తీవ్ర వాయుగుండంగా బలపడనున్నది. ఆ తర్వాత ఆదివారం అర్ధరాత్రి తర్వాత తుఫాన్‌గా మారుతుందని భారత వాతావరణ శాఖ(ఐఎండీ) తెలిపింది. ఇది వాయవ్యంగా పయనించి ఈ నెల 28వ తేదీ నాటికి మధ్య, ఉత్తర కోస్తా దిశగా రానున్నదని ఇస్రో వాతావరణ నిపుణుడొకరు తెలిపారు. ఈ క్రమంలో తీవ్ర తుఫాన్‌గా బలపడి 28వ తేదీ అర్ధరాత్రి లేదా 29వ తేదీ తెల్లవారుజామున మచిలీపట్నం-కాకినాడ మధ్య తీరం దాటనున్నదని అంచనా వేశారు. అయితే కొన్ని మోడళ్ల ప్రకారం విశాఖపట్నం-కాకినాడ మధ్య, ఇంకొన్ని మోడళ్ల విశ్లేషణ మేరకు దక్షిణ ఒడిశాలో తీవ్ర తుఫాన్ తీరం దాటుతుందని అంచనా వేశారు. అల్పపీడన ప్రభావంతో శుక్రవారం రాష్ట్రవ్యాప్తంగా అనేకచోట్ల వర్షాలు కురిశాయి. ఏలూరు జిల్లా ముదినేపల్లి మండలంలో 7.1, కోనసీమ జిల్లా అమలాపురంలో 6.3, అల్లూరి జిల్లా బుట్టాయిగూడెం, కృష్ణా జిల్లా మచిలీపట్నంలో 5.5, నంద్యాల జిల్లా రంగాపురంలో 4.8, కడప జిల్లా బద్వేల్‌లో 4.4 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. శనివారం నుంచి ఈనెల 29వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా ఎక్కువ చోట్ల వర్షాలు కురుస్తాయని ఐఎండీ తెలిపింది. సముద్రం అల్లకల్లోలంగా ఉన్నందున మత్స్యకారులు చేపల వేటకు వెళ్లరాదని హెచ్చరించింది. ఈ తుఫానుకు థాయ్‌లాండ్ దేశం సూచించిన 'మొంథా' (ఎంఓఎన్‌టీహెచ్ఏ) అని పేరు పెట్టనున్నారు. మరోవైపు తూర్పు, మధ్య అరేబియా సముద్రంలో వాయుగుండం కొనసాగుతోంది.

అన్నదాతల్లో ఆందోళన

ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా వరి, పత్తి, వేరుశనగ, తదితర పంటలు పక్వానికి వచ్చి ఉన్నాయి. ప్రధానంగా కృష్ణా, గోదావరి డెల్టా ప్రాంతాల్లో గింజ పాలు పోసుకునే దశ నుంచి పొట్ట దశలో ఉంది. ముదురు పంట కోతకు రైతులు సిద్ధమవుతున్నారు. మెట్ట ప్రాంతాల్లో పత్తి తీస్తుండగా, వేరుశనగ కాయ దశలో ఉంది. మిర్చి ఎదుగుదల దశలో ఉంది. ఈ తరుణంలో తుఫాన్ వల్ల భారీ వర్షాలు కొనసాగితే.. లక్షలాది ఎకరాల్లో పంటలు ముంపు బారిన పడే ప్రమాదం ఉందని రైతులు కలవరపడుతున్నారు. ఏలూరు జిల్లా వ్యాప్తంగా శుక్రవారం ఎడతెరపిలేకుండా వర్షాలు కురవడంతో జనజీవనం స్తంభించింది. పల్లపు ప్రాంతాలు జలమయమయ్యాయి. 1987 ఎకరాల్లో వరి పంట ముంపునకు గురైంది. ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయి. ప్రకాశం జిల్లాలో వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తుండటంతో అనేక చోట్ల రాకపోకలు నిలిచిపోయాయి. సంతనూతలపాడు మండలం తొర్రగుడిపాడు సమీపంలో ఒక విద్యార్థి వాగులో గల్లంతయ్యాడు. ఒంగోలు నగరంలోని అనేక కాలనీలు జలమయమయ్యాయి. తుఫాన్ ముప్పు నేపథ్యంలో క్షేత్రస్థాయిలో ప్రభుత్వ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర హోం, విపత్తుల నిర్వహణ శాఖల మంత్రి అనిత ఆదేశించారు. అధికారులతో శుక్రవారం ఆమె సమీక్ష నిర్వహించారు.

సమ్మె విరమించిన పీహెచ్‌సీ వైద్యులు

మంత్రి సత్యకుమార్‌తో చర్చలు సఫలం
రోగులకు కలిగిన ఇబ్బందికి చింతిస్తున్నాం: డాక్టర్లు

అమరావతి, అక్టోబరు 24(ఆంధ్రజ్యోతి): వృత్తి సంబంధ డిమాండ్ల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం నిర్దిష్టమైన హామీ ఇవ్వడంతో నిరవధిక సమ్మెను విరమిస్తున్నట్లు వైద్య సంఘాల నేతలు తెలిపారు. పీజీ మెడికల్ ఇన్ సర్వీస్ కోటా కొనసాగింపు, ఉద్యోగ సర్వీసు వ్యవహారాలపై సానుకూల ఉత్తర్వులు కోరుతూ గతనెల 28వ తేదీ నుంచి పీహెచ్‌సీ (ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు) వైద్యులు ఆందోళన బాట పట్టారు. ఈనెల 3 నుంచి నిరవధిక సమ్మెను చేపట్టారు. ఈ నేపథ్యంలో వైద్యులతో మంత్రి సత్యకుమార్ చర్చలు జరిపారు. పీహెచ్‌సీ వైద్యుల సంఘం డిమాండ్ మేరకు 2025-26 విద్యా సంవత్సరంలో పీజీ మెడికల్ ఇన్ సర్వీస్ కోటాను 20%అమలు చేసేందుకు మంత్రి అంగీకరించారు. 2026-27లో 15 శాతం కోటాను కొనసాగిస్తామని హామీ ఇచ్చారు. గతంలో అమలులో ఉండి, ప్రస్తుతం నిలిచిపోయిన డీఎన్బీ కోర్సుల్లో ప్రవేశాల కల్పనపైనా మంత్రి సానుకూలంగా స్పందించారు. ట్రైబల్ అలవెన్స్, టైమ్ బౌండ్ పదోన్నతులు, నోషనల్ ఇంక్రిమెంట్లు, అర్బన్ సర్వీస్ ఎలిజిబిలిటీ ఐదేళ్లకు కుదింపు వంటి సమస్యలను పరిష్కరిస్తామని మంత్రి హామీ ఇచ్చారు.

Printed and Published by **Koganti Venkata Seshagiri Rao** on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, **Editor : N.Rahul Kumar,** RNI No:3470/1960, **Managing Director : Vemuri Radha Krishna, Founder :** K.L.N. Prasad.